సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+20 వెల: ₹5.00

సంపుటి: 11
సంచిక: 314

సోమవారం 4-2-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'



'ఐదు'లో అదుర్స్

న్యూజిలాండ్‌పై ఐదో వన్డేలో నెగ్గిన భారత్. సిరీస్ 4-1తో సొంతం. - స్పోర్ట్స్‌లో



సొంతింటికి దారి ఇదీ..

సొంతింటికి ప్లాన్ చేసుకునేందుకు బడ్జెట్‌లో అనుకూలతలు -ప్రాఫిట్ ప్లస్‌లో

తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభం



అమరావతిలో నిర్మించిన హైకోర్టు తాత్కాలిక భవనాన్ని ఆదివారం ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, చిత్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, సీఎం చంద్రబాబు

- అమరావతిలో శాశ్వత హైకోర్టు నిర్మాణానికి శంకుస్థాపన
- న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం సడలిపోకుండా న్యాయవాదులు నిష్టతో విధులు నిర్వర్తించాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ పిలుపు
- రాజధానిలో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తాం: చంద్రబాబు

సాక్షి, అమరావతి: న్యాయం కోసం ఎదురుచూసే వారికి న్యాయస్థానం ఒక దేవాలయం లాంటిదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజలు పెట్టుకున్న నమ్మకం సడలిపోకుండా ఉండాలంటే న్యాయవాదులు తమ విధులను నిష్టతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి పరిధిలోని నేలపాడులో నిర్మించిన తాత్కాలిక హైకోర్టు భవనాన్ని జస్టిస్ రంజన్ గొగోయ్ ఆదివారం ప్రారంభించారు. శాశ్వత హైకోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ రామయ్యగారి సుభాష్‌రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఏపీ, తెలంగాణ హైకోర్టుల న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయవాది జస్టిస్ పి.వెంకటరామారెడ్డి, పలువురు విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. శాశ్వత హైకోర్టు శంకుస్థాపన కార్యక్రమం అనంతరం జస్టిస్ రంజన్ గొగోయ్ అమరావతిలో చేపట్టే నిర్మాణాలకు సంబంధించి సీఆర్‌డీఏ ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రూ. 6 వేల విలువేంటో వారికేం తెలుసు!



పీఎం–కిసాన్ ఒక గొప్ప పథకం. పేద రైతుకు ఈ రూ.6 వేలు ఎంత ముఖ్యమో ఢిల్లీలో ఏసీ గదుల్లో కూర్చునే వారికి అర్థం కాదు. జమ్మూ కశ్మీర్ కూడా చాలా మందికి ఈ పథకం వల్ల లబ్ధి జరుగుతుంది. ఆదివారమే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి నేను మార్గదర్శకాలు పంపిస్తా.

- వివరాలు 13లో

యోగి హెలికాప్టర్‌కు అనుమతి నిరాకరణ



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు పశ్చిమబెంగాల్‌లో చుక్కెదురైంది. ఆయన ప్రయాణించే హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అక్కడి ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. దీంతో ఆదివారం బీజేపీ చేపట్టిన రెండు సభలకు సీఎం యోగి హాజరు కాలేకపోయారు. అందుకు బదులుగా ఫోన్ ద్వారా ఆయన రెండు సభల్లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

- వివరాలు 13లో

పట్టాలు తప్పిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్



బిహార్‌లో జరిగిన రైలు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా 29 మంది గాయాలపాలయ్యారు. బిహార్‌లోని జోగ్‌బనీ నుంచి ఢిల్లీలోని ఆనంద్ విహార్‌కు చేరాల్సిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం వేకువజామున పట్టాలు తప్పడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై రైల్వే శాఖ విచారణకు ఆదేశించింది. బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించింది.

- వివరాలు 13లో

పోస్టుకు లక్ష!



అంగట్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉద్యోగాలు

- గతంలో విధుల నుంచి తొలగించిన ఇన్‌చార్జిలపై వల
- రెగ్యులర్ పోస్టులు సృష్టించి ఇవ్వడంతోపాటు గ్రేడ్–2 సూపర్‌వైజర్‌లుగా పర్మినెంట్ చేస్తామని హామీ
- 361 పోస్టులను అమ్మకానికి పెట్టిన ప్రభుత్వ పెద్దలు
- ఒక్కో ఉద్యోగానికి నిర్ణయించిన రేటు రూ.లక్ష
- ముఖ్యమంత్రి, మంత్రి కనుసన్నల్లో ఇప్పటిదాకా రూ.కోటిన్నరకు పైగా వసూళ్లు.. మిగతా సొమ్ములిస్తే జీవో
- వసూళ్లు, నియామకాలపై నేడు ఉండవల్లిలో సమావేశం

2లో

'సాక్షి' చేతికి చిక్కిన అంగన్‌వాడీ సభ్యుల ఫోన్ సంభాషణలు

కోల్‌కతాలో 'దీదీ'గిరి!

పోలీస్ కమిషనర్‌ను విచారించేందుకు సీబీఐ అధికారుల యత్నం

- అడ్డుకుని అరెస్ట్ చేసిన బెంగాల్ పోలీసులు
- కేంద్రం అవమానించిందంటూ ధర్నాకు దిగిన మమతా బెనర్జీ
- సీబీఐ కార్యాలయాన్ని ఆధీనంలోకి తీసుకున్న బెంగాల్ పోలీసులు
- చిట్‌ఫండ్ కుంభకోణం కేసు విచారణలో హైడ్రామా

13లో



కోల్‌కతా పోలీస్ కమిషనర్ ఇంటి వద్ద ధర్నా చేస్తున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమత

మోదీ ఆదేశాల మేరకు అజిత్ దోవల్ రాజకీయ ప్రత్యర్థులపైకి సీబీఐని పంపుతున్నారు. చేతులకు రక్తపు మరకలు అంటుకున్న అలాంటి ప్రధానితో మాట్లాడటానికి సిగ్గుగా ఉంది. జనవరి 19న విపక్షాలతో విజయవంతంగా ర్యాలీ నిర్వహించడంతో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూల్చేందుకు మోదీ, షా ప్రయత్నిస్తున్నారు.

– మమతా బెనర్జీ

మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల్ని పరిహాసానికి గురిచేస్తోంది. ఈ వైఖరి మమత నిరంకుశత్వాన్ని సూచిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ చిట్‌ఫండ్ కుంభకోణాలపై విచారణ జరుపుతోంది. బెంగాల్‌లో శాంతిభద్రతలు పూర్తిగా దారితప్పాయి.

– బీజేపీ

అర్చకులకు శఠగోపం

అధిక ఆదాయం ఉన్న ఆలయాల్లో వంశపారంపర్య అర్చకత్వానికి బ్రేక్

- రూ.5 లక్షల ఆదాయం దాటిన ఆలయాలన్నిటికీ వర్తింపు
- త్వరలో తుది నోటిఫికేషన్ విడుదల
- ఉత్తర్వులు ఇవ్వకముందే సీఎం చంద్రబాబును సన్మానిస్తారట!



సాక్షి, అమరావతి: ఆలయాల్లో వంశపారంపర్యంగా అర్చకత్వం చేసుకుంటున్న వారి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆఖరి నిమిషం దాకా ఊరించి చివరకు ఊసూరుమనిపించే నిర్ణయం తీసుకున్నారు. దేవదాయ శాఖ పరిధిలో ఆదాయం ఉన్న ఆలయాల్లో వంశపారంపర్య అర్చకత్వాన్ని అనుమతించకూడదనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఆదాయం లేని ఆలయాల్లో కూడా వంశపారంపర్య అర్చకత్వాన్ని హక్కుగా కాకుండా.. ఒక అవకాశంగా మాత్రమే కల్పించాలని నిర్ణయించింది. వంశపారంపర్య అర్చకత్వాన్ని హక్కుగా కల్పిస్తే ఆ కుటుంబంలోని సభ్యులందరూ ఆ ఆలయంలో అర్చకత్వం చేసుకోవడానికి వీలుంటుంది. ప్రభుత్వం చెబుతున్న 'అవకాశం' అన్న నిబంధన ప్రకారమైతే కుటుంబంలోని ఎవరో ఒకరికి మాత్రమే ఆలయంలో అర్చకత్వం కొనసాగించవచ్చు. దేవదాయ శాఖలో వంశపారంపర్య అర్చకత్వానికి అనుమతి తెలుపుతూ 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీలో చట్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు ఆ చట్టం అమలుకు అభ్యంతరం తెలపాలని నిర్ణయించింది.

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో వంశపారంపర్య అర్చకత్వాన్ని తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పటికే నిలిపివేసింది. టీటీడీలో ప్రధాన అర్చకుడు రమణదీక్షితులుతో పాటు మరో ఐదుగురిని

మిగతా 2వ పేజీలో ▶



కాంగ్రెస్‌కు గుడ్‌బై

- తన సూచనలను అధిష్టానం పట్టించుకోలేదన్న కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్
- రాష్ట్రంలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తుండటంతోనే పార్టీని వీడుతున్నట్లు వెల్లడి
- టీడీపీలోకి వెళ్తారంటూ ప్రచారం

4లో

ఢిల్లీ చేరుకున్న వైఎస్ జగన్

ఓటర్ల జాబితా అవకతవకలపై నేడు ఈసీకి ఫిర్యాదు



ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

2లో

ఇదండీ సంగతి



ఈసారి ఎన్నికల్లో మేనిఫెస్టోతో అవసరం ఉండదనుకుంటా!

పెళ్లింట మృత్యుఘోష

- విద్యుదాఘాతంతో నలుగురి దుర్మరణం
- పెళ్లి కుమారుడి తండ్రితో పాటు ఇద్దరు మేనత్తలు, మేనమామ మృతి
- అరటి గెలలు కోస్తుండగా విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు.. వారిని తాకి మరో ఇద్దరి మృతి
- శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలో ఘటన

2లో



నలుగురు మృతికి కారణమైన విద్యుత్‌వైర్లు

రాష్ట్రంలో మందుల సంక్షోభం!



ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర మందులకు తీవ్ర కటకట

ఎమర్జెన్సీలో స్థానిక కొనుగోళ్లకు నిధులు సున్నా

5లో

మిస్టరీ వీడినట్లే.. నా?

ఆర్థిక లావాదేవీలే జయరామ్ హత్యకు కారణం

సూత్రధారి శిఖా చౌదరి.. ప్రియుడు రాకేష్‌రెడ్డి హంతకుడు?

- హైదరాబాద్‌లోనే హత్య జరిగినట్లు పోలీసుల నిర్ధారణ!
- కృష్ణా జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగినట్లుగా చిత్రీకరణ.. తన పలుకుబడితో కేసును నీరుగార్చవచ్చన్నది రాకేష్ ఎత్తుగడ
- జగ్గయ్యపేటలో ఇద్దరినీ విచారిస్తున్న ఎస్పీ త్రిపాఠి
- కుక్కలకు ఇచ్చే ఇంజెక్షన్ ఇచ్చి చంపినట్లు అంగీకారం
- నిందితులను తప్పించేందుకు రంగంలోకి గుంటూరు జిల్లా ఎంపీ
- ఎస్పీ త్రిపాఠి తీరుపై సర్వత్రా విమర్శలు

2లో



శిఖా చౌదరి (ఫైల్)

ఎమ్మెల్యే చెవిరెడ్డిపై టీడీపీ నేతల దాడి

పసుపు కుంకుమ కార్యక్రమంలో ఘటన

- మా పార్టీ కార్యక్రమంలో మీ ప్రసంగాలు ఏమిటని టీడీపీ నేతల బెదిరింపు
- ఎమ్మెల్యేకు రక్షణగా ఉన్న మహిళలు, పోలీసులపై రాళ్లు, కారంతో దాడి
- ముగ్గురు మహిళలకు గాయాలు, తీవ్ర తోపులాట
- స్పృహతప్పిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తిరుపతి రుయా ఆసుపత్రికి తరలింపు

2లో



రుయా ఆస్పత్రిలో చెవిరెడ్డి పరిస్థితి చూసి కన్నీరు పెడుతున్న ఆయన సతీమణి లక్ష్మి

ఢిల్లీ చేరుకున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

ఓటర్ల జాబితా అవకతవకలపై నేడు ఈసీకి ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక రీతిలో అధికార తెలుగుదేశం పార్టీ ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతుండడం, అధికార యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న తీరుపై వైఎస్ జగన్ సోమవారం ఉదయం 11.30 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నారు. సర్వేల పేరుతో టీడీపీ వ్యతిరేక ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తుండడాన్ని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) సునీల్ అరోరా దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరనున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రత్యేక హోదా కోసం ఎంపీ పదవికి రాజీనామా చేసిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు.

6న రోదసిలోకి జీశాట్–31

ఫ్రెంచి గయానా కౌరూ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగం

శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) ఈ నెల 6న తెల్లవారుజామున 2.31 గంటలకు ఫ్రాన్స్ అంతరిక్ష సంస్థ ఫ్రెంచి గయానా కౌరూ కేంద్రం నుంచి ఏరియన్–5 (వీఏ 247) రాకెట్ ద్వారా జీశాట్–31 ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. జీశాట్ సిరీస్‌లో ఇప్పటివరకు ఇస్రో 39 ఉపగ్రహాలను ప్రయోగించగా జీశాట్–31.. 40వ ప్రయోగం కావడం విశేషం. ఈ ఉపగ్రహంలో కేయూ బాండ్ ట్రాన్స్‌ఫాండర్స్‌ను అమర్చి పంపుతున్నారు. ఈ ఉపగ్రహాన్ని బెంగళూరులోని యూఆర్ రావు స్పేస్ సెంటర్‌లో తయారు చేసి ప్రత్యేక విమానంలో తీసుకెళ్లారు. ఆదివారం రాకెట్‌కు అమర్చి తుది తనిఖీలు నిర్వహించారు. ఈ ఉపగ్రహాన్ని భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్య (జియో స్టేషనరీ ఆర్బిట్)లోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహ ప్రయోగంతో వీశాట్ నెట్‌వర్క్, టెలివిజన్ డిజిటల్ సమాచారం. డీటీహెచ్ ప్రసారాల్లో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుంది. అదనంగా దేశంలోని మామూలు ప్రాంతాలతో పాటు మారుమూల దీవులు, ముఖ్యంగా అండమాన్‌లో సెంటిలీన్ దీవిలాంటి వాటిని కూడా గుర్తించేందుకు దోహదపడుతుంది. అదే విధంగా సముద్రాల గమనం కూడా తెలుసుకునే ఆవకాశం కలుగుతుంది. ఈ ఉపగ్రహం సుమారు 15 ఏళ్లపాటు సేవలందిస్తుంది.

ఎమ్మెల్యే చెవిరెడ్డిపై టీడీపీ నేతల దాడి

- పసుపు కుంకుమ కార్యక్రమంలో ఘటన
- ఎమ్మెల్యేకు రక్షణగా ఉన్న మహిళలు, పోలీసులపై రాళ్లు, కారంతో దాడి


చెవిరెడ్డిని పోలీసుల వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

తిరుపతి రూరల్: సీఎం సొంత జిల్లా చిత్తూరులో పచ్చ నేతలు మరోసారి రెచ్చిపోయారు. చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలో ఆదివారం అధికారికంగా నిర్వహించిన పసుపు–కుంకుమ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే హోదాలో ప్రసంగిస్తున్న ఆయన్ని అడ్డుకున్నారు. ఇది టీడీపీ కార్యక్రమం అని, ఇందులో మీ ప్రసంగాలు ఏంటని? మైక్ కట్ చేయించారు. అధికారులు వారిస్తున్నా వినకుండా చెవిరెడ్డి పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఎమ్మెల్యే చెవిరెడ్డికి పోలీసులు, మహిళలు రక్షణగా నిలిచారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలీసులు, మహిళలపై రాళ్లు, కారం పొడి, స్వీట్ ప్యాకెట్లతో దాడి చేశారు. దాడిలో ఎమ్మెల్యేతో పాటు తిరుపతి వెస్ట్ డీఎస్పీ, ఎంఆర్ పల్లి సీఐ, ముగ్గురు మహిళలకు గాయాలు అయ్యాయి. పోలీసులకు, టీడీపీ నాయకులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. తోపులాటలో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఉక్కిరిబిక్కిరి అయ్యారు. స్పృహతప్పి కింద పడ్డారు. ఉలిక్కిపడిన పోలీసులు గొడవ చేస్తున్న టీడీపీ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేశారు. స్పృహ తప్పిన ఎమ్మెల్యేని పోలీసులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చెవిరెడ్డికి శ్వాస తీసుకోవటంలోనూ, బీపీ ఇబ్బందులు రావటంతో రుయా అత్యవసర విభాగంలో వైద్య పరీక్షలు చేశారు. కాగా ప్రభుత్వ ఖర్చులతో నిర్వహిస్తున్న అధికార కార్యక్రమం పసుపు–కుంకుమను టీడీపీ నేతలు, కార్యకర్తలు తమ పార్టీ కార్యక్రమంగా ప్రచారం చేసుకుంటూ దౌర్జన్యాలకు దిగడం మరోసారి బయటపడింది.

ఫోన్‌లో పరామర్శించిన జగన్

రుయాలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలతోనే ఉండు, నీకు అండగా మేమున్నాం... అంటూ ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త జంగాలపల్లి శ్రీనివాసులు ఆసుపత్రికి వచ్చి ఎమ్మెల్యే చెవిరెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యేపై దాడి ఘటనను తెలుసుకున్న నియోజకవర్గంలోని చెవిరెడ్డి అనుచరులు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రుయా ఆసుపత్రికి తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అర్చకులకు శఠగోపం

▶ మొదటి పేజీ తరువాయి

బలవంతంగా తొలగించిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా అర్చకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో టీటీడీలో మాత్రమే వంశపారంపర్య అర్చకత్వం ఉండదని, దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో ఆ ఉత్తర్వులను అమలు చేయమని మంత్రి కేఈ కృష్ణమూర్తి అప్పట్లో ప్రకటించారు. కానీ, తాజాగా దేవదాయ శాఖలో ఆదాయం ఉండే ఆలయాల్లోనూ వంశపారంపర్యంగా అర్చకత్వంలో కొనసాగుతున్న వారిలో 65 ఏళ్లు నిండిన వారిని తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదికి రూ.5 లక్షలు, అంత కంటే తక్కువ ఆదాయం ఉండే ఆలయాల్లో మాత్రమే వంశపారంపర్య అర్చకత్వంలో ఉన్నవారిని కొన్ని పరిమితుల మేరకు కొనసాగించాలని నిర్ణయానికొచ్చినట్లు సమాచారం.

దేవదాయ శాఖలో వంశపారంపర్య అర్చకత్వానికి అంగీకారం తెలుపుతూ 2017 ఫిబ్రవరి 16న రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 30 రోజుల తర్వాత తుది నోటిఫికేషన్ విడుదల చేస్తామని పేర్కొంది. అయితే, దేవదాయ శాఖ చట్టం–2007లో పేర్కొన్న మేరకు పూర్తిస్థాయిలో వంశపారంపర్య అర్చకత్వానికి అనుమతి తెలపడానికి సిద్ధంగా లేని ప్రభుత్వం గత రెండేళ్లుగా ఏదో ఒక సాకు చూపుతూ తుది నోటిఫికేషన్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తోంది. ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో కేవలం ఏడాదికి రూ.5 లక్షల లోపు ఆదాయం ఉండే ఆలయాల్లోనే వంశపారంపర్య అర్చకత్వాన్ని హక్కుగా కాకుండా కేవలం అవకాశంగా ఇవ్వడానికి అంగీకారం తెలుపుతూ తుది నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జీవో జారీకి ముందే సన్మానాలు!

అర్చకుల సంక్షేమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం కీలక నిర్ణయాలు ప్రకటించబోతున్నారని, అర్చకులందరూ ఆ రోజు సీఎంకు సన్మానం చేసేందుకు ఉండవల్లిలోని ప్రజావేదిక వద్దకు రావాలంటూ దేవదాయ శాఖ సలహాదారునితోపాటు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పలువురికి ఫోన్ల ద్వారా సమాచారమిస్తున్నారు. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని, అర్చకులందరి సమక్షంలోనే ఆ ఫైల్‌పై చంద్రబాబు సంతకం చేస్తారని చెబుతున్నారు. ఉండవల్లికి అర్చకులను తరలించే బాధ్యతను జిల్లాల్లోని డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లకు అప్పగించారు.

పోస్టుకు లక్ష!

అంగట్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉద్యోగాలు

"సచివాలయంలో 'సార్'కు డబ్బులు ఇచ్చేస్తే పని అయిపోతుంది. రేపు 10 గంటలకు సచివాలయానికి రమ్మన్నారు. ఇప్పటికే కొంత సొమ్ము చెల్లించాం. మిగిలిన సొమ్మును బ్యాంకు ద్వారా ట్రాన్స్‌ఫర్ చేస్తామని సార్‌కు చెప్పాం. డబ్బులు చెల్లిస్తే రెగ్యులర్ పోస్టుల్లో నియమిస్తారు. ఆ మేరకు జీవో జారీ చేస్తారు. మంత్రి సునీత, కమిషనర్, ముఖ్యకార్యదర్శి, ముఖ్యమంత్రి గారు సంతకాలు చేసి జీవో ఇస్తామన్నారు. జిల్లాలవారీగా ఎవరు ఎంత ఇచ్చారు, ఇంకా ఎంత ఇవ్వాలో లిస్టు రాసి పెట్టుకోండి. ఇంకా ఇవ్వాల్సిన వారు బ్యాంకుల్లో వేస్తే అమరావతిలో డ్రా చేసి ఇవ్వడం సమస్య అవుతుంది. నగదే జాగ్రత్తగా తీసుకురండి. సచివాలయంలో సార్‌కు ఇచ్చేయొచ్చు, ఎలాంటి సమస్య ఉండదు"

- కొందరు అంగన్‌వాడీ మహిళల మధ్య ఫోన్ ద్వారా జరిగిన సంభాషణల సారాంశం ఇదీ...

నేడు ఉండవల్లిలో సమావేశం

అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల సిఫార్సులతో కొన్ని నెలల క్రితం 384 మంది మహిళలను ప్రభుత్వం అంగన్‌వాడీ ఇన్‌చార్జి సూపర్‌వైజర్లుగా నియమించింది. కొంతకాలం తర్వాత వారిని కొన్ని కారణాలతో విధుల నుంచి తొలగించింది. ఇప్పుడు వారిలో 361 మందికి మధ్యవర్తుల ద్వారా ప్రభుత్వ పెద్దలు ఎర వేశారు. రెగ్యులర్ పోస్టులు ఇవ్వడంతోపాటు గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా పర్మినెంట్ చేస్తామని నమ్మబలుకుతున్నారు. ఒక్కో పోస్టుకు రూ.లక్ష చొప్పున రేటు నిర్ణయించారు. ఇప్పటికే ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా వసూలు చేశారు. ఇప్పటిదాకా రూ.1.5 కోట్లకుపైగానే వసూలు చేసినట్లు తెలుస్తోంది. మిగతా సొమ్ము త్వరగా ఇచ్చేస్తే జీవో జారీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. వసూళ్ల ప్రక్రియను సమీక్షించడంతోపాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల ఎంపికపై సోమవారం ఉండవల్లిలో సమావేశం ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

సాక్షి, అమరావతి: రాష్ట్ర పరిపాలనా యంత్రాంగం కొలువుదీరిన పవిత్రమైన సచివాలయాన్ని అక్రమార్జనకు అడ్డాగా మార్చేశారు. సరిగ్గా ఎన్నికల ముందు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అడ్డగోలుగా అమ్మేసుకుంటున్నారు. ఒక్కో పోస్టుకు అక్షరాలా రూ.లక్ష ధర నిర్ణయించి మరీ సచివాలయం సాక్షిగా వసూలు చేస్తున్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఆ శాఖ కమిషనర్, ముఖ్యకార్యదర్శి కనుసన్నల్లోనే ఈ వసూళ్ల భాగోతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. అంగన్‌వాడీ మహిళల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఈ సంభాషణల వివరాలు 'సాక్షి' చేతికి చిక్కాయి. మొత్తం 361 పోస్టులను విక్రయానికి పెట్టారు. ఇప్పటికే కొందరు మహిళలు బ్యాంకుల ద్వారా సంబంధిత మధ్యవర్తులకు కొంత సొమ్ము చెల్లించారు.

ఇన్‌చార్జి సూపర్‌వైజర్‌గా పనిచేసిన ఓ మహిళ ఇతర సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన మాటలివీ..

''అంగన్‌వాడీ టీచర్, వర్కర్‌గా కూలీకి పనిచేశాం. మనకు డైరెక్టుగా పదోన్నతి ఇవ్వడం సాధ్యం కాదు. ఆయా నుంచి వర్కర్‌గా ఇస్తారు. వర్కర్ నుంచి గ్రేడ్–2 పోస్టు రాదు. గ్రేడ్–2 పోస్టులో నియమించాలంటే ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికవ్వాలి. పరీక్ష లేకుండా తీసుకోవాలంటే సీనియారిటీ లిస్టు తయారు చేయాలి. సీనియారిటీ లిస్టులో మన పేర్లు ఉండవు. డబ్బులు చెల్లిస్తే ఇప్పుడు రెగ్యులర్ పోస్టుల్లో నియమిస్తారు. ఆ మేరకు జీవో జారీ చేస్తారు. మంత్రి సునీత, కమిషనర్, ముఖ్యకార్యదర్శి, ముఖ్యమంత్రి గారు సంతకాలు చేసి జీవో ఇస్తామన్నారు. రెగ్యులర్ పోస్టు ఇచ్చిన తరువాత గ్రేడ్–2 పోస్టులు భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తారు. ఈ గ్రేడ్–2 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తుంది. అప్పుడు సీనియారిటీ లిస్టులో మన పేర్లు చేర్చి, గ్రేడ్–2 పోస్టుల్లో నియమిస్తారు. ఆ తరువాతే మిగతావారిని తీసుకుంటారు. ఇన్‌చార్జి పోస్టు కాదు రెగ్యులర్ పోస్టే ఇస్తారు. అంతటితో ఆగకుండా గ్రేడ్–2 పోస్టులు ఇస్తారు''

వివిధ జిల్లాల మహిళా సభ్యుల మధ్య ఫోన్‌లో జరిగిన సంభాషణ..

''ఇప్పుడే మీటింగ్ నుంచి బయటకు వచ్చాం. రేపు కూడా ఉండమని సార్ చెప్పారు. రేపు 10 గంటలకు సచివాలయానికి రమ్మన్నారు. ఇప్పటికే కొంత సొమ్ము చెల్లించాం. మిగిలిన సొమ్మును బ్యాంకు ద్వారా ట్రాన్స్‌ఫర్ చేస్తామని సార్‌కు చెప్పాం. ఈ విషయాలను ఎక్కడా బయట పెట్టకండి. ఎవరికీ చెప్పకండి. మేము ఒట్టు వేశాం. డబ్బులు చెల్లించిన స్లిప్‌ల ఫొటోలను వాట్సాప్ గ్రూపులో పెట్టకండి. గ్రూపులో పెడితే ఎవరి దగ్గరికో వెళ్లిపోతాయి. విల్లింగ్, నాన్ విల్లింగ్ లిస్టులను ఆయా జిల్లాల లీడర్లకు పెట్టండి. ఇంత కంటే ఏమీ చెప్పలేం. మనకు ఏడాదికి రూ.1.60 కోట్ల జీతాలని చెప్పారు. ఒకటిన్నర ఏడాది సీనియారిటీ ఇస్తారు. మీరు స్పందిస్తే కచ్చితంగా గ్రేడ్–2 పోస్టులు తెస్తాం. మీరందరూ సహకరించాలి. సహరిస్తేనే ముందుకు వెళ్లగలం. స్పందించకపోతే సూపర్‌వైజర్‌గానే ఉంటారు. ఆర్థిక మంత్రి దగ్గర ఫైల్ కూడా చూశాం''

ఇతర సభ్యులతో..

''అక్కడ ఏం జరిగిందో ఫోన్ చేసి తెలుసుకుని, ఫోటోలో పెట్టమన్నాం. ఇంకా పెట్టలేదు. సోమవారం ప్రయాణం. ఆర్డర్ కాపీ రావడానికి మూడు నాలుగు రోజుల సమయం పడుతుంది. సోమవారం లీడర్ల మీటింగ్ అన్నారు. ఎవరెవరు వస్తారో చూసి రిజర్వేషన్ చేయించాలి. సోమవారం ఉదయం 10 గంటలకు ఉండవల్లిలో మీటింగ్ ఉంటుంది. అనుకున్న రీతిలో డబ్బులు పూర్తిగా కట్టలేకపోయారట. బ్యాంకుల్లో డబ్బులు వేయడం, తీయడం సమస్యగా ఉంది. ఇన్ని రోజులైనా పని పూర్తి కాలేదు. డబ్బులు తీసుకుని సార్‌కు ఇచ్చేస్తే పని అయిపోయేది. 9వ తేదీ కోడ్ అంటున్నారు. ఏం జరుగుతుందో చూడాలి''

కొందరు అంగన్‌వాడీ సభ్యుల మధ్య..

''జిల్లాలవారీగా ఎవరు ఎంత ఇచ్చారు, ఇంకా ఎంత ఇవ్వాలో లిస్టు రాసి పెట్టుకోండి. ఇంకా ఇవ్వాల్సిన వారు బ్యాంకుల్లో వేస్తే అమరావతిలో డ్రా చేసి ఇవ్వడం సమస్య అవుతుంది. నగదునే జాగ్రత్తగా తీసుకొచ్చేయండి. సచివాలయంలో సార్‌కు ఇచ్చేయొచ్చు, ఎలాంటి సమస్య ఉండదు. 14 మంది నుంచి రూ.7.25 లక్షలు వసూలు చేశాను. సచివాలయంలోనే ఒక సభ్యురాలు మరో సభ్యురాలికి రూ.5 వేలు ఒకసారి, రూ.25 వేలు ఇంకోసారి ఇచ్చింది. ఇప్పటికే లక్ష్మీ అనే మహిళ రామచంద్రయ్య అనే వ్యక్తికి బ్యాంకు ద్వారా రూ.40 వేలు చెల్లించింది. కె.రాజ్యలక్ష్మి అనే మహిళ బ్యాంకు ద్వారా ఎ.బాబు అనే వ్యక్తికి రూ.3,25,059 చెల్లించింది. ఇంకా కొంతమంది మహిళలు బ్యాంకుల ద్వారా రూ.20 వేల చొప్పున చెల్లించారు''

11, 12, 13 తేదీల్లో అనంత, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో..

వైఎస్సార్‌సీపీ సమరశంఖారావం

సాక్షి, హైదరాబాద్/ రేణిగుంట: ఈ నెల 11, 12, 13వ తేదీల్లో అనంతపురం, పీఎస్సార్ నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమర శంఖారావం సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో రాష్ట్ర ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొంటారు. 'జగనన్న పిలుపు' అనే కార్యక్రమంలో భాగంగా తటస్థులైన ఓటర్లకు ఆయన ఇదివరకే లేఖలు రాసిన విషయం తెలిసిందే. తటస్థులు హాజరయ్యే ఈ సమావేశంలో వైఎస్ జగన్ తొలుత పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత పోలింగ్ బూత్ స్థాయి పార్టీ శ్రేణుల సమావేశంలో జగన్ పాల్గొని, వారిని ఎన్నికలకు సమాయత్తం చేస్తారు.

6, 7 తేదీల్లో చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో

ముందుగా ప్రకటించిన విధంగానే ఈ నెల 6న తిరుపతి (చిత్తూరు జిల్లా)లో సమరశంఖారావం సమావేశాలు జరుగుతాయి. ఈ నెల 7న వైఎస్సార్ కడప జిల్లాలో జరుగుతాయి. ఈ రెండు చోట్లా జగన్ పాల్గొని తటస్తులు, పార్టీ శ్రేణులతో విడిగా సమావేశమై ప్రసంగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.


సమర శంఖారావం ఏర్పాట్లను పరిశీలిస్తున్న తలసిల రఘురాం, పెద్దిరెడ్డి, భూమన తదితరులు

తిరుపతి సభకు ముమ్మర ఏర్పాట్లు

ఈ నెల 6న తిరుపతిలో ఏర్పాటు చేయనున్న వైఎస్సార్‌సీపీ సమర శంఖారావం సభకు రేణిగుంట యోగానంద కళాశాల సమీపంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం పార్టీ రాష్ట్ర ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ తలసిల రఘురాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు భూమన అభినయ్‌రెడ్డి పరిశీలించారు. సభా వేదికతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వచ్చే బూత్ కమిటీల ప్రతినిధులు కూర్చునేందుకు వీలుగా సభాస్థలిని చలువ పందిళ్లతో నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, తిరుమలరెడ్డి, ఎస్కే బాబు, పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్, గంగయ్య, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

సినిమా టి'కేటు'గాళ్ల'పై నజర్

సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను ఆసరాగా చేసుకుని సినిమా టికెట్ల పేరుతో ప్రేక్షకుల నుంచి ఎక్కువ ధరలను వసూలు చేస్తున్న థియేటర్ యాజమాన్యాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. వాస్తవానికి రూ.100 కన్నా ఎక్కువ ఉన్న సినిమా టికెట్లపై మొదట్లో 28 శాతం జీఎస్టీ విధించారు. కానీ, గత కౌన్సిల్ సమావేశంలో ఈ మొత్తాన్ని 18 శాతానికి తగ్గించి ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి తెచ్చారు. అయితే, కొన్ని థియేటర్ల యాజమాన్యాలు టికెట్లపై 28 శాతం జీఎస్టీ అని ముద్రించి ప్రేక్షకుల నుంచి వసూలు చేసిన తర్వాత ప్రభుత్వానికి మాత్రం 18 శాతమే చెల్లిస్తున్నాయి. దీంతో హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ అధికారులు హైదరాబాద్‌లో ఉన్న మల్టీప్లెక్స్ థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఎక్కువ మొత్తంలో జీఎస్టీని వసూలు చేస్తున్న థియేటర్ యాజమాన్యాలపై సాక్ష్యాలతో కేసు నమోదు చేసిన అధికారులు విచారించే ప్రక్రియను యాంటీ ప్రాఫిటరింగ్ విభాగానికి బదిలీ చేశారు. కాగా, సినిమా టికెట్లపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గింది. తాజా బడ్జెట్‌లో ఆ వ్యత్యాసాన్ని కూడా తీసేసి ప్రతి సినిమా టికెట్‌పై కేవలం 12% జీఎస్టీ ఉంటుంది.

తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభం

▶ మొదటి పేజీ తరువాయి

మినియేచర్లను పరిశీలించారు.

పెండింగ్ కేసులు మాయని మచ్చ

కింది కోర్టుల్లో 3 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని జస్టిస్ రంజన్ గొగోయ్ తెలిపారు. ఇందులో 81 లక్షల కేసులు ఒక ఏడాదిలోనే దాఖలయ్యాయని, 50 లక్షల కేసులు చిల్లర కేసులని, 25 లక్షల కేసులు పదేళ్ల పాతవని చెప్పారు. 50 లక్షల చిల్లర కేసులను పరిష్కరించడానికి ఏం చేయాలనే దానిపై ప్రధాన న్యాయమూర్తులు ఆలోచన చేయాలని తెలిపారు. తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయవ్యవస్థకు ఈ పెండింగ్ కేసులు ఓ మాయని మచ్చగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కింది కోర్టుల్లో భారీ స్థాయిలో ఖాళీలున్నాయని, వీటి భర్తీకి ఆయా హైకోర్టులు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికే ఖాళీల భర్తీకి తాము తీసుకున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయన్నారు. 75 శాతం ఖాళీలను ఈ ఏడాది చివరికల్లా భర్తీ చేస్తామని తెలిపారు. హైకోర్టులో 392 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇందులో 272 ఖాళీలకు సంబంధించి ఆయా హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల నుంచి ఎలాంటి సిఫార్సులు రాలేదన్నారు. 130 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, మరో 100 ఖాళీల భర్తీ విషయం కొలీజియం పరిశీలనలో ఉందని, 14 ఖాళీలకు సంబంధించి తాము చేసిన సిఫార్సులు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ తాత్కాలిక హైకోర్టును ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రకటించారు.

రైతులే అసలైన రాజధాని నిర్మాతలు

అమరావతిలో తాత్కాలిక హైకోర్టు భవనాన్ని ప్రారంభించడం, శాశ్వత హైకోర్టుకు శంకుస్థాపన చేయడం ఓ చారిత్రక ఘట్టమని జస్టిస్ ఎన్వీ రమణ వ్యాఖ్యానించారు. ఆశావహ దృక్పథంతో ఈ హైకోర్టు ప్రతిష్టను మరింత పెంచాలని న్యాయమూర్తులు, న్యాయవాదులను కోరారు. రాజధాని కోసం తల్లిలాంటి భూములిచ్చిన రైతులే అసలైన రాజధాని నిర్మాతలని అన్నారు. జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఎంతోమంది ఎన్నో రకాల సమస్యలతో, ఆశలతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తుంటారని, న్యాయవ్యవస్థపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని చెప్పారు. జస్టిస్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ... విభజన తరువాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల్లో 1.70 లక్షల చొప్పున కేసులున్నాయన్నారు. జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... ఈ హైకోర్టు భవనాన్ని ఓ వ్యవస్థగా మార్చాల్సిన బాధ్యత న్యాయవాదులు, కక్షిదారులతో పాటు ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. జస్టిస్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. హైకోర్టు విభజన ఎటువంటి సమస్యలు లేకుండా సాఫీగా పూర్తయిందని తెలిపారు.


నేలపాడులో ప్రారంభమైన నూతన హైకోర్టు భవనం

చరిత్రను పునరావృతం చేస్తాం...

రాష్ట్ర విభజన వల్ల పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయని చంద్రబాబు అన్నారు. ప్రత్యేక హోదాతోపాటు పలు హామీలు ఇంకా అమలు కాలేదన్నారు. రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములు ఇచ్చిన రైతులకు సదా రుణపడి ఉంటానని చెప్పారు. శాతవాహనుల కాలంలో అమరావతి ఓ వెలుగు వెలిగిందని, ఇప్పుడు మళ్లీ చరిత్రను పునరావృతం చేస్తామన్నారు.

పెళ్లింట మృత్యుఘోష

- విద్యుదాఘాతంతో నలుగురి దుర్మరణం
- శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలో ఘటన


మృతులు రాముడు, వెంకన్న, పుణ్యవతి, బంగారమ్మ (ఫైల్ ఫొటోలు)

లావేరు: ఆ ఇంట్లో కొద్ది రోజుల్లో పెళ్లి.. ఇక పెళ్లి పనులు ప్రారంభించాలనుకున్నారు.. ఈ నేపథ్యంలో అరటి గెలలు కోసేందుకు తోటలోకి వెళ్లిన ఇద్దర్ని విద్యుత్ తీగలు బలిగొన్నాయి. గెలల కోసం వెళ్లిన వారు ఎంతకీ రాకపోవడంతో మరో ఇద్దరు తోటలోకి వెళ్లి విగత జీవులుగా పడి ఉన్న ఆ ఇద్దర్నీ తట్టారు.. అంతే, వారు కూడా విద్యుత్ షాక్‌తో దుర్మరణం పాలయ్యారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం తామాడ పంచాయతీ పరిధిలోని కొత్తరౌతుపేటలో ఆదివారం జరిగిన ఈ ఘటన పెళ్లింట విషాదాన్ని నింపింది. చుట్టుపక్కల గ్రామాలు ఉలిక్కిపడ్డాయి.

పెళ్లి పనులు ప్రారంభించే క్రమంలో..

పాతరౌతుపేటకు చెందిన కొమ్ము వెంకన్న కుమారుడు శ్రీనుకు మార్చి 27న వివాహం చేయాలని నిర్ణయించారు. ఈ నెల ఆరో తేదీన పెళ్లి పనులు ప్రారంభించేందుకు పసుపు దంచే పనులు చేయాలని ముహూర్తం పెట్టారు. దీని కోసం అరటి పళ్ల అవసరం కావడంతో వాటిని కోసేందుకు తన సోదరి భర్త ఆబోతుల రాముడుకు చెందిన తోటలోకి వెంకన్న (48), రాముడు(60) వెళ్లారు. ముందుగా ఓ చెట్టు నుంచి గెలను బాగానే కోశారు. రెండో చెట్టు గెలను కోస్తుండగా చెట్టువిరిగి పక్క నుంచి కిందకి వేలాడుతూ వెళుతున్న విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుదాఘాతంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. గెలల కోసం వెళ్లిన వారు ఎంతసేపటికీ తోట నుంచి బయటకు రాకపోవడంతో పక్క పొలంలో అరటి గొప్పు(పాదులు) తవ్వుతున్న రాముడు భార్య పుణ్యవతి(50), ఆమెకు సోదరి వరసైన కొత్తరౌతుపేటకు చెందిన రౌతు బంగారమ్మ(45)లు తోటలోకి వెళ్లిచూడగా వెంకన్న, రాముడు పడిపోయి ఉన్నారు. విద్యుత్ షాక్ విషయం తెలియని పుణ్యవతి, బంగారమ్మలు వారిని తాకడంతో వారిద్దరు కూడా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే చనిపోయారు. అరటి తోటలోకి వెళ్లినవారెవరూ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన మృతుడు వెంకన్న కుమారుడు.. శ్రీను, చిరంజీవి తోటలోకెళ్లి చూడగా నలుగురి మృతి విషయం బయటపడింది. మృతుల బంధువుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. శ్రీకాకుళం ఆర్డీవో ఎంవీ రమణ, డీఎస్పీ వి.భీమారావు, రణస్థలం సీఐ విశ్వేశ్వరరావు, లావేరు తహసీల్దార్ పి.సుధాసాగర్, ఎస్‌ఐ చిరంజీవి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతులకు రూ.10 లక్షలు చొప్పున ఇవ్వనున్నట్టు ఆర్డీవో విలేకరులతో చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కొత్తరౌతుపేట గ్రామం విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళావెంకటరావు నియోజవర్గమైన లావేరు మండలంలోనిది. విద్యుత్‌శాఖాధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిస్టరీ వీడినట్లే.. నా?

సాక్షి, అమరావతి బ్యూరో: వ్యాపారవేత్త, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరామ్ హత్య కేసు మిస్టరీ వీడినట్లు తెలుస్తోంది. నాలుగు రోజులుగా అనేక మలుపులు తిరుగుతున్న ఈ కేసులో జయరామ్ మేనకోడలు శిఖా చౌదరి సూత్రధారిగా, ఆమె ప్రియుడు రాకేష్‌రెడ్డి హంతకుడిగా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఆర్థిక పరమైన లావాదేవీల్లో విభేదాలే ఈ హత్యకు కారణమని తేలింది. గత నెల 31న దస్పల్లా హోటల్ వద్ద నుంచి జయరామ్‌ను కారులో తీసుకొచ్చిన రాకేష్.. మరికొందరితో కలిసి అతనికి జబ్బుతో ఉన్న కుక్కలకు ఇచ్చే ఇంజెక్షన్ చేసి హైదరాబాద్‌లోనే హత్య చేసినట్లు సమాచారం. ఆ తర్వాత కృష్ణా జిల్లా నందిగామ సమీపంలోని ఐతవరం వద్ద రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించే యత్నం చేశారని పోలీసులు భావిస్తున్నారు. జగ్గయ్యపేటలోని రాంకో సిమెంట్ కంపెనీకి చెందిన గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఎస్పీ ఎస్.త్రిపాఠి.. రాకేష్‌ని, శిఖా చౌదరిని వేర్వేరుగా విచారించారు. హత్య కేసులో వారిద్దరి పాత్రపై ఒక స్పష్టతకు వచ్చిన పోలీసులు.. వారికి సహకరించిందెవరు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక లావాదేవీలు.. పెళ్లికి అడ్డుగా నిలిచాడనే హత్య?

రాకేష్‌రెడ్డి, శిఖా చౌదరి కొన్నాళ్లుగా డేటింగ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. శిఖా అడిగిన మేరకే రాకేష్ జయరామ్‌కు రూ. 4.5 కోట్లు అప్పుగా ఇచ్చినట్లు సమాచారం. అయితే డబ్బు తిరిగి చెల్లించే విషయంలోనే ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. అదేసందర్భంలో రాకేష్‌రెడ్డితో పెళ్లికి మామయ్య జయరామ్ అడ్డుపడ్డారని, అలాగే జయరామ్ తన విల్లాకు తరచూ రావడం రాకేష్‌కు ఇష్టం లేదని శిఖా పోలీసులకు చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అదేసమయంలో టెక్నాన్ అనే కంపెనీ లావాదేవీల విషయంలో శిఖాకు, జయరామ్‌కు మధ్య విభేదాలు వచ్చాయని, మామయ్యకు తెలియకుండా కంపెనీ చెక్కులపై శిఖా ఫోర్జరీ సంతకాలు కూడా చేసినట్లు వెల్లడయింది. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయల టర్నోవర్ జరిగినట్లు సమాచారం. ఈ విషయం జయరామ్‌కు తెలియడంతో వారిద్దరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. జయరామ్ స్థాపించిన అనేక కంపెనీలను శిఖా చౌదరినే నిర్వహిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కృష్ణా జిల్లా నందిగామ నియోజకవర్గం మంగొల్లు సమీపంలో 10 ఎకరాల ఫాం హౌస్‌ను శిఖా పేరిట జయరామ్ రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను జయరామ్ తన వద్దే ఉంచుకున్నారు. వాటిని చేజిక్కించుకోవడం కోసం ఇటీవల ఓ యువతిని సైతం జయరామ్‌కు ఎరగా వేసినట్లు తెలుస్తోంది. అయినా డాక్యుమెంట్లు లభించకపోవడం, తమ పెళ్లికి అడ్డుగా ఉండడం, అప్పు విషయంలో విభేదాల కారణంతో బాయ్‌ఫ్రెండ్ రాకేష్‌రెడ్డితో కలిసి హత్యకు పథక రచన చేసినట్లు పోలీసుల విచారణలో శిఖా అంగీకరించినట్లు సమాచారం. బాయ్‌ఫ్రెండ్, అతడి స్నేహితులు మరికొందరితో కలిసి ఈ నెల 31న జయరామ్‌ను దస్పల్లా హోటల్ నుంచి కారులో తీసుకొచ్చి హైదరాబాద్ శివార్లలో ఇంజెక్షన్ చేసి జయరామ్‌ను హత్య చేసినట్లు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ కేసు వివరాలను కృష్ణా జిల్లా పోలీసులు సోమవారం మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది.


రాకేష్ (ఫైల్)

అత్యంత రహస్యంగా విచారణ..

హత్య కేసులో అనుమానితులను కృష్ణా జిల్లా పోలీసులు అత్యంత రహస్యంగా విచారిస్తున్నారు. దర్యాప్తు సందర్భంగా పోలీసు బృందాలకు లభ్యమైన కీలక ఆధారాలు, అలాగే తమ అదుపులోకి తీసుకున్న అనుమానితుల వివరాలు కానీ ఎక్కడా వెల్లడించకుండా ఎస్పీ త్రిపాఠి జాగ్రత్తలు తీసుకున్నారు. శిఖా చౌదరిని పోలీసులు విచారిస్తున్న ఫొటో ఆదివారం ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో ఎస్పీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఫొటో మీడియాకు ఇచ్చారన్న కారణంతో ఓ కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపించారు. అలాగే మరో ఐదుగురు కానిస్టేబుళ్ల సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ కేసు విషయంలో ఎస్పీ ఎందుకంత గోప్యత పాటిస్తున్నారనే అంశంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏపీ సీఎం కార్యాలయంలో రాకేష్ హవా!

టీడీపీ అధికారంలోకి వచ్చాక.. సీఎం కార్యాలయంలో పని చేసే అభిష్టా అనే వ్యక్తితో రాకేష్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. అభిష్టా చంద్రబాబు తనయుడు లోకేశ్ క్లాస్‌మేట్ కావడం వల్లే అతడిని సీఎంవోలో ఓఎస్డీగా నియమించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రాకేష్ రెడ్డి కూడా ఇటు చంద్రబాబుతో అటు లోకేష్‌తో సత్సంబంధాలు నెరిపినట్లు సీఎంవో వర్గాలు పేర్కొంటున్నాయి. రాకేష్ ఫోన్ కాల్‌తో ఎవరికైనా తిరుమలలో ఎల్–1 దర్శనం లభిస్తుందంటే అతడి పలుకుబడి ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఈ కారణంతోనే హైదరాబాద్‌లోనే జయరామ్‌ను హత్య చేసినప్పటికీ కృష్ణా జిల్లాకు తీసుకువచ్చి ఐతవరం సమీపంలో ఓ రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. ఏపీలో కేసు నమోదు అయితే తనకు ఉన్న పలుకుబడితో బయటపడొచ్చనే ధీమాతోనే ఇలా చేశాడని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పోలీసులపై అధికారపార్టీ ఒత్తిళ్లు..

జయరామ్ హత్య కేసులో నిందితులుగా ఉన్న వారిద్దరినీ కేసు నుంచి తప్పించేందుకు తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతలు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే జయరామ్ కాల్‌డేటాను పరిశీలించిన పోలీసులకు అందులో గుంటూరుకు చెందిన టీడీపీ ఎంపీ సోదరుడి కుమారుడి ఫోన్ నెంబరు ఉండటం.. అతడికి శిఖా చౌదరి మధ్య మద్యం వ్యాపారానికి సంబంధించిన అంశంలో భాగస్వామ్యం ఉన్నట్లు వెల్లడయ్యింది. కాగా, హత్యకు గురైన చిగురుపాటి జయరామ్ అంత్యక్రియలు ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం శ్మశానవాటికలో ముగిశాయి.

శిఖా చౌదరికి ఏ పాపం తెలియదు

కబాలి సినీ నిర్మాత కేపీ చౌదరి

కంచికచర్ల (నందిగామ): జయరామ్ హత్య కేసులో ఆయన మేనకోడలు శిఖా చౌదరి పాత్ర లేదని కబాలి సినీ నిర్మాత కేపీ చౌదరి చెప్పారు. ఆదివారం కంచికచర్ల వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఆమెకు ఈ పాపంలో ఏ ప్రమేయం లేదన్నారు. జయరామ్ అంటే శిఖాకు ప్రాణం అని, ఆయన ఆస్తి విషయాలన్నీ శిఖాయే చూసుకుంటుందన్నారు. జయరామ్‌కు బిజినెస్‌లలో పూర్తి సహకారం ఇచ్చేదని తెలిపారు.

ఆర్టీసీకి మొండిచెయ్యేనా!?

- సంస్థ మనుగడ ప్రభుత్వ చేతుల్లోనే..
- ఈనెల 6 నుంచి సమ్మెకు దిగనున్న కార్మిక సంఘాలు
- ప్రభుత్వంలో విలీనం, 50 శాతం ఫిట్‌మెంట్ చెల్లించాలని డిమాండ్
- ఇంతవరకు చొరవ చూపించని ప్రభుత్వం
- తమిళనాడు, కర్ణాటకలలో అక్కడి ప్రభుత్వం ఊతం
- ఇక్కడ సూచనలన్నీ బుట్టదాఖలు

సాక్షి, అమరావతి

తీవ్ర నష్టాల్లో ఉన్న సంస్థను ప్రభుత్వం ఆదుకోకుంటే దాని మనుగడకు పెనుముప్పు వాటిల్లే పరిస్థితి ఏపీఎస్ ఆర్టీసీలో నెలకొంది. పొరుగునున్న తమిళనాడు, కర్ణాటకలలో ప్రజా రవాణా వ్యవస్థకు అక్కడి ప్రభుత్వాలు ఊతమిస్తున్నా ఇక్కడ ఆ ఛాయలేమీ కనిపించడంలేదు. మోటారు వాహన చట్టం పన్ను మొత్తం భరించడంతోపాటు ఇంధనంపై వ్యాట్ శాతం కూడా పొరుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు భరిస్తున్నాయి. నష్టాలు వస్తే బడ్జెట్‌లో కేటాయింపులు చేసి ప్రజా రవాణాను బలోపేతం చేస్తున్నాయి. కానీ, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ బాగోగులేవీ పట్టడంలేదు. సంస్థను ప్రభుత్వం ఆదుకోవాలని, దాని మనుగడ ప్రభుత్వం చేతుల్లోనే ఉందని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) స్పష్టంచేసినా సర్కారులో ఎలాంటి చలనంలేదు.



ఏటా ఏఎస్ఆర్టీయూ స్టడీ టూర్‌కు రాష్ట్ర అధికారులను ఎంపిక చేసి ఇతర రాష్ట్రాలు, విదేశాలకు పంపుతున్నా.. అక్కడి సంస్కరణలను ఏ మాత్రం అందిపుచ్చుకోవడంలేదు. దీంతో ఏ ఏటికాయేడు ఆర్టీసీ నష్టాల్లో కూరుకుపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.460 కోట్లు వరకు నష్టాలను మూటగట్టుకుంది. కార్మికుల పనితీరుతో గతేడాది కంటే రూ.400 కోట్ల అధికంగా ఆదాయం వచ్చిందని, ఆక్యుపెన్సీ రేషియో 82 శాతానికి చేరినట్లు నివేదికలు చెబుతున్నాయి. కానీ, నష్టాలను పూర్తిగా అధిగమించి, కార్మికులకు మెరుగైన ఫిట్‌మెంట్ ఇవ్వాలంటే సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం ఒక్కటే మార్గమన్న డిమాండ్‌ను ప్రభుత్వం బేఖాతరు చేస్తోంది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, 50 శాతం ఫిట్‌మెంట్ ప్రధాన డిమాండ్లతో ఈ నెల 6 నుంచి సంస్థలో సమ్మె సైరన్ మోగనుంది. సమ్మెకు దిగుతున్నట్లు కార్మిక సంఘాలు ఇప్పటికే నోటీసిచ్చాయి. అయితే, సర్కారు ఇంతవరకు సమస్యల పరిష్కారంలో ఎలాంటి చొరవ చూపలేదు. అలాగే, గతేడాది ఆర్టీసీ ఛైర్మన్, అధికారులు గుజరాత్ వెళ్లి అక్కడ ప్రజా రవాణా వ్యవస్థను అధ్యయనం చేశారు. ఇతర రాష్ట్రాలు, ఆస్ట్రేలియా అధ్యయన నివేదికలను ఆర్టీసీ అధికారుల బృందం యాజమాన్యానికి, ప్రభుత్వానికి అందించినా ఇంతవరకు సర్కారు పట్టించుకోలేదు. ఇలా అయితే సంస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఏఎస్ఆర్టీయూ పేర్కొన్నా సర్కారు పట్టించుకున్న పాపాన పోలేదు.

ఎంవీ ట్యాక్స్‌నూ తగ్గించాలి

మోటారు వాహన పన్ను ఆర్టీసీకి భారంగా పరిణమించడంతో పలుమార్లు పన్ను తగ్గించాలని కార్మికులు, యాజమాన్యం ప్రభుత్వానికి విన్నవించినా ఫలితంలేదు. గతంలోనే చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఎంవీ ట్యాక్స్ ఆర్టీసీ ఆదాయంలో 13 శాతం ఉండేది. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత దానిని ఏడుకు తగ్గించారు. ప్రస్తుతం మరింత నష్టాల్లో కూరుకున్న ఆర్టీసీని ఆదుకోవాలంటే ఎంవీ ట్యాక్స్ ఇంకా తగ్గించాలని కార్మికులు కోరుతున్నారు. పన్ను భారంవల్ల ఆర్టీసీ ఏటా రూ.300 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది. అదే సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తే పన్ను భారం ఉండదు.

ఆస్ట్రేలియాలో ఇలా..

- రాష్ట్రంలో పరిస్థితి ఇలా ఉంటే.. ప్రజా రవాణా వ్యవస్థకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ఏకంగా 80 శాతం నిధుల్ని రాయితీ రూపంలో అందిస్తోంది.
- అక్కడి ప్రజా రవాణా డ్రైవర్లు సిమ్యులేటర్‌పై డ్రైవింగ్ నేర్చుకుని రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సున్నా శాతం ప్రమాదాలను నమోదు చేస్తున్నారు.
- అక్కడి ప్రజా రవాణా వ్యవస్థ మొత్తం ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుంది.
- బస్ డిపోల పర్యవేక్షణ, టికెట్ టెక్నాలజీ, ట్రాన్స్‌లింక్ మాత్రం బస్ డిపోల అధికారులు నిర్వహిస్తారు.
- లాభనష్టాలతో బస్ డిపోల అధికారులకు ఏ మాత్రం సంబంధం ఉండదు.

- ఆర్టీసీకి మొత్తం ఉన్న నష్టాలు : రూ.3,700 కోట్లు
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఉన్న నష్టాలు : రూ.460 కోట్లు
- ఆర్టీసీలో గతేడాది వచ్చిన ఆదాయం : 5,500 కోట్లు
- కార్మికులవల్ల గతేడాది కంటే పెరిగిన ఆదాయం : రూ.400 కోట్లు
- 50 శాతం ఫిట్‌మెంట్ ఇస్తే ఏటా అదనపు భారం : రూ.1,500 కోట్లు
- 20 శాతం ఫిట్‌మెంట్ ఇస్తే ఏటా పడే భారం : రూ.650 కోట్లు

స్వాతంత్య్ర సమరయోధుడు పిల్లా రామారావు మృతి


పిల్లా రామారావు

సీతంపేట (విశాఖ): స్వాతంత్య్ర సమరయోధుడు, విద్యావేత్త, భారతీయ విద్యా కేంద్రం (బీవీకే) వ్యవస్థాపక అధ్యక్షుడు పిల్లా రామారావు (95) ఆదివారం విశాఖలోని చినవాల్తేర్‌లో మరణించారు. పిల్లా సత్యనారాయణ, అప్పాయమ్మ దంపతులకు 1924లో జన్మించిన రామారావు విద్య, వైద్య, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందించారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదివిన రామారావు ఏవీఎన్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేశారు. 1958లో భారతీయ విద్యా కేంద్రం (బీవీకే)ని స్థాపించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో 1942లో చేరి అదే ఏడాది స్వాతంత్య్ర సమరయోధుడు కొండా వెంకటప్పయ్య నేతృత్వంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకి వెళ్లారు. 1947, 48 సంవత్సరాల్లో ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని ఎత్తివేయాలని నిర్వహించిన సత్యాగ్రహంలో పాల్గొని రెండు సార్లు జైలు శిక్షను అనుభవించారు. ఎమర్జెన్సీ సమయంలో విశాఖ కేంద్ర కారాగారంలో 18 నెలలు జైలు శిక్ష (మీసా) అనుభవించారు. రామారావు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల తరఫున ఆందోళనలు ఉధృతం

- నేడు విజయవాడ ధర్నాచౌక్‌లో ధర్నా
- వైఎస్సార్‌సీపీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పిరెడ్డి

నెహ్రూనగర్ (గుంటూరు): అగ్రిగోల్డ్ సమస్యపై ప్రభుత్వం స్పందించకుంటే వైఎస్సార్‌సీపీ తరఫున ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆ పార్టీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి హెచ్చరించారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు పోరుబాట వీడేది లేదని స్పష్టం చేశారు. అందులో భాగంగానే సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధితులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. గుంటూరు అరండల్‌పేటలో ఆదివారం ఆయన విలేకరులతో మట్లాడారు. ప్రభుత్వంపై బాధితులకు నమ్మకం పోయిందని, అందుకే బాధితులు తమ ఉద్యమానికి ఉవ్వెత్తున తరలి వస్తున్నారని చెప్పారు. మంత్రి వర్గంలో చర్చించి రూ.250 కోట్లు బాధితులకు ఇస్తామని ప్రభుత్వం అబద్ధాలు చెప్పిందని మండిపడ్డారు. అసలు క్యాబినెట్‌లో అగ్రిగోల్డ్ అంశం చర్చకే రాలేదని, కానీ ప్రభుత్వం మాత్రం దానిపై సమగ్రంగా చర్చించి రూ.250 కోట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు, కోర్టులో మెమో వేయనున్నట్లు పేర్కొందని విమర్శించారు. సీఐడీ అధికారులు కోర్టుకు చూపని ఆస్తులు రూ.151 కోట్లు గుర్తిస్తే వాటిలో కేవలం రూ.38 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేస్తున్నట్లు జీవో విడుదల చేసిందని మండిపడ్డారు. మిగిలిన ఆస్తులు ఎటు పోయాయో.. ఎందుకు వాటిని కోర్టుకు చూపకుండా ఎందుకు దాచాల్సి వచ్చిందో చంద్రబాబే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రూ.1,183 కోట్లు వైఎస్ జగన్ ఆరు మాసాల్లో విడుదల చేయిస్తారని తెలిపారు.


లేళ్ల అప్పిరెడ్డి

రచనల ద్వారా మరింత ఉద్యమించాలి

'ప్రరవే' పదో వార్షికోత్సవ సదస్సులో వక్తల పిలుపు

సాక్షి, విశాఖపట్నం: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు, కులమతాల ప్రాతిపదికన దాడులకు వ్యతిరేకంగా రచయితలు తమ రచనల ద్వారా మరింతగా ఉద్యమించాలని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) పిలుపునిచ్చింది. స్త్రీలు, అణగారిన వర్గాలపై అణచివేతను నిరసిస్తూ సామాజిక మార్పే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని కోరింది. విశాఖపట్నంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన ప్రరవే పదేళ్ల వార్షికోత్సవ సదస్సు ఆదివారం ముగిసింది. సదస్సులో 'ప్రరవే పదేళ్ల ప్రయాణం–మరో పదేళ్ల ప్రణాళిక' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కార్యదర్శులు పి. రాజ్యలక్ష్మి, కాత్యాయనీ విద్మహే అధ్యక్షతన జరిగిన ఈ చర్చాగోష్టిలో విష్ణుప్రియ మాట్లాడుతూ.. ప్రరవేకు లభిస్తున్న ఆదరణతో రచయిత్రులపై మరింత సామాజిక బాధ్యత పెరుగుతోందన్నారు. స్త్రీల మౌలిక అవసరాలపై అవగాహన పెంచుకుని రచనలు చేయాలని కోరారు. 'స్త్రీల సాహిత్యంలో ప్రతిఫలించిన సాంస్కృతిక ఒత్తిళ్లు' అనే అంశంపై వాడ్రేవు వీరలక్ష్మీదేవి మాట్లాడుతూ.. స్త్రీలపై నాడు సాంస్కృతిక ఒత్తిళ్లు ఉండేవని, నేడు మతం విషంలా తయారైందని చెప్పారు. విఫణి, మత సంస్కృతులతో స్త్రీలు అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్రవంతి శాంతిశ్రీ, ఖాదర్ మొహియుద్దీన్, నల్లూరి రుక్మిణి, ఖాసిం, రామకృష్ణదొర తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. ముగింపు సమావేశంలో ప్రరవే జాతీయ అధ్యక్షురాలు రజిత, కార్యదర్శి కెఎన్ మల్లీశ్వరి, సమన్వయకర్త భండారు విజయ, జాతీయ కోశాధికారి రెహాన, కుప్పిలి పద్మ, తదితరులు పాల్గొన్నారు. ప్రరవే కథా సంకలనాన్ని ఎమ్మెస్కే కృష్ణజ్యోతి ఆవిష్కరించారు.



సదస్సులో మాట్లాడుతున్న నల్లూరి రుక్మిణి

నేడు విడుదల కానున్న సైనిక్ స్కూల్ ఫలితాలు

విజయనగరం మున్సిపాలిటీ/కలికిరి : 2019–20 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్లో 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల చేయనున్నట్లు విజయనగరం జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్నల్ రుద్రాక్ష అత్రి ఆదివారం తెలిపారు. ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైనిక్‌స్కూల్‌కోరుకొండ.ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో ఆదివారం అర్ధరాత్రి నుంచి అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. ఫలితాల్లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 18 వరకు విశాఖ జిల్లా మల్కాపురంలోని ఐఎన్‌హెచ్ఎస్ కళ్యాణి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు పోస్టు ద్వారా కాల్ లెటర్‌లు పంపిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 08922– 246119, 246168 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కాగా,

నేడు కలికిరి సైనిక్ పాఠశాల ఫలితాలు..

అఖిల భారత కలికిరి సైనిక పాఠశాల ప్రవేశ పరీక్ష – 2019 ఫలితాలు సోమవారం విడుదలవుతాయని పాఠశాల వర్గాలు తెలిపాయి. జనవరి 6న జరిగిన రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 12 కేంద్రాల్లో 3, 700 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాలను www. kalikirisainikschool. com వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు.

19న అమరావతిలో మాలమహానాడు బహిరంగ సభ

మాలమహానాడు అధ్యక్షుడు నల్లి రాజేష్

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 19న రాజధాని అమరావతిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగలను మందకృష్ణ మరోసారి మోసం చేసేందుకే ఈనెల 19న అమరావతిలో సభ నిర్వహిస్తున్నారన్నారు. అదే రోజున తాము కూడా సభ నిర్వహించి మాలల సత్తా ఏమిటో చూపిస్తామని అన్నారు. వర్గీకరణ పేరుతో దళితులకు రాజ్యాధికారం దక్కకుండా మందకృష్ణ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. మందకృష్ణ సభకు అనుమతిచ్చిన పోలీసులు తమకు కూడా అనుమతివ్వాలని కోరారు. సమావేశంలో మాల మహానాడు మహిళా విభాగం అధ్యక్షురాలు బేబీ సరోజిని, కృష్ణా జిల్లా అధ్యక్షుడు దాకవరపు శ్రీనివాసరావు, మాలమహానాడు నేతలు కొంగల దిలీప్, వి.రామకృష్ణ, పాలపర్తి కృపా, నన్నేటి పుష్పరాజ్, నగేష్, శ్రీనివాస్, బేతాళ కమలాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నల్లి రాజేష్

ఎంపిక చేసిన రంగాల్లో జాబ్ ఫెయిర్

ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ కృతిక శుక్లా

సాక్షి, అమరావతి: ఇప్పటివరకు అన్ని రంగాలకు చెందిన కంపెనీలను ఆహ్వానించి జాబ్ మేళాలు నిర్వహించే వారమని, ఈసారి ఎంపిక చేసిన రంగాల్లో జాబ్ ఫెయిర్స్ నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఎండి–సీఈవో డాక్టర్ కృతిక శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2న రాష్ట్ర వ్యాప్తంగా అడ్వాంటేజ్ ఏపీ–పేరుతో హెల్త్ కేర్ రంగంలో నిర్వహించిన కెరీర్ ఎక్స్1కి మంచి స్పందన వచ్చిందన్నారు. 13 జిల్లాల్లో జరిగిన కెరీర్ ఎక్స్1కి 2910 మంది నిరుద్యోగులు హాజరయ్యారని, హెల్త్ కేర్, ఫార్మా, మెడికల్, లైఫ్ సైన్సెస్ రంగాల నుంచి 150కి పైగా కంపెనీల ప్రతినిధులు హాజరై వారికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వ్యూల్లో 1027 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఆమె తెలిపారు.

ఫిబ్రవరి 9న ఐటి, ఎలక్ట్రానిక్స్, టెలీకమ్యూనికేషన్, బీపీవో, ఆటోమొబైల్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో జాబ్ ఫెయిర్ ఉంటుందని, దీనికి బీటెక్, ఐటిఐ, డిప్లొమా పూర్తి చేసినవారు అర్హులని చెప్పారు. ఫిబ్రవరి 16న బ్యాంకింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, రిటైల్, హాస్పిటాలిటీ, సెక్యూరిటీ సర్వీసెస్, ఈ కామర్స్, లాజిస్టిక్స్ రంగాల్లో జాబ్ ఫెయిర్ నిర్వహిస్తారని, దీనికి పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ పాసైనవారు అర్హులని, ఆసక్తి ఉన్నవారు సంస్థ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

టెండర్లలో ఎక్సెస్ నిజమే..

- సాక్షి కథనంపై స్పందించిన అమరావతి అభివృద్ధి సంస్థ
- ప్రపంచ బ్యాంకు ఎక్సెస్‌కు అనుమతించిందంటూ వివరణ
- ఆర్థికశాఖ, డీఈఏ అభ్యంతరాలను వివరణలో ప్రస్తావించని వైనం

సాక్షి, అమరావతి: రాజధానిలో వరద నియంత్రణ, రిజర్వాయర్ల నిర్మాణ పనులకు సంబంధించి ఐదు శాతం కన్నా ఎక్సెస్‌కు టెండర్లు ఖరారు చేసిన విషయం వాస్తవమేనని అమరావతి అభివృద్ధి సంస్థ అంగీకరించింది. 'అసలే అధిక ధరలు..ఆపై ఎక్సెస్.. రాజధాని పనులంతే' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తపై అమరావతి అభివృద్ధి సంస్థ ఆదివారం వివరణ ఇచ్చింది. ఎక్సెస్‌కు టెండర్లను ఖరారు చేసిన మాట వాస్తవమేనని పేర్కొంటూ అందుకు ప్రపంచ బ్యాంకు అంగీకరించిందని వివరణలో పేర్కొంది. అయితే ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో జీవో 94 ప్రకారం ఐదు శాతం కన్నా ఎక్సెస్‌కు టెండర్లు ఖరారు చేయరాదని ఆర్థిక శాఖ చేసిన అభ్యంతరాన్ని మాత్రం విరణలో ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ ఎఫైర్స్ కూడా ఐదు శాతం కన్నా ఎక్కువకు టెండర్ ఖరారు చేయరాదని పేర్కొన్న విషయాన్ని ఆర్థిక శాఖ స్పష్టం చేయగా దానిపై అమరావతి అభివృద్ధి సంస్థ ఎక్కడా వివరణ ఇవ్వలేదు. ప్రపంచ బ్యాంకు అనుమతి తీసుకున్న తరువాతనే ఎక్సెస్‌కు టెండర్లు ఖరారు చేసినట్లు వివరణలో పేర్కొనడం విశేషం. శాఖమూరు రిజర్వాయర్‌తో పాటు వాగుల విస్తరణ పనులను 10.06 శాతం ఎక్సెస్‌కు, నీరుకొండ రిజర్వాయర్, వాగుల విస్తరణ పనులను 9 శాతం ఎక్సెస్‌కు ఇచ్చిన విషయం తెలిసిందే.

ఏపీపీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు జి.నాగరాజు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్‌ను ఆ పదవి నుంచి వెంటనే తొలగించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పీఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జి.నాగరాజు డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం– రిజర్వేషన్లు' అనే అంశంపై ఆదివారం అఖిల పక్ష సమావేశం జరిగింది. నాగరాజు మాట్లాడుతూ.. ఏపీపీఎస్సీ చైర్మన్ మెరిట్ కోటాలో రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులకు అవకాశం లేకుండా చేసి.. రిజర్వేషన్ల ఉద్దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియామకంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ.. ముస్లింలకు, మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో దళిత, గిరిజనులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమేష్, గెజిటెడ్ ఆఫీసర్స్ జేఏసీ కన్వీనర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో 'క్వాలిఫైడ్ అభ్యర్థుల' దీక్ష

సాక్షి, అమరావతి బ్యూరో: స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు వెంటనే మౌఖిక పరీక్షలు నిర్వహించి, ఉద్యోగ నియామకాలను చేపట్టాలని కోరుతూ అసోసియేషన్ ఆఫ్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ స్క్రీనింగ్ టెస్ట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు రెండు రోజుల పాటు దీక్ష చేయనున్నారు. ఫిబ్రవరి 4, 5 తేదీల్లో విజయవాడ ధర్నా చౌక్‌లో రాష్ట్ర వ్యాప్తంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులు నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నారు. అసోసియేషన్ కన్వీనర్ ఎం. విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీలోని 14 వర్సిటీల్లో 1,108 సహాయ అచార్యుల ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసి 2018 ఏప్రిల్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారని పేర్కొన్నారు. మూడు వేల మందికి మౌఖిక పరీక్షలకు కాల్ లెటర్లు పంపించి సరైన కారణం లేకుండా ప్రక్రియను ప్రభుత్వం అర్థాంతరంగా ఆపివేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవటంతో దీక్షకు పూనుకున్నామని తెలిపారు.

కొనసాగుతున్న చలి

రాష్ట్రంపై తూర్పు, ఈశాన్య గాలుల ప్రభావం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో చలి కొనసాగుతోంది. ఒడిశాలో అతి శీతల గాలులు (కోల్డ్‌వేవ్స్) వీస్తుండటం ఈ పరిస్థితికి కారణమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంపైకి తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణంకంటే పగటి ఉష్ణోగ్రతలు 1 నుంచి 3 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల చొప్పున తక్కువగా నమోదవుతున్నాయి. దీంతో చలి ప్రభావం కనిపిస్తోంది. రాయలసీమకంటే కోస్తాంధ్రలో చలి తీవ్రత ఒకింత ఎక్కువగా ఉంది. ఒడిశాలో కోల్డ్‌వేవ్స్ ప్రభావం పొరుగున ఉన్న ఉత్తరాంధ్రపై చూపుతోంది. దీంతో మిగతా జిల్లాలకంటే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో చలి ప్రతాపం అధికంగా ఉంటోంది. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు విశాఖపట్నంలో 16 డిగ్రీలు (–4), కళింగపట్నంలో 16 డిగ్రీలు (–3), జంగమహేశ్వరపురంలో 16 డిగ్రీలు (–2) నమోదు కావడం విశేషం. మరికొద్దిరోజులు ఈ పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు పగటి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల మొదలవుతుందని పేర్కొంటున్నారు.



రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
విశాఖపట్నం	16
కళింగపట్నం	16
జంగమహేశ్వరపురం	16
ఆరోగ్యవరం	17
నంద్యాల	18
కడప	18
అమరావతి	18
నందిగామ	18
బాపట్ల	18
తిరుపతి	19
అనంతపురం	19
కర్నూలు	19
విజయవాడ	19

పట్టణాల్లో కొండెక్కిన పనులు

- మున్సిపాల్టీలను వెన్నాడుతున్న నిధుల కొరత
- రూ.3 వేల కోట్లకు పైగా బకాయిలు
- టెండర్లు వేసేందుకు ముందుకురాని నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టర్లు
- నిధులున్నా ప్రారంభం కాని ఎస్సీ సబ్‌ప్లాన్ పనులు
- ఎక్కడికక్కడ ఆగిన పనులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరోవైపు సిఫారసులున్న వారికే బిల్లులు చెల్లిస్తున్న అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలు, నగరాల్లో చేపట్టిన పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నిధుల కొరత పేరుతో మున్సిపాల్టీలు మూడు నెలలుగా బిల్లులు కూడా చెల్లించడం లేదు. నిర్మాణ సంస్థలకు మున్సిపాల్టీలు రూ.3 వేల కోట్లకు పైగా బకాయిపడినట్లు సమాచారం. దీంతో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, విశాఖ వంటి ప్రధాన నగరాలతో పాటు పట్టణాల్లో నిర్మించతలపెట్టిన పక్కా డ్రైన్లు, సిమెంట్ రోడ్లు తదితర పనులు పూర్తిగా ఆగిపోయాయి. మరోవైపు రక్షిత మంచినీటి పథకాల పనులు కూడా నిలిచిపోవడంతో.. రాబోయే వేసవిలో నీటి ఎద్దడి తప్పేలా లేదని పలువురు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక బిల్లుల కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ నిర్మాణ సంస్థల ప్రతినిధులు ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో మున్సిపాల్టీలు టెండర్లు పిలుస్తున్నా.. దరఖాస్తు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ధైర్యం చేయడం లేదు.


విజయవాడలో నిలిచిపోయిన పనులు

అన్నిచోట్లా అదే దుస్థితి..

రాష్ట్రంలోని 110 మున్సిపాల్టీలు, 14 నగరపాలక సంస్థల్లో దాదాపు రూ.13 వేల కోట్ల విలువైన పనులు మొదలుపెట్టారు. వీటిలో పక్కా డ్రైన్లు, రక్షిత మంచినీటి సరఫరా, సిమెంటు రోడ్లు, వీధి లైట్ల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలతో పాటు పార్కులు, కళ్యాణ మండపాల నిర్మాణ పనులు అధికంగా ఉన్నాయి. విజయవాడ, గుంటూరు, నెల్లూరు నగరాల్లోనే రూ.3 వేల కోట్ల విలువైన పక్కా డ్రైన్ల పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే నిర్మాణ సంస్థలే ఈ పనులు చేస్తున్నాయి. అయితే ఆయా నిర్మాణ సంస్థలు తమకు వచ్చిన పనులను.. చిన్నచిన్న కాంట్రాక్టర్లకు అప్పగించాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో ఆ నిర్మాణ సంస్థలు.. తాము సబ్‌లీజుకు ఇచ్చిన వారికి నగదు చెల్లించట్లేదు. దీంతో ఆ పనులన్నీ నిలిచిపోయాయి. రాష్ట్రంలో 17,300 కిలోమీటర్ల మేర పక్కా డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో సగం పనులు కూడా పూర్తి చేయలేదు. గుంటూరులోని పక్కా డ్రైన్ల పనులైతే షాపూర్ జీ పల్లోంజికి అప్పగించారు. రూ.960 కోట్లతో 560 కిలోమీటర్ల మేర పక్కా డ్రైన్లు నిర్మించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 200 కిలోమీటర్ల లోపే పనులు జరిగాయి. ఆ సంస్థ ఈ పనులను.. కొన్ని నిర్మాణ సంస్థలకు సబ్‌లీజుకు ఇచ్చింది. మొత్తం అన్ని సంస్థలు 2 నెలల్లో రూ.210 కోట్ల విలువైన పనులే చేశాయి. ఆ పనులకు చెందిన బిల్లులను గుంటూరు నగరపాలక సంస్థ చెల్లించకపోవడంతో షాపూర్ జీ పల్లోంజీ పనులు నిలిపివేసింది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక విజయవాడలోని పక్కా డ్రైన్ల పనులను ఎల్ అండ్ టీ చేస్తోంది. ఇక్కడా అదే దుస్థితి. మరోవైపు నెల్లూరులో పక్కా డ్రైన్ల పనులు తీసుకున్న సంస్థకు మున్సిపల్ శాఖ రూ.45 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది.

విశాఖలో రూ.120 కోట్ల విలువైన రక్షిత మంచినీటి సరఫరా, రోడ్ల పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంది. మున్సిపాల్టీలైతే రూ.1,500 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉందని నిర్మాణ సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు. మున్సిపాల్టీలు సైతం సీరియల్ ప్రకారం కాకుండా సిఫారసులున్న వారికే బిల్లులు చెల్లిస్తున్నాయని పలువురు కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సబ్‌ప్లాన్ పనులకూ వెనుకడుగే..

ఎస్సీ కాలనీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసినప్పటికీ.. ఆ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రూ.1,800 కోట్లు విడుదలైనా ఒక్క నెల్లూరు, విశాఖలో మాత్రమే రూ.120 కోట్ల విలువైన పనులు చేసేందుకు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన ప్రాంతాల్లో మున్సిపాల్టీలు టెండర్లు ఆహ్వానించినా.. ఎవరూ ముందుకు రావడం లేదు. సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం ఇతర శాఖలకు మళ్లించే అవకాశముండటంతో దరఖాస్తు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదని తెలిసింది.

17న ఏలూరులో బీసీ గర్జన

- రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు తరలిరావాలి
- బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న టీడీపీ
- వైఎస్సార్‌సీపీ బీసీ అధ్యయన కమిటీ అధ్యక్షుడు జంగా



అభివాదం చేస్తున్న ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల బీసీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 17న ఏలూరులో నిర్వహించనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని పార్టీ బీసీ అధ్యయన కమిటీ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. విశాఖ నగర పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల బీసీల సమావేశంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బీసీలకు బాబు చేసింది శూన్యమని, జయహో బీసీ గర్జన నిర్వహించే అర్హత ఆయనకు లేదన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాల్లో ఏ ఒక్కటీ అమలుచేసిన పాపానపోలేదని ధ్వజమెత్తారు. కేవలం బీసీలను ఓటు బ్యాంక్‌గానే చూస్తోంది తప్ప వారి బాగోగులపై దృష్టి సారించలేదని విమర్శించారు. వైఎస్‌ఆర్ హయాంలో బీసీలకు జరిగినంత మేలు మరే ప్రభుత్వంలోనూ జరగలేదని గుర్తు చేశారు. బీసీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ తీసుకోబోయే విధి విధానాలను ఏలూరులో జరగనున్న బీసీ గర్జన సభలో ప్రకటించనున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు. రాష్ట్ర బీసీ అధ్యయన కమిటీ సభ్యులు పిల్లి సుబాష్‌చంద్రబోష్, ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, హెచ్.బి. నర్సిగౌడ్, చెల్లబోయిన వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలను విస్మరించిన బాబు

వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు



ఐక్యత చాటుతున్న వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం, బీసీ నేతలు

ఘంటసాల (అవనిగడ్డ): సీఎం చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో చేనేతలను విస్మరించారని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు అన్నారు. చేనేత కార్మికులకు జనతా వస్త్రాలు, మూలనిధి, చేనేత కార్పొరేషన్, రుణమాఫీ తదితర హామీలిచ్చి విస్మరించారని, ఎన్నికల వేళ కొత్త హామీలివ్వడం సిగ్గుచేటన్నారు. కృష్ణాజిల్లా ఘంటసాలలో చేనేత సమస్యల అధ్యయన కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఘంటసాల పరిధిలోని చేనేత కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారంపై చర్చించి నివేదిక తయారు చేశారు. నివేదికను పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో మేనిఫెస్టోలో పొందుపర్చడంపై వివరిస్తారు. మోహనరావు మాట్లాడుతూ చేనేతల సమగ్రాభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. వైఎస్సార్ చేనేతకు రుణమాఫీ చేసి చేనేత సంఘాలను, కార్మికులకు ఊపిరిలూదారన్నారు. ప్రస్తుతం చేనేతపై జీఎస్టీ పెనుభారంగా మారిందని, చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర లేక, విక్రయాలు లేక చేనేత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ధర్మవరంలో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రతిపక్ష నేత కార్మికుల సమస్యలపై 48 గంటలు దీక్ష చేయడంతో పాటు వారి కుటుంబాలకు ఆసరాగా నిలిచారన్నారు. 45 ఏళ్లు దాటిన మహిళలకు పెన్షన్లు, ప్రతి మగ్గానికి రూ.2 వేల పెన్షన్, జీఎస్టీపై కేంద్రంతో మాట్లాడి రద్దు చేసేందుకు కృషి, రూ.2 వేల కోట్లతో చేనేత కార్పొరేషన్ తదితర అంశాలను ఇప్పటికే వైఎస్ జగన్ ప్రకటించినట్లు గుర్తు చేశారు. అనంతరం చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి అందె జగదీష్ ఆధ్వర్యంలో చేనేత విభాగపు నేతలు, కార్మికులు 21 అంశాలతో కూడిన సమస్యలను చేనేత సమస్యల అధ్యయనకమిటీ అధ్యక్షుడు మోహనరావుకు అందించారు. చేనేత విభాగం నేతలు గోలి చంద్రశేఖరరావు, గాత్రం కాంతారావు, గోలి సుబ్బారావు, పట్టెం శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది జొన్నాదుల శ్రీనాగరాజు, పార్టీ ఏలూరు నేత సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కిశోర్ చంద్రదేవ్ గుడ్‌బై

- తన సూచనలను అధిష్టానం పట్టించుకోలేదన్న కేంద్ర మాజీ మంత్రి
- రాష్ట్రంలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తుండటంతోనే పార్టీని వీడుతున్నట్లు వెల్లడి
- టీడీపీలోకి వెళ్తారంటూ ప్రచారం

కురుపాం/సాక్షి, విశాఖ: కేంద్ర మాజీ మంత్రి, అరకు మాజీ ఎంపీ కిశోర్‌చంద్ర సూర్యనారాయణదేవ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం విజయనగరం జిల్లా కురుపాంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. తన రాజీనామా లేఖను శనివారమే కాంగ్రెస్ అధిష్టానానికి పంపించినట్టు తెలిపారు. విభజన జరిగే ముందు రాష్ట్రం తరఫున కొన్ని సూచనలు చేశానని, కానీ అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన లభించలేదన్నారు. 2014లో ఓడిపోతానని తెలిసినా కూడా కాంగ్రెస్ తరఫున పోటీచేశానన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో అధిష్టానానికి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. కానీ తన మాట పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను రాష్ట్రంలో భూస్థాపితం చేస్తున్నారనే అనుమానం ఉందన్నారు. అలాంటి పార్టీలో తానున్నా ప్రయోజనం ఉండదని ఆలోచించే రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

మిత్రులతో చర్చించి భవిష్యత్ నిర్ణయం..

మరో వారంలో ఢిల్లీ వెళ్లి తన సన్నిహితులతో పాటు వివిధ పార్టీల నేతలైన శరద్ పవార్, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, మాయావతి తదితరులతో మాట్లాడి.. భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని కిశోర్ చంద్రదేవ్ తెలిపారు. టీడీపీలో చేరుతున్నారనే ప్రచారం జరుగుతోందని విలేకరులు ప్రశ్నించగా.. తాను ఎవరితోనూ సంప్రదింపులు జరపలేదని ఆయన జవాబిచ్చారు. త్వరలో భవిష్యత్ నిర్ణయం ప్రకటిస్తానన్నారు. రాష్ట్ర విభజన సమయంలోనే రాజీనామా చేస్తే బాగుండేది కదా అని మీడియా ప్రశ్నించగా.. తనను రాజీనామా చేయాలని ప్రజలు కోరలేదంటూ కిశోర్ చంద్రదేవ్ బదులివ్వడం గమనార్హం.

అరకు నుంచి టీడీపీ అభ్యర్థిగా..!

దాదాపు ఐదున్నర దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేసిన కిశోర్ చంద్రదేవ్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన విశాఖ జిల్లా అరకు నుంచి 1977లో పార్లమెంటుకు తొలిసారి ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇదే స్థానం నుంచి ఐదుసార్లు లోక్‌సభకు ప్రాతినిథ్యం వహించారు. మధ్యలో ఒకసారి రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. ఇందిరాగాంధీ, సోనియాగాంధీ కోటరీల్లో క్రియాశీలక నేతగా పనిచేసిన కిశోర్ చంద్రదేవ్ పలుమార్లు కేంద్ర మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ప్రతిసారీ పార్లమెంటు కమిటీలకు చైర్మన్‌గా, సభ్యునిగా పలు పదవుల్లో కొనసాగారు. ప్రస్తుతం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుని హోదాలో ఉన్నారు. కాగా, లోక్‌సభ సభ్యునిగా ఐదుసార్లు ఎన్నికైనప్పటికీ అరకు నియోజకవర్గానికి ఆయన చేసిందేం లేదని స్థానికులంటున్నారున. ఎన్నికలప్పుడు రావడం.. గెలవగానే ఢిల్లీలో కూర్చొని రాజకీయాలు చేయడం తప్ప ప్రజల్ని పట్టించుకున్న పాపానపోలేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం నాలుగున్నరేళ్లపాటు అంటీముట్టనట్లున్న కిశోర్ చంద్రదేవ్.. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెరపైకొచ్చారని విమర్శలొస్తున్నాయి. టీడీపీతో సంప్రదింపులు జరిపాకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. అరకు లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దింపేందుకు అభ్యర్థుల్లేక పోవడంతో.. కిశోర్‌ను రంగంలోకి దింపాలని టీడీపీ అధిష్టానం ఓ నిర్ణయా నికి వచ్చినట్టు ఆ పార్టీ నేతలంటున్నారు. ఏ పార్టీలో చేరాలన్న అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన చెబుతున్నా టీడీపీ నేతలతో మంతనాలు పూర్తయ్యాకే కాంగ్రెస్‌కు రాజీనామా చేశారని ప్రచారం జరుగుతోంది.

‘కీ’లకమేంటి?

- డీఎస్సీ ముగిసినా ఇంతవరకూ అనేక సబ్జెక్టులకు వెలువడని ప్రైమరీ కీ లు
- ఫిబ్రవరి చివరినాటికి నియామక ఉత్తర్వులు ఇస్తామంటూ సుప్రీంలో ప్రభుత్వం అఫిడవిట్
- ఆన్‌లైన్ పరీక్షలతో అభ్యర్థుల్లో గందరగోళం
- ఒకరోజు పరీక్ష రాసినవారికి గరిష్టంగా 90 శాతం మార్కులు.. మరో రోజు రాసినవారికి 50 శాతం!
- ఎస్జీటీలో ప్రశ్నల తీరుపైనా అనేక అనుమానాలు
- న్యాయం చేయాలంటున్న అభ్యర్థులు

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగుల సహనానికి విద్యాశాఖ రోజుకో పరీక్ష పెడుతోంది. డీఎస్సీ పరీక్షలు జనవరి 31తో ముగిసినా ఇప్పటివరకూ కొన్నిటికి సంబంధించి మాత్రమే ప్రాథమిక కీ లు ఇచ్చారు. అనేక సబ్జెక్టుల ఫైనల్‌కీలూ రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర గందరగోళంలో పడుతున్నారు. డీఎస్సీ ఫైనల్ లిస్టు, సెలెక్షన్ లిస్టులను ఖరారుచేసి ఫిబ్రవరి ఆఖరులోగా అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల సుప్రీంకోర్టుకు ప్రభుత్వం అఫిడవిట్ ఇచ్చింది. కానీ డీఎస్సీకి సంబంధించి అనేక చిక్కు సమస్యలు ఎదురవుతుండటంతో ఈ నియామకాలు చాలా జాప్యం అవుతాయేమోనని అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో అనేక లోపాలు నెలకొన్నందునే ఇలా అవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరీక్షల్లో ఆన్‌లైన్ విధానం అనుసరించడంతోపాటు ప్రశ్నల రూపకల్పన, సమాధానాల ఎంపిక తదితర ప్రక్రియల్లో సరైన జాగ్రత్తలు పాటించనందునే ఈ పరిస్థితి ఏర్పడిందంటున్నారు. ఈ లోపాల వల్లనే పరీక్షలు ముగిసినా ప్రాథమిక, ఫైనల్ కీలు విడుదల కావడం లేదని చెబుతున్నారు.

10లో 4 పరీక్షలకే ప్రాథమిక కీ లు

డీఎస్సీ–2018 కింద ప్రభుత్వం మొత్తం 10 కేటగిరీలకు చెందిన 7902 పోస్టులకు నియామక పరీక్షలు 2018 డిసెంబర్ 24 నుంచి నిర్వహించింది. ఈ పోస్టుల్లో సెకెండరీ గ్రేడ్ టీచర్లు 3839, స్కూల్ అసిస్టెంట్లు 1,625, భాషాపండితులు 452, పీఈటీలు 476, టీజీటీలు 715, పీజీటీలు 583, ప్రిన్సిపాళ్లు 89, ఆర్టు డ్రాయింగ్ 22, క్రాఫ్ట్ 25, మ్యూజిక్ 76 పోస్టులున్నాయి. గత ఏడాది డిసెంబర్ 24 నుంచి జనవరి 4 వరకు స్కూల్ అసిస్టెంట్లు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు, ప్రిన్సిపాళ్లు, మ్యూజిక్, ఆర్టు అండ్ డ్రాయింగ్, క్రాఫ్ట్, పండిట్, పీఈటీ పరీక్షలను నిర్వహించారు. జనవరి 18 నుంచి 31 వరకు సెకండరీ గ్రేడ్ టీచర్, స్పెషల్ టీచర్ పోస్టులకు పరీక్షలు పూర్తిచేశారు. ఈ పరీక్షలకు మొత్తం 6,08,159 మంది దరఖాస్తు చేయగా 5,55,047 మంది పరీక్షలు రాశారు. అత్యధికంగా ఎస్జీటీ పోస్టులకు 3,46,063 మంది దరఖాస్తు చేయగా 2,89,183 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన వెంటనే ప్రాథమిక కీలను విడుదల చేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు పది కేటగిరీల పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్, పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ కేటగిరీల పోస్టులకు మాత్రమే ప్రాథమిక కీలు విడుదలయ్యాయి. మిగతా సబ్జెక్టులకు సంబంధించిన ప్రాథమిక కీలు కూడా ఇంకా ఖరారు చేయలేదు. ఇక ఫైనల్‌కీలను స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టులకు మాత్రమే ఇచ్చారు. ఫైనల్‌కీలు ఖరారు చేసినా వాటిలో ఏయే ప్రశ్నలకు ఏవి సరైన సమాధానాలు, తొలగించిన ప్రశ్నలుంటే అవి ఏవి? రెండు సరైన సమాధానాలుంటే ఆ ప్రశ్నలు ఏవి అనే సమగ్ర సమాచారాన్ని కూడా వెల్లడించాల్సి ఉంది. ఈ అంశాలను పాఠశాల విద్యాశాఖ పరిధిలోని రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్ఈఆర్‌టీ) చేయాలి. షెడ్యూల్ ప్రకారం ఈనెల 10న స్కూల్ అసిస్టెంట్ల ఫలితాలు ప్రకటించి 13న మెరిట్ జాబితా, 17న ఎంపిక జాబితా ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఈ పోస్టులకు సంబంధించి ఫైనల్‌కీలను విడుదల చేసినా వాటిపై ఒక స్పష్టత లేదు. టీజీటీ, పీజీటీ పోస్టుల ఫైనల్‌కీలు ఇంకా విడుదల కాకపోగా ప్రిన్సిపాళ్లు, పీఈటీ, మ్యూజిక్, క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్ పోస్టుల ప్రాథమిక ‘కీ’లూ రాలేదు. ఈ పోస్టులకు ఈనెల 19, 23, 24 తేదీల్లో ఎంపిక జాబితాను ఇవ్వాల్సి ఉండగా.. ప్రాథమిక, తుది ‘కీ’ ప్రక్రియనే పూర్తికాలేదు.



డీఎస్సీకోసం ఉద్యోగాలు వదులుకుని..

చాలా కాలం తరువాత డీఎస్సీ రావడంతో అభ్యర్థులు చేస్తున్న చిన్నచిన్న ఉద్యోగాలు వదులుకొని మరీ ఈ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. అయితే ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొనడమే కాకుండా పరీక్షల తీరుపై కూడా వారిలో అనేక అనుమానాలు నెలకొన్నాయి. గతంలో ఈ పరీక్షలను ఓఎమ్మార్ పత్రాలతో ఒకే రోజులో ఆయా కేటగిరీల పోస్టులు ముగించేవారు. కానీ ఆన్‌లైన్ కావడంతో ఒకే సబ్జెక్టు పరీక్ష ఒకటికి మించి ఎక్కువ రోజులు నిర్వహించారు. ఒకరోజు పరీక్ష రాసిన వారికి గరిష్టంగా 90 శాతం మార్కులు వస్తే మరో రోజు పరీక్ష రాసిన వారికి 50 శాతం లోపు మాత్రమే వచ్చాయని, దీనివల్ల ప్రశ్నలు సులభంగా ఉన్న రోజు పరీక్ష రాసిన వారికి లాభం చేకూరుతుండగా మిగతా రోజుల్లో రాసినవారు నష్టపోయారంటున్నారు. అరమార్కు తేడాతో పోస్టులు కోల్పోయే ప్రమాదముందని, ఇలాంటి సమయంలో సెషన్‌కు, సెషన్‌కు మధ్య 15 నుంచి 20 మార్కులు తేడా ఉండడంతో వేలమందికి నష్టం వాటిల్లుతుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి బీఈడీ చేసినవారికి ఎస్జీటీ పోస్టులకు అవకాశం కల్పించడంతో వారికి టెట్ కమ్ టీఆర్టీని నిర్వహించారు. నార్మలైజేషన్ ప్రక్రియ చేపట్టినా కొందరికి నష్టం తప్పదని, టెట్ కమ్ టీఆర్టీలోనే చేస్తున్నారని, డీఎస్సీలో అలా చేయకపోవడం వల్ల కూడా కొందరికి నష్టం తప్పదంటున్నారు.

మహిళామంత్రి సమక్షంలో ఆడపడుచులపై దౌర్జన్యం

పసుపు-కుంకుమ కార్యక్రమం సందర్భంగా తోపుదుర్తిలో మహిళల అరెస్టు

- ఇచ్చిన హామీలు అమలు చేయాలని మహిళల డిమాండ్
- డ్వాక్రా రుణ మాఫీపై మోసగించడంపై నిరసన
- రోడ్డుపై బైఠాయించిన మహిళలను ఈడ్చేసిన పోలీసులు
- మంత్రి కాన్వాయ్‌పై చెప్పుల వర్షం కురిపించిన మహిళలు



రాప్తాడు నియోజకవర్గం తోపుదుర్తిలో మంత్రిని అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు



మంత్రి కాన్వాయ్‌పై విసిరిన చెప్పులు

ఆత్మకూరు: రాష్ట్ర మంత్రి పరిటాల సునీత సొంత నియోజకవర్గంలో మహిళలపై దౌర్జన్యం జరిగింది. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రిని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించిన మహిళలను పోలీసులు ఈడ్చిపారేశారు. అనంతరం వారిని అరెస్టు చేశారు. దీంతో ఆగ్రహించిన మహిళలు మంత్రి సునీత కాన్వాయ్‌పై చెప్పులు, పొరకలు, చేటలు విసిరి నిరసన తెలిపారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చేయకుండా మోసం చేసి, తిరిగి ఎన్నికల సమయంలో మోసపు మాటలు చెప్పడం, ప్రశ్నించిన మహిళలను పోలీసులతో అరెస్టు చేయించి విచక్షణారహితంగా వ్యవహరించడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలంలోని తోపుదుర్తిలో ఆదివారం ‘పసుపు–కుంకుమ’ కార్యక్రమం ద్వారా డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేయడానికి మంత్రి పరిటాల సునీత వచ్చిన సందర్భంగా ఈ ఘటన జరిగింది. తమకిచ్చిన హామీలు నెరవేరిస్తేనే గ్రామంలోకి మంత్రిని అడుగుపెట్టనిస్తామని మహిళలు తెగేసి చెప్పారు. దీంతో 400 మంది పోలీసుల భద్రతతో మంత్రి వెళ్లారు. మంత్రి వస్తున్న సమయంలో వందలాది మంది మహిళలు నల్లజెండాలు చేతపట్టుకుని రోడ్డుపై బైఠాయించారు.

మహిళలపై పోలీసుల జులుం

మహిళలను పోలీసులు అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో మహిళలు, పోలీసులకు వాగ్వాదం చోటు చేసుకుంది. రుణమాఫీ చేస్తామని చేయకుండా కేవలం రూ.10వేలు పెట్టుబడి నిధి కింద ఇచ్చారని, ఇది బ్యాంకర్లు రుణం కింద జమ చేసుకున్నారని.. ఇప్పుడు మళ్లీ రూ.10 వేలు ఇస్తాం, స్మార్ట్ ఫోన్‌లిస్తామని మోసపూరిత మాటలు చెబుతున్నారని.. మండిపడ్డారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. పోలీసులు విచక్షణారహితంగా ప్రవర్తించడంతో కొందరికి గాయాలయ్యాయి. రోడ్డుపై కిందపడిపోతే ఈడ్చుకుంటూ వెళ్లి వాహనంలోకి ఎక్కించారు.

సమావేశానికి మహిళలను తెచ్చుకున్న మంత్రి

అనంతరం తన కార్యక్రమంలో పాల్గొనేందుకు మహిళలను సొంతంగా ఏర్పాటు చేసిన 60 వాహనాల్లో ఇతర గ్రామాల నుంచి రప్పించారు. మంత్రి కారుపై గ్రామస్తులు పెద్ద ఎత్తున చెప్పులు విసిరారు. అదే సమయంలో మంత్రి తనయుడు పరిటాల శ్రీరాం తన అనుచరులతో గ్రామానికి వచ్చారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన వారితో సమావేశం తూతూమంత్రంగా నిర్వహించి వెనుదిరిగారు.

తాళిబొట్టు తెంపేశారు



డ్వాక్రా రుణం మాఫీ కాలేదని మంత్రిని ప్రశ్నించాలనుకున్నాం. పోలీసులు అడ్డుకోవడంతో దాదాపు మూడు గంటల పాటు రోడ్డు పైనే కూర్చున్నాం. మంత్రి వస్తున్నారని పోలీసులు రోడ్డుపై ఉన్న మమ్మల్ని ఈడ్చిపడేశారు. ఆ సమయంలో నా తాళిబొట్టు తెగిపోయింది. ఇంత అరాచకం చేస్తారా? ఒక మహిళగా మంత్రి సునీత వ్యవహరించిన తీరు ఏం బాగోలేదు. మా ఉసురు తప్పక తగులుతుంది. **– మమత, తోపుదుర్తి**

ప్రాణం తీసిన పింఛన్‌ల పంపిణీ

- వేలిముద్ర వేసేందుకు వెళ్తూ మృత్యువాతపడ్డ వృద్ధురాలు
- మరోచోట తోపులాటలో విరిగిన వృద్ధురాలి కాలు





అనంతమ్మ (ఫైల్), నీటికుంటలో పడి మృతి చెందిన అనిల్

తాడిపత్రి అర్బన్/ఓడీ చెరువు/దుర్గి: ఎన్నికల వేళ పింఛన్ల పెంపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారం ఆర్భాటం వృద్ధుల ప్రాణం మీదకు తెస్తోంది. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం వెంకటాంపల్లికి చెందిన ఓ వృద్ధురాలు పింఛన్ కోసం వేలిముద్ర వేసేందుకు వెళ్తూ కుప్పకూలిపోగా.. ఓడీ చెరువు మండలం మామిళ్లకుంటపల్లిలో జరిగిన తోపులాటలో మరో వృద్ధురాలు కాలు విరిగింది. తాడిపత్రి మండలంలోని పింఛనుదారులంతా 3వ తేదీలోపు వేలిముద్రలు వేస్తే 4న రావి వెంకటాంపల్లి సమీపంలోనున్న ఓ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేసి స్వీట్లు పంచుతారని అధికారులు తెలిపారు. దీంతో వెంకటాంపల్లికి చెందిన అనంతమ్మ (70) భోగసముద్రం పంచాయతీ కార్యాలయం వద్దకు వేలిముద్ర వేసేందుకు ఆదివారం ఉదయం వెళ్తూ రహదారిపై కుప్పకూలింది. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే ప్రాణం కోల్పోయింది. ప్రతి నెలా స్వగ్రామంలోనే పింఛన్ ఇచ్చేవారనీ, ఇపుడు భోగసముద్రం వరకూ వచ్చి వేలిముద్ర వేయాలని చెప్పడంతో అనంతమ్మ ప్రాణాలు కోల్పోయిందని బంధువులు ఆందోళన వ్యక్తంచేశారు. మరోపక్క ఇక ఓడీ చెరువు మండలం మామిళ్లకుంట్లపల్లి సమీపంలోని జీవన్‌జ్యోతి ఆశ్రమ ఆవరణలో పింఛన్ పంపిణీ సందర్భంగా ఆదివారం జరిగిన తోపులాటలో మామిళ్లకుంట్లపల్లికి చెందిన ఎద్దుల లక్ష్మీనరసమ్మ అనే వృద్ధురాలి కాలు విరిగింది. స్థానికులు హుటాహుటిన ఆమెను చికిత్స నిమిత్తం కదిరిలోని ఆస్పత్రికి తరలించారు.

పుత్రశోకం మిగిల్చిన పసుపు–కుంకుమ

గుంటూరు జిల్లాలో టీడీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం కోసం నిర్వహిస్తున్న పసుపు– కుంకుమ కార్యక్రమం ఓ కుటుంబంలో పుత్రశోకాన్ని మిగిల్చింది. గుంటూరు జిల్లా దుర్గి మండలంలోని ముటూకూరులో ఆదివారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పసుపు–కుంకుమ కార్యక్రమానికి గంటా నారాయణమ్మ తన కుమారుడు గంటా అనిల్‌ని (8) తీసుకెళ్లింది. చెక్కులు అందుకునే సమయంలో కుమారుడిని పాఠశాల ప్రాంగణంలో వదిలిపెట్టింది. చెక్కు తీసుకున్నాక కుమారుడి కోసం వెతగ్గా పాఠశాల పక్కనే ఉన్న నీటి కుంటలో శవమై కన్పించాడు. దీంతో తల్లిదండ్రులు నారాయణమ్మ, నర్సయ్యలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

‘పసుపు-కుంకుమ’లో రికార్డింగ్ డ్యాన్స్

ప్రభుత్వ కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్ల ఇష్టారాజ్యం



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న ‘పసుపు-కుంకుమ’ వేదికపై రికార్డింగ్ డ్యాన్స్ వీడియో

సాక్షి, అమరావతి/పొందూరు: రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం పసుపు– కుంకుమ కోసం ఏర్పాటు చేసిన వేదికలు పలుచోట్ల అపహాస్యం పాలయ్యాయి. డ్వాక్రా సంఘాల్లో మహిళలకు పసుపు– కుంకుమ కింద పోస్టు డేటెడ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి గ్రామానికి సగటున రూ. 25 వేలు చొప్పున గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ నిధులు మంజూరు చేసింది. మరోపక్క జాతీయ జీవనోపాధుల పథకం (ఎన్ఆర్ఎల్ఎం) అమలుకు రాష్ట్రానికి కేంద్రమిచ్చిన రూ. 31.60 కోట్లు ఈ కార్యక్రమానికి మళ్లించారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఈ డబ్బులతో గ్రామాల్లో ఏర్పాటుచేసిన వేదికలను కొన్నిచోట్ల స్థానిక టీడీపీ నేతలు, జన్మభూమి కమిటీ సభ్యులు రికార్డింగ్ డాన్స్‌లకు వేదికలుగా మార్చారు. పట్టపగలే మహిళల రికార్డింగ్ డాన్స్‌లు చేస్తున్న వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. అయితే, ప్రభుత్వ డబ్బులతో ఏర్పాటు చేసిన అధికారిక వేదికలపై టీడీపీ నేతలు రికార్డింగ్ డాన్స్‌లు వేయిస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు అనుమతి తెలుపుతోందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ విప్ ‘కూన’కు చేదు అనుభవం

ప్రభుత్వం విప్ కూన రవికుమార్‌కు సొంత పార్టీ కార్యకర్తల నుంచే చేదు అనుభవం ఎదురైంది. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని లోలుగు గ్రామంలో ఆదివారం నిర్వహించిన పసుపు–కుంకుమ కార్యక్రమం జరగకుండా అడ్డుకొన్నారు. రవికుమార్ టెంట్‌లోకి అడుగుపెడుతుండగానే తమ గ్రామాన్ని పట్టించుకోకపోవడంతో పాటు, టీడీపీ స్థానిక నేత లోలుగు శ్రీరాములనాయుడుకు ప్రాధాన్యత నివ్వకపోవడంపై ప్రశ్నించారు. అయితే రవికుమార్ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన కొంతమంది కార్యకర్తలు టెంట్‌లు పీకేశారు. కుర్చీలు లాగేశారు. ఫైళ్లు విసిరేసారు. డౌన్ డౌన్ రవికుమార్ అంటూ నినాదాలు చేశారు. రవికుమార్ గోబ్యాక్ అంటూ నిరసన తెలియజేశారు. దీంతో పసుపు–కుంకుమ చెక్కుల పంపిణీ కార్యక్రమం పూర్తికాలేదు. దీంతో చేసేదిలేక పోలీసు బందోబస్తు మధ్య విప్ రవికుమార్ వెళ్లిపోయారు.

నవయుగకు మరో ‘వరం’

- పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిబంధనల ఉల్లంఘనలో రికార్డు
- హెడ్ వర్క్స్ కాంట్రాక్టర్‌కు సీఎం చంద్రబాబు వరాల వర్షం
- కాంట్రాక్టర్ కోరగానే రీటెన్షన్ మొత్తాన్ని వెనక్కు ఇచ్చేయాలని ఆదేశం
- గడువు ముగిసే వరకు వెనక్కు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పిన అధికారులు
- అయినా కాంట్రాక్టర్‌కు అనుకూలంగా కేబినెట్‌కు ప్రతిపాదనలు పంపాలని ఆదేశం
- రూ.102 కోట్లు రీటెన్షన్ మొత్తం వెనక్కు ఇచ్చేందుకు రంగం సిద్ధం
- ఈ ప్రభావం పనుల నాణ్యతపై పడుతుందని అధికారుల ఆందోళన
- ఇప్పటికే రోజువారీ ఖర్చుల కోసం నవయుగకు రూ.50 కోట్లు ఇచ్చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి : పోలవరం ప్రాజెక్టు పనుల్లో నిబంధనల ఉల్లంఘనలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోంది. హెడ్ వర్క్స్ (జలాశయం) కాంట్రాక్టర్ నవయుగకు రీటెన్షన్ అమౌంట్‌ను వెనక్కు ఇచ్చేయాలని, ఇకపై చెల్లించే బిల్లుల్లో కూడా ఈ మొత్తాన్ని మినహాయించుకోవద్దని సీఎం చంద్రబాబు జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. జలవనరుల శాఖ చరిత్రలో ఏ ప్రాజెక్టు పనుల్లోనూ రీటెన్షన్ అమౌంట్‌ను పనులు జరుగుతుండగానే వెనక్కి ఇచ్చిన దాఖలాలు లేవని, నిబంధనల మేరకు ప్రతి బిల్లులోనూ 7.5 శాతం చొప్పున రీటెన్షన్ అమౌంట్‌గా మినహాయించుకుంటామని అధికారులు స్పష్టీకరిస్తున్నారు. ప్రాజెక్టు పనుల్లో నాణ్యత లోపాలు బహిర్గతమైతే రీటెన్షన్ అమౌంట్‌గా మినహాయించుకున్న సొమ్ముతోనే వాటిని సరిదిద్దుతామని, పనులన్నీ సవ్యంగా ఉంటే నిర్దేశించిన గడువు ముగిసిన తర్వాత ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్‌కు వెనక్కు ఇస్తామని చెబుతున్నారు. అలాకాకుండా పనులు జరుగుతున్నప్పుడే రీటెన్షన్ అమౌంట్‌ను వెనక్కి ఇచ్చేస్తే కాంట్రాక్టర్‌కు బాధ్యత ఉండదని, ఇష్టారాజ్యంగా పనులు చేసే అవకాశం ఉంటుందని తేల్చి చెప్పారు. అధికారుల అభ్యంతరాలను తుంగలో తొక్కిన సీఎం చంద్రబాబు వచ్చే కేబినెట్ సమావేశానికి రీటెన్షన్ అమౌంట్ నిబంధనలను పోలవరం హెడ్ వర్క్స్ కాంట్రాక్టర్‌కు సడలిస్తూ ప్రతిపాదనలు పంపాలని ఆదేశించడం జలవనరుల శాఖలో కలకలం రేపుతోంది.

హెడ్‌వర్క్స్ పనులన్నీ నామినేషన్‌పైనే

పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్‌ను రూ.4,054 కోట్లకు దక్కించుకున్న టీడీపీ ఎంపీ రాయపాటికి చెందిన ట్రాన్స్‌ట్రాయ్(జేవీ) ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. సత్తాలేని ఆ సంస్థపై వేటు వేయాలన్న ఉన్నతాధికారుల సూచనను తుంగలో తొక్కిన సీఎం చంద్రబాబు అదే సంస్థను అడ్డుపెట్టుకుని పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు అందుకున్నారు. గతేడాది జనవరి నుంచి ఒక్కో పని చొప్పున నవంబర్ నాటికి హెడ్ వర్క్స్ పనులన్నీ నవయుగ సంస్థకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టేశారు. ఆర్థికంగా శక్తిమంతమైన సంస్థకే పోలవరం పనులు చేసే సత్తా ఉంటుందని, అందుకే నవయుగకు ఆ పనులు అప్పగించామని అప్పట్లో సమర్థించుకున్నారు. గతేడాది జనవరి నుంచి నవయుగ చేసిన పనులకు రూ.1,300 కోట్లకుపైగా బిల్లులు చెల్లించారు. నిబంధనల ప్రకారం ప్రతి బిల్లులోనూ 7.5 శాతం చొప్పున రూ.102 కోట్లు మినహాయించుకుని, రాష్ట్ర ఖజానాలో అధికారులు జమ చేశారు. రీటెన్షన్ అమౌంట్‌ను మినహాయించుకోవడం వల్ల పనులు చేసేందుకు ఆర్థికంగా సమస్యలు తలెత్తుతున్నాయని.. ఇప్పటి వరకు వసూలు చేసిన రూ.102 కోట్లను వెనక్కు ఇచ్చేయాలని, ఇకపై చెల్లించే బిల్లుల్లో రీటెన్షన్ అమౌంట్‌ను వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని నవంబర్ 26న వర్చుల్ రివ్యూలో నవయుగ సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించారు. దీన్ని అమలు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

రోజు వారీ ఖర్చులకు ఇబ్బందులా?

పోలవరం ప్రాజెక్టు పనులపై నవంబర్ 5న నిర్వహించిన వర్చువల్ రివ్యూలో రోజు వారీ ఖర్చుల కోసం నవయుగ సంస్థ రూ.50 కోట్లు ఇవ్వాలని కోరింది. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు.. తక్షణమే ఆ సంస్థకు రూ.50 కోట్లు ఇచ్చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ట్రాన్స్‌ట్రాయ్‌కి రూ.170 కోట్లను రోజు వారీ ఖర్చుల కోసం ఇచ్చామని, అదనంగా రూ.50 కోట్లను ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఆర్థిక శాఖ తేల్చి చెప్పింది. వాటిని తోసిపుచ్చుతూ.. ‘ఆ మేరకు మంత్రివర్గంలో తీర్మానం చేస్తాం. ముందుగా ఆ సంస్థకు రూ.50 కోట్లు విడుదల చేయండి’ అని సీఎం ఆదేశించారు. ఈ మేరకు పంపిన ప్రతిపాదనలపై జనవరి 21న కేబినెట్‌తో ఆమోద ముద్ర వేశారు. ఆ మరుసటి రోజే రూ.50 కోట్లు ఇచ్చేశారు. ఆర్థికంగా బలమైన ఆ సంస్థ రోజువారీ ఖర్చులకు రూ.50 కోట్లు ఇవ్వాలని అడగడం విడ్డూరంగా ఉందని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ రూ.50 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయన్నది బహిరంగ రహస్యం అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు సడలిస్తూ ప్రతిపాదనలు సిద్ధం

కాంట్రాక్టు విధానానికి ప్రామాణికంగా భావించే జీవో 94 ప్రకారం పనులు జరుగుతున్న సమయంలో వెనక్కు ఇవ్వడం కుదరదని అధికారులు తేల్చి చెప్పడంతో సీఎం చంద్రబాబు యథావిధిగా కేబినెట్ అస్త్రాన్ని ప్రయోగించారు. కాంట్రాక్టర్ చెప్పినట్లుగా ప్రతిపాదనలు పంపాలని, కేబినెట్‌లో ఆమోద ముద్ర వేస్తామని స్పష్టం చేశారు. దాంతో ఇప్పటి వరకు రీటెన్షన్ అమౌంట్‌గా వసూలు చేసిన రూ.102 కోట్లు వెనక్కి ఇచ్చేస్తూ.. ఇకపై చెల్లించే బిల్లుల్లోదానిని వసూలు చేయకుండా నిబంధనలు సడలిస్తూ జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

రాష్ట్రంలో మందుల సంక్షోభం!



ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర మందులకు తీవ్ర కటకట

ఎమర్జెన్సీలో స్థానిక కొనుగోళ్లకు నిధులు సున్నా

- 18 నెలలుగా రూ.140 కోట్ల బకాయిలు చెల్లించని సర్కారు
- హృద్రోగులకూ ఏ ఆస్పత్రిలోనూ మందుల్లేవు
- కనీస మందులు దొరక్క సామాన్య రోగులు విలవిల
- ఇలాంటి దుస్థితి ఎప్పుడూ చూడలేదంటున్న ఫార్మాసిస్టులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. ఏ ఆస్పత్రికి వెళ్లినా అత్యవసర మందులు అందుబాటులో ఉండడంలేదు. దీంతో సామాన్య, పేద రోగులు విలవిల్లాడుతున్నారు. ఓ వైపు 104 వాహనాలు పల్లెలకు వెళ్లకపోవడం, ఇటు ఆస్పత్రులకు వస్తే మందుల్లేవని చెబుతుండడంతో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న రోగులు బయట కొనుగోలు చేసుకుంటూ ఆర్థికంగా చితికిపోతున్నారు. గుండె, కిడ్నీ, మూర్ఛ రోగులకు ఇవ్వాల్సిన అత్యవసరమైన మందులు సైతం ఏ ఆస్పత్రిలోనూ అందుబాటులో లేవు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పారాసెటిమాల్ జ్వరం బిళ్లకు కూడా దిక్కులేని పరిస్థితి. ఇంతటి మందుల కొరత తామెప్పుడూ చూడలేదని, అన్ని ఆస్పత్రుల్లోనూ పరిస్థితి ఇలాగే ఉందని ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న ఫార్మసిస్ట్‌లు చెబుతున్నారు. కొంతమంది రోగులు ప్రశ్నిస్తుంటే పైనుంచే మందులు రావడంలేదని ఫార్మసిస్ట్‌లు నచ్చజెబుతున్నారు. డాక్టర్లు చిట్టీలు రాసి బయట తెచ్చుకోవాలని రోగులకు సూచిస్తున్నా సర్కారులో ఎలాంటి చలనంలేదు.

స్థానిక కొనుగోళ్లకు మంగళం

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వాస్పత్రులకూ ఏపీఎంఎస్‌ఐడీసీ (రాష్ట్ర మౌలిక వైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థ) మందులను సరఫరా చేస్తుంది. ఇందుకు 2018–19 సంవత్సరానికి రూ.250 కోట్లు కేటాయించారు. ఈ నిధుల నుంచే 1175 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 192 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 31 ఏరియా ఆస్పత్రులు, 8 జిల్లా ఆస్పత్రులు, 11 బోధనాసుపత్రులు, మరో 11 స్పెషాలిటీ ఆస్పత్రులకు మందులు సరఫరా కావాలి. అలాగే, ప్రతి ఆస్పత్రికీ ఏటా మందులకు అయ్యే వ్యయంలో 20 శాతం స్థానికంగా కొనుగోళ్లు (అత్యవసర పరిస్థితుల్లో) చేసుకునేందుకు అనుమతి ఉంది. ఉదాహరణకు గుంటూరు పెద్దాసుపత్రికి ఏడాదికి రూ.7 కోట్లు ఖర్చయితే.. స్థానిక కొనుగోళ్ల కింద రూ.1.40 కోట్లు ఇవ్వాలి. ఇలా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆస్పత్రులకూ అవకాశం ఉంటుంది. కానీ, 18 నెలల నుంచి స్థానిక కొనుగోళ్ల కింద నిధులివ్వకపోవడంతో అన్ని ఆస్పత్రుల్లో కలిపి రూ.140కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో సరఫరాదారులు మందులను అందించడంలేదు.

సర్జికల్ బకాయిలూ రూ.90 కోట్లు

మందులకు మాదిరిగానే శస్త్రచికిత్సల ఉపకరణాలకు కూడా ప్రతి ఆస్పత్రికి స్థానిక కొనుగోళ్లకు బడ్జెట్ కేటాయించాలి. గ్లౌజుల నుంచి సూచర్ (కుట్లకు వాడే దారం) వరకూ అత్యవసర పరిస్థితుల్లో బయట కొనుగోలు చేస్తుంటారు. కానీ, దీనికి కూడా రాష్ట్ర ప్రభుత్వం 28 నెలలుగా డబ్బులివ్వకపోవడంతో సప్లయర్లు వాటి సరఫరాను నిలిపివేశారు. దీంతో సుమారు రూ.90 కోట్ల వరకు వారికి బకాయిలు చెల్లించాల్సి ఉంది. సూదులు, సిరంజిలు, కాటను, బ్యాండేజీ వంటి చిన్నచిన్నవి కొనుగోలు చేసేందుకు కూడా ఆస్పత్రుల వద్ద డబ్బుల్లేవు. కొన్ని ఆస్పత్రుల్లో అయితే పేషెంటును సర్జరీకి తీసుకెళ్లే ముందు ఆపరేషన్‌కు అవసరమైన వాటిని తెచ్చుకోమని కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. అలా తెచ్చిన తర్వాతే శస్త్రచికిత్స మొదలుపెడుతున్నారంటే పరిస్థితి తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. బడ్జెట్ విషయమై ఏపీఎంఎస్‌ఐడీసీ ఎండీని అడిగితే తాను చెక్కులు రాసి పంపించానని, ఆర్థిక శాఖలో విడుదల చేయాల్సి ఉందని చెబుతున్నారని ఆస్పత్రుల వైద్యులు చెబుతున్నారు.

సీఎం సొంత జిల్లాలో ఇదీ పరిస్థితి..

- ☛ చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో డోంపరడైన్ 10 ఎంజీ మాత్రలు 38వేలు అవసరమున్నాయని అడిగితే కేవలం పదివేలు మాత్రమే సరఫరా చేశారు.
- ☛ ఇదే ఆస్పత్రిలో అడ్రినల్ బైటార్‌ట్రేట్ 1 ఎంజీ ఇంజెక్షన్లు 120 కావాలని అడిగితే ఒక్కటీ సరఫరా చెయ్యలేదు.
- ☛ అమాక్సిలిన్ క్లావిలిక్ యాసిడ్ ఓరల్ సస్పెన్షన్ మందులు 2వేలు అడిగితే ఒక్కటీ ఇవ్వలేదు.
- ☛ ఆమ్లొడిపైన్ ఐపీ 5ఎంజీ మందులు 30వేల టాబ్‌లెట్లు అవసరమని ఇండెంట్ ఇస్తే గడిచిన 10 నెలల్లో కేవలం 10వేలు మాత్రమే సరఫరా చేశారు.
- ☛ అబ్జార్బబుల్ కాటన్ బ్యాండేజీలు 50 అడిగితే ఒక్కటీ ఇవ్వలేదు.
- ☛ ఎనలాప్రిల్ మిలెట్ 5ఎంజీ టాబ్‌లెట్లు వెయ్యి ఇండెంట్ పెడితే ఒక్కటీ ఇవ్వలేదు.

సరఫరా చెయ్యకపోతే బ్లాక్‌లిస్టులో..

18 నెలలుగా నిధులు ఇవ్వకపోయినా సరే మందులు సరఫరా చేయాల్సిందేనని, లేదంటే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని అధికారులు తమను బెదిరిస్తున్నట్లు సంస్థలు వాపోతున్నాయి. రూ.140 కోట్ల బకాయిలు చెల్లించకుండా ఇలా బెదిరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే సరఫరా చేస్తున్న సంస్థలన్నీ అప్పుల్లో కూరుకుపోయాయని, ఏపీకి ఎవరైనా సప్లయ్ చెయ్యడానికి రావాలంటే భయపడి పారిపోతున్నారని సరఫరాదారులు చెబుతున్నారు.

మూర్ఛ రోగుల నిరసన

గుంటూరు పెద్దాసుపత్రికి ఎపిలెప్సీ (మూర్ఛ) రోగులు నెలవారీ మందులకు నెలనెలా వస్తుంటారు. కానీ, గత కొంతకాలంగా వీరికి మందులు ఇవ్వడంలేదు. దీంతో ఈనెల 26న గుంటూరు ఆస్పత్రికి వచ్చిన పలువురు మూర్ఛ రోగులు ఆందోళనకు దిగారు. మందులు ఎందుకు సరఫరా చేయడంలేదని వైద్యులను నిలదీశారు. గొడవ పెద్దదవుతోందని, ఇది మీడియా కంటపడితే మరింత ఇబ్బంది అని భావించిన ఆస్పత్రి అధికారులు.. బయట నుంచి మందులు కొనుక్కొచ్చి ఇచ్చారు. ఆ తర్వాత వచ్చిన వారికి డాక్టరు లేరని, ఫార్మసిస్ట్ లేడని చెప్పి పంపించేశారు. రాష్ట్రంలోని అనేక ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి.

షర్మిలపై దుష్ప్రచారం కేసులో మరొకరి అరెస్టు

- తెలంగాణ పోలీసుల అదుపులో మంచిర్యాలకు చెందిన నవీన్
- వెంకటేష్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

సాక్షి, హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె, ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్ సోదరి షర్మిలపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారంపై నమోదైన కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కేసులో ప్రకాశం జిల్లా వేములకు చెందిన పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు అలియాస్ వెంకటేష్‌ది తొలి అరెస్టు కాగా... ఆదివారం తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన నవీన్‌ను అరెస్టు చేశారు. మరికొందరు బాధ్యుల్ని గుర్తించడానికి సైబర్ క్రైమ్ పోలీసులు యూట్యూబ్‌కు సంబంధించిన లాగిన్ వివరాలు ఆరా తీస్తున్నారు. కేసు దర్యాప్తునకు కీలక ప్రాధాన్యమిస్తున్న అధికారులు నిందితుల్ని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. షర్మిల తన ఫిర్యాదుతో పాటు దాదాపు 60 యూట్యూబ్ లింకుల్ని పోలీసులకు సమర్పించారు. వీటిని పరిశీలించిన అధికారులు ఆ అభ్యంతరకరమైన కామెంట్లపై దృష్టి పెట్టారు. ఏడుసార్లు కామెంట్లు పెట్టిన వెంకటేష్‌ను శనివారం గుంటూరులో అరెస్టు చేసి తీసుకొచ్చారు. ఆదివారం మంచిర్యాలలోని రామ్‌నగర్‌కు చెందిన అద్దూరి నవీన్‌ను కటకటాల్లోకి పంపారు. నవీన్ నాలుగు వీడియోల కింది భాగంలో తీవ్రమైన వ్యాఖ్యలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. వెంకటేష్‌ను ఆదివారం ఉదయం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. నవీన్‌ను సైతం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి సోమవారం రిమాండ్‌కు తరలించనున్నారు. వృత్తిరీత్యా క్షురకుడైన ఇతను ఎందుకు అభ్యంతరకర కామెంట్లు చేశాడనే అంశాన్ని ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో అసలు సూత్రధారుల్ని గుర్తించాలంటే ప్రాథమికంగా ఆయా అంశాలతో కూడిన వీడియోలను సృష్టిస్తూ యూ–ట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేసి వివరాలు, పదేపదే కామెంట్లు పెట్టిన వారి మూలాలు తెలియాల్సి ఉంది. వారు యూ–ట్యూబ్‌ను వినియోగించే సమయంలో ఏదో ఒక ఐపీ (ఇంటర్‌నెట్ ప్రొటోకాల్) అడ్రస్ ఆధారంగా ఇంటర్‌నెట్‌ను యాక్సిస్ చేశారో గుర్తించాలి. ఈ వివరాలు కోరుతూ యూట్యూబ్ యాజమాన్యానికి లేఖ రాశారు. ఈ కేసులో వీడియోలు పోస్ట్ చేసిన వారితో పాటు కామెంట్లు చేసిన వారూ నిందితులుగా మారతారని పోలీసులు చెప్తున్నారు. ఇప్పటికే 18 మందికి నోటీసులు జారీ చేసిన విషయం విదితమే.

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నేడు అమిత్‌షా పర్యటన



సాక్షి, అమరావతి: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సోమవారం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఒడిశా రాష్ట్ర పర్యటన అనంతరం ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన విశాఖ చేరుకొని.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరానికి వెళ్తారు. విజయనగరంలో 12.00 గంటలకు ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ బూత్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్రాల సభ్యులతో సమావేశమై ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్నారు. 1.30 గంటలకు విజయనగరం నుంచి శ్రీకాకుళం జిల్లాకు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్తారు. పలాసలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త బస్సుయాత్రను అమిత్‌షా జెండా ఊపి ప్రారంభిస్తారు.

చట్టాన్ని ఎందుకు అమలు చేయలేదు?

బీజేపీ చీఫ్ అమిత్‌షాకు రాష్ట్ర మంత్రి కళా లేఖ



సాక్షి, అమరావతి: విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్ని ఎందుకు అమలు చేయలేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను ఏపీ టీడీపీ అధ్యక్షుడు, మంత్రి కళా వెంకట్రావు ప్రశ్నించారు. అమిత్‌షా ఏపీలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయనకు మంత్రి కళా వెంకట్రావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌కి అన్ని విధాలుగా అన్యాయం చేసి ఇప్పుడు అసత్యాలు చెబుతున్నారని, రాష్ట్రానికి వచ్చి ఈ అసత్యాలను మళ్లీ చెప్పి ఏపీ ప్రజలను మభ్యపెట్టలేరని లేఖలో పేర్కొన్నారు.

బాధితుల్ని చితకబాదిన ఎస్‌ఐ

- అధికార పార్టీ కబ్జాదారులకు అండగా నిలబడ్డ వైనం
- ఎస్‌ఐ తీరుతో మనస్తాపం చెంది రైతు ఆత్మహత్యాయత్నం




ఆత్మహత్యాయత్నం చేసిన రైతు రఘురాం

మహానంది: దౌర్జన్యాలను అరికట్టి బాధితుల పక్షాన నిలవాల్సిన బాధ్యతగల ఓ ఎస్సై, అధికార పార్టీకి చెందిన కబ్జాదారులకు అండగా నిలబడి బాధిత రైతుల్ని చితకబాదిన ఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. ఎస్సై తీరుతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా మహానంది మండలం బుక్కాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు .. మహానందికి సమీపంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన గడేకారి సాలమ్మ అనే పేద మహిళకు 1973లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్ 93/1లో 1.25 ఎకరాలకు పట్టా ఇచ్చింది. దీన్ని ప్రస్తుతం ఆమె మనవళ్లు రఘురాం, జయరాం సాగు చేస్తున్నారు. ఇందులో 25 సెంట్లు కాజేయాలని స్థానిక టీడీపీ నేతలు పన్నంగి రమణయ్య, సుదర్శన్ ప్రయత్నిస్తున్నారు. వీరికి బుక్కాపురం ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి భర్త గుద్దేటి నాగరాజు మద్దతుగా నిలుస్తున్నాడు. భూమిని కబ్జా చేసే ఉద్దేశంతో ఆదివారం రాళ్లు పాతుతుండగా బాధితులు అడ్డుకున్నారు. అయితే..టీడీపీ నాయకులకు మద్దతుగా వచ్చిన ఎస్‌ఐ తులసీ నాగ ప్రసాద్ బాధితులపైనే ప్రతాపం చూపాడు. రఘురాం, జయరాంలను విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన రఘురాం పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ప్రస్తుతం ఇతను నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా..ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తీరు మొదటి నుంచీ వివాదాస్పదంగానే ఉంటోంది. పత్తికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య ఘటనలోనూ ఇతను ఆరోపణలు ఎదుర్కొన్నాడు.

టీడీపీ నమ్మకానికి ప్రతీకని ప్రచారం చేయండి

పార్టీ నాయకులకు చంద్రబాబు సూచన



సాక్షి, అమరావతి: నమ్మకానికి ప్రతీక తెలుగుదేశం పార్టీ అని ప్రచారం చేయాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఆదివారం ఉదయం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. టీడీపీపై నమ్మకంతోనే రైతులు భూములిచ్చేందుకు ముందుకొచ్చారని చెప్పాలన్నారు. పించన్ల పెంపు అనుత్పాదక వ్యయం కాదని, పసుపు కుంకుమ కార్యక్రమం ఉత్పాదక వ్యయమని తెలిపారు. పసుపు కుంకుమ చెక్కులు చెల్లుతాయని, సోమవారం నుంచే డబ్బులు తీసుకోవచ్చని, రూ.2,400 కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ చేశామని చెప్పారు. జీవితకాల పన్ను తొలగింపుతో ఆటో యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ప్రతి ఆటో, ట్రాక్టర్ పై టీడీపీ జెండా ఎగరాలని చెప్పారు. బీజేపీయేతర రాష్ట్రాలపై ప్రధాని మోదీ నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఏమీ చేయకుండా ఏ ముఖం పెట్టుకుని కేంద్ర మంత్రులు రాష్ట్రానికి వస్తారని ప్రశ్నించారు.

‘ప్రైవేటు’ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

టీపీడబ్ల్యూఏ రాష్ట్ర కన్వీనర్ నూర్‌మహ్మద్

సాక్షి, అమరావతి: ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేస్తున్న బోధన , బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని టీపీడబ్ల్యూఏ రాష్ట్ర కన్వీనర్ ఎస్.నూర్‌మహ్మద్, కో–కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌ను కలసి వినతి పత్రం అందజేసినట్టు వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 5 లక్షల మంది ప్రైవేట్ విద్యా సంస్థల్లో బోధన , బోధనేతర ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వీరికి ఇప్పటి వరకు ఎలాంటి గుర్తింపు కార్డు ఇవ్వలేదని పేర్కొన్నారు. కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని ఈఎస్‌ఐ, పీఎఫ్ 50 శాతంపైగా విద్యా సంస్థల యాజమాన్యాలు చెల్లించడం లేదని.. ఇందుకు కారణం ప్రభుత్వం నుంచి ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడమేనన్నారు. ఉద్యోగులు అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో హెల్త్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదిత్యనాథ్‌ను లేఖలో కోరారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి: సామల

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే పోరాటం తప్పదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం హెచ్చరించారు. పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ సక్రమంగా అమలు జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, అన్ని జిల్లాల్లో అంతర్ జిల్లా బదిలీలు పూర్తి చేసి తమకు మాత్రం అమలు చేయకపోవడం అన్యాయమని శ్రీకాకుళం జిల్లా టీచర్లు వాపోతున్నారు. వంశధార ప్రాంత ఉపాధ్యాయులకు సంబంధించి 8 నెలలు క్రితం బదిలీలపై స్పష్టత వచ్చినా ఇంత వరకు అమలు చేయలేదని వారు పేర్కొన్నారు.

సీఎం రమేష్ చెప్పినట్టు వినాలి

- తెలుగుగంగ లైనింగ్ పనుల టెండర్లపై అధికారులకు సీఎం చంద్రబాబు అల్టిమేటం
- ఆ పనులకు గత జూలై 16న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన సర్కార్
- తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో షెడ్యూళ్లు దాఖలు చేసిన రిత్విక్ ప్రాజెక్ట్స్
- అక్రమాలను ‘సాక్షి’ ఎత్తిచూపడంతో టెండర్‌ను రద్దు చేసిన సీవోటీ
- సీఎం రమేష్ సంస్థకే పనులు అప్పగించాలని సీఎం ఆదేశం



సాక్షి, అమరావతి: తప్పు చేసిన వారిని శిక్షించాల్సిన ప్రభుత్వ పెద్ద.. తప్పు చేసిన వారికే పనులు అప్పగించాలని అధికారులపై తీవ్ర స్థాయిలోఒత్తిడి తెచ్చారు. ఈ వ్యవహారానికి తెలుగుగంగ ప్రధాన కాలువలో మిగిలిపోయిన లైనింగ్ పనుల టెండర్ వేదికైంది. వివరాల్లోకి వెళితే.. తెలుగుగంగ ప్రాజెక్టు పనుల అంచనా వ్యయాన్ని రూ. 4,460.64 కోట్లుగా ఖరారు చేస్తూ మార్చి 20, 2007న అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టులో 2009 నాటికి 95 శాతం పనులు పూర్తయ్యాయి. కేవలం 5 శాతం పనులు మాత్రమే మిగిలి ఉండగా అంచనా వ్యయాన్ని రూ. 6,671.62 కోట్లకు పెంచేస్తూ 2018 మార్చి 9న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయించింది. అడ్డగోలుగా పెంచేసిన అంచనా వ్యయంతో.. మిగిలిన పనులను బినామీ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకోవడానికి సీఎం చంద్రబాబు ఆదిలోనే స్కెచ్ వేశారు. తెలుగుగంగ ప్రధాన కాలువ 0.00 కి.మీ నుంచి 18.20 కి.మీ వరకు లైనింగ్ చేయడం, 18.200 కి.మీ నుంచి 42.566 కిమీ వరకు గతంలో లైనింగ్ చేయకుండా మిగిలిపోయిన పనులు, బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ (బీసీఆర్) నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసే లింక్ ఛానల్ 0.00 కి.మీ నుంచి 7.380 కి.మీ వరకు లైనింగ్ చేయకుండా మిగిలిపోయిన పనులను చేపట్టాలని నిర్ణయించారు. 2007 నాటి ఉత్తర్వుల ప్రకారం ఈ పనుల విలువ రూ.172.99 కోట్లు. కానీ.. మార్చి 9, 2018న జారీ చేసిన ఉత్తరులలో ఈ పనుల విలువను రూ. 180.48 కోట్లుగా ఖరారు చేశారు. ఆ పనుల వ్యయాన్ని మళ్లీ పెంచాలని ముఖ్యనేత ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారు. వాటికి తలొగ్గిన అధికారులు ఆ పనుల అంచనా వ్యయాన్ని రూ. 280.27 కోట్లకు పెంచేస్తూ జూన్ 8, 2018న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనులకు రూ. 239.03 కోట్లను అంతర్గత విలువగా నిర్ణయించిన అధికారులు.. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థకు ఆ పనులు దక్కేలా నిబంధనలతో జూలై 16న ఎల్ఎస్–ఓపెన్ విధానంలో టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. 18 నెలల్లో ఈ పనులకు పూర్తి గడువు విధించారు. జూలై 31న టెక్నికల్ బిడ్‌ను తెరిచారు. సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ సంస్థతో పాటు హ్యూ, హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రాలు బిడ్‌లు దాఖలు చేశాయి.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో..

పనులు చేసిన అనుభవం లేకున్నా ఉన్నట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలను చూపి.. అధికార బలంతో పనులు దక్కించుకోవడంలో రిత్విక్‌ది అందెవేసిన చేయిగా జలవనరుల శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. తెలుగు గంగ లైనింగ్ పనుల టెండర్‌లో టెక్నికల్ బిడ్‌ను తెరిచిన సమయంలో రిత్విక్ సంస్థ తప్పుడు అర్హత పత్రాలు సమర్పించినట్లు హ్యూ సంస్థ ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో మీర్జాపూర్, అలహాబాద్ జిల్లాల పరిధిలో బన్సాగర్ కెనాల్ ప్రాజెక్టు పనులను రిత్విక్ సంస్థ సబ్ కాంట్రాక్టర్లతో చేయించిందని.. కానీ ఆ పనులు తానే చేసినట్లు తప్పుడు పత్రాలు సమర్పించిందని, ఈ నేపథ్యంలో ఆ సంస్థపై అనర్హత వేటు వేయాలని కోరారు. కానీ, ఉన్నత స్థాయి ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు ఆగస్టు 6న ప్రైస్ బిడ్ తెరిచారు. 2.88% అధిక ధర (ఎక్సెస్)కు రిత్విక్ (ఎల్–1), 3.61% ఎక్సెస్‌కు హ్యూ (ఎల్–2), 4.31 శాతం ఎక్సెస్‌కు హెచ్ఈఎస్ (ఎల్–3) సంస్థలు బిడ్‌లు దాఖలు చేసినట్లు వెల్లడైంది. ఎల్–1గా నిలిచిన రిత్విక్ సంస్థకు పనులు అప్పగించాలని సీవోటీకి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ అక్రమ వ్యవహారాన్ని ‘సాక్షి’ బహిర్గతం చేసింది. టెండర్‌ను ఖరారు చేసి సీఎం రమేష్‌కు అప్పగించాలని నవంబర్ 30న సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఈ అంశాన్ని ‘సాక్షి’ బయటపెట్టింది. దాంతో సీవోటీ అధికారులు టెండర్‌ను రద్దు చేశారు.

అయినా తీరు మారలేదు..

తెలుగుగంగ ప్రధాన కాలువలో మిగిలిపోయిన లైనింగ్ పనులకు రూ. 239.03 కోట్ల అంచనా వ్యయంతో జనవరి 14న రెండోసారి టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. సీఎం రమేష్ సంస్థకే పనులు దక్కేలా నిబంధనలు పెట్టారు. ఇతర సంస్థలు టెండర్‌లో షెడ్యూళ్లు దాఖలు చేయకుండా ఇప్పటికే తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారు. ఈ క్రమంలో సీఎం రమేష్ చెప్పినట్టు విని.. పనులు ఆయనకు చెందిన సంస్థకే అప్పగించాలని జలవనరుల శాఖ అధికారులు, తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులపై సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. ఈనెల 11లోగా షెడ్యూల్ దాఖలు చేసుకోవచ్చు. 12న టెక్నికల్ బిడ్.. 16న ఫైనాన్స్ బిడ్ ఖరారు చేసి సుమారు 4.85 శాతం అధిక ధర (ఎక్సెస్)కు సీఎం రమేష్ సంస్థ దాఖలు చేసిన షెడ్యూల్‌ను ఆమోదించి.. పనులు కట్టబెట్టడానికి రంగం సిద్ధం చేశారు.

సీఎంకు పెన్షను.. మాకు టెన్షనా?

- గుంటూరులో కదం తొక్కిన సీపీఎస్ ఉద్యోగులు
- ఉద్యోగులను అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపిన వైనం



పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి ఉద్యోగుల నిరసన

సాక్షి, గుంటూరు/ సాక్షి, అమరావతి: సీపీఎస్ ఉద్యోగులు కదం తొక్కారు. సీఎంకు పెన్షను.. మాకేమో టెన్షనా?.. ఇదెక్కడి న్యాయం అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన మహాపాదయాత్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ధర్మపోరాట దీక్షల పేరుతో బూటకపు దీక్షలు చేయడం కాదని, కష్టపడి పనిచేసే ఉద్యోగుల న్యాయమైన హక్కులను నెరవేర్చాలని చంద్రబాబును డిమాండ్ చేశారు. గుంటూరులోని మార్కెట్ సెంటర్ నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి సారథ్యంలో భారీ ర్యాలీతో విజయవాడకు పాదయాత్రగా బయలుదేరిన యూటీఎఫ్ నాయకులు, ఉద్యోగులను నగరంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు అడ్డుకున్నారు. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల నుంచి 1,500 మందికి పైగా ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చాలని శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న ఉద్యోగులను పోలీసులు అడ్డుకోవడంపై వారు మండిపడ్డారు. ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి ఉద్యమంపై ఉక్కుపాదం మోపాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. తమ న్యాయ మైన హక్కుల కోసం నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిందని, టీడీపీ ప్రభుత్వం ఆ హక్కును కూడా కాలరాస్తోందని దుయ్యబట్టారు.


తోపులాట.. ఉద్రిక్తత

యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు గంటకు పైగా రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనా స్థలానికి సివిల్, ఎస్టీఎఫ్, ఏఆర్ పోలీస్‌లు భారీగా అక్కడకు చేరుకొని బలవంతంగా యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులను అరెస్ట్ చేసి తమ వాహనాల్లో పోలీస్ కళ్యాణ మండపానికి తరలించారు. మహిళా ఉపాధ్యాయులను సైతం అరెస్ట్ చేయడంపై యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు.

ఖండించిన ఉభయ కమ్యూనిస్టు పార్టీలు

సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఏలూరు, గుంటూరు నుంచి రాజధానికి పాదయాత్ర చేస్తున్న ఉపాధ్యాయులను అరెస్టు చేయడాన్ని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీలు ఖండిస్తూ కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీఎండీసీలో ఎండీదే ఇష్టారాజ్యం



- వైఎస్సార్ జిల్లా మంగపేటలో సీఎస్సార్ కింద నిర్మించిన పాఠశాల భవనం ప్రైవేటుపరం
- స్థానిక విద్యార్థులకు దక్కని సీట్లు.. సిఫార్సులకే పెద్దపీట

సాక్షి, అమరావతి: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) ముసుగులో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థలో(ఏపీఎండీసీ) అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) వెంకయ్య చౌదరికి సన్నిహితులు, సామాజిక వర్గానికి చెందిన సంస్థలకు అడ్డగోలుగా ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కుతూ నచ్చిన సంస్థలకు విలువైన ప్రాజెక్టులను ఎలాంటి టెండర్లు లేకుండా ఏకపక్షంగా కట్టబెట్టేశారు.

ఓక్రిడ్జ్‌కు స్కూలు సంతర్పణ

వైఎస్సార్ జిల్లా మంగంపేటలో అధునాతన సౌకర్యాలతో ఏపీఎండీసీ నిర్మించిన పబ్లిక్ స్కూలు నిర్వహణ బాధ్యతను ఎలాంటి టెండర్లు లేకుండా ఓక్రిడ్జ్ అనే కార్పొరేట్ పాఠశాల యాజమాన్యానికి అప్పగించారు. ఏపీఎండీసీ ఉద్యోగుల పిల్లలు, భూసేకరణ, గనుల తవ్వకాల వల్ల ప్రభావితమైన గ్రామాల్లోని పిల్లలకు విద్య అందించడం కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కింద ఈ పాఠశాల భవనాన్ని నిర్మించారు. అయితే, దీన్ని ఏపీఎండీసీ ఎండీకి సన్నిహితమైన ఓక్రిడ్జ్ సంస్థకు అడ్డగోలుగా కట్టబెట్టారు. వాస్తవానికి ఏపీఎండీసీనే ఉపాధ్యాయులను నియమించి సొంతంగా పాఠశాలను నిర్వహించాలి. లేదంటే టెండర్లు పిలిచి తక్కువ మొత్తానికి నిర్వహించేందుకు ముందుకొచ్చిన సంస్థకే స్కూలు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలి. ఈ రెండు విధానాలకు భిన్నంగా ఓక్రిడ్జ్ సంస్థకు కట్టబెట్టేశారు. నిర్వహణకు గాను ఆ సంస్థకు ఏటా రూ. కోట్లు చెల్లిస్తున్నారు. అయితే ఏపీఎండీసీ నెలకొల్పిన పాఠశాలలో పలుకుబడి, రాజకీయ బలం ఉన్న స్థానికేతర పిల్లలకే సీట్లు ఇచ్చారని, తమ పిల్లలకు సీట్లు రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థలో ఉన్నతాధికారి సిఫార్సులు ఉన్నవారికే సీట్లు దక్కాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీఎండీసీ స్కూలులో సీట్లు రాకపోవడంలో స్థానికంగా ఉన్న పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళుతున్నారు.


ఏపీఎండీసీకి ఆ సామర్థ్యం లేదా?

పాఠశాలను అన్ని హంగులతో ఏపీఎండీసీ నిర్మించింది. పిల్లలను ఇళ్ల నుంచి పాఠశాలకు తీసుకురావడానికి బస్సులను ఏర్పాటు చేసింది. ఇంత చేసిన సంస్థ నిపుణులైన టీచర్లను నియమించి సొంతంగా పాఠశాలను ఎందుకు నిర్వహించలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బస్సులకు డీజిల్ సహా అన్ని ఖర్చులను ఏపీఎండీసీ భరిస్తోంది. ఇవి చాలవన్నట్లు ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.25 వేలకుపైగా ఓక్రిడ్జ్‌కు ధారపోస్తోంది. ఓక్రిడ్జ్ సంస్థ స్థానిక టీచర్లను నియమించి, వారికి తక్కువ వేతనాలు ఇస్తూ లాభాలు పొందుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏపీఎండీసీ చెల్లించిన మొత్తంపోనూ అనధికారికంగా పిల్లల నుంచి కొంత ఫీజు వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమే.

‘భవ్య’కు పీహెచ్‌సీ నజరానా

మంగంపేటలో చాలాఏళ్లుగా ఏపీఎండీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ) సంస్థ ఎండీగా వెంకయ్య చౌదరి వచ్చిన తర్వాత రెండేళ్ల క్రితం భవ్య హెల్త్‌కేర్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. భవ్య సంస్థ ఆయన సన్నిహితులకు చెందినది కావడం గమనార్హం. పీహెచ్‌సీని భవ్యకు నజరానాగా ఇచ్చి తమకు అన్యాయం చేశారని పూర్వం నుంచి ఇక్కడ ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేసిన ఉద్యోగులు వాపోతున్నారు. పీహెచ్‌సీని భవ్యకు అప్పగించిన సందర్భంగా 2017లో ఇక్కడి సిబ్బందిని తొలగించి భవ్య కాంట్రాక్టు కింద చేర్చారు. దాంతో అంతకుముందు వచ్చే నెలవారీ వేతనం రూ.14,000లో రూ.1,250 కోత పడింది.

సాక్షి
సాహిత్యం



విజయవాడ | సోమవారం
ఫిబ్రవరి | 4 | 2019
మెయిల్: sakshisahityam@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబినామ సంవత్సరం. ఉత్తరాయణం, హేమంత ఋతువు. పుష్యమాసం. తిథి అమావాస్య రా.1.24 వరకు, తదుపరి మాఘ శు. పాడ్యమి. నక్షత్రం శ్రవణం తె.5.13 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి ధనిష్ఠ. వర్జ్యం ఉ.7.10 నుంచి 8.54 వరకు. దుర్ముహూర్తం ప.12.35 నుంచి 1.21 వరకు, తదుపరి ప.2.51 నుంచి 3.32 వరకు. అమృత ఘడియలు సా.5.44 నుంచి 7.29 వరకు

సూర్యోదయం : 6.36, సూర్యాస్తమయం : 5.53
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు

ఫజర్ : 5.33
జొహర్ : 12.30
అసర్ : 4.37
మగ్రీబ్ : 6.13
ఇషా : 7.27

ఈవారం పుస్తకాలు

సాహిల్ వస్తాడు (కథలు)



రచన: అఫ్సర్; పేజీలు: 166; వెల: 180; ప్రచురణ: ఛాయా రిసోర్సెస్ సెంటర్, హైదరాబాద్. ఫోన్: 040–23742711. ప్రతులకు: అనల్ప బుక్ కంపెనీ, సికింద్రాబాద్–94. ఫోన్: 7093800678

బీహార్ నుండి తీహార్ వరకు
(కన్నయ్య కుమార్ ఆత్మకథ)



అనువాదం: డాక్టర్ జి.వి.రత్నాకర్; పేజీలు: 200; వెల: 170; ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 33–22–2, చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ–4; ఫోన్: 0866–2430302

హరివంశము
(సరళ వ్యావహారికంలో)




రచన: అయలసోమయాజుల నీలకంఠేశ్వర జగన్నాథశర్మ; పేజీలు: 448(గట్టి అట్ట); వెల: 324; ప్రతులకు: ఎస్.ఆర్.బుక్ లింక్స్, డి.ఆర్.ఆర్. వీధి, ఇన్నర్ రింగ్ రోడ్(అంబాపురం), విజయవాడ రూరల్–520012. ఫోన్: 0866–2436959

భూమిక
(సుధామ పీఠికలు - ముందుమాటలు)



సంపాదకులు: అల్లంరాజు ఉషారాణి; పేజీలు: 470; వెల: 300; ప్రతులకు: ఎ.ఉషారాణి, స్నేహిత స్రవంతి, జి 12, సాదత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్, సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాద్–36. ఫోన్: 9849297958

చర్చకు సై



రచన: కృష్ణసాయిరాం; పేజీలు: 144; వెల: 250; ప్రతులకు: స్కూల్ ఆఫ్ మీడియా స్టడీస్, 6–3–584/32/8, జి.టి.నగర్, వెంకటరమణ కాలనీ, హైదరాబాద్–4. ఫోన్: 7893285937

చిత్రావతి కథలు




రచన: ఉప్పరపాటి వెంకటేశులు; పేజీలు: 122; వెల: 90; ప్రతులకు: పద్మ పబ్లికేషన్స్, 3–328, తపోవనం, అనంతపురం–515004. ఫోన్: 8074483952



కథాసారం

తెల్లమొహం



ఇప్పుడిప్పుడు కొందరు తెల్లకోటూ, నల్లలాగూ వేసుకుని డాన్సులకీ ఈవినింగ్ పార్టీలకీ వెడుతున్నారు కానీ స్వచ్ఛమైన బ్రిటిషర్ దాన్ని డిజె కింద లెక్కకట్టడు...

బోయ్ విశాలమైన డ్రాయింగ్ రూమ్‌లో ప్రవేశించి అణకువగా ఒక పక్కన నుంచున్నాడు. టీ ముగించి మెత్తని సోఫాలో మునిగిపోయి బి.బి.సి. రేడియో వింటున్న పేట్‌రావ్ ''ఏం కావాలి?'' అన్నట్టు అతని వైపు చూశాడు. ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకునే రోజుల్లో స్నేహితులు ప్రతాపరావుని పేట్ అని ఇంగ్లీషు సంప్రదాయంలో పిలిచేవారు. ఇండియా వచ్చిన తర్వాత పేట్‌రావ్ అయింది.

''మాస్టర్, బాత్ రెడీ''.

పడక గదికి ఆన్చికట్టిన స్నానాల గదికి వెళ్లడానికి పేట్‌రావ్ లేచాడు. అప్పుడే ఇస్త్రీ చేసిన డిన్నర్ జాకెట్ పక్కమీద పరిచి ఉంది. డ్రెస్సింగ్ టేబిల్ పక్కనున్న సోఫాకి ముందు పోలిష్ చేసిన నల్లజోళ్లూ, వాటిమీద నలుపురంగు సాక్సూ ఉన్నాయి.

''బోయ్'' అరిచాడు పేట్‌రావ్. ''తెల్లషార్క్‌స్కిన్‌కోటు ఎందుకు తీశావ్?''

ఒక్క నిమిషం బోయ్ తటపటాయించాడు. ''మాస్టర్ పోయినసారి నల్ల డి.జె. వేసుకున్నారు'' అన్నాడు.

ఒక పార్టీకి నల్లడిన్నర్ జాకెట్ వేసుకుంటే, తరువాత దానికి తెల్ల డి.జె. తీసి ఉంచమని తనే ఆదేశించాడు. అయితే ఈ పార్టీ ప్రత్యేకమైంది. బోయ్‌కి చెప్పడం మర్చిపోయాడు. అయినా అప్పుడప్పుడు ఆ మాత్రం కోప్పడ్డంలో తప్పులేదు.

పేట్‌రావ్‌కి బోయ్ అంటే అభిమానం. బోయ్ తెలుగువాడే, పేరు లోపరాజు. ఎన్నో ఏళ్ల దొరల కింద పనిచేసి బోయ్ అన్నపేరు గడించుకున్నాడు. పదిహేనేళ్ల క్రితం హంటర్ దొర రిటైరై ఇండియా నుండి ఇంగ్లండు వెళ్లిపోతూ పేట్‌రావ్‌కి బోయ్‌ని సిఫార్సు చేశాడు. ''ఫరవాలేదు, పనికొస్తాడు. ఇంగ్లీషు అర్థం అవుతుంది. కొంచెం మాట్లాడగలడు కూడా. అయితే నీ విస్కీ ఒక కంట కనిపెట్టుకో పేట్'' అని నవ్వాడు హంటర్.

మాస్టర్ పొద్దున మేడమ్ గది విడిచి, తన గదిలోకి వచ్చినప్పటినుండీ ఆఫీసుకు పోయేవరకూ అన్ని అవసరాలూ బోయ్ చూస్తాడు. మాస్టరు నైట్ గౌన్, పైజమాలు విప్పడం దగ్గర నుండి తలకి నూనె, ఆఫీసు బట్టలు వేసుకోడం వరకూ ప్రతి విషయంలోనూ సాయపడతాడు. మాస్టర్ బ్రేక్‌ఫాస్ట్‌కి ఏం తింటాడో వంటవాడికి చెబుతాడు. మాస్టర్‌కి ఎన్ని గంటలకి కారు తయారుగా ఉండాలో డ్రైవర్‌కి చెబుతాడు.

''నేను తప్ప ఇవాళ పార్టీకి వచ్చేవాళ్లంతా తెల్లవాళ్లే.''

నల్ల డి.జె. వేసుకోవడానికి కారణం వివరించడానికి ప్రయత్నించాడు పేట్‌రావ్. ఇటువంటి విషయాలు చెప్పేటప్పుడు బోయ్ ఎంతో సన్నిహితుడనిపించేది. పేరు పెట్టి పిలవాలనిపించేది. ఏళ్ల తరబడి అలవాటుపడ్డ సంస్కారం, ఇండియాలో పనిచేసిన ఇంగ్లీషువాళ్ల సంస్కారం అడ్డు వచ్చేది.

''ఇప్పుడిప్పుడు కొందరు తెల్లకోటూ, నల్లలాగూ వేసుకుని డాన్సులకీ ఈవినింగ్ పార్టీలకీ వెడుతున్నారు కానీ స్వచ్ఛమైన బ్రిటిషర్ దాన్ని డిజె కింద లెక్కకట్టడు'' అన్నాడు.

బోయ్ ముగ్ధుడై వింటున్నాడు. ఇది కొత్త విజ్ఞానం. రేపు స్నేహితుల్తో కబుర్లలో దొర్లించవచ్చు.

బోయ్ షార్క్‌స్కిన్ కోటు తీసి వార్డ్‌రోబ్‌లో తగిలించి వికూవాగుడ్డతో కుట్టిన నల్ల డి.జె. కోటు బయటికి తీశాడు.

తొట్టిలో మూడువంతులు వేడి నీళ్ల పట్టి ఉంచాడు బోయ్. వేడిచూసుకొని తృప్తిగా దిగాడు పేట్‌రావ్. శరీరం బయటా, లోపలా సుఖంగా ఉంది. ఆలోచనలు రాత్రి కాక్‌టైల్ పార్టీ మీదికి పోయాయి.

మిస్టర్ అండ్ మిసెస్ స్టూవర్ట్, రగ్గర్ ఫుట్‌బాల్ పోటీల్లో గెలిచిన క్లబ్బు జట్టుకి రాత్రి ఏడూ, పదకొండూ గంటల మధ్య క్లబ్ బ్రిడ్జిరూమ్‌లో పార్టీ ఇస్తున్నారు. అతిథుల్లో తనొక్కడే ఇండియన్. రగ్గర్ జట్టులో ఇండియన్ లేనేలేడు. ఇండియన్ మెంబర్లకి ఇది అసంతృప్తి కలిగించింది. తెల్లవాళ్లంతా కలిసి ఇండియన్లకి చోటు లేకుండా చేసేరన్నారు. ''చేత కాని కబుర్లు'' అనుకున్నాడు పేట్‌రావ్. ఈమధ్య వ్యాపారంలో పడి పట్టించుకోకపోవడం వల్ల నిజానిజాలు చెప్పలేడు. కానీ పదిహేనేళ్ల క్రితం తను రగ్గర్ జట్టులో ఉన్నాడు. సమాజంలో సరైన స్థానం ఉన్న ఇండియన్‌కీ బ్రిటిషరు ప్రాణం పెట్టగలడు. వచ్చిన చిక్కల్లా సంస్కారం సరిపోకుండా పెద్ద ఎత్తుల మీద మనసు పెట్టుకుని కూచున్నవాళ్లకే.

ఏడు అవుతోంది. తొట్టిలో నీళ్లు బయటికి వదిలి, షవర్ తిప్పి తొందరగా బయటపడ్డాడు.

పేట్‌రావ్ డిన్నర్ జాకెట్ వేసుకుని నిలువుటద్దంలో చూసుకుని మురిసిపోయాడు. కోటు ఫేసింగ్ తళతళ మెరుస్తోంది. పాంట్ బ్రెడింగ్ సున్నితంగా ఉంది. షర్టు కాలరూ, బౌ టై, తీర్చిదిద్దినట్టు అమరాయి. తక్కువయిందల్లా కోటు కాలరుకున్న బటన్ హోలులో కార్నేషన్ పువ్వు. ఈ వేడి దేశంలో కార్నేషన్ మొక్కలు మొలవవు. ఎర్రగులాబీని అలంకరించుకున్నాడు. పోర్టికోలోకి దారి తీశాడు. డ్రైవరు, జాగ్వార్ కారు వెనుక తలుపు తీసి పక్కగా నుంచున్నాడు.

●●●

పేట్‌రావ్ వెళ్లేసరికే బ్రిడ్జిరూమ్ జనంతో కిటకిటలాడుతూ ఉంది. అయితే అంతా నల్లకోట్లలో లేరు. లౌంజ్‌సూట్లలో వచ్చినవాళ్లూ, సాదాకోటు పేంటుల వాళ్లూ ఉన్నారు. మిస్టర్ స్టూవర్ట్ అతన్ని ఆహ్వానించి బార్ దగ్గరికి తీసుకు వెళ్లాడు. ''నీ డ్రింక్ ఏమిటి పేట్?''

''విస్కీ అండ్ సోడా''

పేట్‌రావ్ గదంతా కలయజూశాడు. వెళ్లి ఎవరితోనైనా చేరడానికి సందేహించాడు. పేట్‌రావ్ దృష్టి గోడమీద నోటీసు మీదకి పోయింది. ''గదిలో పర్మిట్ ఉన్నవాళ్లు మాత్రమే తాగవచ్చు''. అతనికి నవ్వొచ్చింది. పర్మిట్ లేకుండా ఎందరు ఇక్కడ తాగడం లేదు? తనకి మాత్రం ఉందా? తనకి పర్మిట్ లేని సంగతి ఏ కొద్దిమందికో కానీ తెలియదు. ''పేట్‌ని పర్మిట్ అడిగితే ప్రొహిబిషనే ఎత్తించేస్తాడు'' అని నవ్వుతారు. తనకి గుండెజబ్బు. ''నీకు నేను సర్టిఫికెటు ఇవ్వను, ఇంకే డాక్టరూ ఇవ్వకుండా చూస్తాను'' అని ప్రతిజ్ఞ పట్టేడు డాక్టరు.

''ఇంతమందిలో ఒంటరిగా కాలం వెళ్లబుచ్చేస్తున్నానే'' అనిపించింది. రీటా ఢిల్లీలో ఏం చేస్తుందో? రీటా, సుశీ ఇద్దరూ రెండేళ్లు తండ్రితో ఇంగ్లాండులో గడిపివచ్చారు. పెళ్లయేవరకు ఒకే సమాజంలో పెరిగారు. అయినా ఇద్దరి మనఃప్రవృత్తుల్లో ఎంత భేదం! రీటాకి ఇంగ్లీషు అలవాట్లంటే అభిమానం. సుశీకి గిట్టదు. ''ఈ ఆకతాయి వెధవలంతా హక్కు ఉన్నట్టు నీతో డాన్సు చెయ్యడానికి తగవులాడుకుంటూ ఉంటే నవ్వుతూ ఊరుకుంటావేం?'' అని రీటాని అడిగింది సుశీ. పెళ్లికాని కుర్రకారుకి సరదాగా ఉండే ఆడవాళ్లని చూస్తే మతిపోయే మాట నిజమే. ''బ్రిటిష్ కమ్యూనిటీలో నాకున్న స్థానం రీటావల్ల కాదుగదా?'' నీరసంగా ఒక మూల చేరి విస్కీ చప్పరించడం మొదలుపెట్టాడు.

●●●

పార్టీ హెచ్చుతోంది. కబుర్లు అరుపుల్లోకి దిగాయి. బీర్, రమ్, షెర్రా హరించుకుపోతున్నాయి. రగ్గర్ ఫుట్‌బాల్ పోటీలో అగ్రస్థాయి ఆట ఆడిన డంకన్ హార్వీని తమాషాగా దుయ్యబడుతున్నారు. ''ఇన్ని ఫ్రీకిక్స్‌ని గోలులోకి తన్నేవే, ఈ విస్కీ బుడ్డీని తన్నగలవా?''

మత్తులో తల ఎగరేశాడు డంకన్. కాలిజోడుతో గోడకి తన్ని ముక్కముక్కలుగా చేసేశాడు.

అకస్మాత్తుగా డంకన్ కళ్లు ఎడంగా ఉన్న పేట్‌రావ్ మీదకి పోయాయి. ''ఇక్కడికి నల్లవాడెలా వచ్చాడు?''

అందరి మొహాలూ పేట్‌రావ్ వైపు తిరిగాయి. ''ఈ హోటల్లో నల్లవాళ్లకి తావులేదు.''



సాటి ఇండియన్‌కు మాస్టర్ అయినా, ఎంత ఇంగ్లీషీకరణ చెందినా భారతీయుడికి ఇంగ్లీషువాడి దగ్గర 'బోయ్'కి మించిన గౌరవం దక్కదని చెప్పే కథ సి.రామచంద్రరావు 'నల్లతోలు'. దాని సంక్షిప్తం ఇది. ప్రధానంగా టీ ఎస్టేట్ అనుభవాల నేపథ్యంలో పొదుపుగా కథలు రాసిన సి.రా. కథాసంపుటి 'వేలుపిల్లై'. 1931లో జన్మించిన ఆయన నివాసం హైదరాబాద్.

సి.రామచంద్రరావు

''నేనిక్కడికి ఆహ్వానం మీద వొచ్చేను''

''ఏదీ ఆహ్వానం?''

అతను తీసుకురాలేదు. స్టూవర్ట్‌ని అడగమన్నాడు. ''మేం ఎవర్నీ అడగం. నీకు తాగడానికి పర్మిట్ ఉందా?''

చిక్కులో పడ్డాడు. ''నాకు పర్మిట్ అక్కర్లేదు''

''ఊరికే పేలకు'' అని పేట్‌రావు రెక్క పట్టుకుని ఈడ్చడం ప్రారంభించాడు డంకన్.

''నా అతిథిని అవమానపరచడానికి డంకన్‌కి ఏం అధికారం ఉంది?'' గర్జించాడు స్టూవర్ట్. ''పేట్‌రావ్‌కి క్షమాపణ చెప్పుకోండి''.

''నల్లతోలుకి క్షమాపణ చెప్పుకోవలసిన అగత్యం మాకులేదు''

పేట్‌రావ్ ఇంట్లో తెగతాగే డంకన్ హార్వీయేనా మాట్లాడుతున్నది! స్టూవర్ట్ తెల్లబోయాడు.

మిసెస్ స్టూవర్ట్ మొగుణ్ని లాంజ్‌లో కూర్చోబెట్టి హితబోధ చేసింది. ''నీకు డంకన్ ముఖ్యమా, పేట్ ముఖ్యమా? డంకన్‌కి మనవాళ్లలో ఉన్నస్థానం నీకు తెలుసుకదా. పమీలా కోసమైనా నువ్వీ మొండిపట్టు మానెయ్యాలి.''

పమీలా వాళ్ల కూతురు. డంకన్ మీద మనసు పెట్టుకుని కూచుంది. హార్వీకి పెద్ద ఉద్యోగం ఉంది. అందం ఉంది.

స్టూవర్ట్ గొంతు మూగపోయింది.


మిసెస్ స్టూవర్ట్ యువకుల దగ్గరకు వెళ్లి అంది. ''జాన్‌కి కొంచెం తలనొప్పిగా ఉంది. ఇక్కడికి రాలేనందుకు క్షమాపణ చెప్పమన్నాడు. మిమ్మల్ని మిగిలిన డ్రింక్ తాగేసి మజా చేసుకోమన్నాడు.''

వాళ్ల మొహాలు కళకళలాడాయి. తృప్తిగా గ్లాసులు నింపుకుని పాట ప్రారంభించారు. ''హి ఈజ్ ఎ జోలీ గుడ్ ఫెల్లో''.

బయట ఆవరణలో కారుకోసం వెతుక్కుంటున్న పేట్‌రావ్‌ని పాట కలత పెట్టింది. తన ఇంట్లో ఇవే గొంతుకలు, ఇదే పాట తన గురించి పాడాయి. నల్లటి జాగ్వార్ కారు చిక్కని చీకట్లో కనిపించలేదు. దానిమీద పడి చేతికి చిన్నగాయం తగిలించుకున్నాడు. ●

వదిలిన దేశం తాలూకు ఇంటి బెంగ

కొత్త బంగారం



ఇంతియాజ్ హుసేన్

అబ్బా చనిపోతూ, ఇంక తమది కాని పూర్వీకుల రూప్‌నగర్ ఇంటి తాళాలను జాకిర్ చేతుల్లో పెడుతూ, 'ఇవి నమ్మకానికి చిహ్నం. దాన్ని కాపాడుకో. మనం వదిలిన భూమి, మనపై చూపిన దయని జాపకం పెట్టుకో' అని చెప్తాడు.

ఏనాటి కిందటో, 'ప్రపంచం కొత్తగానూ, ఆకాశం స్వచ్ఛంగానూ ఉన్నప్పుడు, భూమి ఇంకా మలినపడనప్పుడు' కాల్పనిక ఊరైన రూప్‌నగర్ (ఇండియా)లో 'బస్తీ' నవల మొదలవుతుంది. కథకుడైన జాకిర్ పుట్టినది అక్కడే. అతని అబ్బాజాన్, అమ్మీ, చెల్లెల్నీ– పరిచయం చేస్తారు రచయిత ఇంతిజార్ హుసేన్. 'తాబేలు మీద నిలుచున్న ఏనుగు తలపైనే భూమి ఉంటుంది' అనే ఊరి పెద్దయిన భగత్‌జీ కథకీ, 'కాదు, చేప మీద నిలుచున్న ఆవుకొమ్ము మీద భూమి ఉంటుంది' అనే అబ్బా కథకీ మధ్యన ఏ వైరుధ్యతా కనపడని హిందూ–ముస్లిమ్‌లకున్న సామరస్యమైన వాతావరణంలో పెరుగుతాడు జాకిర్. దేశ విభజన సమయంలో, పాకిస్తాన్ తరలి వెళ్తుంది అతని కుటుంబం. జాకిర్ చిన్నప్పటి స్నేహితురాలైన సబీరా మాత్రం ఊర్లోనే ఉండిపోతుంది.

జాకిర్, లాహోర్లో ఏ రాజకీయ పార్టీతోనూ అనుబంధం పెట్టుకోకుండా, టీ తాగుతూ దేశ భవిష్యత్తు గురించి చర్చిస్తుంటాడు. హిస్టరీ ప్రొఫెసర్‌గా చేరతాడు. సబీరాను తలచుకుంటూ– గతం, వర్తమానం, కల, యథార్థతలకి మధ్య ఊగిసలాడుతూ– రూప్‌నగర్, లాహోర్ కలిసిపోతాయన్న ఆశ వదలడు. తన ఊరి వేపచెట్టుని తలచుకుంటూ, లాహోర్లో ఉన్న మర్రిచెట్టుకి అలవాటు పడతాడు. అయితే, 'పాత తరం మాత్రం తమ శరీరాలనైతే కొత్త దేశానికి తెచ్చుకుంది కానీ తమ ఆత్మలను తమ ఇళ్ళలోనే వదిలి వచ్చినది. మారుతున్న కాలానికి అనుగుణంగా మారలేకపోతూ, గతంలోనే బతుకుతున్నది'. కొత్త దేశానికి వెళ్ళినవారి ఆశలు, ఆశయాలు నవలంతటా ప్రతిధ్వనిస్తాయి.

నవల పాకిస్తాన్ దేశపు మొదటి పాతికేళ్ళనీ ఒక శరణార్థి దృష్టితో చూపిస్తుంది. లాహోర్ పట్టణానికి– చరిత్ర గురించి రూప్‌నగర్‌కు ఉన్నంత పట్టింపు ఉండదు. 'సూర్యుడు, తుపాన్లు, వర్షం, పక్షి రెట్టల వల్ల తప్ప– దేశంలో కలిగిన సంక్షోభం– ఊర్లో ఉన్న ఏ బిల్డింగుకీ గతంతో సంబంధం కల్పించదు. ఉన్న కేంద్రీకరణంతా రాజకీయాల మీదే'.

1971లో బంగ్లాదేశ్ ఏర్పడ్డాక, జాకిర్ ఆశావాదం మాయం అవుతుంది. 'రూప్‌నగర్ సాంప్రదాయాలు, లాహోర్ నాగరికత కూడా పోయాయి. మాట్లాడగలిగేవారు మౌనంగా ఉన్నప్పుడు బూట్లలేసులే మాట్లాడతాయి' అన్న తండ్రి మాటలు తలచుకుంటాడు. మొదటి రోజున లాహోర్‌లో గమ్యం లేకుండా తిరుగుతూ, 'సంతోషమైన రోజది. తాజా భూమి మీద, నిర్మలమైన ఆకాశం కింద నడిచాను. ఎంతో స్వచ్ఛంగా అనిపించింది' అనుకున్న జాకిర్ కొన్నేళ్ళ తరువాత, 'రోజులు మురికి పట్టాయి. ఆ రోజుల తేటదనం ఎక్కడ పోయిందో?' అని దిగులు పడి, 'నా అడుగులు ఏ భూమ్మీద పడుతున్నాయో!' అన్న అయోమయ స్థితికి చేరతాడు.

అబ్బా చనిపోతూ, ఇంక తమది కాని పూర్వీకుల రూప్‌నగర్ ఇంటి తాళాలను జాకిర్ చేతుల్లో పెడుతూ, 'ఇవి నమ్మకానికి చిహ్నం. దాన్ని కాపాడుకో. మనం వదిలిన భూమి, మనపై చూపిన దయని జాపకం పెట్టుకో. అదే నీ కర్తవ్యపాలన' అని చెప్తాడు. 'ఏ కథా అంతం అవదు. దానినుండి మరొక కొత్త కథ పుడుతుంది. అలా కథలు పుట్టుకొస్తూనే ఉంటాయి' అనే హుసేన్– గతంలోనే కూరుకుపోకుండా, దానినుండి ప్రేరణ పొందుతారు. ఏ దేశాన్నీ సమర్థించరు. పుస్తకంలో–విభజన వివరాలు కానీ విషాదం కానీ కనిపించదు. ఒక కాలక్రమాన్ని పాటించని నవలకి నిర్దిష్టమైన ముగింపేదీ ఉండదు. 1979లో రాసిన యీ పుస్తకాన్ని ఉర్దూ నుండి ఇంగ్లిష్‌లోకి అనువదించినది ఫ్రాన్సిస్ డబ్ల్యూ ప్రిట్చెట్.

◆ కృష్ణ వేణి

సాహిత్య మరమరాలు

ఉత్తమ లేఖకుడు

ఆంధ్రమహాభారతంలోని 18 పర్వాలలో 15 పర్వాలను రచించిన 'కవిబ్రహ్మ' తిక్కన సోమయాజికి గురునాథుడు లేఖకుడు. తిక్కన ఆశువుగా పద్యాలను చెప్తూవుంటే గురునాథుడు తాటాకుల మీద రాస్తూ ఉంటాడన్నమాట.



ఒక సందర్భంలో తొమ్మిదవ పర్వమైన శల్యపర్వ రచన జరుగుతున్నది. కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవుల పక్షాన ఉన్న వీరులు చాలామంది మరణించారు. దుర్యోధనుడు ఒంటరివాడైనాడు. ధృతరాష్ట్రుడికి సంజయుడు ఈ విషయాన్ని చెప్తూ– పలపలని మూకలో కాల్/ నిలువక గుర్రంబు డిగ్గి నీ కొడుకు గదా/ కలిత భుజుండై ఒక్కడు/ తొలగి చనియె'(నీ కుమారుడైన దుర్యోధనుడు పల్చబడిపోయిన సైన్యంలో నిలిచి ఉండలేక తన గుర్రం నుండి దిగి, గదను భుజాన పెట్టుకొని రణరంగం నుండి బయటకు వెళ్లిపోయాడు) అంటాడు.

ఇది కంద పద్యం. మూడు పాదాలు ఐపోయినై. నాలుగవ పాదంలో ఉండవలసిన ఐదు గణాలలో ఇంకా మూడు గణాలు రావలసి ఉన్నది. వాక్యం మాత్రం పూర్తి ఐంది కనుక 'ఏమి చెబుదామా?' అని ఆలోచిస్తూ– 'ఏమి చెప్పుదుం గురునాథా' అన్నాడు తిక్కన పరాకుగా. 'బాగుంది. తర్వాత పద్యం చెప్పండి' అన్నాడు గురునాథుడు. 'పద్యం పూర్తి కాకుండానే నా?' అన్నాడు తిక్కన. గురునాథుడు విస్తుబోయి 'కురునాథా (ఓ ధృతరాష్ట్ర మహారాజా)! ఏమి చెప్పుదున్ (ఏమని చెప్పేది?) అని మీరే చెప్పారు కదా! నాలుగవ పాదం పూర్తి ఐంది. యతి కూడా సరిపోయింది' అన్నాడు. లేఖకోత్తముడైన గురునాథుడి తెలివిని మెచ్చుకొంటూ తర్వాతి వచనాన్ని ప్రారంభించాడు తిక్కన.

కురునాథుడు సంధి వలన గురునాథుడు కావటమూ, అది లేఖకుడి పేరు కావటమూ ఈ సందర్భంలోని విశేషం!

◆ డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి

పదం పలికింది - పాట నిలిచింది

ఇన్ని ఏల సుక్కల్లో నిన్ను నేనెతికానే



ప్రియురాలిని చుక్కతో పోల్చడం మామూలే. కానీ విధివశాత్తూ ఆమెకే దూరమైపోతే ఇక నాయకుడు చేయగలిగేదేమిటి? వేలాది నక్షత్రాల్లో ఆమెను వెతుక్కోవడమే. నిరీక్షణ చిత్రంలోని ఈ పాట రాసినవారు ఆచార్య ఆత్రేయ. సంగీతం కూర్చినవారు ఇళయరాజా. పాడినవారు కె.జె.జేసుదాస్. 1982లో విడుదలైన ఈ చిత్రానికి దర్శకుడు బాలు మహేంద్ర. అర్చన, భానుచందర్ నటీనటులు.


సుక్కల్లే తోచావే ఎన్నెల్లే కాచావే
ఏడ బోయావే
ఇన్ని ఏల సుక్కల్లో నిన్ను నేనెతికానే

పూసిందే ఆ పూలమాను నీ దీపంలో
కాగిందే నా పేద గుండె నీ తాపంలో
ఊగానే నీ పాటలో ఉయ్యాలై
ఉన్నానే ఈనాటికీ నేస్తాన్నై
ఉన్నా ఉన్నాదొక దూరం
ఎన్నాళ్ళకు చేరం తీరందీ నేరం

తానాలే చేశాను నేను నీ స్నేహంలో
ప్రాణాలే దాచావు నీవు నా మోహంలో
ఆనాటి నీ కళ్ళలో నా కళ్ళే
ఈనాటి నా కళ్ళలో కన్నీళ్ళే
ఉందా కన్నీళ్లకు అర్థం
ఇన్నేళ్లుగా వ్యర్థం చట్టందే రాజ్యం

వైతాళికుల ప్రస్థానం ఎటు?

అభిప్రాయం



ముద్దుకృష్ణ

జాతీయ పోరాట స్ఫూర్తి సంకలనంగా తెలుగు సాహిత్యంలో నిలబడే బంగారు అవకాశం ఉండి కూడా, ఎదగని సంకలనం 'వైతాళికులు'.

ఒక సంకలనం చేసేటప్పుడు సంకలనకర్త దృక్పథం కీలకం. ఇప్పటికి పన్నెండు ముద్రణలు పొందిన వైతాళికులు, ముద్దుకృష్ణ సంకలనకర్తగా 1935లో వచ్చింది. ముగ్గురు స్త్రీలతో సహా, 29 మంది కవుల 191 కవితలున్నాయిందులో. సంకలిత కవితల కాలం 1910 నుంచి 1934 వరకూ ఇరవై నాలుగేళ్ళు. తొలి కవిత రాయప్రోలు సుబ్బారావుది, రెండోది గురజాడది, ఆఖరుది శ్రీశ్రీ 'మహా ప్రస్థానం'.

వైతాళికులు అంటే 'మేలుకొలుపువారు' అని నిఘంటు అర్థం. ఏ యుగానికి, ఏ శకానికి ఇది కవితల మేలుకొలుపు? ఆ వైతాళిక కవులెవరు అన్న పరిశీలనాయుత ప్రశ్నలతో ఈ 84 ఏళ్ల సంకలనాన్ని చూడాలి. ఏ సంకలనమైనా, సమకాలాన్ని ప్రతిఫలించే సమదర్శన ధర్మంతో ఉండటం తప్పనిసరి. అదే సంకలన స్థాయిని సూచిస్తుంది. 1910–35 దేశం మొత్తంలోనే గాంధీ నడుపుతున్న స్వాతంత్ర్యోద్యమ కాలం కనుక అప్పటి తెలుగు సంఘ స్థితిగతులకు అద్దంగా ఉందా ఈ సంకలనం? భిన్నభాషల్లో, ఉపఖండం నలుమూలలా జాతీయోద్యమ సాహిత్యం ముమ్మరంగా వస్తున్న రోజులవి. చంపారన్ రైతు సమస్యలలో గాంధీజీ విజయాలు, జలియన్ వాలా బాగ్, 1920లో తిలక్ కన్ను మూశాక, కాంగ్రెస్ పిలుపునిచ్చిన సహాయ నిరాకరణోద్యమం, తెలుగునాట కూడా బావుటా ఎగురవేస్తున్న ఒక దశాబ్దన్నర కాలపు కవిత్వ సృజన 1935 నాటికి సంకలనకర్త ఎదుట ఉన్నది. స్వాతంత్ర్య సముపార్జన, సాంఘిక సంస్కరణ లేదా పునర్నిర్మాణ శంఖారావాలు తెలుగు సమాజంలో ఘూర్ణిల్లుతున్నాయి.

1919లో మదరాసులో మొదలైన సాహితీసమితిలో తల్లావఝుల శివశంకర శాస్త్రి సభాపతి. దేవులపల్లి కృష్ణశాస్త్రి, చింతా దీక్షితులు, ముద్దుకృష్ణ, తదితరులు ఇందులో ఉన్నారు. ప్రజల్లో ఉన్న స్వాతంత్ర్యోద్యమ భావావేశాలు, కవుల్లో ఉన్న రచనాగరిమ బాగా తెలిసిన వీరు, వీరి మిత్రపుంగవులు ధార్మికావేశం, జాతి ఔన్నత్య భావనలు, భావకవిత్వోద్రేకం, ప్రణయభావ సంభరితం అయిన కవితలు రాసేవారు. ఆ కారణంగా ముద్దుకృష్ణ ఈ సంకలనం చేస్తున్నప్పుడు, ఇటువంటి కవితలన్నీ అందులో చేరాయి. 1935 – 36 దాకా ప్రోగ్రెసివ్ రైటర్స్ సభలు లండన్, లక్నోలలో జరుగలేదు. తెలుగునాట అభ్యుదయ రచయితల సంఘం 1942 దాకా ఏర్పడలేదు. అలా ఇరవయ్యో శతాబ్దంలో బహుశా తొలి తెలుగు కవితా సంకలనంగా 'వైతాళికులు' ఎంత విశాల బాధ్యత నిర్వర్తించింది? 1935లో విజయవాడ నుంచి తాను రాసిన మూడు పేజీల ముందుమాటలో, 'నవయుగం' అంటూ ఆఖరి మూడు పేరాలలో గాంధీ పేరు ఒక్కసారి ప్రస్తావించారు ముద్దుకృష్ణ. దేశ స్వేచ్ఛ కోసం తెలుగు కవులు రాసిన కవితలు సంకలనంలో ఒక్కటైనా ఉండవు. దువ్వూరి రామిరెడ్డి 'స్వాతంత్ర్య రథం' అసలు నేల మీదికే రాకుండా అసంతృప్తినే కలిగిస్తుంది.

జాతీయ పోరాట స్ఫూర్తి సంకలనంగా తెలుగు సాహిత్యంలో నిలబడే బంగారు అవకాశం ఉండి కూడా, ఎదగని సంకలనం 'వైతాళికులు'. అంటరానితనంపై పోరాటం, స్త్రీ విద్య, బ్రిటిష్ పాలన లోపాలను విమర్శించే కవితలు, పాటల కవులు మంగిపూడి వెంకట శర్మ, గుర్రం జాషువా, శ్రీరంగం నారాయణబాబు ఎవరూ కనిపించరు. వేసిన కవుల కవితలే వేస్తూ, ఏకంగా కృష్ణశాస్త్రి ఇరవై కవితలు వేశారు. భారత స్వాతంత్ర్య పోరాటాన్నే పక్కన పెట్టిన అసంగత సంకలనం ఇది.

'గాంధీజీ 150' దేశదేశాల్లో జరుగుతున్న సందర్భంలో ఉన్నాము. ఇందులోని 191 కవితల్లో, గరిమెళ్ళ 'మాకొద్దీ తెల్లదొరతనం', బసవరాజు అప్పారావు 'కొల్లాయిగట్టితేనేమి', 1930 ఉప్పు సత్యాగ్రహం తరువాతి త్రిపురనేని రామస్వామి గీతం 'వీరగంధము తెచ్చినారము' వేటికీ ఇందులో చోటు లేదు.

తన భావ కవిత్వ ఖండికలు వేసి, ఉప్పు సత్యాగ్రహం సమయంలో బసవరాజు అప్పారావు రాసిన 'స్వరాజ్యలక్ష్మి పెండ్లి' (సంద్రమే పెళ్లిల్లంట, సదస్యులే దేవతలంట, ఉప్పే తలంబ్రాలంట స్వరాజ్య లక్ష్మి పెండ్లికి) కూడా విడిచిపెట్టారు. ఇలా 'వైతాళికులు' నవయుగాన్ని పట్టించుకోలేదు. కేవలం భావ కవిత్వ ఉదాహరణగా మిగిలిపోయింది. 'వైతాళికులు' అని పేరు పెట్టుకున్నా, ముందుమాటలో సాహిత్యంలో నవయుగ ప్రస్తావనలు చేయకున్నా, ముద్దుకృష్ణకు ఈ అపఖ్యాతి మిగిలేది కాదు.

◆ రామతీర్థ

రారండోయ్

■ సాహిత్య అకాడెమి 'దక్షిణ భారత కవిత్వ ఉత్సవం' ఫిబ్రవరి 10న ఉదయం 11:30కు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. స్వాగతం: కె.శ్రీనివాసరావు. కీలకోపన్యాసం: కె.శివారెడ్డి.

■ చైతన్య ప్రకాశ్ సంస్మరణ సభ ఫిబ్రవరి 5న సా. 6 గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. కాశీం, కె.పి.అశోక్ కుమార్, వి.శంకర్ వక్తలు. అధ్యక్షత: నాళేశ్వరం శంకరం. నిర్వహణ: తెలంగాణ రచయితల సంఘం.

■ కవిసమ్రాట్ నోరి నరసింహ శాస్త్రి 120వ జయంతి ఉత్సవం ఫిబ్రవరి 6న సాయంత్రం 6 గంటలకు త్యాగరాయ గానసభ, హైదరాబాద్‌లో జరగనుంది. నోరి పురస్కారాన్ని ఆచార్య కొల్లూరు అవతార శర్మకూ, నోరి యువరచయిత పురస్కారాన్ని రాంభట్ల వేంకటరాయశర్మకూ ప్రదానం చేస్తారు. ముఖ్య అతిథి: జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు.

■ కొండపల్లి నీహారిణి రెండు పుస్తకాలు 'సృజన రంజని', 'రాచిప్ప'ల ఆవిష్కరణ ఫిబ్రవరి 7న ఉదయం 10:30కు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరగనుంది. ఆవిష్కర్తలు: నందిని సిధారెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి. నిర్వహణ: తెలంగాణ రచయితల సంఘం.

■ తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా కావ్య పరిమళం పరంపరలో భాగంగా ఫిబ్రవరి 8న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో కాళోజీ నారాయణరావు 'నా గొడవ' పై డాక్టర్ తూర్పు మల్లారెడ్డి ప్రసంగిస్తారు.

■ ఎన్.శైలజ చేసిన ఖలీల్ జిబ్రాన్ అనువాద కవిత్వం ఆవిష్కరణ ఫిబ్రవరి 8న సాయంత్రం 6 గంటలకు కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడలో జరగనుంది.

■ జి.ఎస్.సాయిబాబా అండాసెల్ కవిత్వం 'నేను చావును నిరాకరిస్తున్నాను' ఆవిష్కరణ ఫిబ్రవరి 9, 10ల్లో నల్గొండలో జరగనున్న విరసం సాహిత్య పాఠశాలలో జరగనుంది. ప్రచురణ: విరసం.

■ అరుణ్ సాగర్ సంస్మరణ సభ (3వ వర్ధంతి) ఫిబ్రవరి 10న ఉదయం 10 గంటలకు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, విజయవాడలో జరగనుంది. అధ్యక్షుడు: ఖాదర్ మొహియుద్దీన్. వక్తలు: చినుకు రాజగోపాల్, కోయి కోటేశ్వరరావు. అరుణ్ సాగర్ జీవన సాఫల్య సాహిత్య పురస్కారాన్ని జి.లక్ష్మీనరసయ్యకు ప్రదానం చేస్తారు. నిర్వహణ: సాగర్ మిత్రులు, సాహితీ మిత్రులు.

■ మెట్టా నాగేశ్వరరావు తొలి కవితా సంపుటి 'మనిషాక పద్యం' ఆవిష్కరణ ఫిబ్రవరి 10న ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బయ్యనగూడెం, పశ్చిమ గోదావరి జిల్లాలో జరగనుంది. అతిథి: కొప్పర్తి. 'ఊరూరా కవిసంగమం–9'లో భాగంగా జి.లక్ష్మీనరసయ్య ప్రసంగిస్తారు.



నాలుగో బ్యూటీ
– సినిమా పేజీలో



క్యాన్సర్ కాటుకు
కొత్త చికిత్సల దెబ్బ
– లోపలి పేజీలో



నేనున్నాను..
నేనుంటాను
– లోపలి పేజీలో

గర్ల్ చైల్డ్

ఒక పక్షి పూసింది

ఎక్కడైనా ఏ ఆడపిల్లయినా పక్షిలా ముక్కున గోల్డ్ మెడల్ కరుచుకొచ్చేస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది, ఇదెలా సాధ్యం అయిందని! ఎందుకవదూ.. ఎదుగుదల సృష్టి సహజగుణం అయినప్పుడు? ఎదుగుదలను పైకి కనిపించేలా చెయ్యడం కూడా ప్రకృతి గుణమే. పైకి కనబడుతోందే దేవుడా, పాడుకళ్లను పడనివ్వకూడదని రెక్కల్ని దాచేస్తే ఎలా?! ఎదుగుతున్న ఆడపిల్ల ఉన్న ఇల్లు ధైర్యంగా ఉండొద్దూ!

● మాధవ్ శింగరాజు

ఆడపిల్ల ఎదిగితే పువ్వు పూసినట్లుగా ఉంటుంది. మగపిల్లాడు ఎదిగితే పక్షి ఎగిరినట్లుగా ఉంటుంది. పువ్వు పూసినట్లుగా ఉండాలని ఆడపిల్ల, పక్షి ఎగిరినట్లుగా ఉండాలని మగపిల్లాడు నైటవుట్స్ చేసేమీ ఎదగరు. వాళ్ల మానాన వాళ్లు మెల్లిగా ఎదుగుతారు. ఇంట్లో పెట్టిందేదో ఇంత తిని, రోజూ స్కూల్‌కి వెళ్లొస్తూ, బాగా చదివి పరీక్షలు రాస్తూ, ఉద్యోగాలకు ప్రిపేర్ అయి ఇంటర్వ్యూలు నెగ్గుకొస్తూ.. ఓ రోజెప్పుడో దీపాలు పెట్టే వేళకు అకస్మాత్తుగా మన ఇంట్లోకి స్వీట్ బాక్సుతో వచ్చేస్తారు.. 'ఆంటీ, నాకు యు.ఎస్.ఫర్మ్‌లో ఓవర్‌సీస్ ఎగ్జిక్యూటివ్‌గా జాబ్ వచ్చింది. నెలలో సగం రోజులు ఫ్లయిట్ జర్నీలే.. జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ..' అని అమ్మాయి చెబుతుంది! 'అంకుల్, ఇక్కడే సిటీ బ్రాంచ్‌లో నాకు ప్రొబేషనరీ ఆఫీసర్‌గా పోస్టింగ్ వచ్చింది. నాన్న కోరుకున్నట్లే టెన్ టు ఫైవ్ బ్యాంక్ జాబ్' అని అబ్బాయి చెబుతాడు. అప్పుడు కూడా ఆ ఎదిగిన అమ్మాయి 'ఒక పువ్వు పూసినట్లుగా'నే, ఆ ఎదిగిన అబ్బాయి 'ఒక పక్షి ఎగరబోతున్నట్లుగా'నే అనిపిస్తారు



ఆకాశమూ ఒక హద్దేనా!

తప్పు.. అమ్మాయి చేయబోయేది జర్నీల జాబ్ కనుక ఆమెను 'ఎదిగిన పక్షి'లా, అబ్బాయికి వచ్చింది ఎటూ కదలకుండా కూర్చొని చేసే ఉద్యోగం కనుక అతడిని 'ఒదిగిన పువ్వు'లా చూడలేం. ఆడపిల్లకు అంత పెద్ద బలమైన, మెరిసే అందమైన, చక్కటి డిజైన్‌లు ఉన్న ఖండాంతర రెక్కలు ఉన్నప్పటికీ ఆమె పక్షి కాలేదు, పువ్వే! ఎందుకు పువ్వంటే, పువ్వులా పెంచుకుంటాం కనుక.

మగపిల్లాడు గాలికి ఎదిగితే, ఆడపిల్ల గాలిలోకి పరిమళాలు వెదజల్లుతూ ఎదుగుతుంది. అక్కడొస్తుంది భయం. పువ్వులా పెంచడం ఆ భయానికే. మనమ్మాయి ఎదగాలి. కానీ ఇంట్లోనే ఉండి ఎదగాలి! బయటి వాటర్ బాటిల్స్ తాగకూడదు. బయటి గాలి పీల్చకూడదు. బయటి సూర్యరశ్మి తగలకూడదు. కుండీలోని పువ్వు ఎంతవరకు ఎదుగుతుంది? మహా అయితే మెట్టినింటి గోడ మీది వరకు. అక్కడా మళ్లీ ఆ కుండీలోనే. అందుకే ఎక్కడో ఏ మానుకో పుట్టి, స్వేచ్ఛగా ఎదిగి, పక్షిలా ఎగిరిన పువ్వును చూస్తే ప్రపంచానికింత విడ్డూరం! సైకిల్ ఎవరైనా నడపగలిగిందే. ఆడపిల్ల నడిపితే సర్‌ప్రైజింగ్. ర్యాంక్ ఎవరికైనా వచ్చేదే. ఆడపిల్లకు వస్తే అమేజింగ్. ఎవరెస్టు ఎత్తు ఎవరికైనా ఒకటే. ఆడపిల్ల ఎక్కితే ఎస్టానిషింగ్. ఆడపిల్ల సాధించిన ప్రతి విజయంలోనూ మనమిలా ఎందుకు 'ఆ' అని నోరు తెరుస్తామంటే.. నడిచే దారిలో నడవనివ్వకుండా, పరుగెత్తే దారిలో పరుగెత్తనివ్వకుండా, పడిలేచే దారిలో పడిలేవనివ్వకుండా ఆడపిల్లల్ని అరచేతుల్లో పెట్టుకుని మనమే నడుస్తూ, మనమే పరుగులు తీస్తూ, మనమే పడిలేస్తూ ఉంటాం కదా..

అందుకు. ఎక్కడైనా ఏ ఆడపిల్లయినా పక్షిలా ముక్కున గోల్డ్‌మెడల్ కరుచుకొచ్చేస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది, ఇదెలా సాధ్యం అయిందని! ఎందుకవదూ.. ఎదుగుదల సృష్టి సహజగుణం అయినప్పుడు? ఎదుగుదలను పైకి కనిపించేలా చెయ్యడం కూడా ప్రకృతి గుణమే. ఆడపిల్ల అచీవ్‌మెంట్స్ మార్కుల్లో, న్యూయార్కుల్లో మాత్రమే పైకి కనిపించి, ఆమె ఫిజికల్ గ్రోత్ ఎప్పుడూ ఆ పన్నెండేళ్ల లోపు స్కర్ట్ లోపలే కనిపించకుండా ఉండిపోవాలని కోరుకుంటే.. 'ఓకే పేరెంట్స్.. అలాగే చేద్దాం.. మీ అమ్మాయికొక మంచి వరుడు దొరికే వరకు' అంటుందా ప్రకృతి మన వాకిట్లోకి వచ్చి. అనదు. అనకపోగా, మన అనుమతి లేకుండా ఇంటి లోపలికి వచ్చి.. బెడ్ మీద చుట్టూ బుక్స్‌తో బోర్లా పడుకుని కాళ్లు పైకీ కిందికీ ఆడిస్తూ హోమ్‌వర్క్ చేసుకుంటున్న మన అమ్మాయి బుగ్గలు పుణికి, ఆమె పసి పాదాలకు, అమాయకపు చుబుకానికి ఇంత పసుపు, గంధం రాసి వెళ్తుంది! ఏం చేస్తాం? 'హనీ, సరిగ్గా కూర్చో నాన్నా' అంటాం. పిల్ల వినకపోతుంటే వెళ్లి, సరి చేసి కూర్చొబెడతాం. 'ఇలా ఉంటేనే నాకు కంఫర్ట్‌గా ఉంటుంది మమ్మీ' అంటున్నా వినకుండా! హింస ఇది ఆడపిల్లకు. హింసే! ఒంటిని టచ్ చెయ్యడం కన్న పెద్ద హింస ఒంటిని స్వేచ్ఛగా ఎదగనివ్వకపోవడం.

ఇంట్లో ఆడపిల్ల ఎదుగుతుంటే భయం ఏ స్థాయిలో ఉంటుందో చూడండి. లండన్‌లోని 'గార్డియన్' పత్రికా కార్యాలయానికి ఇటీవల కొంతకాలంగా ఫోన్‌లు వస్తున్నాయి. 'మా చుట్టుపక్కల ఇళ్లలో బ్రెస్ట్ ఐరనింగ్ (గుండ్రాయిని వెచ్చబరిచి ఛాతీని అదమడం) జరుగుతోంది, ఎవరికి కంప్లైంట్ చెయ్యాలి? అని! ఆఫ్రికా దేశాల్లోని వెనుకబడిన ప్రాంతాల్లో.. ఎదిగే ఆడపిల్లలపై మగపిల్లల దృష్టి పడకుండా ఉండేందుకు అమ్మలు, అమ్మమ్మలు, పెద్దమ్మలు, పిన్నమ్మలు బ్రెస్ట్ ఐరనింగ్ చేస్తారట. లండన్‌లోని ఆఫ్రికన్ వలస కుటుంబాల్లో అలా జరుగుతోందన్న విషయం 'గార్డియన్' పత్రిక వార్తా కథనంతో తెలుసుకున్న యూఎన్‌ఓ గతవారం బ్రిటన్ ప్రభుత్వాన్ని వివరణ కోరింది. 'ఈ దురాచారాన్ని రూపుమాపేందుకు మేము నిబద్ధతతో ఉన్నాము' అని బ్రిటన్ కూడా వెంటనే సంజాయిషీ ఇచ్చింది. పెద్ద విషయం ఇది.

ఎదిగిన దేశాలకు మాత్రమే తల్లిదండ్రుల భయాందోళనల వల్ల బాలికల హక్కులకు భంగం కలగడాన్ని పెద్ద విషయంగా తీసుకోగల శక్తి ఉంటుంది. 'అగ్రదేశం' కన్నా పెద్దది 'ఎదిగిన దేశం'. కొన్ని ఆయుధాలు, కొంత అహంకారం ఉంటే చాలు అగ్రదేశం అయిపోవచ్చు. ఆడపిల్లల్ని హాయిగా ఎదగనివ్వడానికి, స్వేచ్ఛగా ఎగరనివ్వడానికి రోజుకు పదిసార్లు దేవుడి గదిలోకి వెళ్లి దండం పెట్టుకొచ్చే తల్లిదండ్రులకు ధైర్యాన్నిచ్చి, 'మీ అమ్మాయిని నిశ్చింతగా బయటికి పంపండి, క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యత మాది' అని భరోసా ఇవ్వగలిగిన దేశం మాత్రమే 'ఎదిగిన దేశం' అవుతుంది. 'బ్రెస్ట్ ఐరనింగ్' అనే విపరీతం గురించి మీకివాళే మొదటిసారిగా తెలిసి, మీరింకా తేరుకోలేకపోతుంటే.. కాసేపటి తర్వాతనైనా.. అధునాతన తెగల్లోని మనం రోజూ చేస్తున్న ఆడపిల్లల ఆశల ఐరనింగ్, ఆశయాల ఐరనింగ్, వారి కలల ఐరనింగ్.. ఇవన్నీ 'బ్రెస్ట్ ఐరనింగ్' కంటే ఏం తక్కువ అని మీకు అనిపిస్తే కనుక మీరొక ఎదుగుతున్న పేరెంట్ అనే. మీ వల్ల ఈ దేశం ఎదగబోతున్నదనే. ఎదుగుతున్న ఇంట్లో, ఎదుగుతున్న దేశంలో ఆడపిల్ల ఎదిగితే పువ్వు పూసినట్లుగా మాత్రమే ఉండదు. పక్షి ఎగిరినట్లుగా కూడా ఉంటుంది. పువ్వు తక్కువ, పక్షి ఎక్కువ అని కాదు. పక్షిలా ఎగరాలని ఉన్నప్పుడు పువ్వులా ఎందుకు ఉండిపోవాలీ అని! ●

క్లైమేట్‌కు ఏమొచ్చిందో కరుణించలేదు.
పండిన పంటైనా గింజను విదిల్చలేదు.
అస్సాం గ్రామాలన్నీ అలమటించాయి.
అప్పుడొచ్చారు.. 'నీడ్స్‌' సంస్థ ప్రతినిధులు.
మగ్గాలను బయటికి తీయించారు.
మహిళల చేతికి ఇకపై పగ్గాలు ఇచ్చారు.
ఇది సక్సెస్‌ స్టోరీ మాత్రమే కాదు.
కష్టాల్లో ఫాలో అవ్వాల్సిన దారి కూడా.

మగ్గం మళ్లీ చేతికొచ్చింది



అస్సాంలోని ఒక కుగ్రామంలో సంప్రదాయ చేనేతకు జీవం పోస్తున్న గృహిణి

ప్రకృతి మనిషికి పరీక్షలు పెడుతూనే ఉంటుంది. పయనిస్తున్న దారిలో లెక్కలేనన్ని అవాంతరాలను సృష్టిస్తూనే ఉంటుంది. ఆ పరీక్షను ఎదుర్కోలేక మరో మార్గంలో అడుగు పెడితే అక్కడ మరో రకమైన పరీక్ష ఎదురవుతుంది. అయితే ఎన్ని పరీక్షలను పెట్టినా జీవితం మీద ఆశ చావనివ్వదు ప్రకృతి. 'ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని ముందుకు వెళ్తే మంచి భవిష్యత్తు ఉంటుంది' అనే ఆశను చిగురింపచేస్తూనే ఉంటుంది. కొంతకాలం ముందుకు నడిపిస్తుంది, మరికొంత కాలం తర్వాత 'వచ్చిన దారిలోనే వెనక్కు వెళ్లు' అని యూటర్న్ చూపిస్తుంది. ప్రకృతి మనిషిని మంచి వైపు నడిపిస్తున్న టూ టర్న్. ఇప్పుడు అస్సాం మహిళల చేత అదే యూటర్న్.. పునఃయానం చేయిస్తోంది. అలా వారికి.. చేతుల్లో దాగి ఉన్న కళను ప్రదర్శించే అవకాశం మళ్లీ దొరికింది. అన్నం పెట్టడం లేదని అటకెక్కించిన చేతి మగ్గాల దుమ్ము దులిపే అవకాశం వచ్చింది.



మార్కెటింగ్‌కు సిద్ధం అవుతున్న చేనేతలు



మగ్గాలను కిందికి దింపక ముందు వరకు అడ్డా మీద కూలీలుగా సోనోవాల్ (అస్సాం) గ్రామ మహిళలు

వాళ్లు వలసకు.. వీళ్లు కూలికీ

అస్సాం రాష్ట్రంలో తిన్‌సుఖియా జిల్లా. చేనేత కుటుంబాలు లెక్కకు మించి ఉన్నాయి. మగవాళ్లు, ఆడవాళ్లందరికీ చేనేత పని వచ్చి ఉంటుంది. చేతిలో పని ఉన్నా చేతినిండా పని దొరకని స్థితి రాజ్యమేలింది కొన్నేళ్లు. సంప్రదాయ వృత్తినే నమ్ముకుంటే ఇంట్లో అందరి కంచాలు నిండే పరిస్థితి కరవైంది. అప్పుడు మగ్గాలను పక్కన పెట్టి పొలం బాట పట్టారు వాళ్లంతా. దాదాపుగా అందరికీ ఎకరమో, అరెకరమో పొలం ఉండడంతో మగవాళ్లు పొలం పనులు చేసుకుంటూ, ఆడవాళ్లు ఇంటి పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీశారు. అది సరిపోదని తెలియడానికి ఎంతో కాలం పట్టలేదు. దాంతో మగవాళ్లు పనుల కోసం రాష్ట్రం వదిలి పొరుగు రాష్ట్రాలకు వెళ్లారు. సెక్యూరిటీ గార్డులుగా, దినసరి కూలీలుగా పనులు వెతుక్కున్నారు.

పొలం లేని ఇళ్లలో ఆడవాళ్లు పొద్దున్నే లేచి పనులు చేసుకుని ఊరి అడ్డ మీద చేరితే పొలం పనులకు కూలీలు అవసరమైన భూస్వాములు పనికి తీసుకుపోయేవాళ్లు. పని దొరికిన రోజు రోజుకు రెండు వందల రూపాయలు చేతిలో పడతాయి. పట్టెడన్నం పళ్లెంలో పడుతుంది. అంతో ఇంతో పొలం ఉండి, భర్తలు పొలాన్ని నమ్ముకోలేక రాష్ట్రాలు పట్టి పోయిన ఇళ్లలోని ఆడవాళ్లు స్వయంగా నారు పోసి నీరు పెట్టి సేద్యం చేశారు. ఆ ప్రయత్నమూ ఎక్కువ కాలం సవ్యంగా సాగలేదు. ఒక్కో ఏడాది వానచుక్క కరుణించదు. దగ్గర్లోనే మేఘాలయ రాష్ట్రం ఉన్నప్పటికీ అస్సాం జిల్లాల్లో వర్షాలు సరిగ్గా కురిసేవి కాదు. మరో ఏడాది అకాల వర్షం, అతివృష్టితో పంటలు కొట్టుకుపోయేవి.

పండిన పంటలోనూ గింజ లేదు!

అతివృష్టి, అనావృష్టి.. ఈ రెండూ ప్రకృతి ఎప్పుడూ రైతుకు పెట్టే పరీక్షలే. అస్సాం వాళ్లకు ఈ రెండింటితో మరో పరీక్షను కూడా పెట్టింది. ఏడాదంతా కష్టపడి, ఈ ఏడాది పంట చేతికి వస్తుందనే కొండంత ఆశతో వరి కంకిని కంటినిండుగా చూసుకున్న దులుమోని సేనాపతి అనే ఓ మహిళకు ఎందుకో సందేహం వచ్చింది. గింజ బరువుకు భారంగా తలవాల్చాల్సిన వరికంకులు నిటారుగా ఉంటున్నాయి. చేత్తో తాకి చూస్తే లోపల బియ్యపు గింజ ఉన్న ఆనవాలు పెద్దగా దొరకడం లేదు. చేతిలోకి తీసుకుని నలిచి చూస్తే.. నిజమే వడ్లలో ఎక్కువ భాగం తాలు గింజలే. పంటకోసి, నూర్చి, తూర్పార బోస్తే గట్టి గింజల కంటే తాలు గింజలే ఎక్కువ తేలాయి. ఆమె ఉంటున్న ఒక్క సోనోవాల్ గ్రామంలోనే కాదు. అస్సాంలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి. వడ్లగింజలో బియ్యపు గింజలు మాయం కావడానికి కారణం వాతావరణ మార్పులేనని ప్రభుత్వం నిర్వహించిన అధ్యయనంలో తేలింది. పన్నెండు హిమాలయ రాష్ట్రాల్లో వాతావరణ మార్పులకు తీవ్రంగా లోనవుతున్నది అస్సాం రాష్ట్రమేనని నిర్ధారించేశారు అధ్యయనకారులు. ఉష్ణోగ్రతలు పరిమితికి మించి పెరిగిపోతే ఫలదీకరణ సజావుగా జరగదని, ధాన్యం గింజకట్టదని ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చెప్పింది. ఇక దారేది? సోనోవాల్ గ్రామంలో ఉన్న ఎనభై కుటుంబాల ఆడవాళ్లు ఎనిమిది కిలోమీటర్లు నడిచి పొరుగు రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్‌కి పొలం పనులకు వెళ్లడం మొదలు పెట్టారు. చుట్టుపక్కల పాతిక గ్రామాల మహిళలకు అదే ఉపాధి మార్గమైంది.



పట్టుగూళ్ల నుంచి దారం తీసే ప్రక్రియ

మగ్గాలు.. సంపాదన పగ్గాలు

వ్యవసాయానికి సెలవిచ్చి, చేతివృత్తులకు ప్రోత్సాహకాలు మొదలు పెట్టింది ప్రభుత్వం. స్టేట్ సెరికల్చర్ (పట్టుపురుగుల పెంపకం) డిపార్ట్‌మెంట్, స్థానిక స్వచ్ఛందసంస్థ నీడ్స్ (నార్త్ ఈస్ట్ అఫెక్టెడ్ ఏరియా డెవలప్‌మెంట్ సొసైటీ) కలిసి వాతావరణ మార్పులకు గురైన ప్రాంతాలను దత్తత తీసుకున్నాయి. ప్రతి ఇంటికీ మగ్గం ఉంది. పట్టు పురుగులను పెంచడం, పట్టు దారం తీయడం నేర్చుకున్నారు ఆ మహిళలు. మగ్గాలను మెరుగు పరుచుకుని, పట్టు వస్త్రాలు నేయడంలో మెళకువలు ఒంటబట్టించుకున్నారు. 'చేనేత మా రక్తంలోనే ఉంది. కొత్త డిజైన్‌ల కోసం నీడ్స్ ఇస్తున్న సూచనలతో ఇట్టే అల్లుకుపోతున్నాం' అంటోంది అరుణా సోన్‌వాల్ అనే గృహిణి.


ఈ తరం మహిళలకు పట్టుబడని అస్సాం సంప్రదాయ పూల డిజైన్‌లను గత తరం దగ్గర నేర్చుకుంటున్నారు. పదిహేను రోజుల పాటు పని చేస్తే రెండున్నర వేల రూపాయలు మిగులుతున్నాయని చెబుతున్నారా మహిళలు. ఇరవై ఎనిమిది గ్రామాల నుంచి రెండువేల ఐదొందల మంది మహిళలు ఉపాధి పొందుతున్నారిప్పుడు. ప్రకృతి ఒకదారి మూసుకుపోయినప్పుడు మరోదారిని తెరుస్తుంది. ఆ దారి ఏమిటో అన్వేషించడంలోనే మనిషి మనుగడ, విజయం దాగి ఉన్నాయి.

(సౌజన్యం : థాంప్సన్ రాయిటర్స్ ఫౌండేషన్)

– మంజీర

బ్యూటిప్స్

ఒక్కోసారి బ్యూటీపార్లర్‌కి వెళ్లే టైమ్ దొరకనప్పుడు ఇంట్లో లభించే సాధనాలతోనే తేలిగ్గా పది నిమిషాల్లో తాజాగా కనిపించవచ్చు ఇలా...



- ఒక టొమాటోని తీసుకుని గుండ్రగా కట్ చేసుకోవాలి. ముఖాన్ని శుభ్రం చేసుకుని తరిగిన టొమాటో ముక్కలతో ముఖాన్నంతా వలయాకారంలో సుతిమెత్తగా అయిదు నిమిషాల పాటు మర్దనా చేయాలి.
- తరవాత ఒక టీ స్పూన్ నారింజ రసంలో కొద్దిగా పాలపొడి, చిటికెడు గంధం, రెండు మూడు చుక్కల తేనె ఒకదారి తరవాత ఒకటి వేసి కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 10 నిమిషాల తరవాత కడిగేస్తే తాజాగా నిగనిగలాడే అందం మీ సొంతం!





సౌందర్య పోషణలో నిమ్మ రసం ప్రత్యేకత ఎంతో ఉంది. ముఖంపై బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్‌తో చర్మ రంధ్రాలు మూసుకుపోయినా, మొటిమల నివారణకయినా నిమ్మరసం చక్కని సౌందర్య సాధనంగా ఉపయోగపడుతుంది.

- టీ స్పూన్ నిమ్మరసంలో కాటన్ ముంచి ముఖానికంతా అప్లై చేసి, 10 నిమిషాల తరువాత చన్నీటితో కడిగేయాలి.
- నిమ్మరసంలో రెండు మూడు చుక్కల తేనె కలిపి ముఖానికి పట్టించి 15 నిమిషాల తరువాత కడిగేస్తే ముఖం తాజాగా నిగనిగలాడుతుంది.

'యువ'సాయం

పొలం బడిలో పంట పాఠాలు

నేర్పుతూ.. నేర్చుకుంటూ..

వీళ్లంతా విద్యార్థినులు. కొందరు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినవారు. మరి కొందరు ఉద్యోగస్తుల, వ్యాపారుల కుటుంబాల పిల్లలు. అందరిలాగా ఇంటర్ , ఎంసెట్ అయ్యాక.. కార్పొరేట్ ఉద్యోగాలను, ఇంజనీరింగ్, మెడికల్ వంటి ఏ ఇతర కోర్సులనూ వారు ఎంచుకోలేదు. దేశంలో అందరికి అన్నం పెట్టే రైతులకు తోడుగా, చేదోడుగా ఉండాలనుకుని వ్యవసాయ విద్యలో చేరారు. ప్రాక్టికల్స్‌లో భాగంగా కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి దాదాపు నలభై మంది ఇటీవల నెల్లూరు జిల్లాకు వచ్చి, గ్రామాలలోనే బస చేస్తూ క్షేత్రస్థాయిలో రైతన్నలతో కలిసి పని చేశారు. చదివిన పాఠాలను పొలం పనుల్లోకి అప్లయ్ చేశారు. రైతుల అనుభవాలను పాఠంగా నేర్చుకున్నారు. ఇలా ఆరు నెలల పాటు పొలం బాట పట్టి వెళ్లిన విద్యార్థినులపై ఉత్సాహంపై ప్రత్యేక కథనం.

వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతికత. ఆధునిక విధానాలు, వంగడాలు, నీటి వినియోగం, సస్య రక్షణ లాంటి అంశాలలో రైతులకు అవగాహన కల్పించేందుకు వివిధ శాఖలు ఎంతోకాలంగా కృషి చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. వాతావరణానికి అనుగుణంగా పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పురుగు మందుల వినియోగం లాంటి అంశాలలో అవసరమైన మేర పరిజ్ఞానం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ సేద్యంలో తాము కూడా తోడుగా ఉండేందుకు వ్యవసాయ విద్యార్థినులు తమ వంతు పాత్రను పోషిస్తున్నారు.







గ్రామాలలో వ్యవసాయం గురించి తెలుసుకునేందుకు వచ్చి, వ్యవసాయ పనులు చేస్తున్న విద్యార్థినులు

ప్రాక్టికల్‌గా నేర్చుకున్నాం



తేజశ్వని

మా నాన్న టీచర్. కాని ఆయనకు వ్యవసాయం అంటే ఇష్టం. నాన్నకు ఇంట్రెస్ట్ అని నేను ఈ రంగంలోకి వచ్చాను. ఆరు నెలలు అక్కడ ఉండి, వ్యవసాయంలో మెళకువలను ప్రాక్టికల్‌గా నేర్చుకున్నాం. ప్రధానంగా ఆర్గానిక్ ఫుడ్‌పై ఫీల్డ్ రీసెర్చ్ చేశాం.

– డి. తేజస్విని, గోరంట్ల, అనంతపురం జిల్లా

ఎన్నో విషయాలు తెలిశాయి



మన్విత

పల్లెల్లో ఉండి పరిశీలించడం వల్ల క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించగలిగాం. రైతులతో మమేకం కావడం వల్ల వ్యవసాయంలో కొత్త పద్ధతులను తెలుసుకోగలిగాం.

– పి. మన్విత, పోరుమామిళ్ల, కడప జిల్లా

సంతోషంగా అనిపించింది



అనసూయ

మొదటి నుంచి మాది వ్యవసాయ కుటుంబం. నాన్న కూడా వ్యవసాయం చేస్తున్నారు. నగరంలో విద్యను అభ్యసించినా... వ్యవసాయంపై ఉన్న మక్కువతో ఈ రంగాన్ని ఎంచుకున్నాను. ఇందులో ఉన్నంత సంతోషం మరెక్కడా ఉండదని అనిపించింది.

– కె. అనసూయ, హిందూపురం, అనంతపురం జిల్లా

పొలమే పెద్ద పుస్తకం



దివ్య

మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి, కాని నాకు రైతన్నలా పనిచేయాలని, వ్యవసాయంలో కొత్త విషయాలను తెలుసుకోవాలని ఆసక్తి. పుస్తకాలలో చదివే దానికి , ప్రాక్టికల్‌గా చేసే దానికి చాలా తేడా ఉంది. పొలంలో ప్రత్యక్షంగా పరిశీలించి పంటల సాగుబడి తెలుసుకోవడం ఎంతో బాగుంది.

– కె దివ్య, నంద్యాల, కర్నూలు జిల్లా

వ్యవసాయంలో డిగ్రీ చేస్తున్న విద్యార్థినులు తమ కోర్సులో భాగంగా ఆరు నెలల పాటు పల్లెటూళ్లో ఉంటూ.. రైతులతో మమేకమై వారి పొలాలలో పంటను వేయడం దగ్గర నుంచి దిగుబడి వరకూ చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి లోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ (అగ్రి) విద్యార్థినులు పొలం పనులు చేపడుతున్నారు.

వ్యవసాయ కోర్సులో భాగంగా ఇటీవలే అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన విద్యార్థినులు జిల్లాలోని వివిధ మండలాలకు వచ్చి రైతులతో కలిసి మెలిసి వ్యవసాయదారులుగా మారారు. ఆయా గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించారు. పంట కోసం నార్లు వేశారు. అనంతరం పంట ఎదుగుదలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులకు సలహాలు ఇవ్వడంతో పాటు మార్గదర్శనం చేసేందుకు ఎంతో సహకారం అందిస్తున్నారు. వీరికి డాట్ సెంటర్, వ్యవసాయ పరిశోధన, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు తమ వంతు తోడ్పాటును ఇస్తున్నారు. రైతులు కూడా వీరితో కలిసి మెలిసి ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో పాలు పంచుకుంటున్నారు. ఆయా గ్రామాల్లోనే నివాసం ఉంటూ.. ఉదయం వేళల్లో పొలం పనులు.. సాయంత్రం గ్రామస్తులకు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను వివరిస్తూ వారిలో స్ఫూర్తిని నింపుతున్నారు.

పట్టణాలలో పుట్టినా పల్లెటూరి వాతావరణంలో ఉంటూ రైతు బిడ్డల్లా పనిచేస్తున్న వీరిని గ్రామంలోని యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరముందని గ్రామస్తులు కూడా అంటున్నారు.

– పులిమి రాజశేఖర్‌రెడ్డి,
సాక్షి, నెల్లూరు

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేనొక అమ్మాయిని ప్రాణం కంటే ఎక్కువ ప్రేమించాను. మాది ఎఫ్‌బీలో పరిచయం. ఫోర్ ఇయర్స్ లవ్ చేసుకున్నాం. లైఫ్‌లో సెటిల్ అయ్యాకే పెళ్లి చేసుకుందామనుకున్నాం. మా విషయం తనే వాళ్ల మమ్మీతో చెప్పింది. ఆమె ఒప్పుకోలేదు. నేను, వాళ్ల మమ్మీ తనకి రెండు కళ్లు. దాంతో ఇద్దరం కూర్చుని ఆలోచించాం. నా ప్రేమ కంటే వాళ్ల మదర్ ప్రేమే గొప్పదని చెప్పి తనకి దూరంగా వచ్చేశాను. తను చాలా బాధపడింది. చివరికి వాళ్ల మమ్మీ చూసిన అబ్బాయినే పెళ్లి చేసుకుంది. పెళ్లి అయ్యి కూడా వన్ ఇయర్ దాటింది. కానీ నేను తనని మరచిపోలేకపోతున్నాను. నేను చేసింది తప్పో, రైటో చెప్పండి అన్నయ్యా ప్లీజ్!

– అమీర్

ఇప్పుడు చెప్పుకుని ఏం చేద్దామని అన్నయ్యా???

ప్లాట్‌ఫామ్ మీద నుంచి ట్రైన్ ఎప్పుడో చుక్.. చుక్.. అయిపోయింది.

చుక్.. చుక్.. అయిపోయాక చక్కబెట్టానికి ఏముంది?????

'ఇంకో ట్రైన్ ఎక్కొచ్చు కదా సార్?' అని నవ్వింది నీలాంబరి.

కొత్త ట్రైన్‌కి కొత్త టికెట్ కొనాలి. పాత టికెట్‌తో కొత్త ట్రైన్ ఎక్కితే... చుక్.. చుక్... మని లోపలేస్తారు నీలూ!

'ఓ.. ఓహో.. ఓహోహో...!! పాత టికెట్ అంటే పాత జ్ఞాపకాలు చించేసి... కొత్త ఆశల టికెట్ కొనుక్కుని.. ఇంకో ట్రైన్ కోసం వెయిట్ చెయ్యమంటారు. అబ్బా ఎంత ఎగ్జైటింగ్‌గా ఉంది సార్ ఈ లవ్ జర్నీ. సూపర్ అమీర్! మంచి మనసుతో ఒక తల్లి కూతుర్ల ప్రేమను కాపాడిన నీకు... తప్పకుండా సూపర్ డూపర్ ట్రైన్ జర్నీ కన్‌ఫామ్!!'

lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పెదవి చివరకే చిరునవ్వే తిరిగొచ్చే
కనుల చివరకే వెలుగేదో వలసొచ్చే
హే ఆదమరపులు కొంచెం
ఆటవిడుపులు కొంచెం
మూతి ముడుపులు కొంచెం
హాయి ఇంకొంచెం

చూపులేవో లేఖలు రాసే
మౌనమేదో రాగం తీసే
సైగలేవే ఓపిరి పోసే
వయసు మనకే బానిసే

నింగి అంచుకు చినుకులు పూసే
నేల అంచుకు పువ్వులు పూసే
గుండె అంచుకు గురుతులు పూసే
చేతికందే రోదసే
॥పెదవి చివరకే॥

హ్మ్... ఒకటంటే ఒక్క జన్మే ఎవరికైనా
బతుకుతూ వెతుకుదాం బతుకులో తీపినీ
దూరంగా ఎగిరిపోదాం ఎక్కడికైనా
తూరుపు పడమర దిక్కులే లేవని
ఆశలకు రెక్కలు ఊహలకు మొప్పలు
కట్టుకున్న ఈ క్షణం మాట వినదే

చూపులేవో లేఖలు రాసే
మౌనమేదో రాగం తీసే
సైగలేవే ఓపిరి పోసే
వయసు మనకే బానిసే
॥పెదవి చివరకే॥

చిత్రం : పేట
రచన : భాస్కరభట్ల
సంగీతం : అనిరుధ్
గానం : విజయ్ ప్రకాశ్

కట్‌చేయ్...దాచేయ్...

స్పెషల్ డైట్



● అల్లు అర్జున్

సినిమాలోని తన పాత్ర కోసం అల్లు అర్జున్ ఎంతటి రిస్క్ అయినా తీసుకుంటారు. ఎంతైనా కష్టపడతారు. 'దేశముదురు' సినిమాకోసం సిక్స్ ప్యాక్ చేశారు. 'బద్రినాథ్' సినిమాలో దేవాలయ సంరక్షుడి పాత్రలోకి మారిపోయారు. 'దువ్వాడ జగన్నాథమ్' సినిమాలో బ్రాహ్మణునిగా చక్కని సంభాషణలు పలికారు. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాలో సైనికుడి పాత్రలో ఒదిగిపోయారు. ఇప్పుడు తన నెక్ట్స్ చిత్రంలోని పాత్రకోసం బరువు తగ్గే పనిలో పడ్డారట అల్లు అర్జున్. ఇందు కోసం ఆయన ఓ స్పెషల్ డైట్‌ను కూడా ఫాలో అవుతున్నారని వినికిడి. అందుకు తగ్గట్లే కసరత్తులు కూడా చేస్తున్నారని సమాచారం. ఈ సినిమాకు త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తారు. ఎస్.రాధాకృష్ణ, అల్లు అరవింద్ నిర్మిస్తారు. ఈ నెలలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు కథానాయికల పేర్లను పరిశీలిస్తున్నారట. ముఖ్యంగా కియారా అద్వానీ, రష్మికా మండన్నా పేర్లు వినిపిస్తున్నాయి. త్వరలో అధికారిక ప్రకటన రావొచ్చు. ఇంతకుముందు అల్లు అర్జున్–త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి' సినిమాలు హిట్ సాధించడంతో తాజా సినిమాపై ఇండస్ట్రీలో అంచనాలు ఉన్నాయి.



● ప్రశాంత్ వర్మ, రాజశేఖర్, జీవిత, సి.కల్యాణ్, శివాని, శివాత్మిక

అంతకుమించిన సంతోషం లేదు

– రాజశేఖర్

''లోకంలో ఎవరికైనా పని దొరకడమన్నదే గ్రేట్. దానికంటే సంతోషమైన విషయం ఏదీ ఉండదు. నాకు పని కల్పించి, నాతో పని చేయించుకుంటూ సినిమాలు చేస్తున్న నిర్మాతలు, దర్శకులకు కృతజ్ఞతలు'' అని రాజశేఖర్ అన్నారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రాజశేఖర్ హీరోగా, అదా శర్మ, నందితా శ్వేత, స్కార్లెట్ విల్సన్ కథానాయికలుగా చేస్తున్న చిత్రం 'కల్కి'. శివాని–శివాత్మిక సమర్పణలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్నారు. నేడు రాజశేఖర్ పుట్టిన రోజు సందర్భంగా 'కల్కి' సినిమా టీజర్ విడుదల చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ– ''గరుడవేగ' సినిమా తర్వాత ఆరేడు నెలలు కథ కోసం అన్వేషించి, ఈ కథ ఓకే చేశాం. 'గరుడవేగ' కి ప్రవీణ్ సత్తారుతో పని చేసేటప్పుడు ఎంత కొత్తగా ఫీల్ అయ్యానో, ప్రశాంత్ వర్మతోనూ అంతే కొత్తగా ఫీల్ అవుతున్నా'' అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ– ''శేషు' తర్వాత రాజశేఖర్‌గారితో నేను చేస్తున్న చిత్రమిది. నేను చిన్న సినిమాలు చేసేటప్పుడు లైట్స్ కొనడానికి కూడా డబ్బులు లేవు. ఓ తమిళ హిట్ సినిమా రీమేక్ రైట్స్ కొని, నన్ను నిర్మాతను చేశారు జీవిత–రాజశేఖర్ దంపతులు'' అన్నారు. ''అ!' చిత్రానికి ముందే 'కల్కి' సినిమా చేద్దాం అనుకున్నాం. కానీ, కుదరలేదు. ఒక ఫ్రాంచైజీ తరహాలో ఈ సినిమాకు సీక్వెల్స్ చేయాలనుంది. అన్నీ కుదిరితే రాజశేఖర్ గారి తర్వాతి బర్త్ డేకి 'కల్కి 2' మొదలవుతుంది. నా అభిమాన నటుడు రాజశేఖర్‌గారికి ఈ పుట్టిన రోజు కానుకగా నేను 'యాంగ్రీ స్టార్' అనే బిరుదు ఇస్తున్నా'' అన్నారు ప్రశాంత్ వర్మ. ''గరుడవేగ' కి ముందు మళ్లీ సక్సెస్‌లోకి వస్తామా? లేదా? అనుకున్న రోజులు ఉన్నాయి. మన వెనుక ఎన్ని కోట్లు ఉన్నా కెరీర్‌ని కొనలేం. అటువంటి సమయంలో 'గరుడవేగ' వచ్చింది. ఇప్పుడు 'బాహుబలి' గురించి మాట్లాడుతున్నప్పుడు 'గరుడవేగ' గురించి కూడా మాట్లాడుతుండటంతో సంతోషంగా ఉంది'' అన్నారు జీవిత. శివానీ, శివాత్మిక, సినిమాటోగ్రాఫర్ దాశరథి శివేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, లైన్ ప్రొడ్యూసర్: వెంకట్ కుమార్ జెట్టి.

మల్లేశం వచ్చిండు



● ప్రియదర్శి, అనన్య

అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న చీరను నేచి, చేనేత రంగంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సాధించుకున్నారు చింతకింది మల్లేశం. పెద్ద చదువులు చదవకపోయినా చేనేత శ్రమజీవుల కోసం ఆయన ఆసు యంత్రాన్ని ఆవిష్కరించారు. ఇందుకుగాను ఆయన్ని 'పద్మశ్రీ' అవార్డు వరించింది. తాజాగా చింతకింది మల్లేశం బయోపిక్‌ని 'మల్లేశం' పేరుతో తెరకెక్కిస్తున్నారు. టైటిల్ రోల్‌లో ప్రియదర్శి నటిస్తున్నారు. రాజ్ ఆర్ దర్శకత్వంలో శ్రీ అధికారి, రాజ్ ఆర్ నిర్మిస్తున్నారు. అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లాలో ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. మార్క్ కె.రాబిన్ సంగీతం సమకూర్చుతున్న ఈ చిత్రానికి గోరేటి వెంకన్న, చంద్రబోస్ పాటలు రాస్తున్నారు. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకట్ సిద్ధారెడ్డి.

తెలుగు వారికి ప్రాధాన్యం ఇవ్వండి

– 'మా' అధ్యక్షుడు శివాజీరాజా



● కనగాల రమేశ్, పద్మాలయ మల్లయ్య, శివాజీరాజా, విక్కీరాజ్

''తెలుగు సినిమాలో తమిళ నటీనటులు ఉండొచ్చా? లేదా? అనేది ప్రస్తుతానికి అప్రస్తుతం. కానీ, ఉంటే అనువాద చిత్రం అనే భావన వస్తుంది. మన తెలుగు వాళ్లను మనం తీసుకుంటే ఇంకా బాగుంటుంది. హీరోయిన్స్ ఎలాగూ తప్పదు.. చిన్న చిన్న నటీనటులను కూడానా? మన వారికి ప్రాధాన్యం ఇవ్వండి. వాళ్లు కుదరకపోతేనే ఇతర భాషల వారిని తీసుకురండి'' అని నటుడు, 'మా' అధ్యక్షుడు శివాజీరాజా అన్నారు. శ్రీనివాసరెడ్డి ముఖ్య పాత్రలో అమర్, ప్రదీప్‌వర్మ, ఉదయ్, అభి, సి.టి., ఖాదర్, లక్ష్మి, శృతి, కావ్య, దేవి, వీణ, జాస్మిన్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'చెడ్డీ గ్యాంగ్'. కనగాల రమేష్ చౌదరి దర్శకత్వం వహించారు. రాజ్ ప్రొడక్షన్స్ ఇంటర్నేషనల్ పతాకంపై విక్కీరాజ్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. రమేష్ చౌదరి మాట్లాడుతూ– ''30 ఏళ్లుగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో–డైరెక్టర్‌గా పని చేస్తున్న నేను 'చెడ్డీ గ్యాంగ్' సినిమాతో దర్శకుడిగా మారాను. పది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కేరళ అడవులకు టూర్‌కు వెళతారు. అక్కడి కోయవారి నిబంధనలను అతిక్రమించి ఓ సమస్యలో ఇరుక్కుంటారు. ఆ తర్వాత వాళ్లు ఎలా బయటపడ్డారనేదే ఈ చిత్ర కథాంశం'' అన్నారు. ''మలేషియాలో తెరకెక్కించిన క్లైమాక్స్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. బాలీవుడ్ బ్యూటీ స్నేహా కపూర్ చేసిన ఐటమ్ సాంగ్ యువతను ఆకట్టుకుంటుంది'' అని విక్కీరాజ్ అన్నారు. సెన్సార్ సభ్యులు ఎంఎస్ రెడ్డి, పాటల రచయిత లక్ష్మణ్, పద్మాలయ మల్లయ్య పాల్గొన్నారు.

పెద్దలకు మాత్రమే!



● నిక్కీ తంబోలీ, అరుణ్ ఆదిత్

అరుణ్ ఆదిత్, నిక్కీ తంబోలీ జంటగా సంతోష్ పి.జయకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చీకటి గదిలో చితక్కొట్టుడు'. బ్లూ గోస్ట్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో ఆదిత్ మాట్లాడుతూ– ''కామెడీతో సాగే హారర్ చిత్రమిది. ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలుంటాయి. ఇంతకు ముందు నేనే నటించిన 'ఎల్ 7' అనే హారర్ మూవీ సరిగ్గా ఆడలేదు. ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''దక్షిణాదిలో ఈ జోనర్ కొత్త. నేను తమిళంలో తెరకెక్కించిన చిత్రాన్ని ఇక్కడ రీమేక్ చేశాను. 18 ఏళ్లు దాటిన వాళ్లే ఈ సినిమా చూడండి. ఇది బూతు చిత్రం కాదు. మంచి ఎమోషన్స్ ఉంటాయి. భయపెడుతూనే నవ్విస్తాం'' అన్నారు సంతోష్ పి.జయకుమార్. ''ఈ పాత్ర నాకు మంచి పేరు తీసుకొస్తుందనుకుంటున్నాను'' అని కథానాయిక నిక్కీ తంబోలీ చెప్పారు.

ఏం సక్కగున్నారో!



● మహేశ్‌బాబు, పూజా హెగ్డే

మహేశ్‌బాబు హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహర్షి'. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. 'అల్లరి' నరేశ్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. అశ్వనీదత్, 'దిల్' రాజు, పీవీపీ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. మహేశ్ బాబు క్యారెక్టర్‌లో పలు షేడ్స్ ఉంటాయి. స్టూడెంట్‌గా, బిలీయనీర్‌గా, ఆధునిక రైతుగా మహేశ్ కనిపిస్తారని తెలిసింది. ఆల్రెడీ రెండు లుక్స్‌ను రిలీజ్ చేశారు. తాజాగా ఈ సినిమా నుంచి మరో పోస్టర్ నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. ఇక్కడున్న ఫొటోలోని మహేశ్ లుక్ స్టూడెంట్ పోర్షన్‌లోనిదని తెలుస్తోంది. ఈ ఫొటో చూసి, ఏం సక్కగున్నారో! అంటూ మహేశ్ అభిమానులు సంబరపడిపోతున్నారు. ఈ సినిమాలో రిషిగా మహేశ్‌బాబు, రవిగా 'అల్లరి' నరేశ్, మహా పాత్రలో పూజా హెగ్డే నటిస్తున్నారని సమాచారం. 'మహర్షి' చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

నాలుగో బ్యూటీ



● కేథరిన్



● విజయ్ దేవరకొండ

ఆల్రెడీ ముగ్గురు హీరోయిన్స్‌తో రొమాన్స్ చేస్తున్న విజయ్ దేవరకొండ లేటెస్ట్ మూవీలోకి కేథరిన్ థెరీసా కూడా జాయిన్ అయ్యారు. క్రాంతిమాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్‌పై కేఎస్ రామారావు సమర్పణలో కేఏస్ వల్లభ నిర్మిస్తున్నారు. ఇందులో రాశీ ఖన్నా, ఐశ్వర్యా రాజేశ్, ఇజబెల్లా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. తాజాగా నాలుగో బ్యూటీగా కేథరిన్ కూడా తోడయ్యారు. ప్రస్తుతం కొత్తగూడెంలో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సింగరేణి కార్మికుడి పాత్రలో కనిపించనున్నారు. ఈ షెడ్యూల్‌లో కేథరిన్ కూడా పాల్గొంటున్నారు. గోపీ సుందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానుంది.

హారర్ జోనర్ సినిమాలు హిట్టే

– సి.కల్యాణ్



● అలీ అస్గర్, భూషణ్ పటేల్, సచిన్ జోషి, సి.కల్యాణ్

''నాకు హారర్ జోనర్ అంటే ఇష్టం. అందుకే ఆ నేపథ్యంలో చాలా సినిమాలు నిర్మించాను. హారర్ జోనర్ సినిమాలు ఎప్పుడూ హిట్టే. సచిన్ మంచి నటుడు. తనకు చాలా వ్యాపారాలు ఉన్నా సినిమాపై ప్యాషన్‌తో నటిస్తున్నారు. ఆయన భార్య రైనా సచిన్‌జోషిగారు నిర్మాతగా మంచి విజయాన్ని అందుకోవాలి'' అని నిర్మాత సి.కల్యాణ్ అన్నారు. సచిన్ జోషి, నర్గిస్ ఫక్రి జంటగా భూషణ్ పటేల్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అమావాస్య'. వైకింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రైనా సచిన్‌జోషి, దీపెన్ ఆమిన్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో సి.కల్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొని చిత్ర పాటల్ని విడుదల చేశారు. సచిన్ జోషి మాట్లాడుతూ– ''నేను చాలా కాలంగా హారర్ జోనర్‌లో ఓ సినిమా చేయాలనుకుంటన్న టైమ్‌లో భూషణ్ పటేల్ 'అమావాస్య' కథ చెప్పారు. ఇదొక క్లాసిక్ హారర్ మూవీ. నా గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. లేటెస్ట్ టెక్నాలజీ వి.ఎఫ్.ఎక్స్. వర్క్‌ను ఉపయోగించాం. హాలీవుడ్ స్థాయి హారర్ సినిమాని ప్రేక్షకులకు అందించాలని చాలెంజింగ్‌గా తీసుకుని చేశాం'' అన్నారు. ''ఈ సినిమా క్లైమాక్స్ అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. మా టీం అంతా చాలా కష్టపడటం వల్లే ఈ సినిమా చాలా బాగా వచ్చింది'' అని భూషణ్ పటేల్ అన్నారు. ''మొదటిసారి ఒక హారర్ సినిమాలో నటించాను'' అని నటుడు అలీ అస్గర్ అన్నారు. ఫైట్ మాస్టర్ విజయ్ పాల్గొన్నారు.



● నిత్యామీనన్

సైంటిస్ట్ వర్ష


ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) మార్స్ మిషన్ విజయవంతం కావడానికి కృషి చేసిన మహిళా శాస్త్రవేత్తల గురించి హిందీలో రూపొందుతున్న సినిమా 'మిషన్ మంగళ్'. అక్షయ్ కుమార్, విద్యా బాలన్, తాప్సీ, నిత్యా మీనన్, సోనాక్షి సిన్హా, కీర్తి కుల్హారీ ముఖ్య తారలుగా నటిస్తున్నారు. ఇందులో సైంటిస్ట్ వర్షా పిళ్లై పాత్రలో నిత్యా మీనన్ కనిపిస్తారు. ''మిషన్ మంగళ్' సినిమా షూట్‌లో చివరి రోజు పాల్గొంటున్నాను''అని ఆదివారం పేర్కొన్నారు నిత్యా మీనన్. జగన్ శక్తి దర్శకుడు. నిత్యా మీనన్‌కు హిందీలో తొలి చిత్రమిది. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.



● సోనాలీ బింద్రే

నమ్మలేనట్టుగా అనిపిస్తోంది!

క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం సోనాలీ బింద్రే లండన్‌లో కొంత కాలం గడిపిన సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబై వచ్చిన సోనాలి మళ్లీ షూటింగ్ లొకేషన్‌లో అడుగుపెట్టారు. అయితే ఇది సినిమా షూటింగ్ కాదు.. యాడ్ షూటింగ్ కోసం. చాలా కాలం తర్వాత సెట్లో అడుగుపెడుతుంటే నమ్మలేనట్టుగా అనిపిస్తోంది అని పేర్కొన్నారామె. ''మళ్లీ పనిలో పడటం ఎలా ఉంటుందో మాటల్లో చెప్పలేను. మరింత బాధ్యతగా, అర్థవంతంగా సెట్లోకి అడుగుపెట్టాను. మళ్లీ కెమెరాను ఎదుర్కోవడం, ఎమోషన్స్‌ను పలికించడం హ్యాపీగా ఉంది'' అంటూ పేర్కొన్నారు సోనాలి. యాడ్స్‌లో నటిస్తున్న ఆమె మళ్లీ సినిమాల్లోనూ నటిస్తారా? వేచి చూద్దాం.



● అల్లు శిరీష్

శిరీష్ చిందేస్తే..

హీరో అల్లు శిరీష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఏబీసీడీ'. మలయాళ చిత్రం 'ఏబీసీడీ: అమెరికన్ బోర్న్ కన్ఫ్యూజ్డ్ దేశీ' కి ఇది రీమేక్. రుక్సార్ థిల్లాన్ కథానాయికగా నటిస్తున్నారు. డి.సురేశ్ బాబు సమర్పణలో యశ్ రంగినేని, 'మధుర' శ్రీధర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ ఫోక్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. జుధా సాంధీ స్వరకర్త. ఫోక్ సాంగ్స్‌కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ ఉంటుంది. మరి.. శిరీష్ వేస్తున్న స్టెప్పులు ఆడియన్స్‌ను ఏ రేంజ్‌లో ఉర్రూతలూగిస్తాయనే విషయం థియేటర్స్‌లోనే తెలుస్తుంది. మార్చి 1న ఈ చిత్రం రిలీజ్ కానుంది.



● సౌందర్య

నిర్మాతగా సౌందర్యా రజనీకాంత్

కల్కి కృష్ణమూర్తి రచించిన తమిళ చారిత్రాత్మక నవల 'పొన్నియిన్ సెల్వన్' ఆధారంగా ఓ సినిమాను తెరకెక్కించాలని చాలామంది దర్శక–నిర్మాతలు కలలు కంటుంటారు. వారిలో దర్శకుడు మణిరత్నం పేరు కూడా వినిపిస్తూనే ఉంటుంది. ప్రస్తుతం ఆయన ఈ సినిమా తీసే పనిలోనే ఉన్నారు. ఇప్పుడు రజనీకాంత్ కుమార్తె సౌందర్యా రజనీకాంత్ పొన్నియిన్ సెల్వన్ ఆధారంగా ఓ వెబ్ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. రజనీకాంత్ 'కొచ్చాడియన్' సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా వర్క్ చేసిన ఎస్. సూర్య ప్రతాప్ దర్శకత్వం వహిస్తారు. ''ఈ నవలకు దృశ్యరూపం ఇవ్వాలని చదివినప్పుడే అనిపించింది'' అని పేర్కొన్నారు సౌందర్య.



● విశ్వనాథ్

కథే హీరో

''చిన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలి. అప్పుడే మాలాంటి కొత్త నిర్మాతలు మరిన్ని సినిమాలు నిర్మించడానికి అవకాశం ఉంటుంది'' అని నిర్మాత తన్నీరు విశ్వనాథ్ అన్నారు. ధ్రువ, అశ్విని జంటగా జైరాం వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యమ్ 6'. తన్నీరు విశ్వనాథ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ– ''నటుడు అవ్వాలనే ఇండస్ట్రీకి వచ్చాను. మొదట్లో కొన్ని సీరియల్స్‌లో నటించాను. ఆ తర్వాత కొన్ని సీరియల్స్ నిర్మించాను. కొంతకాలం దర్శకత్వ శాఖలో కూడా పని చేశాను. ఇప్పుడు 'యమ్ 6' చిత్రం నిర్మించా. ఈ చిత్రానికి కథే హీరో. విజయ్ బాలాజీ మంచి సంగీతం అందించారు. నా స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. త్వరలో వివరాలు చెబుతా'' అన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ సోమవారం
4-2-2019

నేనున్నాను నేనుంటాను



పరిచయం రాజ్యలక్ష్మి ప్లాంజెరీ

'అయామ్.. ఐ విల్'.
ఇదీ ఈ ఏడాది వరల్డ్ క్యాన్సర్ డే నినాదం.
మరో రెండేళ్ల పాటు ఇదే నినాదంతో క్యాన్సర్ డే కార్యక్రమాలు ప్రపంచాన్ని చైతన్యవంతం చేస్తాయి.
అయితే యు.ఎస్.లో ఉంటున్న రాజ్యలక్ష్మి దంపతులు గత ఐదేళ్లుగా ఇదే నినాదంతో..
'నేనున్నాను.. నేనుంటాను' అంటూ క్యాన్సర్ పేషెంట్‌లకు భరోసా ఇవ్వడంతో పాటు ఆర్థికంగా తోడ్పాటునిస్తున్నారు.

''మేడమ్! మెడిసిన్స్ స్టాక్ తగ్గుతోంది. మరికొంత పంపిస్తారా'' హోల్‌సేల్ డ్రగ్గిస్ట్ మాధవి నుంచి ఫోన్.

''అలాగే మాధవీ! ఈ నెల ఎక్కువ అవసరం పడ్డాయా? సరే, అరేంజ్ చేస్తాను'' బదులిచ్చారు రాజ్యలక్ష్మి. వెంటనే మందుల తయారీ కంపెనీకి ఫోన్ చేసి తనకు కావాల్సిన మెడిసిన్స్ ఇండెంట్ చెప్పారామె.

ఇంతలో మరో ఫోన్... డాక్టర్ నుంచి. ''మేడమ్! ఈ నెల ఎక్కువ మందిని రిఫర్ చేశాను. అంత అవసరం ఏర్పడింది.''

''ఫర్వాలేదు డాక్టర్ గారూ, ఎంతమంది వచ్చినా పంపించండి'' భరోసా ఇచ్చారు రాజ్యలక్ష్మి.

''అంతకు ముందు మందులు కొనుక్కోలేని పేషెంట్‌లను చూసి ఓ క్షణం బాధపడి, తర్వాత మర్చిపోయేవాళ్లం. ఇప్పుడు పేషెంట్లకు ధైర్యం చెప్పి మీరు అరేంజ్ చేసిన డీలర్ దగ్గరకు పంపిస్తున్నాం. ఇది మీతో ప్రతిసారీ చెప్తున్న మాటే అయినా మళ్లీ మళ్లీ చెప్పాలనిపిస్తోంది. మందులు సబ్సిడీ ధరల్లో దొరుకుతాయని చెప్పినప్పుడు, అసలే కొనలేని వాళ్లకు ఉచితంగా ఇస్తారని చెప్పినప్పుడు పేషెంట్ కళ్లలో కనిపించే సంతోషం ఇంత అని మాటల్లో చెప్పలేను. వ్యాధి నయం అయినట్లే రిలీఫ్ పొందుతుంటారు. వాళ్లందరి తరఫున మరోసారి కృతజ్ఞతలు'' అన్నారు ఆ డాక్టర్.

''చేస్తున్నది నేను కాదు డాక్టర్ గారూ, ఆ భగవానుడే నా చేత చేయిస్తున్నాడు. సేవ అవసరం నాకు తెలియడానికే నాకు వ్యాధిని ఇచ్చి, వ్యాధిని తగ్గించి, మళ్లీ జీవితాన్నిచ్చినట్లున్నాడు. ఇకపై ఈ జీవితం అభాగ్యుల సేవకోసమే. నాకొక్కదానికే ఈ బాధ తెలిస్తే చాలదనుకున్నాడేమో ఆ భగవంతుడు. నాతో పాటు, నా భర్తనూ క్యాన్సర్ బారిన పడేసి, తిరిగి మమ్మల్ని మామూలు మనుషులను చేశాడు. ఖరీదైన క్యాన్సర్ మందులు కొనుక్కోలేని వాళ్లకు సహాయం చేయడానికి డబ్బును కూడా ఆ భగవంతుడే సమకూర్చాడు. ఆ భగవంతుడిచ్చిన డబ్బును అవసరమైన వాళ్లకు చేరుస్తున్న చేతులు మాత్రమే ఇవి'' అన్నారు రాజ్యలక్ష్మి మృదువుగా. నిజమే.. ఆమె ఎప్పుడూ తాను సహాయం చేస్తున్నానని చెప్పరు. తాను నమ్మే భగవానుడే చేయిస్తున్నాడంటారు. సమాజానికి తిరిగి ఇవ్వాలనే (గివింగ్ బ్యాక్ టు సొసైటీ) సంకల్పం తనలో కలగడం కూడా ఆ భగవానుని ప్రేరణేనంటారామె.

'మణీస్ కేఫ్' వాళ్లమ్మాయి

రాజ్యలక్ష్మి ప్లాంజెరీ పుట్టింది, పెరిగింది నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో. అప్పట్లో ప్రసిద్ధి చెందిన మణీస్ కేఫ్ వాళ్లమ్మాయి. తమిళనాడు నుంచి వచ్చి కావలిలో స్థిరపడిన తమిళ కుటుంబం వారిది. కావలిలో న్యాయవాదిగా కెరీర్ మొదలు పెట్టిన రాజ్యలక్ష్మికి నెల్లూరు కోమల విలాస్ వాళ్లబ్బాయి శంకర్‌నారాయణతో వివాహమైంది. కొన్నాళ్లు హైదరాబాద్‌లో ఉన్నారు వాళ్లు. ఆమె హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు కూడా. భర్తకు అమెరికాలో ఉద్యోగం రావడంతో ఆమె ప్రయాణానికి గమ్యం కూడా అమెరికానే అయింది. ప్లాంజెరీ అనేది తమిళనాడులో శంకర్‌నారాయణ పూర్వికుల గ్రామం. ఆ ఊరి పేరే ఇంటిపేరుగా అమెరికాలో స్థిరపడ్డారు వాళ్లు. ఆ సంగతులను యు.ఎస్.నుంచి 'సాక్షి'తో పంచుకున్నారు రాజ్యలక్ష్మి ప్లాంజెరీ.

డాలర్ ఆరు రూపాయల కాలం

''మేము అమెరికా వెళ్లినప్పుడు ఒక డాలర్ ఆరు రూపాయలు. జీవించడానికి, జీవితంలో నిలదొక్కుకోవడానికి మా వారి జీతం సరిపోయేది. మాకు తొలి బిడ్డ అమ్మాయి. ఇంటి వెలుగు అని మురిసిపోయేలోపు పిడుగులాంటి నిజం. పాపాయి స్పెషల్లీ చాలెంజ్‌డ్ చైల్డ్! వైద్యం చేయించడానికి జీతం సరిపోయేది కాదు. బిడ్డను కాపాడుకోవాలనే ఆరాటంతో ఎనిమిదేళ్లపాటు పోరాటం చేశాం. మన బంధం ఇంతటితో తీరిపోయిందని చెప్పకుండానే మమ్మల్ని విడిచివెళ్లిపోయింది శారద (పాపాయి పేరు). ఆ ఇంట్లో ఉండబుద్ధయ్యేది కాదు. ఎటైనా వెళ్లిపోవాలనిపించేది. తర్వాత పుట్టిన బాబు పనుల్లో మునిగిపోతున్నా కూడా నాకు పాప గుర్తుకొస్తుండేది. 'మీ డెస్టినేషన్ ఇది' అని మా వారికి కొరియాలో ఉద్యోగం చూపించాడు భగవంతుడు. కొరియాకు వెళ్లిన తర్వాత కూడా నేను మామూలు మనిషి కాలేకపోయాను. ఊహలకు తప్ప మాటలకు లేని పాపాయి తరచూ గుర్తుకు వస్తుండేది. కొరియాలో సత్య సాయిబాబా స్పిరిచ్యువల్ గ్యాదరింగ్స్ జరిగేవి. ఇండియన్స్ ఎక్కడెక్కడ ఉన్నారా అని వెతికి పట్టుకుని మరీ ఆహ్వానించేవాళ్లు. ఆధ్యాత్మిక సత్సంగాల్లో సాంత్వన దొరికింది. ఆ సత్సంగాలు మా జీవిత గమనాన్నే మార్చేశాయి.

> **భయం వద్దు.. ధైర్యం పెంచుకోవాలి**
>
> నాకు సర్జరీ చేయాల్సిందేనన్నారు డాక్టర్లు. అయితే దేవుడి రూపంలో డాక్టర్ సెంథిల్ 'మందులతో తగ్గుతుందేమో ప్రయత్నం చేద్దాం' అన్నారు. మందులు వేసుకుంటూ రోజూ ప్రాణాయామం చేశాను. పచ్చటి చెట్టు కింద కూర్చుని ఉదయం పది నిమిషాలు, మధ్యాహ్నం పది నిమిషాలు, సాయంత్రం పది నిమిషాలు ప్రాణాయామం చేస్తే తగినంత ఆక్సిజన్ అందుతుంది. దేహం తనను తానే తిరిగి ఆరోగ్యవంతం చేసుకుంటుంది. ఒంటికి రోజూ సూర్యరశ్మి తగలాలి. జీవనశైలిని ఆక్సిజన్ రిచ్‌గా ఉండేలా చూసుకోవాలి. వైఫై ఎన్విరాన్‌మెంటను తగ్గించుకోవాలి. ముఖ్యంగా బిడ్డల్ని కనాల్సిన వయసులో ఉన్న అమ్మాయిలు మంచి ఆహారం, మంచి గాలిలో జీవించాలి. చేతిలో ఆరోగ్యం ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేసి, ఆ తర్వాత ఆరోగ్యం కోసం వెంపర్లాడే పరిస్థితి తెచ్చుకోవద్దనేది నా సూచన. ఇక క్యాన్సర్ బారిన పడిన వాళ్లకు చెప్పే మాట ఒకటే.. ఇప్పుడు మంచి మందులున్నాయి. క్యాన్సర్ ప్రాణాంతకం కాదు. ధైర్యంగా ఎదుర్కోవడమే మనిషిగా మనం చేయాల్సింది. నేను భగవంతుడిలో ధైర్యాన్ని వెతుక్కున్నాను.
>
> – రాజ్యలక్ష్మి ప్లాంజెరీ,
> సామాజిక కార్యకర్త, ప్లాంజెరీ ఫౌండేషన్ నిర్వాహకురాలు

సత్యసాయి రప్పించారు

యు.ఎస్.నుంచి ఏటా సాయిబాబా దర్శనానికి పుట్టపర్తికి వచ్చేవాళ్లం. ఓసారి బాబా మా వారితో 'ఇప్పటి వరకు సమాజం నుంచి తీసుకున్నావు. ఇక సమాజానికి చేయాల్సింది చాలా ఉంది. హైదరాబాద్‌లో ఉంటూ నువ్వు చేయాల్సిందంతా పూర్తి చేయి' అన్నారు. ఆ మాటతో అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చాం. సమాజానికి తిరిగి ఇవ్వడం మొదలైంది. మొదటగా ఇచ్చింది ప్రభుత్వానికే. ఎన్ఆర్ఐకి ఇచ్చే టాక్స్ మినహాయింపును తీసుకోకుండా పూర్తి ట్యాక్స్ కట్టారాయన. అమెరికాలో ఆయన చదువుకోవడానికి స్కాలర్‌షిప్‌తో ఆదుకున్న ఐవోడబ్ల్యుఎ యూనివర్సిటీలో ఏటా మూడు మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నాం. మా పాపకు స్పెషల్ ట్రీట్‌మెంట్, ట్రైనింగ్ ఇప్పించడానికి అప్పట్లో మా దగ్గర అంత డబ్బు ఉండేది కాదు. యుఎస్‌లోని రే గ్రాహమ్ అసోసియేషన్ మాకు హెల్ప్ చేసింది. ఆ చారిటీకి మా పాప శారదా దేవి పేరుతో ఫైనాన్షియల్ ఎయిడ్ ఇస్తున్నాం. శారద మెమోరియల్‌తో స్పెషల్లీ చాలెంజ్‌డ్ కిడ్స్‌కి అవసరమైన సర్వీస్ ఇస్తూ ఉంటే శారద మాకు లేదని అనిపించదు.

అప్పటికే ఫోర్త్ స్టేజ్!

ఆ భగవంతుడు మా చేత... విద్యకు, స్పెషల్ కిడ్స్‌కే కాదు, వైద్యరంగానికీ సేవ చేయించాలనుకున్నాడో ఏమో తెలియదు. మా భార్యాభర్తలిద్దరినీ మూడు నెలల తేడాతో క్యాన్సర్ బారిన పడేశాడు, ఆనక బతికించాడు. 2011లో మా అబ్బాయికి పెళ్లి చేశాం.

'అరవై నిండాయి, బాధ్యతల నుంచి రిటైరయ్యాం' అనుకునే లోపు ఆ ఏడాది ఆగస్టులో నాకు బ్రెస్ట్ క్యాన్సర్ బయటపడింది. అప్పటికే ఫోర్త్ స్టేజ్. మూడు నెలలే అన్నారు డాక్టర్లు. నాకు వైద్యం మొదలైంది. ఆ ఏడాది డిసెంబర్‌లో మా వారికి స్టమక్ క్యాన్సర్ బయటపడింది. ఇద్దరమూ ట్రీట్‌మెంట్ తీసుకున్నాం. నాకు మందులతోనే తగ్గిపోయింది. ఇద్దరం కోలుకున్న తర్వాత క్యాన్సర్ నివారణకు ప్రివెంటివ్ మెడిసిన్ రీసెర్చ్‌కి మావంతుగా తిరిగి ఇవ్వాలనిపించింది.

హ్యూస్టన్‌లోని ఎండిఎ రీసెర్చ్‌కి, అరిజోనాలోని ఫీనిక్స్ నగరంలో హోమియో మెడిసిన్ పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్‌కి మా వంతు సాయం చేస్తున్నాం. ఇండియాలో నేరుగా పేషెంట్‌కే సహాయం చేస్తున్నాం. ఏడాదిలో సగం కాలం అమెరికాలో ఉంటాం. అందుకే క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లను కలిసి మేము చేయదలుచుకున్నది చెప్పాం. మాధవి అనే హోల్‌సేల్ డీలర్‌తో అనుసంధానం అయ్యాం. ఎనభై వేలు, లక్ష రూపాయలు ఉండే ఇంజక్షన్‌లను వేయించుకోలేని వాళ్లకు మేము ఆసరా అవుతున్నాం. పేషెంట్లు వాళ్లు భరించగలిగినంత ఖర్చును వాళ్లు భరిస్తారు, మిగిలిన డబ్బు మేమిస్తాం. ఒక్కొక్కరు నలభై వేలు పెట్టుకుంటారు, ఒక్కొక్కరు ఐదు–పది వేలకు మించి భరించలేమంటారు. అసలే ఆధారమూ లేని వాళ్లకు ఫ్రీగా ఇస్తున్నాం. తల్లిగా, గృహిణిగా నా బాధ్యతలు పూర్తయ్యాయి. ఇప్పుడు సోషల్ వర్క్‌లో ఉన్న సంతృప్తిని ఆస్వాదిస్తున్నాను.

ఈ జీవితం ఇక సమాజానికి తిరిగి ఇవ్వడానికే. ఏటా ఇంత మొత్తం చదువులకు, ఇంత మొత్తం వైద్యానికి, ఇంత మొత్తం స్పెషల్ కిడ్స్‌కి, ఇంత మా ఇద్దరి మెయింటెనెన్స్‌కి అని విభజించుకుని ఖర్చు చేస్తున్నాం. మా అబ్బాయి ఇక్కడే అమెరికాలో తన ఉద్యోగంలో స్థిరపడ్డాడు. మేము సంపాదించుకున్నదంతా ఇక సమాజసేవకే అంకితం'' అన్నారు రాజ్యలక్ష్మి.

> **వేద పఠనం ఓ శక్తి తరంగం**
>
> 
>
> మోడరన్ లైఫ్‌స్టయిల్‌లో క్యాన్సర్ 35 ఏళ్లకే దాడి చేస్తోంది. బయట నూనెలో వేయించిన ఆహారం, సెల్‌ఫోన్ రేడియేషన్ చాలా ప్రమాదకరం. మాది చాలా డిసిప్లిన్డ్ లైఫ్‌స్టయిలే అయినా, హైదరాబాద్, శ్రీనగర్ కాలనీలో మా ఇంటి దగ్గరలో ఉన్న సెల్ టవర్లే క్యాన్సర్ బారిన పడేశాయి. వేదం, రుద్రం, పంచసూక్త పఠనం చేస్తాను. ఆ వైబ్రేషన్స్ ఒట్టి శబ్ద తరంగాలు కాదు, శక్తి తరంగాలు. మనిషిని ఆరోగ్యవంతం చేస్తాయి. మామూలు వ్యక్తుల్లాగే అన్ని పనులూ చేసుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తున్నాం.
>
> – శంకర్‌నారాయణ ప్లాంజెరీ,
> ఎన్ఆర్ఐ, ప్లాంజెరీ ఫౌండేషన్ స్థాపకులు

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: శివ మల్లాల

పరి పరిశోధన

బరువుకు.. బ్రేక్‌ఫాస్ట్‌కూ లింక్!



రోజులో అతిముఖ్యమైన ఆహారం ఉదయాన్నే తీసుకునే ఉపాహారమని చెబుతూంటారు. అయితే బరువు తగ్గాలనుకునేవాళ్లకు ఇదేమంత మంచి సూత్రం కాదంటున్నారు మొనాష్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. బ్రిటిష్ మెడికల్ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమైన పరిశోధన వ్యాసం ప్రకారం.. ఉపాహారం తినకపోతే ఆ తరువాత ఆకలి ఎక్కువై అవసరానికి మించి తింటారన్న గత అంచనాల్లో ఏమాత్రం నిజం లేదు. అలాగే ఆరోగ్యకరమైన బరువు ఉండేందుకు బ్రేక్‌ఫాస్ట్ అవసరమని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయని.. తాము జరిపిన తాజా అధ్యయనంలో మాత్రం ఇందుకు భిన్నమైన ఫలితాలు వచ్చాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త తెలిపారు. ఇప్పటికే జరిగిన 13 అధ్యయనాల వివరాల ఆధారంగా తాము ఈ అంచనాకు వచ్చినట్లు చెప్పారు. వీటికి అదనంగా తాము అమెరికా, యూకేలకు చెందిన కొంత మందిపై కొన్ని పరిశోధనలు చేశామని బ్రేక్‌ఫాస్ట్ తీసుకోని వారు మిగిలిన వారితో పోలిస్తే తేలికగా ఉన్నట్లు తెలిసింది.

ఉబ్బసానికి విరుగుడు మితాహారమా?



ఉబ్బసంతో బాధపడేవారు వీలైనన్ని తక్కువ కేలరీలను తీసుకోవడం ద్వారా వ్యాధి లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చునని అంటున్నారు హాప్కిన్స్ మెడిసిన్ శాస్త్రవేత్తలు. అంతేకాకుండా శరీరానికి అందే కేలరీలు కొవ్వుల నుంచి వచ్చినా.. చక్కెరల నుంచి వచ్చినా ఈ ఫలితాల్లో తేడాలేవీ ఉండవని వారు ఎలుకలపై జరిపిన పరిశోధనల ఆధారంగా చెబుతున్నారు. అధికాహారం కారణంగా ఊబకాయులైన వారి ఊపిరితిత్తులు మంట/వాపులకు గురవుతాయని.. ఫలితంగా ఉబ్బస లక్షణాలు కనిపిస్తాయని.. మంట/వాపు నివారణకు మందులు వేసుకుంటే పరిస్థితి సాధారణమవుతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త వసెవోలోడ్ పొలోట్స్కీ అంటున్నారు. ఎలుకలకు తాము నాలుగు రకాల ఆహారాన్ని అందించి వాటిపై పరిశీలనలు జరిపామని, ఎనిమిది వారాల తరువాత తక్కువ కేలరీలు తీసుకున్న ఎలుకల ఊపిరితిత్తుల పనితీరు మెరుగ్గా ఉన్నట్లు తెలిసిందని, కొవ్వు ఎక్కువగా తీసుకున్న ఎలుకల ఊపిరితిత్తుల్లోని వాయుమార్గాలు సాధారణం కంటే చాలా రెట్లు కుంచించుకుపోయినట్లు తెలిసిదని వివరించారు. దీన్నిబట్టి మితాహారానికీ ఊబ్బస లక్షణాలకూ మధ్య సంబంధం ఉన్నట్లు తాము అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఉబ్బసం వ్యాధికి మరింత మెరుగైన చికిత్స కల్పించేందుకు తమ పరిశోధన ఉపయోగపడుతుందని అన్నారు.


ఆశారేఖలు

క్యాన్సర్ కాటుకు కొత్త చికిత్సల దెబ్బ!



ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 90 లక్షల మంది క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని అంచనా. అయితే ఎన్నెన్నో పరిశోధనల కారణంగా క్రమంగా కొత్త చికిత్స విధానాలు, కొత్త ప్రక్రియలు, కొత్త మందులు, కొత్త పరీక్షలూ అందుబాటులోకి వస్తున్నాయి. ఫలితంగా గతంలో 85% కేసులు ప్రాణాంతకంగా ఉండగా...ఇప్పుడు దాదాపు 85% క్యాన్సర్లకు చికిత్స అందుబాటులో ఉంది. క్యాన్సర్ చికిత్స రంగంలో ఇంకా ఎన్నెన్నో కొత్త ఆశారేఖలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. నేడు క్యాన్సర్ డే సందర్భంగా వాటిలో కొన్నింటి గురించిన వివరాలు...

ప్రపంచంలో ఏదైనా కొత్త మందు లేదా చికిత్స విధానం రోగులకు అందుబాటులోకి రావాలంటే... రోగికి అది సురక్షితమైందా, ఏమేరకు లాంటి అనేక అంశాలను అనేక దశల్లో పరిశీలించి అమెరికాకు చెందిన 'ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్' (ఎఫ్‌డీఏ) అనే అత్యున్నత సంస్థ అనుమతులను ఇస్తుంది. గత ఏడాది అది 18 కొత్త రకాలైన క్యాన్సర్ చికిత్స ప్రక్రియలకు అనుమతులిచ్చింది. క్యాన్సర్ ప్రక్రియల వల్ల 13 రకాల ఉపయోగాలను కొత్తగా కనుగొన్నట్లు ప్రపంచానికి వెల్లడించింది.



వ్యక్తిగతమైన ఔషధాలు : ఒక రకం క్యాన్సర్‌కు ఒక మందు కనుక్కున్నారని అనుకుందాం. అప్పుడు ఆ రకం క్యాన్సర్ రోగులందరూ వాడాల్సిందే. అయితే రోగి తాలూకు వ్యాధి నిరోధక శక్తిని పెంచేలా ఇచ్చే మందులైన ఇమ్యూనోథెరపీ అనే ప్రక్రియలూ, ఆరోగ్యకరమైన కణాలను వదిలేసి కేవలం క్యాన్సర్ కణాలను మాత్రమే పట్టి పట్టి చంపేసే టార్గెట్ థెరపీలలో ఇటీవల చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. దాని ఫలితంగా ఊపిరితిత్తుల, ప్రోస్టేట్, మూత్రాశయ క్యాన్సర్ల చికిత్సలో మునుపెన్నడూ ఊహించనంత పెను మార్పులు వచ్చాయి. వాటి వల్ల ఎన్నో మంచి ఫలితాలు వచ్చాయి. అందరూ క్యాన్సర్ రోగులకూ గంపగుత్తగా ఒకే మందు వాడటానికి బదులు... ఆ మందును మరింత ప్రభావపూర్వకంగా మార్చేందుకు వీలున్న మరో ప్రక్రియకు ఎఫ్‌డీఏ ఇటీవల అనుమతిని ఇచ్చింది. స్వభావంలోనూ, ఒక మందుకు స్పందించే విషయంలోనూ వ్యక్తికీ వ్యక్తికీ మార్పులు ఉంటాయన్న విషయం తెలిసిందే. దీని ఆధారంగా అతడి జన్యుపరిస్థితిని, జన్యువుల తీరుతెన్నులను పరిశీలించి, ఒక అవయవంలో క్యాన్సర్ ఉన్న స్థానాన్ని బట్టి... ఇలాంటి కొన్ని అంశాల ఆధారంగా ఆ మందులలో మార్పులు చేసి, అవి ఆ వ్యక్తిలో మరింత ప్రభావపూర్వకంగా, బలంగా పనిచేసేలా చేస్తారు. ఇలా వ్యక్తిగతమైన మందుల రూపకల్పనకే ఇటీవల ఎఫ్‌డీఏ అనుమతులను ఇచ్చింది. దీన్నే 'పర్సనలైజ్‌డ్ థెరపీ' అని చెప్పవచ్చు. ఇది కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఒక చికిత్సాప్రక్రియ.


టీఆర్‌కే ఫ్యూజన్ ప్రోటీన్ : క్యాన్సర్ చికిత్సల కోసం పరిశోధకులు ప్రతిరోజూ కొత్తదారులు వెదుతుకూనే ఉన్నారు. ఆ మార్గాల్లో పయనిస్తూ, కొత్త చికిత్సా ప్రక్రియలను కనుగొంటున్నారు. క్యాన్సర్ కూడా ఒక కణమే కదా. అన్ని కణాలకు ఉన్నట్లే దానికీ ఒక జన్యుపటలం ఉంటుంది. కాకపోతే ఆరోగ్యకరమైన కణంలా కాకుండా అది విభిన్నంగా, విపరీతంగా ప్రవర్తిస్తుంటుంది. ఈ కొత్తమార్గంలో చూసినప్పుడు దాని జన్యుపటలంలోని ప్రోటీన్ల గొలుసుల్లో ('ప్రోటీన్ చైన్'లో) ఏదైనా మార్పులు చేయడం వల్ల అది తనకు తానుగా నశించిపోతుందేమోనంటూ పరిశోధకలు పరిశీలించారు. ఇది కూడా క్యాన్సర్ రోగులకు వ్యాధి పూర్తిగా తగ్గేలా చేసే ఒక ప్రక్రియ అనీ, త్వరలోనే అది అందుబాటులోకి వస్తే అది క్యాన్సర్ చికిత్సా రంగంలోనే ఓ పెద్ద మార్పు తీసుకొస్తుందనే ఆశలున్నాయి.

హైపర్‌థెర్మిక్ ఇంట్రా పెరిటోనియల్ కీమోథెరపీని మరింత విస్తృత పరచడం : సాధారణంగానైతే కీమోథెరపీని నిర్దిష్టంగా ఒక చోట కాకుండా శరీరమంతటా ఆ మందు ప్రవహించేలా డాక్టర్లు ఇస్తుంటారు. అయితే శస్త్రచికిత్స ద్వారా కడుపును తెరచి, ఆ కడుపు కుహరంలో కీమోథెరపీకి ఉపయోగించే మందును ఉంచడం ద్వారా ఇచ్చే చికిత్సను 'హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కీమోథెరపీ (హెచ్‌ఐపీఈసీ) అని అంటారు. సాధారణ కీమోథెరపీలో మందు శరీరమంతటికీ విస్తరిస్తుంది కదా... కానీ ఈ హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కీమోథెరపీలో మందు కేవలం కడుపు ప్రాంతంలోనే కేంద్రీకృతమై ఉంటుంది. అక్కడ విశేషమైన వేడికి పుట్టిస్తూ, క్యాన్సర్ కణాలను భస్మం చేస్తుంది. సాధారణ కణాలకు తనను తాను రిపేర్ చేసుకునే శక్తి ఉంటుంది. ఫలితంగా ఈ ప్రక్రియలో దెబ్బతిన్న సాధారణ ఆరోగ్యకరమైన కణాలు మళ్లీ మామూలు స్థితికి వస్తాయి. కానీ భస్మమైన క్యాన్సర్ కణాలు మళ్లీ పుట్టవు. అలాగే దెబ్బతిన్న క్యాన్సర్ కణాలకు తమను తాము రిపేర్ చేసుకునే శక్తి ఉండదు. ఈ అంశం ఆధారంగా ఈ ప్రత్యేకమైన థెరపీని కడుపునకు సంబంధించిన కొన్ని క్యాన్సర్లలో ఉపయోగించవచ్చు.

క్యాన్సర్ చికిత్సలో కృత్రిమ మేధస్సు సహాయం తీసుకోవడం : ఊహల్లోనూ మన మేధస్సుకు ఒక సరిహద్దు లేదు. అయిప్పటికీ ఎన్నో సంక్లిష్టమైన నిర్మాణాలతో ఉండే జన్యుపటలం లాంటి అంశాలను కేవలం మనిషి ఒక్కడే (అంటే మ్యాన్యువల్‌గా) విశ్లేషిస్తూ అర్థం చేసుకోవడంలో ఎంతో సమయం పట్టవచ్చు. ఆ సమయం ఆదా అయ్యే విధంగా మనిషి సృష్టించిన కృత్రిమ మేధస్సే క్యాన్సర్ జీనోమ్ స్ట్రక్చర్‌ను అర్థం చేసుకునేలా ప్రోగ్రామ్ చేస్తారు. దాని విశ్లేషణల ఆధారంగా క్యాన్సర్ కణాన్ని ఎలా ధ్వంసం చేయవచ్చో తేలిగ్గా తెలిసిపోతుంది. ఇలా క్యాన్సర్‌పై పోరాటంలో ఇప్పుడు కృత్రిమ మేధస్సు కూడా సహాయం చేస్తోంది.

ఇవీ... ఇటీవల క్యాన్సర్ రంగంలో చోటు చేసుకున్న, చేసుకోబోతున్న విప్లవాత్మకమైన మార్పులు. ఇవన్నీ త్వరలోనే దాదాపుగా 'క్యాన్సర్ రహిత లోకం' వైపునకు బాటలు పరుస్తాయేమోనని ఆశాభావంతో రాబోయే తరాలు ఎదురుచూస్తున్నాయి.

> **సాధారణ మూత్రపరీక్షతోనే క్యాన్సర్‌ను తెలుసుకోవచ్చు**
>
> 
>
> లక్షణాలను బట్టి కొన్ని సందర్భాల్లో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ పరీక్షలు చేయిస్తారు. అయితే అప్పటికే వ్యాధి ముదిరిపోయి, చికిత్సకు లొంగకుండా పోవడం అన్నది కొన్ని సందర్భాల్లో కనిపించే అవకాశం ఉండటం ఇలాంటి సందర్భాల్లో జరుగుతుంది. కానీ కొన్ని రకాల క్యాన్సర్లను ఇప్పుడు కేవలం మూత్రపరీక్ష వంటి చిన్న పరీక్షతోనూ తెలుసుకునే సాంకేతికతను 'ఇజ్రాయెల్‌లోని బీర్షెబాలో ఉన్న బెన్–గురియన్ యూనివర్సిటీ ఆఫ్ నెగావ్ కు చెందిన పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీని సహాయంతో రొమ్ము క్యాన్సర్‌ను చాలా నిశితంగానూ, చాలా త్వరగానూ పట్టేయడానికి వీలవుతుంది. దాంతో చికిత్స ఆలస్యం కావడం అనే పరిస్థితి తప్పిపోయి, ఎంతో మంది మహిళల ప్రాణాలు నిలబడతాయి. ఇదీ క్యాన్సర్ రోగులకు అందుబాటులోకి రాబోతున్న మరో ఆశారేఖ. ఇక్కడ ఒక చిన్న తమాషా కూడా ఉంది. మూత్రం ద్వారా పట్టేసేందుకు ఉద్దేశించిన ఎలక్ట్రానిక్ పరికరాన్ని పరిశోధకులు నిర్మించారు. దీనికి పెద్దగా ఖర్చుకూడా అవసరం లేదు. మూత్రాన్ని పరిశీలించి, రొమ్ముక్యాన్సర్ తాలూకు వాసన పట్టేస్తుందనే ఉద్దేశంతోనో ఏమో ఈ ఎలక్ట్రానిక్ పరికరానికి 'ఈ–నోస్' (ఎలక్ట్రానిక్ ముక్కు) అని పిలుస్తున్నారు. దాంతో మహిళారోగులు భవిష్యత్తులో మామోగ్రఫీ లాంటి అడ్వాన్స్‌డ్ పరీక్షలతో కాకుండా... కేవలం కొద్ది ఖర్చుతోనే రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకునే అవకాశం రాబోతోంది.



డాక్టర్ ఏవీఎస్ సురేశ్,
సీనియర్ కన్సల్టెంట్,
మెడికల్ అండ్ హిమటో ఆంకాలజిస్ట్,
సెంచరీ హాస్పిటల్స్,
హైదరాబాద్

సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
4-2-2019

విద్య, ఉద్యోగ సమాచారం

బీఎస్ఎఫ్‌లో 1763 పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)2019కి గాను 1763 కానిస్టేబుల్ (ట్రేడ్స్ మ్యాన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** టైలర్, కార్పెంటర్, కుక్, బార్బర్, పెయింటర్, వెయిటర్, తదితర పోస్టులు..
- **అర్హత:** పోస్టును బట్టి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత ట్రేడులో రెండేళ్ల పని అనుభవం/ఐటీఐలో సర్టిఫికెట్ కోర్సు, నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి.
- **వయసు:** ఆగస్టు 1, 2019 నాటికి 18–23 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (ఫిబ్రవరి 2–8)లో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** http://bsf.nic.in

సీఎస్ఐఆర్-ఐఐసీటీలో 17 పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ).. 17 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో బీఎస్సీ లేదా డిప్లొమా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణతతో పాటు ఏడాది పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు హార్డ్‌కాపీని ప్రింట్ తీసుకుని, దానికి ఇతర ధ్రువీకరణ పత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 1, 2019.
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** మార్చి 16, 2019.
- **వెబ్‌సైట్:** www.iictindia.org

ఏపీ పోస్టల్ సర్కిల్‌లో 22 పోస్టులు

విజయవాడలోని ఏపీ పోస్టల్ సర్కిల్ పోస్ట్‌మ్యాన్, మెయిల్‌గార్డ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. పోస్ట్‌మ్యాన్–19.
2. మెయిల్ గార్డ్–3.

- **అర్హత:** మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత.
- **వయసు:** 18–27 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆధారంగా.
- **పరీక్ష కేంద్రాలు:** కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం.
- **దరఖాస్తు ఫీజు:** అప్లికేషన్ ఫీజు రూ.100; పరీక్ష ఫీజు: రూ.400. (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళలకు రూ.100).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **ప్రైమరీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 28, 2019.
- **పోస్టాఫీసుల్లో ఫీజు చెల్లించుటకు చివరితేదీ:** మార్చి 5, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 8, 2019.
- **వెబ్‌సైట్:** www.appost.in

ఏపీ పోస్టల్ సర్కిల్‌లో 46 పోస్టులు

విజయవాడలోని ఏపీ పోస్టల్ సర్కిల్ 46 మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- **విభాగాల వారీ ఖాళీలు:** సర్కిల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాల్లో 13, సబార్డినేట్ కార్యాలయాల్లో 33 పోస్టులున్నాయి.
- **అర్హత:** మెట్రిక్యులేషన్ లేదా ఐటీఐ ఉత్తీర్ణత.
- **వయసు:** 18–25 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆధారంగా.
- **పరీక్ష కేంద్రాలు:** కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం. ✦ **దరఖాస్తు ఫీజు:** అప్లికేషన్ ఫీజు రూ.100; పరీక్ష ఫీజు: రూ.400.(ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళలకు రూ.100).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **ప్రైమరీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 28, 2019.
- **పోస్టాఫీసుల్లో ఫీజు చెల్లించుటకు చివరితేదీ:** మార్చి 5, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 8, 2019.
- **వెబ్‌సైట్:** www.appost.in

ఎయిమ్స్‌ల్లో పీజీ ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎయిమ్స్ సంస్థల్లో పీజీ కోర్సుల్లో(జులై–2019 సెషన్)ప్రవేశాలకు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)–న్యూఢిల్లీ దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సులు:** ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం/ఎండీఎస్.
- **ప్రవేశాలు కల్పించే ఎయిమ్స్‌లు:** భోపాల్, భువనేశ్వర్, జోధ్‌పూర్, పట్నా, రాయ్‌పూర్, రిషికేశ్, న్యూఢిల్లీ.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **ప్రవేశ పరీక్ష తేదీ:** మే 5, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 19, 2019.
- **వెబ్‌సైట్:** www.aiimsexams.org

ఏపీపీఎస్సీ ఎగ్జామ్స్



ఏపీపీఎస్సీ గ్రూప్-1 దరఖాస్తు ప్రక్రియ ఈ నెల ఏడో తేదీన ముగియనుంది. ప్రిలిమ్స్ పరీక్షను మార్చి 31న నిర్వహించనున్నట్లు తాజాగా ప్రకటించారు. అంటే.. ప్రిలిమ్స్‌కు ఇప్పటినుంచి అందుబాటులో ఉన్న సమయం కేవలం రెండు నెలలు! అంతేకాకుండా.. ఈసారి ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు 1:15 నిష్పత్తిలోనే అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెబుతున్న నేపథ్యంలో.. ప్రిలిమ్స్ గట్టెక్కడం నల్లేరు మీద నడక ఎంతమాత్రం కాదు. అయితే సిలబస్‌పై అవగాహన.. సరైన ప్రిపరేషన్ వ్యూహాలు.. ఆత్మవిశ్వాసమనే ఆయుధం తోడుగా.. ముందుకుసాగొచ్చు. అభ్యర్థులకు ఉపయోగపడేలా గ్రూప్-1 సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ వ్యూహాలు, సక్సెస్ టిప్స్...

గ్రూప్-1

ప్రిలిమ్స్‌లో గట్టెక్కండిలా..!


ఏపీపీఎస్సీ 169 పోస్టులతో గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే! ఇందులో 125 తాజా పోస్టులు కాగా, 44 క్యారీ ఫార్వర్డ్ పోస్టులు. గ్రూప్–1 స్క్రీనింగ్ టెస్టు(ప్రిలిమ్స్) మార్చి 31న జరగనుంది.

పరీక్ష స్వరూపం

- గ్రూప్–1 స్క్రీనింగ్ టెస్టు రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్–1(జనరల్ స్టడీస్)లో చరిత్ర, సంస్కృతి; రాజ్యాంగం–రాజకీయ వ్యవస్థ, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సంబంధాలు; భారత్, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ప్రణాళికలు; భౌగోళిక శాస్త్రం.. విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగం నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 120 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- పేపర్ 2 (జనరల్ ఆప్టిట్యూడ్)లో రెండు విభాగాలు (ఎ, బి) ఉంటాయి. ప్రతి విభాగంలో 60 ప్రశ్నలు చొప్పున మొత్తం 120 ప్రశ్నలు–120 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పార్ట్ ఏలో... జనరల్ మెంటల్ ఎబిలిటీ; అడ్మినిస్ట్రేటివ్, సైకలాజికల్ ఎబిలిటీస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పార్ట్ బిలో రెండు ఉప విభాగాలు.. సైన్స్ అండ్ టెక్నాలజీ; ప్రాంతీయ, జాతీయ,అంతర్జాతీయ ప్రాధాన్యమున్న కరెంట్ ఈవెంట్స్.. ఉన్నాయి. వీటిలో ప్రతి విభాగం నుంచి 30 ప్రశ్నల చొప్పున అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కు కోత విధిస్తారు.

పేపర్ 1.. సమగ్ర అవగాహన


చరిత్ర, సంస్కృతి



- ఈ విభాగంలో 6 అంశాలను పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రధానంగా సంస్కృతిపై ఎక్కువ దృష్టిపెట్టాలి. ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష విధానాన్ని సివిల్స్ తరహాలో మార్చిన నేపథ్యంలో.. సివిల్స్ ప్రశ్నల శైలిని పరిశీలించడం లాభిస్తుంది. యూపీఎస్సీ, ఇతర జాతీయ స్థాయి పరీక్షల్లో సంస్కృతి–సంబంధిత అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ ట్రెండ్ ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ కొనసాగే అవకాశముంది. కాబట్టి ఏయే అంశాలపై ప్రశ్నలు అడుగుతున్నారనే విషయాన్ని గుర్తించేందుకు అభ్యర్థులు ప్రయత్నించాలి.
- ఈ విభాగం నుంచి సాపేక్ష తరహా ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి ప్రిపరేషన్ పరంగా కంపారిటివ్ (పోల్చి) స్టడీ విధానాన్ని అనుసరించాలి. సింధు–వేద నాగరికతలు, బౌద్ధ–జైన మతాలు, భక్తి–సూఫీ ఉద్యమం తదితరాలను పోల్చుతూ చదవడం లాభిస్తుంది.
- 'కళలు–శిల్పకళ' కీలక అంశంగా నిలుస్తుంది. అభ్యర్థులు ప్రధానంగా దేవాలయ శిల్పకళపై దృష్టిపెట్టాలి. అజంతా, ఎల్లోరా తదితర శిల్పాలు, వాటి మధ్య ఉన్న సాపేక్ష అంశాల గురించి తెలుసుకోవాలి. దీంతోపాటు యునెస్కో గుర్తింపు పొందిన ప్రదేశాలపై ప్రశ్నలు అడగవచ్చు.
- ఈ విభాగంలో మరో కీలక అంశం... 'భాష–సాహిత్యం'. ప్రాచీన భాషలు–గుర్తింపు, బౌద్ధ–జైన మత గ్రంథాలు, ఆయా కాలాల్లో ప్రముఖ గ్రంథాలు–రచయితలు గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలి.
- మౌర్యులు, కుషాణులు, గుప్తులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, చోళులు, కాకతీయులు తదితర రాజవంశాలు–వారి పరిపాలన, ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన కలిగి ఉండాలి.
- పైన పేర్కొన్న అంశాలతోపాటు ఢిల్లీ సుల్తానులు, విజయనగర సామ్రాజ్యం, మొగలులు, 1857 తిరుగుబాటు, గవర్నర్ జనరల్స్, మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్, వల్లభాయ్‌పటేల్ తదితరుల గురించి సిలబస్‌లో పేర్కొన్న అంశాలను చదివితే..ఈ విభాగంలో 25 మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

రాజ్యాంగం-సామాజిక న్యాయం-అంతర్జాతీయ సంబంధాలు

- పేపర్ 1లో.. రాజ్యాంగం–రాజకీయ వ్యవస్థ, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సంబంధాలను ఒక విభాగంగా పేర్కొన్నారు. పబ్లిక్ సర్వీస్ పరీక్షలకు సంబంధించి 'సామాజిక న్యాయం' అంశాన్ని పాలిటీలో భాగంగా పేర్కొనడం ఇదే తొలిసారి. రాజ్యాంగ పీఠికలోని 'జస్టిస్' అనే పదం దేశ ప్రజల రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాల గురించి పేర్కొంటుంది. కాబట్టి అభ్యర్థులు సిలబస్‌లో పేర్కొన్న సదరు అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. 'రాజ్యాంగం–రాజకీయ వ్యవస్థ' అంశానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన, కీలక ఘట్టాలు, పాలుపంచుకున్న వ్యక్తులు, పొందుపరిచిన అంశాల మూలం (సోర్సు), గవర్నెన్స్ టాపిక్స్ కీలకంగా నిలుస్తాయి.
- పంచాయతీ రాజ్ వ్యవస్థ, పబ్లిక్ పాలసీ, గవర్నెన్స్; పాలనపై ప్రైవేటీకరణ, సరళీకరణ, భౌగోళీకరణల ప్రభావం తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- ఈ విభాగంలో పేర్కొన్న 'అంతర్జాతీయ సంబంధాలు' నుంచి తప్పనిసరిగా ప్రశ్నలు వస్తాయి. భారత విదేశాంగ విధానం... ఆయా దేశాలతో ద్వైపాక్షి సంబంధాలు, భారత్‌పై ప్రభావం చూపే అంతర్జాతీయ అంశాలు, పరిణామాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు ఇతర దేశాలతో భారత్ కుదుర్చుకున్న ద్వైపాక్షిక ఒప్పందాలు, భారత్‌ను రాజకీయంగా, ఆర్థికంగా ప్రభావితం చేసే తాజా పరిణామాల గురించి అవగాహన పెంచుకోవాలి. ఇందులో భాగంగా మాల్దీవులు–చైనా మధ్య కుదిరిన ఫ్రీ ట్రేడ్ ఒప్పందం, భారత్–చైనా సరిహద్దు తగాదాలు, చైనా వన్ బెల్ట్ వన్ రోడ్, దక్షిణ చైనా సముద్ర వివాదం, చైనా–నేపాల్–భారత్ మధ్య సంబంధాలు గురించి అధ్యయనం చేయాలి.



ఆర్థికాన్ని అర్థంచేసుకోండి

పరీక్షలో 'భారత, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ప్రణాళికలు' ఒక విభాగంగా ఉంది. అభ్యర్థులు ఈ విభాగాన్ని విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. భారత, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలను స్వాతంత్ర్యానికి పూర్వం, 1947 నుంచి నేటి వరకు, ప్రస్తుత స్థితిలుగా విభజించుకొని చదవాలి. ఆయా కాలాల్లో ఆర్థిక వ్యవస్థలు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన వృద్ధి, ప్రస్తుత ఆర్థిక స్థితిగతుల గురించి తెలుసుకోవాలి. జాతీయాదాయం అంశాలను అధ్యయనం చేయాలి. సిలబస్‌లో పేర్కొన్న 'ప్రణాళికలు'పై అవగాహన పెంచుకోవాలి. దేశ, రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల గురించి తెలుసుకోవాలి. వ్యవసాయ రంగంపై ఎక్కువగా దృష్టిపెట్టి చదవాలి. ఆర్‌బీఐ, బ్యాంకింగ్, మానిటరీ పాలసీ, విత్తమార్కెట్లు, సెబీ, భారత పన్నుల విధానం–జీఎస్టీ–దాని ప్రభావం, ఫైనాన్స్ కమిషన్–సిఫార్సులు, ప్రజా వ్యయం, ఫిజికల్ పాలసీ, బడ్జెట్ తదితర అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, దేశ, రాష్ట్ర ఆర్థిక లక్షణాలు, ఈ–గవర్నెన్స్ అంశాలు ఈ విభాగంలో కీలకంగా ఉంటాయి.

జాగ్రఫీ.. జయం

భౌతిక, సామాజిక, ఆర్థిక కోణాల్లో జాగ్రఫీని అధ్యయనం చేయాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలను వరల్డ్, ఇండియా, ఏపీ జాగ్రఫీలుగా విభజించుకొని చదవాలి. ఇంటర్ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో వరల్డ్, ఇండియన్ జాగ్రఫీల సమాచారం అందుబాటులో ఉంది. ఏపీ జాగ్రఫీ కోసం ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ఫాలో అవ్వాలి.

పేపర్ 2... చాలా కీలకం

- పేపర్–2 పార్ట్ ఏలో.. 'జనరల్ మెంటల్ అండ్ సైకలాజికల్ ఎబిలిటీస్' మొదటి విభాగంగా ఉంది. ఇందులో జనరల్ ఎబిలిటీ నుంచి నంబర్ బేస్డ్, లెటర్ బేస్డ్, జనరల్ ప్రశ్నలు వస్తాయి. పని–దూరం, పని–కాలం, శాతాలు, సరాసరి, వైశాల్యం, చుట్టుకొలత, సంఖ్యామానం తదితరాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు 1 నుంచి 60 వరకు స్క్వేర్‌లు, 1 నుంచి 20 క్యూబ్‌లను కంఠస్థం చేయాలి. తద్వారా నంబర్ బేస్డ్ ప్రశ్నలను సులభంగా సాధించేందుకు వీలవుతుంది. అలాగే ఎ నుంచి జెడ్ వరకు.. జెడ్ నుంచి ఎ వరకు.. ఇంగ్లిష్ అక్షరాలను, వాటి స్థాన విలువలను గుర్తుపెట్టుకోవడం ద్వారా లెటర్ బేస్డ్ ప్రశ్నలను సాధించొచ్చు. ఈ నైపుణ్యాలు కోడింగ్, డీకోడింగ్ ప్రశ్నల సాధనకు ఉపయోగపడతాయి. బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్ నుంచి జనరల్ ప్రశ్నలు వస్తాయి.
- సైకలాజికల్ ఎబిలిటీస్‌లో భావోద్వేగ ప్రజ్ఞ–కోణాలు, సహానుభూతి, సామాజిక ప్రజ్ఞ, డెసిషన్ మేకింగ్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ టాపిక్స్‌ను ముఖ్యమైనవిగా చెప్పవచ్చు.
- పేపర్–2 పార్ట్ బిలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ; అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ తాజా ప్రాధాన్యాంశాలు ఉప విభాగాలుగా ఉన్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీలో.. స్పేస్, డిఫెన్స్ టెక్నాలజీ, దైనందిన జీవితంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్, ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, భారత శక్తి వనరులు, సౌర, పవన విద్యుత్‌లు–ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు కీలకంగా ఉంటాయి. ఎన్విరాన్‌మెంటల్ సైన్సులో.. హరిత గృహ ప్రభావం, జీవ వైవిధ్యం, వాతావరణ మార్పులు–ప్రభావం, విపత్తుల నిర్వహణ, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ, అడవులు, వన్యమృగ సంరక్షణ తదితర అంశాలపై దృష్టిపెట్టాలి.
- అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ తాజా ప్రాధాన్యాంశాల కోసం దినపత్రికలు, కరెంట్ అఫైర్ మ్యాగజీన్‌లు, వెబ్‌సైట్లను ఉపయోగించుకోవాలి. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో పరీక్షకు ముందు వరకు జరిగిన కీలక ఘట్టాలు, మార్పులు, వివిధ సూచీలు, వాటిలో భారత్ పొందిన స్థానం తదితరాల గురించి తెలుసుకోవాలి.

> **బేసిక్స్‌తోనే భరోసా**
>
> ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్ష శైలి యూపీఎస్సీ తరహాలో మారింది. కాబట్టి అభ్యర్థులు బేసిక్స్‌పై పట్టుసాధించాలి. ఇటీవల కాలంలో పోటీ పరీక్షల్లో ఒకటి, రెండు విభాగాలు మినహా దాదాపు అన్ని అంశాల్లో కరెంట్ అఫైర్స్ మిళిత ప్రశ్నలు అడుగుతున్నారు. సైన్సు అండ్ టెక్నాలజీ, ఎకనామిక్స్‌లో ఈ ట్రెండ్ ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్షకు తక్కువ సమయం ఉంది కాబట్టి అభ్యర్థులంతా ప్రిలిమ్స్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రిపరేషన్ సాగించాలి. తద్వారా మెయిన్స్‌కు క్వాలిఫై అయ్యే అవకాశాలు మెరుగవుతాయి. ఒక స్థాయిలో ప్రిపేరైన అభ్యర్థులంతా 50శాతం ప్రశ్నలకు సులభంగా సమాధానాలు గుర్తించగలుగుతారు. మిగిలిన ప్రశ్నల్లో ఎవరైతే పైచేయి సాధిస్తారో వారికి మెయిన్స్ అర్హత లభిస్తుంది. ఆల్ ది బెస్ట్!
>
> **– ఆర్.రామ్‌కుమార్,**
> గ్రూప్–1, 2016 విజేత.

చార్టర్డ్ అకౌంటెన్సీ.. సంక్షిప్తంగా సీఏ! ఇది కష్టమైన కోర్సని భావిస్తూ.. ఎంతోమంది విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు జంకుతుంటారు. కానీ, ఇష్టంతో చదివితే సీఏలో విజయకేతనం ఎగురేయొచ్చని నిరూపించారు.. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు!! ఇటీవల విడుదలైన సీఏ ఫైనల్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జాతీయస్థాయిలో టాప్-50 ర్యాంకర్ల జాబితాలో చోటు సాధించారు. తాజాగా విడుదలైన సీఏ ఫైనల్ ఫలితాల్లో సక్సెస్ సాధించిన విజేతల మనోగతం మీకోసం...

సీఏ ఫైనల్

టాపర్ల... మనోగతం!

సక్సెస్ స్టోరీ

సేల్స్‌మ్యాన్ కుమార్తె.. సీఏ ఫైనల్‌లో సత్తా

మా స్వస్థలం గుంటూరు. నాన్న బేకరీలో సేల్స్‌మ్యాన్. అమ్మ అరుణ కుమారి గృహిణి. ఇద్దరూ పెద్దగా చదువుకోలేదు. ఆర్థిక సమస్యలు. దాంతో తక్కువ ఖర్చుతో ఉన్నత భవిష్యత్తు లభించే సీఏ కోర్సులో చేరేలా అమ్మానాన్న ప్రోత్సహించారు. ఫలితంగా అక్క వైష్ణవి సీఏ పూర్తి చేసింది. అక్కనే స్ఫూర్తిగా తీసుకుని నేను కూడా సీఏ కోర్సులో చేరాను. సీఏ లక్ష్యం చేరుకోవడానికి ఇంటర్మీడియెట్ నుంచే అడుగులు ప్రారంభించాను. ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ గ్రూప్ ఎంచుకొని మాస్టర్ మైండ్స్ సంస్థలో చేరాను. సీఏ తొలిదశ సీపీటీలో 183 మార్కులు రావడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. సీఏ పూర్తి చేయగలననే నమ్మకం కలిగింది. అదే స్ఫూర్తితో మిగతా దశలకు కూడా ప్రిపరేషన్ సాగించాను. ఫలితంగా తాజాగా సీఏ ఫైనల్‌ను కూడా తొలి ప్రయత్నంలో జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకుతో విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. సీఏ చదువుతూనే సీఎంఏ(కాస్ట్ అకౌంటెన్సీ) కోర్సుకు కూడా దరఖాస్తు చేసుకున్నాను. సీఎంఏ ఇంటర్‌లో 40వ ర్యాంకు వచ్చింది. సీఏ కోర్సును ఇష్టంగా చదివితే సులువుగా విజయం సాధించొచ్చు.



కమతం విజయలక్ష్మి,
ఆలిండియా
నాలుగో ర్యాంకు.

గుమాస్తా కొడుకు.. సీఏపై గురి

మా స్వస్థలం తుని. నాన్న వెంకటరమణ ఒక ట్రాన్స్‌పోర్ట్ సంస్థలో గుమాస్తాగా ఉద్యోగం చేస్తున్నారు. అమ్మ సుబ్బలక్ష్మి గృహిణి. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. సీఏ కోర్సు పూర్తి చేస్తే ఉన్నత అవకాశాలు లభించడమే కాకుండా.. సమాజంలో గుర్తింపు లభిస్తుందనే ఆలోచనతోనే ఇందులో చేరాను. ఇంటర్‌లో అడుగుపెట్టిన ప్పటి నుంచి సీఏలో గెలుపు దిశగా కృషి చేశాను. ఫలితాల గురించి ఆందోళన చెందకుండా.. సబ్జెక్ట్‌పై పట్టు సాధిస్తే విజయం సొంతమవుతుందనే ఆలోచనతో చదివాను. దీంతో ఎలాంటి ఒత్తిడి ఎదురుకాలేదు. ఫలితంగా సీఏ ఐపీసీసీని తొలి ప్రయత్నంలోనే పూర్తి చేశాను. తాజాగా సీఏ ఫైనల్‌ను కూడా తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో 13వ ర్యాంకుతో పూర్తి చేయగలిగాను. సీఏలో విజయం సాధించడానికి హార్డ్ వర్క్ ఎంతో ప్రధానం. దీనికితోడు ప్రిపరేషన్ పరంగా పకడ్బందీ ప్రణాళికతో వ్యవహరించాలి.



మారెడ్డి భానుప్రసాద్,
ఆలిండియా
13వ ర్యాంకు.

అమ్మ ప్రోత్సాహంతోనే విజయం

నా విద్యాభ్యాసం అంతా గుంటూరులోనే. నాన్న కోటేశ్వరరావు. అమ్మ మల్లీశ్వరి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగిణి. అమ్మ.. నన్ను, అక్కను మంచి చదువులు చదివేలా చిన్నప్పటి నుంచి ప్రోత్సహించింది. సీఏ కోర్సు పూర్తి చేస్తే మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని, తొలి ప్రయత్నంలోనే విజయం సాధించే విధంగా కృషి చేస్తే చిన్న వయసులో కెరీర్‌లో స్థిరపడొచ్చని స్నేహితురాలు చెప్పింది. ఇంటర్మీడియెట్ చదువుతూనే సీఏ సీపీటీకి ప్రిపరేషన్ సాగించాను. తొలి ప్రయత్నంలోనే 179 మార్కులతో విజయం సాధించాను. దీంతో సీఏ చదవగలనని పూర్తి స్థాయిలో నమ్మకం కలిగింది. దాన్ని కొనసాగిస్తూనే సీఏ ఐపీసీసీకి కూడా సన్నద్ధమయ్యాను. ఈ దశలోనూ తొలి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించాను. తాజాగా ఫైనల్ కూడా తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. సీఏ కోర్సులో విజయానికి ప్రధానంగా లాజికల్ థింకింగ్ అప్రోచ్ ఉండాలి. ఆ దృక్పథం ఉంటేనే పరీక్షలో ఎలాంటి ప్రశ్న ఎదురైనా సమాధానం రాయగలిగే సన్నద్ధత లభిస్తుంది.



పిట్టల లక్ష్మి దీపిక,
ఆలిండియా
22వ ర్యాంకు.

అన్నయ్య మాటలే స్ఫూర్తిగా..

మా స్వస్థలం గుంటూరు. నాన్న ఈశ్వర్ రెడ్డి, వృత్తిరీత్యా వ్యాపారి. అమ్మ భారతి గృహిణి. సీఏ పూర్తిచేసిన అన్నయ్య సలహాతో.. పదో తరగతిలోనే సీఏ లక్ష్యంగా నిర్దేశించుకున్నాను. ఇంటర్ పూర్తి కాగానే సీఏ సీపీటీలో ఉత్తీర్ణత సాధించాను. తర్వాత సీఏ–ఐపీసీసీలోనూ 362 మార్కులతో రెండు గ్రూప్‌లలోనూ విజయం సాధించాను. సీఏ ఫైనల్‌లోనూ తొలి ప్రయత్నంలోనే విజయం సాధించడానికి పకడ్బందీ ప్రణాళికతో చదివాను. ఎప్పటికప్పుడు సబ్జెక్ట్‌లోని అంశాల ప్రిపరేషన్ పూర్తి చేసుకోవడం, రివిజన్‌కు తగినంత సమయం లభించేలా టైమ్ మేనేజ్‌మెంట్ పాటించాను. మాక్ టెస్ట్, రివిజన్ టెస్ట్‌లకు హాజరుకావడం కలిసొచ్చింది. ఫలితంగా తొలి ప్రయత్నంలోనే ఫైనల్‌లో విజయం సొంతమైంది.



తూము భాగ్యలక్ష్మి,
ఆలిండియా
47వ ర్యాంకు.

పట్టుదలతోనే విజయం

మా స్వస్థలం భీమవరం. నాన్న పెరుమాళ్ల గుప్తా నగల వ్యాపారం చేస్తున్నారు. అమ్మ మాధవి గృహిణి. పదోతరగతిలోనే సీఏ కోర్సు గురించి స్నేహితురాలి ద్వారా తెలుసుకున్నాను. సీఏ లక్ష్యంగా ఎంచుకున్నప్పటికీ.. ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్‌లో చేరాను. సీఏ సీపీటీలో 157 మార్కులతో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాను. అదే ఉత్సాహంతో సీఏ–ఐపీసీసీ దిశగా అడుగులు వేశాను. అందులోనూ తొలి ప్రయత్నంలోనే గట్టెక్కాను. ఇంకొక్క దశ (సీఏ ఫైనల్) పూర్తి చేస్తే సీఏ లక్ష్యం చేరుకోవచ్చనే నమ్మకంతో ఫైనల్‌కు పకడ్బందీగా ప్రిపరేషన్ సాగించాను. ఫలితంగా తాజాగా విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో 49వ ర్యాంకు సొంతం చేసుకోగలిగాను. సీఏ కోర్సు విజయం దిశగా.. ప్రిపరేషన్ సమయంలో అకడమిక్ సబ్జెక్ట్‌లపై పట్టుతోపాటు సెల్ఫ్ మోటివేషన్ ఎంతో ప్రధానం. అప్పుడే కోర్సు పట్ల ఇష్టం కలుగుతుంది. నిర్దిష్టంగా ఒక ప్రామాణిక మెటీరియల్‌ను ఎంపిక చేసుకుని దానికి పరిమితమై.. అందులోని అంశాలపై పట్టు సాధిస్తే పరీక్షలో విజయం తథ్యం!!



కారుమూరి మధురిమ,
ఆలిండియా
49వ ర్యాంక్.

2 న్యూజిలాండ్ గడ్డపై భారత్ గెలిచిన వన్డే సిరీస్‌ల సంఖ్య. ఇప్పటి వరకు న్యూజిలాండ్‌లో భారత్ ఎనిమిది ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లు ఆడింది.

2 తొలుత బ్యాటింగ్ చేస్తూ 20 పరుగులలోపే నాలుగు వికెట్లు కోల్పోయాక కూడా భారత్ వన్డే మ్యాచ్‌లో నెగ్గడం ఇది రెండోసారి మాత్రమే. చివరిసారి 1983 ప్రపంచ కప్‌లో జింబాబ్వేపై లీగ్ మ్యాచ్‌లో భారత్ (9/4; 268/8; కపిల్ దేవ్ 175 నాటౌట్) ఈ ఘనత సాధించింది.

4 వన్డేల్లో 'హ్యాట్రిక్' సిక్స్‌లు కొట్టడం హార్దిక్ పాండ్యాకిది నాలుగోసారి. ఓవరాల్‌గా ఐదోసారి.

3 భువనేశ్వర్, జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత వన్డే సిరీస్‌లో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం సాధించిన మూడో భారతీయ పేసర్‌గా షమీ నిలిచాడు.

3 అజహరుద్దీన్ (334)ను వెనక్కి నెట్టి భారత్ తరఫున అత్యధిక వన్డేలు ఆడిన మూడో క్రికెటర్‌గా ధోని (335) నిలిచాడు. తొలి రెండు స్థానాల్లో సచిన్ టెండూల్కర్ (463), రాహుల్ ద్రవిడ్ (340) ఉన్నారు.

6 జూన్ 2016 నుంచి విదేశీ గడ్డపై భారత జట్టు సాధించిన వన్డే సిరీస్ విజయాలు (జింబాబ్వేపై 3-0; వెస్టిండీస్‌పై 3-1; శ్రీలంకపై 5-0; దక్షిణాఫ్రికాపై 5-1; ఆస్ట్రేలియాపై 2-1; న్యూజిలాండ్‌పై 4-1).

'ఐదు'లో అదుర్స్

కివీస్ గడ్డపై భారత ఆట అద్భుతంగా 'స్వింగ్' అయింది. గత పోరు పరాభవాన్ని ఒక్క మ్యాచ్‌కే పరిమితం చేస్తూ టీమిండియా మళ్లీ సత్తా చాటింది. చివరి మ్యాచ్‌లో ఆరంభ తడబాటును అధిగమించి తక్కువ స్కోరుతోనే ప్రత్యర్థికి సవాల్ విసిరిన రోహిత్ సేన మరో చక్కటి బౌలింగ్ ప్రదర్శనతో వన్డే పోరును విజయవంతంగా ముగించింది. 4-1తో సిరీస్ గెలుచుకొని గత పర్యటనలో ఓడిన నాలుగు వన్డేలకు సరైన ప్రతీకారం తీర్చుకుంది.

పది ఓవర్లు కూడా పూర్తి కాకముందే భారత్ స్కోరు 18/4. ప్రత్యర్థి పేస్‌కు మళ్లీ కుప్పకూలడం ఖాయమన్నట్లుగా కనిపించింది. కానీ కివీస్‌కు ఈసారి మన జట్టు ఆ అవకాశం ఇవ్వలేదు. ముందుగా రాయుడు, విజయ్ శంకర్ తమ బ్యాటింగ్‌తో పరిస్థితిని చక్కదిద్దితే, హార్దిక్ పాండ్యా సిక్సర్ల మోత జట్టును మెరుగైన స్థితిలో నిలిపింది. బౌలింగ్‌లో ఎప్పటిలాగే షమీ శుభారంభానికి తోడు చహల్, కేదార్ జాదవ్ స్పిన్ సత్తాతో మ్యాచ్ మన ఖాతాలో చేరింది.





3 ఇప్పటివరకు కెరీర్‌లో 52 వన్డేలు ఆడిన అంబటి రాయుడు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు సాధించడం ఇది మూడోసారి. ఈ మ్యాచ్‌కంటే ముందు రాయుడు (శ్రీలంకపై అహ్మదాబాద్‌లో 2014; జింబాబ్వేపై హరారేలో 2015) రెండుసార్లు ఈ ఘనత సాధించాడు.

చివరి వన్డేలో 35 పరుగులతో భారత్ విజయం

- న్యూజిలాండ్‌పై 4–1తో సిరీస్ సొంతం
- అంబటి రాయుడు 90
- రాణించిన పాండ్యా, శంకర్, జాదవ్
- బుధవారం తొలి టి20

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ గడ్డపై భారత జట్టు మరో చక్కటి విజయంతో వన్డే సిరీస్‌ను ముగించింది. ఆదివారం ఇక్కడ జరిగిన ఐదో వన్డేలో భారత్ 35 పరుగుల తేడాతో కివీస్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అంబటి రాయుడు (113 బంతుల్లో 90; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విజయ్ శంకర్ (64 బంతుల్లో 45; 4 ఫోర్లు), కేదార్ జాదవ్ (45 బంతుల్లో 34; 3 ఫోర్లు) రాణించారు. రాయుడు, శంకర్ ఐదో వికెట్‌కు 98 పరుగులు జత చేశారు. చివర్లో హార్దిక్ పాండ్యా (22 బంతుల్లో 45; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపు ప్రదర్శన మరో విశేషం. టాడ్ ఆస్టల్ వేసిన ఇన్నింగ్స్ 47వ ఓవర్లో పాండ్యా వరుసగా మూడు సిక్సర్లు కొట్టాడు. అనంతరం న్యూజిలాండ్ 44.1 ఓవర్లలో 217 పరుగులకే ఆలౌటైంది. జిమ్మీ నీషమ్ (32 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), విలియమ్సన్ (39), లాథమ్ (37) ఫర్వాలేదనిపించారు. చహల్ 3, షమీ 2 వికెట్లు పడగొట్టారు. నాలుగో వన్డే మినహా మిగతా నాలుగు మ్యాచ్‌లు గెలుచుకున్న భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4–1తో సొంతం చేసుకుంది. నిలకడైన బౌలింగ్‌తో 4 ఇన్నింగ్స్‌లలో కలిపి 9 వికెట్లు తీసిన షమీ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. టి20 సిరీస్‌లో తొలి మ్యాచ్ బుధవారం ఇదే మైదానంలో జరుగుతుంది.

కీలక భాగస్వామ్యాలు...

భారత జట్టుకు లభించిన ఆరంభం చూస్తే నాలుగో వన్డే ఫలితమే పునరావృతమయ్యేలా కనిపించింది. స్వింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై కివీస్ పేసర్లు హెన్రీ, బౌల్ట్ చెలరేగిపోయారు. ఇబ్బంది పడుతూ ఆడిన రోహిత్ శర్మ (2)ను హెన్రీ ఔట్ చేయగా, తర్వాతి ఓవర్లోనే ధావన్ (6)ను బౌల్ట్ పెవిలియన్ పంపించాడు. మరుసటి ఓవర్లోనే సునాయాస క్యాచ్ ఇచ్చిన గిల్ (7) తన రెండో అవకాశాన్ని కూడా వృథా చేసుకున్నాడు. బౌల్ట్ అద్భుత బంతికి ధోని (1) కూడా క్లీన్ బౌల్డయ్యాడు. ఈ స్థితిలో స్కోరు మరోసారి 100 పరుగులైనా దాటుతుందా అనిపించింది. అయితే రాయుడు, శంకర్ కీలక భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. నిలదొక్కుకున్నాక చక్కటి షాట్లు ఆడారు. కెరీర్ తొలి మూడు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేయని శంకర్... ఇప్పుడు లభించిన తొలి అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకున్నాడు. కఠిన పరిస్థితుల్లో, తీవ్ర ఒత్తిడి సమయంలో బరిలోకి దిగి తన సామర్థ్యాన్ని ప్రదర్శించాడు. అయితే సమన్వయ లోపంతో రనౌటై శంకర్ నిరాశగా వెనుదిరిగాడు. మున్రో వేసిన బంతిని షార్ట్ మిడ్ వికెట్ వద్దకు ఆడి సింగిల్ కోసం ప్రయత్నించగా రాయుడు ఆలస్యంగా స్పందించాడు. అయితే పరుగు మొదలు పెట్టిన శంకర్ సరైన సమయంలో క్రీజ్‌లోకి చేరలేకపోయాడు. ఆ తర్వాత వచ్చిన జాదవ్ కూడా రాయుడుకు అండగా నిలిచి చకచకా పరుగులు చేశాడు. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా... చివర్లో పాండ్యా మెరుపు బ్యాటింగ్ భారత్ స్కోరును 250 పరుగులు దాటించింది.

కొనసాగిన తడబాటు...

న్యూజిలాండ్‌కు మరోసారి మెరుగైన ఆరంభం లభించలేదు. షమీ దెబ్బకు నికోల్స్ (8) తొందరగానే ఔట్ కాగా... మున్రో (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా షమీ బౌలింగ్‌లోనే బౌల్డయ్యాడు. ఆ వెంటనే టేలర్ (1)ను పాండ్యా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అయితే రీప్లేలో బంతి వికెట్ల మీద నుంచి వెళుతున్నట్లుగా కనిపించింది. టేలర్ రివ్యూ కోరకపోవడంతో కివీస్ స్కోరు 38/3 వద్ద నిలిచింది. ఈ దశలో విలియమ్సన్, లాథమ్ కలిసి ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే భారత బౌలింగ్ కట్టుదిట్టంగా సాగడంతో పరుగుల వేగం మందగించింది. ఇదే అసహనంతో జాదవ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి విలియమ్సన్ డీప్ మిడ్‌వికెట్‌లో క్యాచ్ ఇవ్వడంతో 67 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. కొద్ది సేపటికే చహల్ తన వరుస ఓవర్లలో లాథమ్, గ్రాండ్‌హోమ్ (11)లను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపించాడు. నీషమ్ క్రీజ్‌లో ఉన్నంత సేపు కివీస్‌కు విజయంపై ఆశలు ఉన్నా... అతని రనౌట్‌తో పరిస్థితి మారిపోయింది. మరో 5.5 ఓవర్లు మిగిలి ఉండగానే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) హెన్రీ 2; ధావన్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 6; గిల్ (సి) సాన్‌ట్నర్ (బి) హెన్రీ 7; రాయుడు (సి) మున్రో (బి) హెన్రీ 90; ధోని (బి) బౌల్ట్ 1; విజయ్ శంకర్ (రనౌట్) 45; జాదవ్ (బి) హెన్రీ 34; పాండ్యా (సి) బౌల్ట్ (బి) నీషమ్ 45; భువనేశ్వర్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 6; షమీ (రనౌట్) 1; చహల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 252.**
వికెట్ల పతనం: 1–8; 2–12; 3–17; 4–18; 5–116; 6–190; 7–203; 8–248; 9–252; 10–252.
బౌలింగ్: హెన్రీ 10–1–35–4; బౌల్ట్ 9.5–2–39–3; నీషమ్ 5–0–33–1; గ్రాండ్‌హోమ్ 7–0–33–0; మున్రో 10–0–47–0; సాన్‌ట్నర్ 3–0–18–0; ఆస్టల్ 5–0–35–0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: మున్రో (బి) షమీ 24; నికోల్స్ (సి) జాదవ్ (బి) షమీ 8; విలియమ్సన్ (సి) ధావన్ (బి) జాదవ్ 39; టేలర్ (ఎల్బీ) (బి) పాండ్యా 1; లాథమ్ (ఎల్బీ) (బి) చహల్ 37; నీషమ్ (రనౌట్) 44; గ్రాండ్‌హోమ్ (ఎల్బీ) (బి) చహల్ 11; సాన్‌ట్నర్ (సి) షమీ (బి) పాండ్యా 22; ఆస్టల్ (ఎల్బీ) (బి) చహల్ 10; హెన్రీ (నాటౌట్) 17; బౌల్ట్ (సి) షమీ (బి) భువనేశ్వర్ 1; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (44.1 ఓవర్లలో ఆలౌట్) 217.
వికెట్ల పతనం: 1–18; 2–37; 3–38; 4–105; 5–119; 6–135; 7–176; 8–194; 9–204; 10–217. **బౌలింగ్:** భువనేశ్వర్ 7.1–0–38–1; షమీ 8–0–35–2; పాండ్యా 8–1–50–2; విజయ్ శంకర్ 4–0–19–0; చహల్ 10–0–41–3; జాదవ్ 7–0–34–1.

రాయుడు మార్క్...

మ్యాచ్‌లో చక్కటి ఇన్నింగ్స్‌తో తెలుగు తేజం అంబటి రాయుడు జట్టులో తన విలువేమిటో మరోసారి చూపించాడు. అతను క్రీజ్‌లోకి వచ్చే సమయానికి స్కోరు 12/2... వెల్లింగ్టన్ మరో హామిల్టన్‌లా మారలేదంటే రాయుడే కారణం. ఐదో వన్డేలో అతని ఆట జట్టుకు ప్రాణం పోసింది. పరిస్థితులను బట్టి మొదట్లో నిలదొక్కుకునేందుకు ప్రయత్నించిన రాయుడు, ఆ తర్వాత ధాటిని ప్రదర్శించాడు. తొలి 36 బంతుల్లో 7 పరుగులే చేసిన అతను తర్వాతి బంతికి మొదటి ఫోర్ కొట్టాడంటే ఎంత సంయమనంతో బ్యాటింగ్ చేశాడో అర్థం చేసుకోవచ్చు. కొద్దిసేపటికి గ్రాండ్‌హోమ్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి రాయుడు గేర్ మార్చాడు. మున్రో బౌలింగ్‌లో భారీ సిక్స్ బాదిన అనంతరం గ్రాండ్‌హోమ్ ఓవర్లోనే వరుసగా రెండు ఫోర్లతో 86 బంతుల్లో రాయుడు అర్ధ సెంచరీ పూర్తయింది. మళ్లీ మున్రో ఓవర్లోనే కొట్టిన రెండు భారీ సిక్సర్లు అతని ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచాయి. అంతకుముందు 60 పరుగుల వద్ద లాంగాన్‌లో బౌల్ట్ క్యాచ్ వదిలేయడంతో రాయుడు బతికిపోయాడు. హెన్రీ బౌలింగ్‌లో మూడు ఫోర్లు కొట్టి 90కి చేరుకున్న రాయుడుకు సెంచరీ చేజారిపోయింది. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి ఎక్స్‌ట్రా కవర్‌లో మున్రోకు క్యాచ్ ఇవ్వడంతో అతని ఆట ముగిసింది. తను ఎదుర్కొన్న చివరి 31 బంతుల్లో 46 పరుగులు చేసిన అతను లెక్క సరి చేసే ప్రయత్నం చేశాడు. జట్టును ఆదుకునే ప్రయత్నంలో ఆటను ప్రారంభించిన తీరును బట్టి చూస్తే 79.64 స్ట్రయిక్‌రేట్‌తో ఇన్నింగ్స్‌ను ముగించడం అంటే అది ప్రశంసాపూర్వక ప్రదర్శనే.

2018లో రాయుడు 10 ఇన్నింగ్స్‌లలో 56 సగటుతో 393 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 3 అర్ధ సెంచరీలు ఉన్నాయి. కానీ ఆస్ట్రేలియాతో రెండు ఇన్నింగ్స్‌లు విఫలం కాగానే అతని ఆటపై కొందరు సందేహాలు లేవనెత్తారు. మిడిలార్డర్‌లో రాయుడు స్థానాన్ని ప్రశ్నిస్తూ వరల్డ్ కప్‌కు కష్టమే అన్నట్లుగా మాట్లాడారు. కానీ తాజా ఇన్నింగ్స్ అసలు సిసలు మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ ఎలా ఉంటాడో చూపించింది. ప్రపంచ కప్‌కు ముందు విదేశీ గడ్డపై ఆడిన ఆఖరి మ్యాచ్‌లో రాయుడు చూపిన పట్టుదల ఇక అందరి అనుమానాలను పటాపంచలు చేసిందనేది వాస్తవం. ఇది మరో మాటకు తావు లేకుండా అతడి వరల్డ్ కప్ స్థానాన్ని కూడా ఖాయం చేసింది.

దక్షిణాఫ్రికాదే టి20 సిరీస్


మిల్లర్

జొహన్నెస్‌బర్గ్: కీలకదశలో వికెట్లు కోల్పోయిన పాకిస్తాన్... దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో ఏడు పరుగుల తేడాతో ఓడిపోయింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నెగ్గిన దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సొంతం చేసుకుంది. తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 3 వికెట్లకు 188 పరుగులు చేసింది. తాత్కాలిక కెప్టెన్ డేవిడ్ మిల్లర్ (29 బంతుల్లో 65 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), డసెన్ (27 బంతుల్లో 45; ఫోర్, 4 సిక్స్‌లు) మెరిశారు. అనంతరం పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 181 పరుగులు చేసి ఓడిపోయింది. ఓపెనర్ బాబర్ ఆజమ్ (58 బంతుల్లో 90; 13 ఫోర్లు, సిక్స్), హుస్సేన్ తలత్ (55; 7 ఫోర్లు, సిక్స్) దూకుడుగా ఆడారు. ఒకదశలో 16 ఓవర్లలో 147/1తో పటిష్టంగా కనిపించిన పాక్ తొమ్మిది బంతుల తేడాతో ఆజమ్, తలత్ వికెట్లను కోల్పోవడంతో విజయంపై ఆశలు వదులుకుంది. మూడో టి20 మ్యాచ్ బుధవారం జరుగుతుంది.

కాలికట్ హీరోస్ శుభారంభం

కొచ్చి: ప్రొ వాలీబాల్ లీగ్‌లో కాలికట్ హీరోస్ జట్టు బోణీ చేసింది. ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కాలికట్ హీరోస్ 15–8, 15–8, 13–15, 15–11, 15–11తో చెన్నై స్పార్టన్స్‌పై విజయం సాధించింది. మ్యాచ్ మొత్తంలో కాలికట్ స్మాష్‌ల ద్వారా 38 పాయింట్లు సాధించగా... సర్వీస్‌లో తొమ్మిది పాయింట్లు, బ్లాకింగ్ ద్వారా ఎనిమిది పాయింట్లు గెల్చుకుంది. చెన్నై స్పార్టన్స్ స్మాష్‌లతో 22 పాయింట్లు గెల్చుకోగా... బ్లాకింగ్, సర్వీస్‌ల ద్వారా ఐదేసి పాయింట్లు లభించాయి. కాలికట్ జట్టులో అజిత్ లాల్ 14 పాయింట్లు, కార్తీక్ 11 పాయింట్లు సాధించారు. నేడు బ్లాక్‌హాక్స్ హైదరాబాద్‌తో అహ్మదాబాద్ డిఫెండర్స్ తలపడుతుంది.

వెస్టిండీస్ ఘన విజయం

10 వికెట్లతో ఇంగ్లండ్ చిత్తు

నార్త్‌సౌండ్: సొంతగడ్డపై వెస్టిండీస్ మరోసారి చెలరేగింది. మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో 10 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుగా ఓడించింది. ఫలితంగా మూడు టెస్టుల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. బ్యాట్స్‌మెన్ మళ్లీ విఫలం కావడంతో ఇంగ్లండ్ శనివారం తమ రెండో ఇన్నింగ్స్‌లో 132 పరుగులకే కుప్పకూలింది. బట్లర్ (24)దే అత్యధిక స్కోరు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కీమర్ రోచ్ (4/52), కెప్టెన్ హోల్డర్ (4/43) తమ పేస్‌తో ప్రత్యర్థిని పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో 119 పరుగుల ఆధిక్యాన్ని మినహాయిస్తే...14 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ 13 బంతుల్లో వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసింది. 2009 తర్వాత ఇంగ్లండ్‌పై వెస్టిండీస్‌కు ఇదే తొలి సిరీస్ విజయం.


రోచ్, హోల్డర్

మూడో టెస్టు ఈ నెల 9నుంచి గ్రాస్ ఐలెట్‌లో జరుగుతుంది. **మరోవైపు స్లో ఓవర్ రేట్ కారణంగా విండీస్ కెప్టెన్ హోల్డర్‌పై ఐసీసీ ఒక టెస్టు నిషేధం విధించడంతో తర్వాతి మ్యాచ్‌కు అతను దూరం కానున్నాడు.**

లంక ముందు కొండంత లక్ష్యం


ఖాజా

- ఉస్మాన్ ఖాజా సెంచరీ
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 196/3 డిక్లేర్డ్
- శ్రీలంక లక్ష్యం 516

కాన్‌బెర్రా: రెండో టెస్టులో ఆస్ట్రేలియా... శ్రీలంక ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచింది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలున్న ఈ టెస్టులో శ్రీలంకకు 516 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మ్యాచ్ ద్వారా ఎట్టకేలకు ఉస్మాన్ ఖాజా (101 నాటౌట్, 14 ఫోర్లు) ఫామ్‌లోకి వచ్చాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 123/3తో మూడో రోజు ఆట కొనసాగించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 215 పరుగుల వద్ద ఆలౌటైంది. స్టార్క్ (5/54) లంకపై పంజా విసిరాడు. లయన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఆసీస్‌ను ఖాజా నడిపించాడు. జట్టులో స్థానం ప్రశ్నార్థకమైన దశలో శ్రీలంకపై అజేయ శతకం సాధించాడు. దీంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఓపెనర్లు హారిస్ (14), బర్న్స్ (9)లతో పాటు లబ్‌షేన్ (4) విఫలం కాగా... ఖాజా, హెడ్ (59 నాటౌట్; 8 ఫోర్లు) అజేయంగా రాణించారు. ఇద్దరు అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 159 పరుగులు జోడించారు. ఖాజా సెంచరీ పూర్తవగానే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. ఆ తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో ఆట నిలిచే సమయానికి 6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసింది. కరుణరత్నే (8 బ్యాటింగ్), తిరిమన్నె (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

విదర్భ 200/7

సౌరాష్ట్రతో రంజీ ఫైనల్

నాగ్‌పూర్: సౌరాష్ట్ర బౌలర్లు తొలిరోజు ఆటను శాసించారు. రంజీ ట్రోఫీ ఫైనల్లో విదర్భ బ్యాట్స్‌మెన్‌ను క్రీజులో నిలువకుండా దెబ్బమీద దెబ్బ కొట్టారు. సౌరాష్ట్ర కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (2/26) విదర్భ టాప్ లేపాడు. కీలకమైన విదర్భ 'రన్ మెషీన్' వసీమ్ జాఫర్ (23; 1 ఫోర్, 1 సిక్స్)తో పాటు ఓపెనర్ సంజయ్ (2)ను ఔట్ చేశాడు. మిగతా బౌలర్లు తలా ఒక చేయి వేశారు. దీంతో ఆదివారం మొదటి రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. మొదట టాస్ నెగ్గిన విదర్భ బ్యాటింగ్ ఎంచుకుంది. సంజయ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కెప్టెన్ ఫైజ్ ఫజల్ (16) శుభారంభం ఇవ్వడంలో విఫలమయ్యాడు. ఫజల్ రనౌట్ కాగా, ఉనాద్కట్ బౌలింగ్‌లో సంజయ్, జాఫర్ నిష్క్రమించడంతో విదర్భ 60 పరుగులకే 3 టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. తర్వాత వచ్చిన వారిలో మోహిత్ కాలే (35; 4 ఫోర్లు), గణేశ్ సతీశ్ (32; 1 ఫోర్, 1 సిక్స్) కాసేపు నిలబడటంతో జట్టు స్కోరు 100 పరుగులు దాటింది. తర్వాత సౌరాష్ట్ర బౌలర్లు మూకుమ్మడిగా పట్టుబిగించడంతో విదర్భ ఇన్నింగ్స్ కకావికలమైంది. జట్టు స్కోరు 106 పరుగుల వద్ద మోహిత్ కాలేను స్పిన్నర్ కమలేశ్ మక్వానా, సతీశ్‌ను మీడియం పేసర్ ప్రేరక్ మన్కడ్ స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేర్చారు. ఇది చాలదన్నట్లు క్రీజులో పాతుకుపోతున్న అక్షయ్ వాడ్కర్ (45)ను చేతన్ సాకరియా సాగనంపాడు. దీంతో 33 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లను కోల్పోయింది. ఆట నిలిచే సమయానికి అక్షయ్ కర్నేవర్ (31 బ్యాటింగ్), అక్షయ్ వఖరే (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.


సౌరాష్ట్ర సంబరం

ఐర్లాండ్‌పై భారత్ సంచలన విజయం

ముర్సియా (స్పెయిన్): మహిళల హాకీ ప్రపంచకప్ రన్నరప్ ఐర్లాండ్ జట్టుపై భారత్ సంచలన విజయం సాధించింది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 3–0తో గెలిచింది. భారత్ తరఫున నవ్‌జ్యోత్ కౌర్ (13వ నిమిషంలో), రీనా ఖోఖర్ (26వ నిమిషంలో), గుర్జీత్ కౌర్ ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్‌తో భారత క్రీడాకారిణి నవ్‌జ్యోత్ కౌర్ కెరీర్‌లో 150 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. తొలి మ్యాచ్‌ను 1–1తో 'డ్రా' చేసుకున్న భారత్... రెండో మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 1–0తో సొంతం చేసుకుంది.

విజేత రమిత్ టాండన్



న్యూఢిల్లీ: భారత యువ స్క్వాష్ ప్లేయర్ రమిత్ టాండన్ తన కెరీర్‌లో నాలుగో అంతర్జాతీయ టైటిల్‌ను సాధించాడు. అమెరికాలో జరిగిన సియాటిల్ ఓపెన్ ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) చాలెంజర్ టోర్నమెంట్‌లో రమిత్ చాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్లో ప్రపంచ 58వ ర్యాంకర్ రమిత్ 11–4, 11–7, 2–11, 11–2తో మొహమ్మద్ ఎల్ షెర్బిని (ఈజిప్ట్)పై గెలుపొందాడు.

ఏయూకు కేంద్ర సాయం రూ.100 కోట్లు



ఏయూలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ (రూసా) 2లో భాగంగా కేంద్రం రూ.100 కోట్లు మంజూరు చేసిందని వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తొలి దశలో రూసాలో రూ.20 కోట్లు మంజూరయ్యాయని, ఇప్పుడు మంజూరైన రూ.100 కోట్లతో వర్సిటీలో విద్యార్థులకు మూడు హాస్టల్స్‌తో పాటు ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కాగా, రూసా కార్యక్రమంలో భాగంగా ఏయూలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని నరేంద్రమోదీ శ్రీనగర్ నుంచి డిజిటల్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని వీసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ కె.హరిబాబు, వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల కాళ్ల కింద పడి వ్యక్తి మృతి

చిత్తూరు జిల్లాలో పశువుల పండుగలో అపశ్రుతి

వెదురుకుప్పం: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం కాపు మొండివెంగనపల్లె గ్రామంలో ఆదివారం జరిగిన పశువుల పండుగలో అపశ్రుతి చోటు చేసుకుంది. పశువులను నిలువరించే క్రమంలో వాటి కాళ్లకిందపడి ఒక వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు... రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం గ్రామానికి చెందిన ధర్మయ్య (60) ఆదివారం మొండివెంగనపల్లె గ్రామంలో జరిగిన పశువుల పండుగను తిలకించేందుకు వచ్చాడు. పశువులను పందేనికి వదులుతున్న సమయంలో ధర్మయ్య పలకలు లాక్కునేందుకు వరుసలో నిలబడి ఎద్దును నిలువరించే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో ఎద్దుకొమ్ము తగిలి తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. పశువులు అతన్ని తొక్కుకుంటూ వెళ్లిపోతుండటంతో గమనించిన యువకులు అతన్ని పక్కకిలాగి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు.

రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

నెల్లూరు (వేదాయపాళెం): రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని, ఈ మేరకు ప్రజాతంత్ర శక్తులతో కలిసి పనిచేస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. నెల్లూరులో ఆదివారం నిర్వహించిన సభలో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో నూతనంగా చేరిన యువకులకు ఆయన పార్టీ కండువాను కప్పిసాదరంగా ఆహ్వానించారు. మధు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని, తర్వాత చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. వచ్చేఎన్నికల్లో అధికారంలోకి రావాలని కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేసేందుకు రకరకాల హామీలను ఇస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీలతో రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పాటు దిశగా కృషి చేస్తున్నామన్నారు.

టీటీడీ ఆలయాల భద్రత గాలికి!

- మొన్న కోదండరామస్వామి, నిన్న పద్మావతి అమ్మవారి ఆలయంలో నగలు మాయం
- నేడు గోవిందరాజస్వామి గుడిలో మూడు కిరీటాలు చోరీ
- రెండ్రోజులు గడుస్తున్నా దొరకని ఆచూకీ
- ఇంటిదొంగల పనేనంటూ ప్రచారం
- ఆభరణాలంటే అధికారులకు 'లెక్క' లేనితనం
- ఘటనలపై మొక్కుబడి విచారణలతో సరి
- కఠిన చర్యలు తీసుకోవడంలో సర్కారు, టీటీడీ తీవ్ర నిర్లక్ష్యం
- భద్రతా సిబ్బంది నియామకంలోనూ నాన్చుడే



సాక్షి, తిరుపతి/తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాలకు భద్రత కరువైంది. ఇప్పటికి అనేకమార్లు టీటీడీ ఆలయాల్లో దొంగతనాలు జరిగినా అటు ప్రభుత్వం కానీ, ఇటు టీటీడీ కానీ సరైన చర్యలు తీసుకోకుండా తీవ్ర నిర్లక్ష్యంగా ఉంటున్నాయి. ఫలితంగా ఇలాంటి దుర్ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. తాజాగా తిరుపతి నగరం నడిబొడ్డున కొలువుదీరిన శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు అలంకరించే మూడు బంగారు కిరీటాలు చోరీకి గురైన సంఘటన శనివారం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. నాలుగేళ్ల క్రితం నగరంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో బంగారు ఆభరణం అపహరణకు గురైంది. అలాగే, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలోనూ గత ఏడాది కాసుల హారం మాయమైంది. ఇకపోతే తిరుమల శ్రీవారి ఆలయంలో విలువైన పింక్ డైమండ్, మరికొన్ని విలువైన ఆభరణాలు మాయమయ్యాయనే ఆరోపణలు ఉన్నా అందులో నిజానిజాలను ఇంతవరకు నిగ్గుతేల్చిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో విచారణల పేరుతో కాలయాపన చేస్తూ టీటీడీ ఆలయాల భద్రతను గాలికొదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చోరీని గుర్తించలేని టీటీడీ అధికారులు

1970లో ఓ భక్తుడు తిరుమల శ్రీవారికి 1.300 కిలోల బంగారు కిరీటాలను కానుకగా సమర్పించారు. అయితే, స్వామివారికి అవి సరిపోకపోవటంతో టీటీడీ అధికారులు వాటిని శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహాల అలంకరణ కోసం ఇచ్చారు. ఆ కిరీటాలే ఇప్పుడు కనిపించకుండాపోయాయి. ఈ విషయం ఎవరో చెబితే తప్ప టీటీడీ అధికారులు గుర్తించలేని పరిస్థితి. మరోవైపు.. కిరీటాలు మాయమై రెండ్రోజులు గడుస్తున్నా కేసులో పురోగతి లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. పోలీసులు, విజిలెన్స్ అధికారులు, టీటీడీ ఈఓ, జేఈఓ ఇతర అధికారులు.. ఆలయ సిబ్బంది, అర్చకులతో మాట్లాడి వెళ్లిపోయారు. కాగా, కిరీటాలు మాయం వెనుక ఇంటిదొంగల పనేనని ప్రచారం జరుగుతోంది.

ఖాళీల భర్తీ ఊసేలేదు

తిరుపతిలోని గోవిందరాజస్వామి, కోదండరామస్వామి, తిరుచానూరులోని పద్మావతి, అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి, కపిలతీర్థం శివాలయం, శ్రీనివాస మంగాపురం కళ్యాణ వెంకటేశ్వరాలయం, అలిపిరి పాదాల వద్ద ఆలయాలతో పాటు మరికొన్ని టీటీడీ ఆధీనంలో వున్నాయి. గోవిందరాజస్వామి ఆలయంలో ఆభరణాలు మాయమైన సంఘటన సంచలనం సృష్టించినా టీటీడి ఉన్నతాధికారులు దానిని సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడంలేదు. ఒకరిద్దరిపై మొక్కుబడి చర్యలతో సరిపెట్టారు. అలాగే, రూ.కోట్లు విలువచేసే అభరణాలున్న ఈ ఉపాలయాలలోని భద్రతా సిబ్బంది వద్ద సరైన ఆయుధాలు లేనేలేవు. టీటీడీ భద్రతా విభాగంలో ఖాళీలు భర్తీచేయమని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితంలేదు. టీటీడీ సీవీఎస్‌ఓ (చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యురిటీ అధికారి) పోస్టును ఏడాదిపాటు భర్తీ చేయకపోవడం ఇందుకు ఉదాహరణ. రెండు నెలల క్రితమే కొత్త వ్యక్తిని నియమించారు. అదే విధంగా విజిలెన్స్ విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోందని టీటీడీ అధికారులు చెబుతున్నారు. ఖాళీలను భర్తీచేయమని ఐదేళ్లుగా టీటీడీ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా చర్యలు తీసుకోలేదు. కాగా, శ్రీ గోవిందరాజస్వామి ఆలయానికి వచ్చే భక్తుల తాకిడి ఆధారంగా సుమారు వందమంది విధుల్లో ఉండాలి. కానీ, ప్రస్తుతం 25 మందికి మించి లేరు.

గ్రిల్ తొలగించడమే కారణమా?

ఇదిలా ఉంటే.. గోవిందరాజస్వామి ఆలయానికి వచ్చే భక్తులు ఉపాలయాలకు వెళ్లేందుకు వీలుగా గర్భాలయంలో గ్రిల్ ఉండేది. ఇటీవల వాటిని తొలగించారు. దీంతో కేవలం 200 మంది భక్తులకే గర్భాలయం కిటకిటలాడినట్లు కనిపిస్తోంది. వారిలో ఎవరు ఏ ఆలయానికి వెళ్తారో తెలియని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఉప ఆలయాల్లోని ఉత్సవమూర్తుల కిరీటాలతో పాటు ఆభరణాలు కూడా చోరీకి గురయ్యే అవకాశం ఉందని అర్చకులు అభిప్రాయపడుతున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు

శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో ప్రస్తుతం 12 సీసీ కెమెరాలున్నాయి. కిరీటాలు చోరీకి గురయ్యాక పోలీసులు, విజిలెన్స్ అధికారుల విచారణలో ఆలయంలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. కిరీటాలు మాయమైన ప్రదేశంలోని కెమెరాలు పనిచెయ్యలేదని తేలింది. అనధికారికంగా విడుదల చేసిన పుటేజీలో ఇద్దరు మాత్రం కనిపించారని.. అయితే వారు భక్తులా? ఆలయంలో పనిచేసే సిబ్బందా అనేది తెలియలేదు. అదే విధంగా తిరుమల శ్రీవారి ఆలయంలో గతంలో జరిగిన సంఘటనలూ అక్కడి భద్రతలోని డొల్లతనానికి అద్దం పడుతున్నాయి. ఆభరణాలు చోరీకి గురయ్యాయని, గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారని ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు చేసిన ఆరోపణలు తెలిసిందే. ఆలయంలోని సీసీ పుటేజీలు పరిశీలిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని ఆయన చెప్పినా బయటపెట్టలేదు. అలాగే, గత నెలలో తిరుమల నంబి ఆలయం వద్ద గేటు తాళాలను పగులగొట్టి ముగ్గురు భక్తులు చొరబడ్డా టీటీడీ భద్రతా సిబ్బంది పసిగట్టలేకపోయారు.

సక్రమంగా జరగని ఆభరణాల లెక్కింపు


ఆలయ పర్యవేక్షణ మొత్తం డిప్యూటీ ఈవో స్థాయి అధికారి నిర్వహణలోనే వుంటుంది. గోవిందరాజస్వామి ఆలయంలో పనిచేసే సిబ్బంది మొత్తం ఆ అధికారి సూచనల మేరకే పనిచేయాలి. కానీ, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ఇక్కడ ఎక్కువే. ఎప్పటికిప్పుడు ఆభరణాల లెక్కలు చూసుకోకపోవడం ఇక్కడ మామూలే. ప్రతీ సేవ అనంతరం ఆభరణాల లెక్కింపు సరైన పద్ధతిలో నిర్వహించాలి. వాటికి సంబంధిత అధికారులు పూర్తి బాధ్యత వహించాలి. కానీ, టీటీడీ ఉన్నతాధికారులు, పాలక మండలి సభ్యులు, ఇతర అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా ఇది సక్రమంగా జరగడంలేదు. అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవడం, నిర్వహణ సక్రమంగా లేకపోవడంవల్లే తరచూ దొంగతనాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

స్వర్ణ కిరీటాల రికవరీకి చర్యలు చేపట్టాం: ఈవో

తిరుపతి కల్చరల్: తిరుపతి లోని గోవిందరాజస్వామి వారి ఆలయంలో కనిపించ కుండా పోయిన మూడు స్వర్ణ కిరీటాల రికవరీకి చర్యలు చర్యలు చేపట్టామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ చెప్పారు. టీటీడీ తిరుపతి జేఈవో పోల భాస్కర్, సీవీఎస్‌ఓ గోపినాథ్‌శెట్టి, పోలీస్ అధికారులతో కలిసి ఆయన ఆదివారం ఆలయాన్ని పరిశీలించారు. సింఘాల్ మాట్లాడుతూ.. గోవిందరాజస్వామి వారి ఆలయానికి అనుబంధంగానున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు అలంకరించే మూడు కిరీటాలు శనివారం సాయంత్రం నుంచి కనబడటంలేదని అర్చకులు చెప్పారన్నారు. ఈ విషయమై టీటీడీ విజిలెన్స్, పోలీస్ అధికారులు గత రెండు రోజుల సీసీటీవీ రికార్డులను పరిశీలిస్తున్నారని తెలిపారు. ఆలయంలోని సీసీ కెమెరాలు అన్ని సక్రమంగా పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. స్వామి వారి నగలను రికవరీ చేసేందుకు టీటీడీ విజిలెన్స్, తిరుపతి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు సీజే

జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు కూడా..





ధ్వజస్తంభానికి మొక్కుతున్న జస్టిస్ గొగోయ్, జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ, జేఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఇస్తికఫాల్ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకున్నారు. సీజేతో పాటు సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ దంపతులు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. తర్వాత రంగనాయకుల మండపంలో జస్టిస్ రంజన్ గొగోయ్‌కు, జస్టిస్ ఎన్వీ రమణకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఈవో శ్రీవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

భగవంతుని పట్ల అపచారం

- ఆలయాల సంప్రదాయాలకు విఘాతం
- దేవుళ్ల ఆభరణాలు మాయమైన చోట సీసీ కెమెరాలు లేకపోవడమా?
- బాబు పాలనపై మఠాధిపతులు కన్నెర్ర జేయాలి
- అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తాం
- భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి సెంట్రల్: చంద్రబాబు పాలనలో భగవంతుని పట్ల అపచారం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆలయ భద్రత డొల్లగా మారిందని దుయ్యబట్టారు. గోవిందరాజ స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు సంబంధించిన మూడు కిరీటాలు అపహరణకు గురైనట్టు టీటీడీనే ప్రకటించిందన్నారు. రామానుజాచార్యులు ప్రతిష్టించిన ఉత్సమూర్తుల కిరీటాలే మాయం కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. చోరీకి గురైన ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తిరుమలలో టోపీలు అమ్మేవారిపై ప్రతాపాన్ని ప్రదర్శించే విజిలెన్స్ అధికారులు, టిఫిన్ సెంటర్లపై వీరంగం చేసే టీటీడీ అధికారులు.. గోవిందరాజస్వామి కిరీటాలు మాయమైపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు అపరిమిత దైవ భక్తుడి గా తనకు తానే ప్రకటించుకుని, ఆలయాల ప్రతిష్టను భ్రష్టు పట్టిస్తు న్నారని ఎద్దేవా చేశారు. భక్తిని తన స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవడం బాబుకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. విజయవాడ సమీపంలో 40 ఆలయాలను నేలమట్టం చేసిన ఘనాపాటి అన్నారు. 11వ శతాబ్దంలో మహ్మద్ గజినీ దండయాత్రలో, పన్నెండవ శతాబ్దంలో ఘోరీ పాలనలో కూడా ఇంత పెద్ద ఎత్తున హిందూ దేవాలయాలు భూస్థాపితం కాలేదన్నారు. చేసిన పాపాలను కూడా సమర్థించుకోగలిగిన వ్యక్తి చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో, శ్రీకాళహస్తి దేవాలయంలో క్షుద్ర పూజలు చేసినట్టు ప్రముఖులే ఆరోపించారని అందరికీ తెలుసన్నారు. కానీ, ఇంత వరకు ఏ ఒక్కరినీ ఎందుకు నిర్బంధంలోకి తీసుకోలేదన్న దానిపై చంద్రబాబు సర్కార్ వద్ద సమాధానం లేదన్నారు. తిరుమల క్షేత్రంపై స్వామి వారి ఆభరణాలు మాయమయ్యాయని ప్రధానార్చకులే ఆరోపిస్తే... సమాధానం చెప్పలేక, ఆరోపణలు చేసినందుకు నాలుగు వంశాల ప్రధానార్చకులను అర్చకత్వ బాధ్యతల నుంచి తొలగించారని విమర్శించారు. అమరావతిలో తలపెట్టిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన నమూనాపై తనకు సమాచారం లేదని సాక్షాత్తు పెద్ద జియ్యర్‌స్వామే ప్రకటించారని తెలిపారు. స్వామి ఆలయంలో విష్వక్‌సేనుడు, వరాహస్వామి వంటి ఉపాలయాలు ఉండి తీరాలని, అయితే అమరావతిలో అలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

రాజకీయాల్లోకి లాగే ప్రయత్నం...

రాజీవనేత్రుడినే రాజకీయాల్లోకి లాగే ప్రయత్నం చేస్తున్నారంటూ చంద్రబాబుపై భూమన నిప్పులు చెరిగారు. పసుపు, కుంకుమ కార్యక్రమాల్లో చంద్రబాబు విగ్రహాన్ని ప్రతిష్టించారని, ముమ్ముందు అర్చక మూర్తుల స్థానంలో చంద్రబాబు మూర్తులను చూడాల్సిన దుస్థితి దాపురిస్తుందేమో అని వ్యంగ్యాస్త్రాలను సంధించారు. చెప్పులు వేసుకుని పూజలు, శంకుస్థాపనలు చేయడం వల్ల తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్వామీజీలు, ఆచార్య పురుషులు, పీఠాధిపతులు కన్నెర్ర జేయాల్సిందిగా కోరారు. నాలుగున్నరేళ్ల చంద్రబాబు కాలంలో ఆలయాల్లో జరిగిన అరాచకత్వంపై, హిందుత్వం దాడిపై, దోపిడి, అభరణాల మాయం వంటి నిర్వాకాలపై ...తాము అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తామని, దోషులను కస్టడీలోకి పంపుతామని భూమన హెచ్చరించారు.

దళిత రైతు కూలీలకు చంద్రబాబు అన్యాయం

- రాజధానిలో పట్టా, అసైన్డ్ భూముల ప్యాకేజీలో భారీ తేడాలు
- వైఎస్సార్‌సీపీ బాపట్ల పార్లమెంట్ సమన్వయకర్త నందిగం సురేష్



విజయవాడ సిటీ: రాజధాని ప్రాంతం భూ సేకరణలో దళిత రైతులకు చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల పార్లమెంట్ సమన్వయకర్త నందిగం సురేష్ ధ్వజమెత్తారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లంక భూములకు ఒక ప్యాకేజీ, పట్టాభూములకు మరో ప్యాకేజీ ఇస్తున్నారంటే చంద్రబాబుకు దళితులంటే ఎలాంటి భావన ఉందో అర్థమవుతోందన్నారు. రాజధాని ప్రాంతంలో 40 శాతం దళిత రైతులు ఉన్నారని, భూసేకరణ సమయంలో సీఎం చంద్రబాబు చేసిన వాగ్దానాలను మరచి మోసం చేశారని మండిపడ్డారు. పట్టా భూములతో పాటు సమానంగా లంక భూములకు ప్యాకేజీ ఇవ్వాల్సి ఉండగా, పట్టా భూములకు 1450 గజాల భూమి ఇచ్చి, లంక భూములు సాగుచేసుకుంటున్నవారికి 600 గజాలే ఇచ్చారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం అసైన్డ్ భూములకు కూడా న్యాయం చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు. మరో పక్క దళిత ఎమ్మెల్యే అయి ఉండి కూడా ఎస్సీలకు మీకు 600 గజాలు ఇవ్వడమే ఎక్కువ అని అపహాస్యం చేస్తున్నారని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌పై మండిపడ్డారు. రాజధాని నిర్మాణంలో స్థానిక రైతు కూలీలకు ఉపాధి కల్పిస్తామని చెప్పి రైతు కూలీలను మోసం చేసి రోడ్డున పడేశారని ధ్వజమెత్తారు. ఒడిశా, బిహార్ నుంచి కూలీలను తీసుకొచ్చి హేళన చేస్తూ మాట్లాడుతున్నారన్నారు. వ్యవసాయ కూలీలకు ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు కట్టించి ఇస్తుందని చెప్పిన చంద్రబాబు నేడు సింగిల్ బెడ్ రూమ్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.50 వేల నుంచి రూ.లక్ష పైగా చెల్లించాలని చెప్పడం ఏమిటని నిలదీశారు. అధికారంలోకి రాగానే రాజధాని రైతులందరినీ ఆదుకుంటామని వైఎస్ జగన్ మాట ఇచ్చిన విషయాన్ని సురేష్ గుర్తు చేశారు.

మోదీ ముఖాన్ని ఖాళీ కుండలతో కొట్టాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

ఒంగోలు టౌన్: రాష్ట్ర రాజధాని శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ మట్టి, చెంబుడు నీళ్లు తెచ్చి మన ముఖాన కొట్టి వెళ్లారని, అందుకే ఈనెల 10వ తేదీ గుంటూరులో పర్యటించనున్న నరేంద్రమోదీ ముఖాన్ని ఖాళీ కుండలతో కొట్టి ఆంధ్ర రాష్ట్ర ప్రజల నిరసన తెలపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి చేసిన అన్యాయంపై బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి భగ్గుమంటున్నాయన్నారు. రాష్ట్రానికి వస్తున్న ప్రధానికి నిరసన తెలిపేలా పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు రూ.350 కోట్ల నిధులు ఇచ్చి ఎందుకు వెనక్కు తీసుకున్నారో ఇక్కడి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ముదిరాజ్‌లను విస్మరించిన ప్రభుత్వం

ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు రఘురామ్

నెల్లూరు (వేదాయపాళెం): తెలుగుదేశం ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ఆరోపించారు. నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ముదిరాజ్, ముత్తరాశి, తెనుగోళ్లు కులాలకు చెందిన వారు 30 లక్షల మంది ఉన్నారని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్ ఉపకులాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బీసీ–డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ –ఏలో చేర్చాలని, బీసీ కమిషన్ నివేదికను సుప్రీం కోర్టుకు అందజేయాలని, ముదిరాజ్ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మత్స్యకారుల సంక్షేమ పథకాలు తమకు అందించాలని, డిమాండ్ చేశారు.

కోల్‌కతాలో 'దీదీ'గిరి!

- చిట్‌ఫండ్ కుంభకోణం కేసు విచారణలో హైడ్రామా
- పోలీస్ కమిషనర్‌ను విచారించేందుకు సీబీఐ అధికారుల యత్నం
- అడ్డుకుని అరెస్ట్ చేసిన బెంగాల్ పోలీసులు
- కేంద్రం అవమానించిందంటూ ధర్నాకు దిగిన మమతా బెనర్జీ
- సీబీఐ కార్యాలయాన్ని ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు

కోల్‌కతా

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్‌లోని మమతా బెనర్జీ సర్కారు మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం తారాస్థాయికి చేరింది. చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో ఆదివారం కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను విచారించేందుకు వెళ్లిన సీబీఐ అధికారుల్ని బెంగాల్ పోలీసులు అడ్డుకుని నిర్బంధంలోకి తీసుకోవడం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. దీంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధీనంలో పనిచేస్తున్న రెండు పోలీసు విభాగాల మధ్య కనీవినీ ఎరుగని రీతిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. సెర్చ్ వారెంట్ లేకుండానే పోలీస్ కమిషనర్ ఇంటికి వెళ్లడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మమతా బెనర్జీ.. మోదీ, షా చేతుల్లో తనకు అవమానం జరిగిందని పేర్కొంటూ కోల్‌కతాలో పేరొందిన మెట్రో సినిమాకు ఎదురుగా రాత్రి ధర్నాకు దిగారు. అయితే సీబీఐ అధికారుల అరెస్ట్‌పై భిన్న కథనాలు వినిపించాయి. తమ అధికారుల్ని బలవంతంగా తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని సీబీఐ ఆరోపించగా, సీనియర్ పోలీసు అధికారి ఒకరు ఖండించారు. పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను విచారించేందుకు తగిన పత్రాలు ఉన్నాయో? లేదో? పరిశీలించేందుకే వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లామని వివరణ ఇచ్చారు. దెబ్బకు దెబ్బ అన్నట్లు ఆ తరువాత బెంగాల్ పోలీసుల బృందం ఒకటి కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి తమ అదుపులోకి తీసుకుంది. కనిపించకుండా పోయారని వార్తలు వచ్చిన రాజీవ్‌కుమార్ తాజా ఘటనతో మళ్లీ ప్రత్యక్షమయ్యారు. రాజీవ్‌కుమార్‌ను విచారించేందుకు బెంగాల్ ప్రభుత్వం నుంచి అనుమతి ఇప్పించాలని కోరుతూ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీబీఐ తెలిపింది. శారద చిట్‌ఫండ్, రోజ్‌వ్యాలీ పోంజి పథకాలకు సంబంధించి రాజీవ్‌కుమార్ విచారణకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నారని సీబీఐ ప్రకటించిన మరుసటి రోజే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇదే అదనుగా బీజేపీ, తృణమూల్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. బెంగాల్‌లో తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్రపన్నుతోందని తృణమూల్ ఆరోపించగా, రాజ్యాంగ సమగ్రత, విలువల్ని మమత ప్రభుత్వం ఎగతాళి చేస్తోందని బీజేపీ ఎదురు దాడి చేసింది.

డ్రామా కొనసాగిందిలా..

కోల్‌కతాలో లౌడాన్ వీధిలోని రాజీవ్‌కుమార్ నివాసానికి సుమారు 40 మంది సీబీఐ అధికారులు చేరుకున్నాక కనీవినీ ఎరుగని హైడ్రామా మొదలైంది. వారు లోనికి వెళ్లకుండా అక్కడి భద్రతా సిబ్బంది, అధికారులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు..రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారుల వద్ద అవసరమైన పత్రాలు ఉన్నాయా? లేదా? అని వాకబు చేయడం ప్రారంభించారు. ఆ తరువాత కొందరు అధికారుల్ని షేక్‌స్పియర్ సరాని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ వెంటనే రాజీవ్‌కుమార్ నివాసానికి మరికొందరు సీబీఐ అధికారులు రావడంతో కొంత



సీబీఐ దాడుల తరువాత ధర్నాకు దిగిన మమతా బెనర్జీ. చిత్రంలో పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ (ఎడమ)



సీబీఐ అధికారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గందరగోళం నెలకొంది. వారిలో కొందరిని పోలీసులు బలవంతంగా జీపులో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణ ముగిశాక సీబీఐ అధికారుల్ని వదిలిపెట్టినట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ (క్రైం) ప్రవీణ్ త్రిపాఠి చెప్పారు. రహస్య ఆపరేషన్ నిమిత్తం కోల్‌కతాకు వచ్చామని వారు చెప్పారని, అది ఏ రకమైన ఆపరేషనో తమకు తెలియదని వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఉద్రిక్తతను నివారించడానికి కోల్‌కతా సీబీఐ కార్యాలయం వద్దకు కేంద్ర బలగాలు చేరుకున్నాయి.

సీబీఐ దాడులు ఊహించాం: మమతా బెనర్జీ

రాజీవ్‌కుమార్ నివాసం బయట హడావుడిగా మీడియా సమావేశం నిర్వహించిన మమతా బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మోదీ ఆదేశాల మేరకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రాజకీయ ప్రత్యర్థులపైకి సీబీఐని పంపుతున్నారని దుయ్యబట్టారు. 'చేతులకు రక్తపు మరకలు అంటుకున్న అలాంటి ప్రధానితో మాట్లాడటానికి సిగ్గుగా ఉంది. జనవరి 19న విపక్షాలతో విజయవంతంగా ర్యాలీ నిర్వహించడంతో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూల్చేందుకు మోదీ, షా ప్రయత్నిస్తున్నారు. ర్యాలీ తరువాత సీబీఐతో దాడులు చేయిస్తారని మాకు తెలుసు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిట్‌ఫండ్ కంపెనీల యజమానుల్ని అరెస్ట్ చేసింది. ఈ వ్యవహారంలో సిట్‌ను ఏర్పాటుచేసి దర్యాప్తు చేసింది మేమే' అని మమతా బెనర్జీ అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు విపక్షాలన్నీ చేతులు కలపాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగాన్ని పరిహసించారు: బీజేపీ

కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను సీబీఐ ప్రశ్నించకుండా పోలీసులు అడ్డుకోవడంపై బీజేపీ మండిపడింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల్ని పరిహాసానికి గురిచేస్తోందని ఆరోపించింది. ఈ వైఖరి మమతా బెనర్జీ నిరంకుశత్వాన్ని సూచిస్తోందని తెలిపింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ చిట్‌ఫండ్ కుంభకోణాలపై విచారణ జరుపుతోందని, కోల్‌కతా పోలీసుల చర్య అత్యున్నత న్యాయస్థానం పట్ల అవిధేయత కనబరచడమేనని పేర్కొంది. బెంగాల్‌లో శాంతి, భద్రతలు పూర్తిగా దారితప్పాయని విమర్శించింది.

సీబీఐ నోటీసులకు స్పందించని కమిషనర్

శారదా, రోజ్‌వ్యాలీ కుంభకోణాల కేసుల్ని విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి రాజీవ్‌కుమార్ నేతృత్వం వహించారు. ఈ కేసులకు సంబంధించి గల్లంతయిన కొన్ని పత్రాల విషయమై ఆయనని విచారించాల్సి ఉందని సీబీఐ ప్రకటించింది. తమ ముందు హాజరుకావాలని సీబీఐ పలు నోటీసులు పంపినా స్పందించలేదు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష జరిపేందుకు ఇటీవల ఎన్నికల సంఘం కోల్‌కతాలో పర్యటించగా, ఆ కార్యక్రమానికి రాజీవ్‌కుమార్ హాజరుకాలేదు. అయితే రాజీవ్‌కుమార్ విధులకు దూరంగా ఉంటున్నారని వచ్చిన వార్తల్ని కోల్‌కతా పోలీసులు కొట్టిపారేశారు. ఆయన కోల్‌కతాలోనే ఉన్నారని, రోజూవారీ విధులకు హాజరవుతున్నారని ప్రకటన విడుదల చేశారు.

మమతకు విపక్షాల బాసట..

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, సీబీఐ మధ్య ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో మమతా బెనర్జీకి విపక్ష నాయకులు సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లా ఆమెకు ఫోన్‌చేసి మద్దతు తెలిపారు. విపక్షాలంతా ఒకే పక్షమని, వచ్చే ఎన్నికల్లో ఫాసిస్ట్ శక్తుల్ని ఓడిస్తామని రాహుల్ అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, సమాఖ్య స్ఫూర్తికి మోదీ తూట్లుపొడిచారని కేజ్రీవాల్ ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి మోదీ–షా ద్వయం ప్రమాదకరమని, బెంగాల్‌లో సీబీఐ చర్యను ఖండించాలని అన్నారు.

పద్మభూషణ్ వెనక్కిచ్చేస్తా: హజారే



రాలేగావ్‌సిద్ధి: కేంద్ర ప్రభుత్వం తన డిమాండ్లను నెరవేర్చకపోతే ఇచ్చిన పద్మభూషణ్ పురస్కారాన్ని తిరిగి ఇచ్చేస్తానని సామాజిక కార్యకర్త అన్నాహజారే హెచ్చరించారు. రాలేగావ్ సిద్ధిలో చేపట్టిన ఆమరణ దీక్ష ఆదివారం నాటికి ఐదోరోజుకు చేరింది. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే 1992లో ఇచ్చిన పద్మభూషణ్ పురస్కారాన్ని వాపసు చేస్తానని హెచ్చరించారు. ఈ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. తక్షణమే లోక్‌పాల్, లోకాయుక్తలను ఏర్పాటు చేయడంతో పాటు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, హజారేకు డాక్టర్ ధనంజయ పోటే ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఐదురోజుల్లోనూ ఆయన 3.8 కేజీల బరువు తగ్గిపోయినట్లు తెలిపారు. హజారే ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ రాలేగావ్ సిద్ధి గ్రామప్రజలు అహ్మద్‌నగర్–పుణె జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో బైఠాయించారు. దీంతో ఆరు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

పౌరసత్వ బిల్లుపై నిరసన..పద్మశ్రీ వెనక్కి

న్యూఢిల్లీ: 15 సార్లు జాతీయ అవార్డు పొందిన ప్రముఖ మణిపురి డైరెక్టర్ అరిబమ్ శ్యాం శర్మ (83) తాను పొందిన పద్మశ్రీని వెనక్కి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పౌరసత్వ (సవరణ) బిల్లు–2016కు వ్యతిరేకంగా ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 'ఈ బిల్లు ఈశాన్య రాష్ట్రాలు, మణిపురిలోని ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. ఇక్కడి చాలా మంది ప్రజలు బిల్లును వ్యతిరేకిస్తున్నారు. పద్మశ్రీ అనేది అత్యున్నత పురస్కారాల్లో ఒకటి. అందుకే ఈ అవార్డును వెనక్కి ఇవ్వడం ద్వారా బిల్లుపై నిరసన తెలపాలనుకుంటున్నా'అని తెలిపారు. ఆయనకు 2006లో పద్మశ్రీ వచ్చింది.

భారత్‌కీ మన్‌కీ బాత్-మోదీకే సాత్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ మేనిఫెస్టో రూపకల్పనకు బీజేపీ'భారత్‌కీ మన్‌కీ బాత్– మోదీకే సాత్' పేరుతో సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా నెల పాటు 300 రథయాత్రలను 4000 అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపి నేరుగా 10 కోట్ల ప్రజల అభిప్రాయాలను స్వీకరించనుంది. రథయాత్రను బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఢిల్లీలో జెండా ఊపి ప్రారంభించారు.

'ఫార్మింగ్టన్' బాధితులను ఆదుకుంటాం

వాషింగ్టన్: ఫార్మింగ్టన్ యూనివర్సిటీ ఉచ్చులో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని అమెరికాలో భారత రాయబారి హర్షవర్ధన్ శ్రింగ్లా భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మిషిగాన్‌లోని ఫార్మింగ్టన్ యూనివర్సిటీ విషయంలో ఇంతమంది భారతీయ విద్యార్థులను నిర్బంధించడం బాధాకరమైన విషయం. వివిధ ప్రాంతాల్లో ఉన్న మా అధికారులు విద్యార్థులతో మాట్లాడారు. అందరూ క్షేమంగానే ఉన్నారు. వారికి న్యాయపరమైన సాయం అందజేసేందుకు గల మార్గాలపై నిపుణులతో చర్చించాం. మన విద్యార్థుల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడుతుంది. వారికి అండగా ఉంటుంది' అని తెలిపారు. ఈ వ్యవహారంలో దళారులతోపాటు వందలాదిగా విద్యార్థులను నిర్బంధించిన అధికారులు మరో 600 మందికి వారంట్లు జారీ చేశారు.

6 వేల విలువేంటో వారికేం తెలుసు?

- పేద రైతులకు అదెంత ముఖ్యమో ఏసీ గదుల్లో ఉండే కాంగ్రెస్ నేతలకు తెలీదు
- జమ్మూ కశ్మీర్ సభల్లో విపక్షంపై మోదీ మండిపాటు



లేహ్‌లో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ప్రజలు

లేహ్/జమ్మూ/శ్రీనగర్: రైతులకు ఆరు వేల రూపాయలు ఎంత ముఖ్యమనే విషయం ఢిల్లీలో ఏసీ గదుల్లో కూర్చునే వారికి తెలియదంటూ ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై ఆదివారం విమర్శలు చేశారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతులను ఆకట్టుకునే ఉద్దేశంతో ఐదెకరాల్లోపు సాగు భూమి ఉన్న వ్యవసాయదారులకు ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయం చేయనున్నట్లు కేంద్రం తాత్కాలిక బడ్జెట్‌లో ప్రకటించడం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ మోదీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ రైతులకు ఇచ్చేది రోజుకు 17 రూపాయలేనా, ఇది వారిని అవమానించడమేనంటూ ధ్వజమెత్తింది. ఈ వ్యాఖ్యలకు స్పందనగా జమ్మూ కశ్మీర్‌లో మాట్లాడుతూ 'పీఎం–కిసాన్ ఒక గొప్ప పథకం. పేద రైతుకు ఈ రూ.6 వేలు ఎంత ముఖ్యమో ఢిల్లీలో ఏసీ గదుల్లో కూర్చునే వారికి అర్థం కాదు. ఈ రాష్ట్రంలో కూడా చాలా మందికి ఈ పథకం వల్ల లబ్ధి జరుగుతుంది. ఆదివారమే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి నేను మార్గదర్శకాలు పంపిస్తా' అని అన్నారు. అనంతరం జమ్మూ కశ్మీర్‌లోని విజయపూర్‌లో మోదీ మాట్లాడుతూ రైతులకు రుణమాఫీని కాంగ్రెస్ ఎన్నికల గిమ్మిక్కుగా వాడుతోందని మోదీ ఆరోపించారు. '2008–09లో రూ. 6 లక్షల కోట్ల విలువైన రైతు రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించి, అధికారంలోకి వచ్చాక, రూ. 52 వేల కోట్ల విలువైన రుణాలనే మాఫీ చేసింది. మాఫీ పొందిన వారిలో 30 లక్షల మంది అనర్హులే ఉన్నట్లు కాగ్ తేల్చింది' అని మోదీ అన్నారు.

భరతమాత బిడ్డలకు సాయం చేస్తాం..

1947లో దేశ విభజన కారణంగా ఈ దేశ పౌరులు కాకుండా పోయిన భారతి బిడ్డలను కాపాడతామని చెప్పారు. కశ్మీరీ పండితుల మహా నిష్క్రమణం తననెప్పుడూ గుండెల్లో బాధకు గురిచేస్తుంటుందని మోదీ వెల్లడించారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ .. శ్రీనగర్, లడఖ్, లేహ్, విజయ్‌పూర్, కఠువా తదితర ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేశారు.

యోగి హెలికాప్టర్‌కు అనుమతి నిరాకరణ

- పశ్చిమబెంగాల్ సభలకు రాకుండా అడ్డుకున్న ప్రభుత్వం

బలూర్ఘాట్/లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు పశ్చిమబెంగాల్‌లో చుక్కెదురైంది. ఆయన ప్రయాణించే హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అక్కడి ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. దీంతో ఆదివారం బీజేపీ చేపట్టిన రెండు సభలకు సీఎం యోగి హాజరు కాలేకపోయారు. అందుకు బదులుగా ఫోన్ ద్వారా ఆయన రెండు సభలకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మమతా బెనర్జీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో సత్తా చూపేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న బీజేపీ 'గణతంత్ర బచావో' పేరిట ర్యాలీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా దక్షిణ దినాజ్‌పూర్ జిల్లా బలూర్ఘాట్, ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా రాయ్‌గంజ్‌లో నిర్వహించే సభలకు యూపీ సీఎం ఆదిత్యనాథ్‌తోపాటు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ హాజరు కావాల్సి ఉంది. అయితే, ఆదిత్యనాథ్ ప్రయాణించే హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ఈ రెండు చోట్లా మమతా బెనర్జీ రాష్ట్ర యంత్రాంగం అనుమతి నిరాకరించింది. దీంతో ఆయన లక్నో నుంచే ఫోన్ ద్వారా ఈ రెండు సభలకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

ఈ నెల నుంచే 'పీఎం కిసాన్' సాయం

న్యూఢిల్లీ: చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు తెచ్చిన పీఎం కిసాన్ పథకం నగదు సాయాన్ని ఈ నెల నుంచే ఇవ్వాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన (పీఎం కిసాన్) కింద ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ఏటా రూ.6 వేలు ఇస్తామని ఇటీవల బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద 12 కోట్ల మంది లబ్ధి పొందే రైతులున్నారని.. రూ.20 వేల కోట్ల బడ్జెట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించినట్లు కేంద్రం పేర్కొంది. 'ఈ పథకం గతేడాది డిసెంబర్ నుంచి వర్తించనుంది. బడ్జెట్ కేటాయింపుల కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.20 వేల కోట్లు కేటాయించారు. భూముల రికార్డుల డేటా కూడా సిద్ధంగా ఉంది. అలాగే చిన్న, సన్నకారు రైతుల వివరాలు మా దగ్గర ఉన్నాయి..' అని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ఆదివారం తెలిపారు.

అధికారంలోకి వస్తే రుణమాఫీ



పట్నా: లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. ఆహార శుద్ధి పరిశ్రమలను బాగా ప్రోత్సహిస్తామన్నారు. బిహార్ రాజధాని పట్నాలో మూడు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. కేంద్రం తెచ్చిన పంట బీమా పథకం పేద రైతులు కష్టపడి సంపాదించుకున్న డబ్బును కొందరు పెద్ద వ్యాపారవేత్తల జేబుల్లోకి చేరుస్తోందని రాహుల్ ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే రైతుల దుస్థితిని మారుస్తామనీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ల్లో కాంగ్రెస్ ఇటీవల అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే రైతుల రుణాలను మాఫీ చేసిన విషయాన్ని రాహుల్ గుర్తు చేశారు. ప్రజలందరికీ కనీస ఆదాయాన్ని కూడా కల్పిస్తామనీ, 2014లో బీజేపీ ఇచ్చిన రూ. 15 లక్షల అబద్ధపు హామీలాంటిది ఇది కాదని రాహుల్ చెప్పారు. రాహుల్‌కు ప్రధాని అయ్యే అన్ని అర్హతలూ ఉన్నాయని బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ అన్నారు.

పట్టాలు తప్పిన 'సీమాంచల్'

బిహార్‌లో ఆరుగురు మృతి



సోన్‌పూర్(బిహార్): బిహార్‌లో జరిగిన రైలు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా 29 మంది గాయాలపాలయ్యారు. బిహార్‌లోని జోగ్‌బనీ నుంచి ఢిల్లీలోని ఆనంద్ విహార్‌కు చేరాల్సిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం వేకువజామున పట్టాలు తప్పడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై రైల్వే శాఖ విచారణకు ఆదేశించింది. బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించింది. 'నంబర్ 12487 జోగ్‌బనీ–ఆనంద్ విహార్ సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ కిషన్‌గంజ్ జిల్లా జోగ్‌బనీ నుంచి వస్తుండగా తెల్లవారు జామున 4 గంటల సమయంలో రైలు పట్టాల్లో పగుళ్ల కారణంగా సహదాయ్ బుజుర్గ్ ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఒక జనరల్ బోగీ, ఒక ఏసీ కోచ్, మూడు స్లీపర్ కోచ్‌లతోపాటు మరో ఆరు బోగీలు పట్టాలు తప్పాయి' అని రైల్వే శాఖ పేర్కొంది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా 29 మంది క్షతగాత్రులయ్యారు. తీవ్రంగా గాయపడిన వారిని ముజఫర్‌పూర్, పట్నాలోని ఆస్పత్రులకు తరలించాం. మిగతా వారికి వైశాలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నాం' అని రైల్వే పోలీసు అధికారులు తెలిపారు. పట్టాలు తప్పని బోగీలకు మరికొన్నిటిని జత చేసి ఉదయం 10 గంటల సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని ఈస్ట్ జోన్ రైల్వే సేఫ్టీ కమిషనర్ లతీఫ్ ఖాన్‌ను రైల్వే శాఖ ఆదేశించింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్ప గాయాలైన వారికి రూ.50 వేలు చొప్పున రైల్వే శాఖ పరిహారం ప్రకటించింది.

మోదీకి ట్రిపుల్ సవాల్!

మమత, మాయావతి, ప్రియాంకలతో ఢీ

అందరి లక్ష్యం మోదీని గద్దె దించడమే

వాళ్లు ముగ్గురూ ముగ్గురే. ఒక్కొక్కరు ఒక్కో సామాజిక వర్గానికి చెందినవారు. అయితేనేం అత్యంత శక్తిమంతమైన మహిళలు. పశ్చిమబెంగాల్‌లో ఎర్రకోటను బద్దలు కొట్టి 34 ఏళ్ల కమ్యూనిస్టుల పాలనకు తెరదించి, ఫైర్ బ్రాండ్‌గా ఎదిగిన బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఎవరి ఊహకూ అందని విధంగా దళితులు, అగ్రవర్ణాల అరుదైన సోషల్ ఇంజనీరింగ్ ఫార్ములాతో ఉత్తరప్రదేశ్ రాజకీయాల్ని శాసించిన బీఎస్పీ అధినేత్రి మాయావతి, కాంగ్రెస్ పార్టీకి దిక్సూచిగా ప్రధాన కార్యదర్శి హోదాలో రాజకీయ రణక్షేత్రంలోకి దిగుతున్న ప్రియాంక గాంధీ.. ఈ ముగ్గురమ్మలు ఈసారి ఎన్నికల్లో ప్రధాని మోదీకి కంటి మీద కునుకు లేకుండా చేస్తారా? ఈ ముగ్గుర్నీ ఎదుర్కోవడమే మోదీ ముందున్న అతి పెద్ద సవాలా? ఇప్పుడివే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మమత, మాయావతిలు ప్రత్యర్థులు విలవిల్లాడేలా రాజకీయ వ్యూహాలను రచించడంలో దిట్టలు. ఎన్డీయేతర ప్రభుత్వం ఏర్పాటైతే ప్రధాని పదవి రేసులో ముందున్నవారు. ప్రియాంకకు రాజకీయ అనుభవం అంతగా లేకపోయినప్పటికీ నాన్నమ్మ ఇందిరాగాంధీ పోలికల్ని పుణికిపుచ్చుకోవడంతో ప్రజల్లో ఆమెకున్న ఛరిష్మా వేరు.







మాయావతి

ఢిల్లీ పీఠానికి దగ్గర దారిగా భావించే ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ 2014 ఎన్నికల్లో ఏకంగా 71 స్థానాలను గెలుచుకుంది. ఈస్థాయి విజయాన్ని ఆ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన బీఎస్పీ, ఎస్పీ జీర్ణించుకోలేకపోయాయి. ఈసారి మోదీని గద్దె దించడమే లక్ష్యంగా ఈ రెండు పార్టీలు చేతులు కలిపాయి. కాంగ్రెస్ కూడా తమకు మిత్రపక్షమేనన్న పరోక్ష సంకేతాలు పంపుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సొంత నియోజకవర్గాలైన రాయ్‌బరేలీ, అమేథీ నియోజకవర్గాల్లో పోటీకి కూడా దిగడం లేదు. ఎన్నికల అనంతరం పొత్తులపై కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ మధ్య స్పష్టమైన అవగాహన ఉంది. పైపెచ్చు మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఎస్పీ మద్దతు కూడా తెలుపుతోంది. 63 ఏళ్ల వయసున్న మాయావతి.. మోదీకి చెక్ పెట్టడం కోసం తనకు ఆగర్భ శత్రువైన ఎస్పీతో కూడా చేతులు కలిపారు.

మమతా బెనర్జీ

ఇక అన్నీ కలిసి వస్తే ప్రధాని పీఠంపై కూర్చోవాలని కలలు కంటున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మోదీ పేరు చెబితేనే మండిపడుతున్నారు. ఒకప్పుడు బీజేపీతో కలిసి పోటీచేసి రైల్వే మంత్రిగా కూడా పనిచేసిన మమత ఈ ఎన్నికల్లో బీజేపీపై ఏ మాత్రం మమత చూపించడం లేదు. గత నెలలోనే కోల్‌కతాలో బీజేపీ వ్యతిరేక ర్యాలీ నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఎన్డీయే వ్యతిరేక పార్టీలను ఏకతాటి పైకి తీసుకురావడానికి తన వంతు ప్రయత్నాలు చేస్తూ రాజకీయాలను వేడెక్కిస్తున్నారు. కాంగ్రెస్‌తో నేరుగా ఎలాంటి పొత్తు లేకపోయినప్పటికీ మోదీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికి ఆమె ఎవరితో చేతులు కలిపేందుకైనా సిద్ధమవుతున్నారు.

ప్రియాంక గాంధీ

ఇక రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాలతో మంచి జోష్ మీదున్న కాంగ్రెస్ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మోదీ హవాకు చెక్ పెట్టడం కోసమే తమ పార్టీ తురుపు ముక్క ప్రియాంకను రంగంలోకి దించుతోంది. యూపీలో ఒకప్పుడు కాంగ్రెస్‌కు సంప్రదాయంగా మద్దతునిచ్చే బ్రాహ్మణులు, ఠాకూర్లు ఇటీవల కాలంలో బీజేపీ వైపు మళ్లిపోయారు. ప్రియాంక రాకతో వారు కాంగ్రెస్ గూటికి తిరిగి వస్తారన్న ఆశలు పార్టీ నేతల్లో ఉన్నాయి. ఇక ఎస్పీ, బీఎస్పీ పొత్తుతో దళితులు, ముస్లింలు ఆ కూటమికే మద్దతు పలికే అవకాశం ఉంది. ఇవన్నీ బీజేపీ విజయావకాశాల్ని దెబ్బ తీస్తుందనే అంచనాలున్నాయి.

బీజేపీవైపే ఉన్నారా?

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలతో కొంత అపప్రధను మూటకట్టుకున్నప్పటికీ మోదీ ఇప్పటికీ దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడే. ఓ ముగ్గురు మహిళలు చేతులు కలిపినంత మాత్రాన మోదీకి వచ్చే ముప్పేమీ లేదని బీజేపీ నేతలు భావిస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆడవాళ్ల కోసం టాయిలెట్ల నిర్మాణం, సబ్సిడీ రేట్లకే గ్యాస్ సిలిండర్లు వంటివి మోదీ సర్కార్ పట్ల మహిళల్లో సానుకూలతనే పెంచాయి. అంతే కాకుండా మోదీ తన కేబినెట్‌లో కూడా మహిళలకు సముచిత స్థానాన్ని కల్పించారు. మొత్తం 26 మంది మంత్రులున్న కేబినెట్‌లో ఆరుగురు మహిళలున్నారు. ఇవన్నీ మోదీ ప్రభుత్వానికి కలిసొచ్చే అంశాలేనని మహిళలు తమవైపే ఉంటారన్న ధీమాలో బీజేపీ ఉంది.

విపక్షాల్లోనే ఎక్కువ

ఎన్డీయేతో పోల్చి చూస్తే విపక్షపార్టీల్లోనే శక్తిమంతమైన మహిళా నేతలు ఉన్నారు. సహజంగానే వారివైపు మహిళా ఓటర్లు మొగ్గు చూపించే అవకాశం ఉంది. ఈసారి ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న మహిళలు ఎటువైపు మొగ్గు చూపిస్తారో వారే అధికార అందలాన్ని అందుకునే అవకాశమైతే ఉంది. ''బీజేపీ చాలా ఆందోళనలో ఉంది. మూడు రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోవడంతో ఆత్మవిశ్వాసం కోల్పోయింది. విపక్షాల్లో ఉన్న శక్తిమంతమైన మహిళలే మోదీకి ఈ ఎన్నికల్లో ముప్పుగా మారుతారు'' అని బీజేపీకి గుడ్ బై కొట్టేసిన యశ్వంత్ సిన్హా అభిప్రాయపడ్డారు. మాయావతి, మమతా బెనర్జీ వంటి నేతల పట్ల కేవలం మహిళా ఓటర్లే మొగ్గు చూపిస్తారనుకోవడం సరికాదని అంటున్నారు బీఎస్పీ అధికార ప్రతినిధి సుధీంద్ర భదోరియా.

సాక్షి ప్రాఫిట్ ప్లస్

సోమవారం
4-2-2019

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్	213 ▲	36,469
నిఫ్టీ	63 ▲	10,894

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	7,264	▼	17
డోజోన్స్	25,064	▲	64
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,020	▲	51
డాక్స్	11,181	▲	8
షాంఘై	2,618	▲	34
నికాయ్	20,788	▲	15

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	70.05	72.3
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	92.35	94.9
€	యూరో	ధామస్‌కుక్	80.8	83.05
¥	జపాన్ ఎన్ (100)	ధామస్‌కుక్	63.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	50.9	53.15
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	51.15	54.65
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	17.65	20.75
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	9.05	11.2

సొంతింటికి దారి ఇదీ..!

ఇంటి కొనుగోలును ఆకర్షణీయం చేసే పలు నిర్ణయాలను మోదీ సర్కారు ఇటీవలి బడ్జెట్లో ప్రకటించింది. అందుబాటు గృహాలపై బిల్డర్లకు పన్ను రాయితీలను 2019-20 వరకు పొడిగించింది. అమ్ముడుపోకుండా ఉన్న ఇళ్లపైనా పన్ను మినహాయింపు రెండేళ్లకు పొడిగించారు. రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటే పన్ను మినహాయింపునిచ్చారు. దీనికి పైన మరో రెండు లక్షల ఆదాయం ఉన్న వారు రుణంపై ఇంటిని తీసుకుని వడ్డీ రూ.2 లక్షలు చెల్లించడం ద్వారా మొత్తం ఆదాయంపై పన్ను లేకుండా ప్రయోజనం పొందొచ్చు. త్వరలో ఇళ్లపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వచ్చేందుకు కూడా ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇక బడ్జెట్‌కు ముందే, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద వడ్డీ సబ్సిడీని మరో ఏడాది పాటు పొడిగించడం జరిగింది. ఇవన్నీ కలసి మధ్యతరగతి జీవులు సొంతింటి కలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. అయితే, ఈ విషయంలో కచ్చితంగా దృష్టిపెట్టాల్సిన కొన్ని అంశాలున్నాయి. అవేంటో చూడండి మరి...



- బడ్జెట్‌లో రియల్టీకి పలు ప్రయోజనాలు...
- ఆదాయపన్ను పరంగానూ పెద్ద ఉపశమనం
- సొంతింటికి ప్లాన్ చేసుకునేందుకు అనుకూలతలు
- రుణం తీసుకోవాలంటే చూడాల్సినవి కొన్ని ఉన్నాయ్
- డౌన్ పేమెంట్, రుణ కాల వ్యవధి, ఈఎంఐ కీలకం
- పిల్లల ఉన్నత విద్య, అత్యవసరాలూ పరిగణనలోకి...

ఇల్లు కొనుగోలు అన్నది ఆర్థికంగా ఓ పెద్ద నిర్ణయం. ఈ విషయంలో ఒకటికి వంద సార్లు ఆలోచిస్తుంటారు. సొంతిల్లును సమకూర్చుకోవడాన్ని చాలా ముఖ్యమైన విషయంగా చూస్తారనడంలో ఎటువంటి సందేహం అక్కర్లేదు. నిజానికి ఇది ఆర్థిక కట్టుబాటు కూడా. అందుకే ఇంటి కొనుగోలుకు సిద్ధమైన వారు ముందుగా చూడాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. రుణంతో మొదటి సారి ఇంటిని కొనాలనుకునే వారు.. డౌన్ పేమెంట్ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. నెలవారీ సమాన వాయిదాల (ఈఎంఐ)ను సక్రమంగా చెల్లించే సామర్థ్యాన్ని కూడా అంచనా వేసుకోవాలి. వీటికి తోడు మరెన్నో అంశాలు ఇంటి కొనుగోలు సామర్థ్యాలను నిర్ణయిస్తాయి. అవన్నీ పరిశీలించిన తర్వాతే ముందడుగు వేయాలి.

డౌన్ పేమెంట్...

ఇంటి రుణానికి డౌన్ పేమెంట్ తప్పనిసరి. ఓ ఇంటి కొనుగోలుకు అయ్యే మొత్తం ఖర్చులో కొంత శాతాన్ని రుణం తీసుకోదలిచిన వ్యక్తి తన వంతుగా రెడీ చేసుకోవాల్సినదే డౌన్ పేమెంట్. రుణాలిచ్చే సంస్థలు సాధారణంగా ఇల్లు కొనుగోలు వ్యయంలో 20 శాతం డౌన్‌పేమెంట్ కింద అడుగుతాయి. ఉదాహరణకు రూ.50 లక్షల విలువైన ఇంటిని కొనుగోలు చేసే వారు కనీసం తమ వంతుగా రూ.10 లక్షలను డౌన్‌పేమెంట్‌గా సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. మిగిలిన రూ.40 లక్షలను బ్యాంకులు రుణంగా ఇస్తాయి. ఇంటి కొనుగోలు విలువ... డౌన్‌పేమెంట్ ఎంతన్నది నిర్ణయిస్తుంది. ఒకవేళ ఈ మొత్తం లేకపోతే ఇంటి రుణం సాధ్యం కానట్టే.


అత్యవసరాలనూ దృష్టిలో ఉంచుకోవాల్సిందే

జీవితంలో అత్యవసరాలు ఎప్పుడైనా ఎదురుకావచ్చు. వాటిని తప్పించుకోలేం. అటువంటి పరిస్థితులను అధిగమించేందుకు ముందే తగిన విధంగా సన్నద్ధం కావాలి. సొంతింటి కోసం అప్పటి వరకు పొదుపు చేసిన మొత్తాన్ని డౌన్ పేమెంట్ కోసం వినియోగిస్తే... వేతనంలో మిగిలేదంతా ఈఎంఐగా పోతుంటే... అత్యవసరం ఎదురైతే ఏంటి పరిస్థితి? ఉన్నట్టుండి ఉద్యోగం కోల్పోతే..? అందుకే అత్యవసర నిధిని పక్కన పెట్టి మిగిలిన మొత్తానే డౌన్‌పేమెంట్‌గా వాడుకోవడం వివేకం. కనీసం ఆరు నెలల కుటుంబ అవసరాలకు సరిపడా మొత్తాన్నే అత్యవసర నిధిగా ఉంచుకోవాలి. అలాగే, ఇంటి రుణం తీసుకునే వారు, అత్యవసర నిధికి అదనంగా మూడు నెలల ఈఎంఐ మొత్తాన్ని కూడా విడిగా రెడీగా ఉంచుకోవాలి.

ముఖ్య లక్ష్యాల కోసం పెట్టుబడులు...

డౌన్ పేమెంట్‌ను సమకూర్చుకుని, అత్యవసర నిధిని పక్కన పెట్టి, నెలవారీ ఈఎంఐ చెల్లించడంతోనే అన్ని బాధ్యతలు తీరినట్టు కాదు. జీవితంలో కీలకమైన లక్ష్యాలు వేరేవీ ఉన్నాయి. పిల్లల ఉన్నత విద్య ఇందులో ఎంతో ముఖ్యమైనది. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదు. పిల్లల ఉన్నత విద్య వంటి కీలక లక్ష్యాలకు అవసరమైనంత సమకూర్చుకునేందుకు ప్రతి నెలా కొంత మేర ఇన్వెస్ట్ చేస్తుండాలి. దీనికి తోడు స్వల్పకాల లక్ష్యాలు ఏవైనా ఉన్నాయా అన్నది చూసుకోవాలి. వీటికి పెట్టుబడులు పోను వేతనంలో ఎంత మిగులుతుంది, ఎంత ఈఎంఐగా చెల్లించగలరన్నది నిర్ణయించుకోవాలి. చాలా మంది సొంతింటిని సమకూర్చుకునే విషయంలో కీలకమైన పెట్టుబడులు, అత్యవసరాలను విస్మరిస్తుంటారు. ఈఎంఐ మొత్తాన్ని నిర్ణయించుకోవడంలోనూ అన్ని అంశాలను చూడరు. అందుకే ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయానికి రావాలి.





ఈఎంఐ ఎంత మేర...?

డౌన్ పేమెంట్ అవసరమైనంత ఉన్న వారు చూడాల్సిన తదుపరి అంశం ఈఎంఐ. రుణం తీసుకుంటే నెలవారీగా ఈఎంఐ మొత్తాన్ని చెల్లించగల సామర్థ్యం ఉందా? అనేది చూడాలి. కట్టగలమన్న నమ్మకం వేరు, సామర్థ్యం వేరు. ఉదాహరణకు మీ నెలవారీ ఆదాయంలో ఈఎంఐ మొత్తం 30-40 శాతాన్ని మించరాదనేది పాటించాల్సిన సూత్రం. ఇక ఈఎంఐ ఎంతన్నది రుణం ఎంత తీసుకుంటున్నారనే అంశంతోపాటు, ఎంత కాలానికి తీసుకుంటున్నారనేదీ నిర్ణయిస్తుంది. ఉదాహరణకు నెలవారీ ఆదాయం రూ.75,000 ఉందనుకుంటే... 9.5 శాతం వడ్డీ రేటు ప్రకారం ఎంత కాలానికి, ఎంత రుణం తీసుకుంటే ఈఎంఐ ఎంత ఉంటుందంటే...

ఆదాయంలో ఈఎంఐ 20%

- రూ.18 లక్షల ఇంటికి 20 శాతం డౌన్ పేమెంట్ పోను బ్యాంకులు రూ.14.4 లక్షల రుణం ఇస్తాయి. 15 ఏళ్ల కాలానికి తీసుకుంటే 9.5 శాతం వడ్డీ రేటు ప్రకారం ఈఎంఐ రూ15,000 అవుతుంది. అంటే రూ.75,000 నెలసరి ఆదాయంలో 20 శాతాన్ని ఈఎంఐగా చెల్లించాల్సి ఉంటుంది.
- రూ.20 లక్షల ఇంటికి బ్యాంకులు రూ.16 లక్షల రుణం ఇస్తాయి కనుక 20 ఏళ్ల కాలాన్ని నిర్ణయించుకుంటే అప్పుడు కూడా ఈఎంఐ రూ.15,000 అవుతుంది. రుణం పెరిగినప్పటికీ కాల వ్యవధి ఐదేళ్లు పెంచుకున్నారు గనుక ఈఎంఐ మొదటి ఉదాహరణలో మాదిరే ఉంటుంది.
- ఇక రూ.21.5 లక్షల ఇంటికి బ్యాంకులు రూ.17.2 లక్షల రుణాన్ని ఇస్తాయి. దీనిపైనా రూ.15,000 ఈఎంఐ ఉండాలనుకుంటే ఇంటి రుణ కాల వ్యవధిని 25 ఏళ్లుగా చేసుకుంటే సరిపోతుంది.

ఆదాయంలో ఈఎంఐ 30%

- రూ.26.8 లక్షల ఇంటికి డౌన్ పేమెంట్ పోను రూ.21.5 లక్షలు రుణంగా లభిస్తుంది. 15 ఏళ్ల టర్మ్ పెట్టుకుంటే ఈఎంఐ రూ.22,500 అవుతుంది.
- రూ.30.3 లక్షల ఇంటికి 24.2 లక్షలు రుణంగా తీసుకుంటే టర్మ్‌ను 20 ఏళ్లుగా నిర్ణయించుకున్నా కూడా ఈఎంఐ రూ.22,500 అవుతుంది.
- రూ.32.3 లక్షల ఇంటికి రూ.25.8 లక్షలు రుణంగా లభిస్తుంది. 25 ఏళ్ల టర్మ్‌ను నిర్ణయించుకుంటే ఈఎంఐ 22,500 అవుతుంది.

ఆదాయంలో ఈఎంఐ 40%

- రూ.36 లక్షల ఇంటిపై రూ.28.8 లక్షల రుణానికి గాను, 15 ఏళ్ల టర్మ్‌కు ఈఎంఐ రూ.30,000.
- రూ.40.3 లక్షల ఇంటికి రూ.28.8 లక్షల రుణం లభిస్తుంది. రుణం చెల్లించాల్సిన వ్యవధి 20 ఏళ్లు అయితే అప్పుడూ ఈఎంఐ రూ.30,000 దాటదు.
- ఇక రూ.43 లక్షల ఇంటికి 20 శాతం డౌన్ పేమెంట్ పోను వచ్చే రుణం రూ.34.4 లక్షలు. కాల వ్యవధి 25 ఏళ్లు అయితే ఈఎంఐ రూ.30,000 అవుతుంది.

నెలసరి ఆదాయం ఎక్కువగా ఉంటే తప్ప, ఈఎంఐ 20 శాతానికి మించకుండా ఉంటే దాన్ని సురక్షితంగా భావించొచ్చు. ఒకవేళ డౌన్ పేమెంట్ 20 శాతానికి మించి సమకూర్చుకుంటే అప్పుడు కూడా ఈఎంఐ భారం తగ్గుతుంది. నెల వేతనంలో ఈఎంఐ 40 శాతం వరకు ఉంటే చెల్లింపులు కష్టం కావచ్చు. తప్పదనుకుంటే నెల ఆదాయంలో 30 శాతాన్ని ఈఎంఐగా నిర్ణయించుకోవచ్చు. కొందరు దంపతులు ఇద్దరూ కలసి ఇంటి రుణం తీసుకుంటుంటారు. ఇరువురు ఆర్జనాపరులైతే అధిక ఈఎంఐ చెల్లించగలరు. అయితే, రుణ కాల వ్యవధి ముగిసే వరకు ఇద్దరూ ఆర్జనను కొనసాగించాలి. లేదంటే మధ్యలో ఇల్లాలు కుటుంబ అవసరాల కోసం ఉద్యోగాన్ని విడిచిపెడితే, అప్పుడు భారీ ఈఎంఐ భారం ఆమె భాగస్వామి ఒక్కరిపైనే పడుతుంది. దీన్ని ముందే ఆలోచించుకోవాలి.

ఆదాయం 5 లక్షలు దాటకపోతేనే...



- ఉద్యోగులైతే స్టాండర్డ్ డిడక్షన్ అదనం
- మినహాయింపులన్నీ ఉంటే మొత్తం ఆదాయం రూ.10,25,000
- ఉద్యోగులు కానివారికి ఇది రూ.9,75,000
- మినహాయింపులేవీ లేకుంటే మాత్రం రూ.5లక్షలు
- అది దాటితే మాత్రం మునుపటిలానే పన్ను వర్తింపు

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య



ట్యాక్సేషన్ నిపుణులు

తాజా బడ్జెట్లో ఆదాయపు పన్ను పరంగా.. అనుకున్నంతగా కాకపోయినా బాగానే ఉందని చెప్పాలి. ఎక్కువగా లబ్ధి పొందింది... వార్షికాదాయం రూ.5 లక్షలు దాటనివారని చెప్పొచ్చు. నికర ఆదాయం లేదా ట్యాక్సబుల్ ఆదాయం 1-4-2019 నుంచి 31-3-2020 వరకు రూ.5 లక్షలు, ఆ లోపు ఉంటే పన్ను భారం లేదు. ప్రస్తుతం అమల్లో ఉన్న శ్లాబులు, రేట్లు తదితరాల్లో ఎలాంటి మార్పులూ లేవు. శ్లాబులు మార్చకుండా... రేట్లలో మార్పు లేకుండా... ఇది ఎలా సాధ్యమనే సందేహం వస్తుంది. పన్ను తగ్గింపును సెక్షన్ 87ఎ ప్రకారం రిబేటు ద్వారా ఇచ్చారు.


ఉదాహరణకు ఒకరి సేవింగ్స్ రూ.1,50,000 అనుకోండి. మెడిక్లెయిమ్ వార్షిక ప్రీమియం రూ.25,000 అనుకోండి. విద్యా రుణం మీద వడ్డీ రూ.1,00,000, ఇంటిమీద రుణంపై రూ.2,00,000 వడ్డీ అనుకోండి. వీటిన్నింటినీ కలిపితే మొత్తం రూ.4,75,000. ఈ మొత్తానికి రూ.5,00,000 కలిపితే మొత్తం రూ.9,75,000. తాజా బడ్జెట్ ప్రతిపాదనల్లో భాగంగా స్టాండర్డ్ డిడక్షన్‌ను కూడా రూ.40వేల నుంచి రూ.50 వేలకు పెంచారు. అయితే ఇది కేవలం ఉద్యోగస్తులకే వర్తిస్తుంది. దీనిని కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం రూ.10,25,000 అవుతుంది. ఆ లెక్కంటో ఒకసారి చూద్దాం.



మొత్తం జీతం	-	10,25,000
స్టాండర్డ్ డిడక్షన్	-	50,000
మెడిక్లెయిమ్	-	25,000
సేవింగ్స్(80సి)	-	1,50,000
విద్యారుణంపై వడ్డీ	-	1,00,000
గృహరుణంపై వడ్డీ	-	2,00,000
మొత్తం మినహాయింపులు	-	5,25,000
నికర ఆదాయం	-	5,00,000

ఇలా మిగిలిన మొత్తం రూ.5,00,000 దాటలేదు కనక ఎలాంటి పన్ను భారం ఉండదు. ప్రస్తుత సంవత్సరపు పన్ను భారంతో పోల్చి చూస్తే రూ.12,500 తక్కువ. ఈ మేరకు పన్ను భారం తగ్గినట్లే. ఇది సంతోషించవలసిన విషయం. ఉద్యోగస్తులు కాని వారికి కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. కాకపోతే స్టాండర్డ్ డిడక్షన్ అనేది మాత్రం ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ మేరకు చూస్తే పై ఉదాహరణలో స్థూల ఆదాయం రూ.10,25,000 నుంచి రూ.9,75,000కు తగ్గుతుంది. అలాంటి వారికి పన్ను భారం ఉండదు.

కొసమెరుపు ఏమిటంటే... పన్ను చెల్లించాల్సిన లేదా నికర ఆదాయం రూ.5,00,000 దాటిన వారికి శ్లాబులు, రేట్లు అన్నీ యథాతథం. వీటిల్లో ఎలాంటి మార్పూ లేనందున వెసులుబాటు, ఉపశమనం వంటివేమీ లేవు. ఇది మోదీ మంత్రం. నికరాదాయం రూ.5లక్షల లోపు ఉన్నవారికే ఈ మార్పు వర్తిస్తుంది.



పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఐటీ రిటర్న్స్ మదింపు



ఆదాయపు పన్ను(ఐటీ) మదింపు, రిటర్న్స్ స్క్రూటినీలో అధికారుల ప్రమేయాన్ని పూర్తిగా తగ్గించి, అంతా ఆటోమేటిక్‌గా ఆన్‌లైన్‌లోనే జరిగే విధానాలను అమల్లోకి తెస్తున్నట్లు కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ సుశీల్ చంద్ర తెలిపారు. రిటర్న్స్ దాఖలు ప్రక్రియను సరళతరం చేసే క్రమంలో మరో రెండేళ్లలో 'ప్రి-ఫిల్డ్' రిటర్న్ ఫారంలను అసెసీలకు అందించనున్నట్లు వివరించారు. మూలం వద్ద పన్ను మినహాయించుకున్న (టీడీఎస్) వర్గాల నుంచి అందిన వివరాలను ఆదాయ పన్ను శాఖ ఈ ఫారంలలో పొందుపరుస్తుందని, తదనుగుణంగా రిటర్న్స్ దాఖలు చేస్తే సరిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయత్నాల్లో భాగంగా అత్యాధునిక సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్ 2.0ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇటీవలే అనుమతులిచ్చిందని చంద్ర పేర్కొన్నారు. సీపీసీ 2.0 అందుబాటులోకి వస్తే 24 గంటల వ్యవధిలోనే రిటర్నుల ప్రాసెసింగ్ పూర్తి చేయడం సాధ్యపడగలదని చంద్ర చెప్పారు. పన్ను ఎగవేత తీవ్రతను బట్టి అసెసీలు వ్యక్తిగతంగా ఆదాయ పన్ను కార్యాలయంలో హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జనవరి-31-2019 అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1-2 ఏళ్లు	3-5 ఏళ్లు
ఆంధ్రా బ్యాంక్	6.26-6.6	6.8	6.75
యాక్సిస్ బ్యాంక్	6.75-7.1	7.3-7.35	7.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	5.75-6.5	6.7-7	6.7
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.65	6.5
కెనరా బ్యాంక్	6.35-6.4	7-7.1	6.2
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.55	6.65	6.55
కార్పొరేషన్ బ్యాంక్	6-6.35	6.55-6.8	6.5
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.25-7.1	7.3	7.25-7.4
ఐసీఐసీఐ బ్యాంక్	6.25-6.75	6.9-7.1	7.25-7.5
ఐడీబీఐ బ్యాంక్	6.25-6.5	7.2-7.25	6.85-7.3
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.5-7	7.4-7.65	7
కోటక్ మహీంద్రా బ్యాంక్	7	7.25-7.4	7-7.1
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.5-6.75	7	6.7
ఎస్‌బీఐ	6.35-6.4	6.8	6.80
సిండికేట్ బ్యాంక్	6.35	6.7-7.05	7.15
పీఎన్‌బీ	6.35	6.75-6.85	6.25-6.75
యస్ బ్యాంక్	7-7.1	7.25-7.85	7.25-7.5

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

పెట్టుబడుల్లో బ్యాలన్స్...

ఎస్‌బీఐ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్

మార్కెట్ అస్థిరతల్లో పెట్టుబడులకు తక్కువ రిస్క్‌ను ఆశించే వారు, దీర్ఘకాలంలో సంప్రదాయ ఎఫ్‌డీలు, పోస్టాఫీసు పథకాల కంటే కాస్త అధికరాబడులు కోరుకునే వారు పరిశీలించాల్సిన పథకాల్లో ఎస్‌బీఐ హైబ్రిడ్ ఈక్విటీ కూడా ఒకటి. గతంలో ఇది ఎస్‌బీఐ మ్యాగ్నం ఫండ్ పేరుతో నడిచింది. గతేడాదే సెబీ ఆదేశాల మేరకు పథకం పేరు మారింది. ఈ పథకం ఈక్విటీ, డెట్ రెండింటిలోనూ ఇన్వెస్ట్ చేస్తుంది. కానీ, డెట్ సాధనాలకు మించి రాబడులను ఇవ్వగలదు. కనీసం 65 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సెక్యూరిటీల్లో పెడుతుంది. బుల్ మార్కెట్లో, బేర్ మార్కెట్లోనూ పనితీరు పరంగా ఈ పథకానికి మంచి ట్రాక్ రికార్డు ఉంది.

రాబడులు

ఈ పథకం రాబడులు గడచిన ఏడాది కాలంలో మైనస్ 2 శాతంగా ఉన్నాయి. కానీ, మూడేళ్ల కాలంలో చూసుకుంటే సగటున ఏటా 10.46 శాతం, ఐదేళ్ల కాలంలో వార్షికంగా 15.39 శాతం, పదేళ్ల కాలంలో 16.19 శాతం చొప్పున రాబడులు ఇచ్చింది. 1995 డిసెంబర్ 31న ఈ పథకం ప్రారంభం కాగా, అప్పటి నుంచి చూసుకుంటే వార్షిక రాబడులు 15.84 శాతంగా ఉన్నాయి. కనుక దీర్ఘకాలంలో ఓ బ్యాలన్స్‌డ్ ఫండ్‌లో ఈ స్థాయి రాబడులు మెరుగైనవేనని చెప్పుకోవాలి. రిస్క్ ఎక్కువగా తీసుకోలేని వారికి ఈ తరహా బ్యాలన్స్‌డ్ ఫండ్స్ అనుకూలం.



పెట్టుబడుల విధానం

పెట్టుబడుల కేటాయింపును ఈ పథకం మేనేజర్లు తెలివిగా చేస్తుంటారు. ఆటుపోట్ల సమయాల్లో ఈక్విటీ ఎక్స్‌పోజర్‌ను తగ్గించుకుని నగదు నిల్వలు పెంచుకుంటారు. 2011 మార్కెట్ కరెక్షన్‌లో, 2015 ఒడిదుడుకుల సమయాల్లో ఈక్విటీలకు ఎక్స్‌పోజర్ తగ్గించుకోవడం వల్ల ఈ పథకంలో నష్టాలు పరిమితం అయ్యాయి. 2014 బాండ్ మార్కెట్ ర్యాలీ ప్రయోజనాలను సైతం పొందింది. 2018 మార్కెట్ల అస్థిరతల్లోనూ ఈక్విటీలో అధిక పెట్టుబడులను కాస్త తగ్గించుకుంది. ఈ విధమైన వ్యూహాలతో నష్టాలను పరిమితం చేయడం, లాభాలను ఒడిసిపట్టడం ఈ ఫండ్ మేనేజర్లు చేసే పని. ప్రస్తుతానికి ఈక్విటీల్లో 71.95 శాతం, డెట్‌లో 25.76 శాతం, నగదు నిల్వలు రూ.2.29 శాతం కలిగి ఉంది. ఈ పథకం ఈక్విటీ పోర్ట్‌ఫోలియోలో 58 స్టాక్స్ ఉన్నాయి. మూడు రంగాల కంపెనీల్లోనే 44 శాతం వరకు ఇన్వెస్ట్ చేసింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌కు 27 శాతం వరకు కేటాయింపులు చేసింది. ఆ తర్వాత సేవల రంగానికి 9 శాతం వరకు కేటాయింపులు ఉన్నాయి. ఎనర్జీ, టెక్నాలజీ, ఎఫ్‌ఎంసీజీ, ఆటోమొబైల్ రంగాలకు సుమారు ఐదు శాతం చొప్పున కేటాయింపులు ఉన్నాయి. ఈ పథకంలో కనీసం రూ.1,000 మొత్తంతో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ప్రతీ నెలా సిప్ రూపంలో అయితే రూ.500 నుంచి కూడా ఇన్వెస్ట్ చేసుకునే అవకాశం ఉంది.



టాప్ హోల్డింగ్స్

అంశం	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ	5.85
ఎస్‌బీఐ	4.55
కోటక్ బ్యాంకు	3.95
బీపీసీఎల్	2.99
ఆర్ఐఎల్	2.74
ఇన్ఫోసిస్	2.53
దివిస్ ల్యాబ్స్	2.43
ఐసీఐసీఐ బ్యాంకు	2.39
ఐటీసీ	2.36
భారతీ ఎయిర్‌టెల్	2.29



అపజయమే అంతిమం కాదు... విజయమే తుది కాదు!
తదుపరి చర్యలపైనే ఈ రెండూ ఆధారపడతాయి!
- విన్‌స్టన్ చర్చిల్

బొమ్మ-బొరుసు



వడ్డీరేట్లు అక్కడే..!

- తటస్థ విధానానికి మారొచ్చు...
- ఆర్‌బీఐ పాలసీ సమీక్షపై నిపుణుల అంచనా...
- ఈ నెల7న నిర్ణయం...



న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం తగ్గుదల నేపథ్యంలో ఈ వారంలో జరిగే ద్వైమాసిక సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ .. పాలసీ రేట్లను క్రమానుగతంగా కఠినతరం చేసే విధానం నుంచి తటస్థ విధానానికి మారే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు రేట్ల పెరుగుదల, ద్రవ్యలోటుపరమైన సవాళ్ల కారణంగా కీలక పాలసీ రేట్లను తగ్గించకపోవచ్చని చెబుతున్నారు. అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం.. ఆర్‌బీఐ అంచనా వేసిన 3.8 శాతం కన్నా తక్కువగా 2.6 శాతంగానే నమోదైన సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడం, అటు అంతర్జాతీయంగా మందగమన ఆందోళనల నేపథ్యంలో 2018–19లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశిత 4 శాతం కన్నా తక్కువే ఉండొచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకానమిస్ట్ సమీర్ నారంగ్ చెప్పారు. పరపతి విధానాన్ని మార్చుకోవడానికి ఆర్‌బీఐ దీనివల్ల కాస్త వెసులుబాటు లభిస్తుందని, అయితే విద్య, వైద్యం, గృహావసరాల వ్యయాలు అధికంగానే ఉండటం వల్ల రేట్ల తగ్గింపునకు అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని ఆయన తెలిపారు.

ఇటు పెరుగుతున్న ముడి చమురు ధరలు, అటు ద్రవ్యపరమైన సవాళ్ల కారణంగా ఈ ఏడాది ఆర్‌బీఐ పాలసీపరంగా సంక్లిష్టమైన నిర్ణయాలే తీసుకోవాల్సి రావొచ్చని కన్సల్టెన్సీ సంస్థ డీబీఎస్ ఎకనామిక్స్ పేర్కొంది. ఉర్జిత్ పటేల్ నిష్క్రమణ అనంతరం కొత్త గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శక్తికాంత దాస్ సారథ్యంలో ఫిబ్రవరి 5 నుంచి 7 దాకా మూడు రోజులపాటు ఆర్‌బీఐ ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష జరగనున్న సంగతి తెలిసిందే. 7వ తేదీ(గురువారం) మధ్యాహ్నం పాలసీ నిర్ణయం వెలువడుతుంది. ఈ ఆర్థిక సంవత్సరం రెండు సార్లు రేట్లను పెంచిన ఆర్‌బీఐ క్రమానుగతంగా కఠినతర విధానాన్ని పాటిస్తోంది. డిసెంబర్‌లో రేట్లను మార్చకపోయినప్పటికీ ద్రవ్యోల్బణం పెరిగే రిస్కులు లేకపోతే తగ్గించే సంకేతాలే ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే విశ్లేషకుల అంచనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

9న ఆర్‌బీఐ బోర్డుతో ఆర్థిక మంత్రి భేటీ..

సాంప్రదాయం ప్రకారం బడ్జెట్ అనంతరం ఫిబ్రవరి 9న ఆర్‌బీఐ బోర్డు సభ్యులతో ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ సమావేశం కానున్నారు. మధ్యంతర బడ్జెట్‌లో కీలక అంశాల గురించి వివరించనున్నారు. ఆర్‌బీఐ ఆరో ద్వైమాసిక పాలసీ విధాన సమీక్ష అనంతరం రెండు రోజులకు ఈ భేటీ జరగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మధ్యంతర డివిడెండ్ చెల్లించాలన్న కేంద్రం సూచన కూడా ఇందులో చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్రం రూ. 28,000 కోట్ల దాకా మధ్యంతర డివిడెండ్ రావొచ్చని అంచనా వేస్తోంది.

ఆర్‌బీఐ సమీక్ష, క్యూ3 ఫలితాలే కీలకం..!

- నికాయ్ సర్వీసెస్ పీఎంఐ డేటా ఈవారంలోనే..
- టాటా మోటార్స్, కోల్ ఇండియా, లుపిన్, సిప్లా క్యూ3 ఫలితాలు
- అమెరికా ఉద్యోగ గణాంకాలు, జీడీపీపై దృష్టి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం గత శుక్రవారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రభావం ఈ వారంలో కూడా స్టాక్ మార్కెట్‌పై ఉండనుందని దలాల్ స్ట్రీట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రభావం కొనసాగనున్నప్పటికీ.. ఫిబ్రవరి 7న వెల్లడికానున్న ఆర్‌బీఐ ఆరవ ద్వైమాసిక పాలసీ సమీక్ష నిర్ణయం దేశీ మార్కెట్‌కు దిశా నిర్దేశం చేయనుందని భావిస్తున్నారు. ఈ ప్రధాన అంశానికి తోడు అంతర్జాతీయ పరిణామాలు, స్థూల ఆర్థిక అంశాల వెల్లడి, క్యూ3 గణాంకాలపై ఈవారం ఇన్వెస్టర్లు దృష్టిసారించినట్లు ఎస్సెల్ మ్యూచువల్ ఫండ్ సీఐఓ విరల్ బెరవాలా విశ్లేషించారు. విదేశీ నిధుల ప్రవాహం కూడా ఈవారంలో కీలక పాత్ర పోషించనుందని చెప్పారాయన. 'కేంద్ర ప్రభుత్వ పరిమిత ద్రవ్యోల్బణ వైఖరిని బడ్జెట్ వెల్లడించిన నేపథ్యంలో ప్రత్యేకించి గ్రామీణ వ్యవసాయ రంగం.. రిటైల్, గృహ రుణాల కార్పొరేట్ ఆదాయాలు పెరిగేందుకు అవకాశం ఉంది.' అని ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆర్థికవేత్త ధనన్జయ్ సిన్హా పేర్కొన్నారు.

ఫార్మా ఫలితాలు..

పలు దిగ్గజ ఫార్మా కంపెనీలు ఈవారంలో వెల్లడికానున్నాయి. బుధవారం లుపిన్, సిప్లా.. గురువారం అరబిందో ఫార్మా, కాడిలా హెల్త్‌కేర్ క్యూ3 గణాంకాలను ప్రకటించనున్నాయి. ఇతర దిగ్గర కంపెనీల్లో సోమవారం (4న) కోల్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్, ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఎక్సైడ్ ఫలితాలను ప్రకటించనుండగా.. మంగళవారం (5న) టెక్ మహీంద్రా, గెయిల్, హెచ్‌పీసీఎల్, ఏసీసీ, బీహెచ్‌ఈఎల్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, డీఎల్‌ఎఫ్, అపోలో టైర్స్, టాటా గ్లోబల్, డిష్ టీవీ గణాంకాలు వెల్లడికానున్నాయి. బుధవారం (6న) అదానీ పోర్ట్స్, అదానీ పవర్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అలహాబాద్ బ్యాంక్.. గురువారం (7న) టాటా మోటార్స్, బ్రిటానియా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కాఫీ డే, గ్రాసిమ్ ఫలితాలు వెల్లడికానున్నాయి. శుక్రవారం (8న) మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్‌హెచ్‌పీసీ, బీపీసీఎల్, ఇంజనీర్స్ ఇండియా ఫలితాలను ప్రకటించనున్నాయి.

స్థూల ఆర్థిక అంశాలపై దృష్టి

నికాయ్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ జనవరి డేటా మంగళవారం వెల్లడికానుంది. అంతర్జాతీయ అంశాల పరంగా.. అమెరికా ఉద్యోగ గణాంకాలు, జీడీపీ గణాంకాలు, పర్చేజ్ మేనేజర్స్ ఇండెక్స్ ఈవారంలోనే వెల్లడికానున్నాయి. వీటితోపాటు అమెరికా–చైనా వాణిజ్య యుద్ధ అంశం, వెనిజులాలో సంక్షోభం వంటి అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టిసారించినట్లు దలాల్ స్ట్రీట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాలతో ముడిపడి.. ముడిచమురు, రూపాయి కదలికలు ఆధారపడి ఉండగా.. ఈ ప్రభావం మార్కెట్‌పై ఉండనుందని తెలిపారు. గత నెల్లో 30 శాతం పతనాన్ని నమోదుచేసిన బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్.. మళ్లీ ఎగువస్థాయిల వైపు ప్రయాణం కొనసాగిస్తున్నాయి. 62 డాలర్ల సమీపానికి చేరుకున్నాయి. ధరలు మరింత పెరిగితే భారత ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం ఉన్న నేపథ్యంలో ఈ కదలికలను మార్కెట్ వర్గాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. 'మళ్లీ క్రూడ్ ధరల జోరు కారణంగా డాలరుతో రూపాయి మారకం విలువ 71కి చేరుకుంది. 70.80 వద్దనున్న కీలక నిరోధాన్ని అధిగమించిన నేపథ్యంలో ఆ తరువాత రెసిస్టెన్స్ 72.60 వద్ద ఉంది. సమీపకాలంలో రూపాయి విలువపై ఒత్తిడి ఉండే అవకాశం ఉంది. కీలక మద్దతు స్థాయి 70.40–69.90 వద్ద కొనసాగుతోంది.' అని అబియన్స్ గ్రూప్ చైర్మన్ అభిషేక్ బన్సల్ విశ్లేషించారు.

ఎఫ్‌ఐఐల నికర విక్రయాలు..

గత నెలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) రూ.5,300 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నట్లు డిపాజిటరీ డేటా ద్వారా వెల్లడయింది. ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.5,264 కోట్లు, డెట్ మార్కెట్ నుంచి రూ.97 కోట్లను జనవరిలో వెనక్కి తీసుకున్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కారణంగా.. ఎఫ్‌పీఐలు వేచి చూసే వైఖరిని ప్రదర్శిస్తున్నారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ వ్యాఖ్యానించారు.

ఎన్‌సీఎల్‌టీకీ అదే రుణ పరిష్కార ప్రణాళిక: ఆర్‌కామ్



న్యూఢిల్లీ: రుణాల పరిష్కారానికి సంబంధించి గతంలో రూపొందించిన ప్రణాళిక తరహా ప్రతిపాదనే జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందు కూడా ఉంచనున్నట్లు రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) వెల్లడించింది. అసెట్స్ విక్రయం కోసం రుణదాతలందరి దగ్గర్నుంచి నూటికి నూరు శాతం అనుమతులు తీసుకోవాలన్న నిబంధన అమలు సాధ్యం కాకపోవడంతో దివాలా పిటిషన్ ద్వారా ఎన్‌సీఎల్‌టీ మార్గంలోనైనా రుణ పరిష్కార ప్రక్రియకు ఆమోదం తీసుకోవాలని ఆర్‌కామ్ భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కంపెనీ దేశ, విదేశీ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ. 38,000 కోట్ల పైచిలుకు బాకీ పడింది (వడ్డీ కాకుండా). ఈ నేపథ్యంలో అసెట్స్ విక్రయించి, బాకీలు తీర్చేసేలా నిర్దిష్ట ప్రణాళికను రుణదాతలకు సమర్పించింది. అయితే, ఆస్తుల విక్రయానికి వివిధ వర్గాల నుంచి అడ్డంకుల కారణంగా గత ఏడాదిన్నరగా ఇది సాధ్యం కాలేదు. దీంతో ఎన్‌సీఎల్‌టీలో దివాలా పిటిషన్ దాఖలు చేయాలని ఆర్‌కామ్ నిర్ణయించుకుంది.

ఇక పీఎస్‌యూ వాటా విక్రయాల్లో జోరు!

- వ్యూహాత్మక అమ్మకానికి 35 పీఎస్‌యూలు
- విక్రయ ప్రక్రియను సరళతం చేయాలని కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల విక్రయం మరింత వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. పవన్ హన్స్‌లో వాటా విక్రయం దీర్ఘకాలం పట్టడం, వ్యూహాత్మక వాటా విక్రయానికి 35 పీఎస్‌యూలు వరుసలో ఉండటంతో ఆర్థిక శాఖ ఈ దిశగా ఆలోచన చేస్తోంది. దీంతో ప్రభుత్వ రంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని, ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా విక్రయం జరపాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్(దీపమ్) కసరత్తు చేస్తోంది.

ప్రక్రియ మరింత సరళతరం...

ప్రభుత్వ రంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియను మరింత సరళతరం చేయనున్నామని దీపమ్ కార్యదర్శి అతనూ చక్రవర్తి తెలిపారు. ఈ ప్రక్రియకు దీర్ఘకాలం పడుతుందని, ఆరంభంలో అది అంగీకారయోగ్యమేనని, కానీ ఇప్పుడు కాదని పేర్కొన్నారు. వ్యూహాత్మక వాటా విక్రయం జరపదగ్గ ప్రభుత్వ రంగ సంస్థల ఐదో జాబితాను నీతి ఆయోగ్ ఇటీవలనే దీపమ్‌కు సమర్పించిందని తెలిపారు. ఈ తాజా జాబితాతో కలుపుకొని వ్యూహాత్మక వాటా విక్రయం జరపాల్సిన ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య మొత్తం 35కు పెరిగిందని పేర్కొన్నారు. దీనికి కేబినెట్ ఆమోదం పొందాల్సి ఉందన్నారు. ఈ జాబితాలో ఎయిర్ ఇండియా, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, బీఈఎమ్‌ఎల్, స్కూటర్స్ ఇండియా, భారత్ పంప్స్ కంప్రెసర్స్, సెయిల్‌కు చెందిన భద్రావతి, సలేమ్, దుర్గాపూర్ యూనిట్లు, హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్, హిందుస్తాన్ న్యూస్‌ప్రింట్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఐటీడీసీలు ఉన్నాయి. ఎయిర్ ఇండియా ఫలితాలు వచ్చిన తర్వాత ఆ ఫలితాలను ఆధారంగా ఈ కంపెనీలో వ్యూహాత్మక విక్రయ ప్రక్రియను మళ్లీ ప్రారంభిస్తామని వివరించారు.

షీలాఫోమ్ అమ్మకాల్లో 11 శాతం వృద్ధి

హైదరాబాద్: స్లీప్‌వెల్ బ్రాండ్ పేరిట పరుపులను(మ్యాట్రెస్) విక్రయించే షీలా ఫోమ్ లిమిటెడ్ డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో అమ్మకాల పరంగా 11 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇదే కాలంలో పరిశ్రమ వృద్ధి 6 శాతంగా ఉంది. ఫైనాన్షియల్ మార్కెట్లో ప్రతికూలతల నడుమ పరిశ్రమకు మించిన వృద్ధిని కంపెనీ సాధించింది. అవ్యవస్థీకృత రంగం నుంచి కొనుగోళ్లు క్రమంగా వ్యవస్థీకృత రంగం వైపు మళ్లుతాయని అంచనా వేస్తోంది. డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా 6,800 ఔట్‌లెట్లు ఉన్నాయని, వీటిలో 3800 ఎక్స్‌క్లూజివ్ బ్రాండెడ్ ఔటులెట్లు కాగా, 3,000 మల్టీబ్రాండ్ ఔట్‌లెట్లు అని కంపెనీ తెలిపింది.


నేటి బోర్డు సమావేశాలు

ఫ్యూచర్ రిటైల్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, ఐడీబీఐ బ్యాంక్, వర్ల్‌పూల్ ఇండియా, ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్, బేయర్ క్రాప్ సైన్స్, బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొ, గ్లాక్సో స్మిత్‌లైన్ ఫార్మా, గోద్రేజ్ ఆగ్రోవెట్, లక్ష్మీ విలాస్ బ్యాంక్, నొవార్టిస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొ, టెక్స్‌మాకో రైల్, టిటాఘర్ వ్యాగన్స్, అబన్ ఆఫ్‌షోర్, శ్రేయి ఇన్‌ఫ్రా

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 04-2-2019

విశాఖ	400–00
చిత్తూరు	428–00
వరంగల్	399–00
చెన్నై	435–00
ముంబై	–
విజయవాడ	397–00
నమక్కల్	425–00
గోదావరి	397–00
03-2-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	397–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.55
బెంగళూరు	425–00
కోల్‌కతా	426–00
ఢిల్లీ	415–00


హెచ్‌డీఎఫ్‌సీ
బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ.1,961 **టార్గెట్ ధర:** రూ.2,300

ఎందుకంటే: భారత దేశపు మొదటి హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా 1977లో కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం భారత్‌లో అతి పెద్ద హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఇదే. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో ఈ కంపెనీ రిటైల్ రుణాలు 18 శాతం, కార్పొరేట్ లెండింగ్ 8 శాతం చొప్పున వృద్ధి చెందడం వల్ల నిర్వహణ ఆస్తులు 15 శాతం వృద్ధితో 4.4 లక్షల కోట్లకు పెరిగాయి. రుణ నాణ్యత నిలకడగా ఉంది. ఈ క్యూ3లో స్థూల మొండి బకాయిలు 1.22 శాతంగా ఉన్నాయి. లిక్విడిటీ సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ, కంపెనీ ట్రెజరీ మేనేజ్‌మెంట్ పటిష్టంగా ఉండటంతో స్ప్రెడ్స్ 2.3 శాతంగా, మార్జిన్లు 3.2 శాతంగా నమోదయ్యాయి. మొత్తం మీద ఈ కంపెనీ తాను సమీకరించిన నిధులపై 8.35 శాతం వడ్డీని చెల్లిస్తోంది. సీక్వెన్షియల్‌గా చూస్తే, కంపెనీ సమీకరించిన రుణాలు 18 శాతం నుంచి 21 శాతానికి, డిపాజిట్లు 28 శాతం నుంచి 30 శాతానికి పెరిగాయి. స్థూల ఫీజు ఆదాయం 25 శాతం తగ్గి రూ.104 కోట్లకు చేరింది. టైర్ వన్ మూలధనం 17.2 శాతంగా ఉంది. పోటీ తీవ్రతమవుతున్నప్పటికీ, రిటైల్ రుణాల జోరు పెరుగుతూనే ఉంది. కార్పొరేట్ లెండింగ్ కూడా పుంజుకుంటోంది. లిక్విడిటీ సమస్యలు తీవ్రంగా ప్రస్తుత పరిస్థితుల్లో నిధులు పుష్కలంగా ఉన్న ఈ కంపెనీ రిటైల్ రుణ మార్కెట్ వాటా మరింత పెరగనున్నది. గత 20 ఏళ్లలో ఈ కంపెనీ ఎన్నో అనుబంధ సంస్థలను అభివృద్ధి చేసింది. బ్యాంకింగ్, బీమా, అసెట్ మేనేజ్‌మెంట్, రియల్టీ, రియల్ ఎస్టేట్ వెంచర్ క్యాపిటల్, ఎడ్యుకేషన్ లోన్స్ తదితర రంగాల్లో ఆ అనుబంధ కంపెనీలు మంచి వృద్ధిని సాధిస్తున్నాయి. ఈ కంపెనీ నికర లాభంలో ఈ అనుబంధ కంపెనీల వాటాయే 40 శాతం. రూ. లక్ష కోట్లకు పైగా డిపాజిట్లు, రుణ నాణ్యత ట్రాక్ రికార్డ్ పటిష్టంగా ఉండటం వంటివి సానుకూలాంశాలు.

బజాజ్ ఫిన్‌సర్వ్
బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ.6,100 **టార్గెట్ ధర:** రూ.6,950

ఎందుకంటే: బజాజ్ గ్రూప్‌నకు చెందిన ఈ కంపెనీ జీవిత, సాధారణ బీమా రంగాలతో కన్సూమర్ ఫైనాన్స్ రంగాల్లో కూడా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. అన్ని సెగ్మెంట్లు మంచి వృద్ధి సాధించడంతో ఆదాయం(కన్సాలిడేటెడ్) 45 శాతం వృద్ధి చెంది రూ.11,142 కోట్లకు, నికర లాభం 16 శాతం వృద్ధితో రూ.851 కోట్లకు పెరిగాయి. నిర్వహణ ఆస్తులు 41 శాతం ఎగిశాయి. సీక్వెన్షియల్‌గా చూస్తే, రుణ నాణ్యత కొంత తగ్గినా, మొత్తం మీద నియంత్రణలోనే ఉంది. సాధారణ బీమా విభాగం ప్రీమియమ్ ఆదాయం 35 శాతం పెరిగింది. సాధారణ బీమా వ్యాపారం లాభదాయకత ఇతర రెండు బిజినెస్ సెగ్మెంట్ల కంటే అధికంగా ఉంది. ఈ విభాగం రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్ఓఈ) 24 శాతం కంటే ఎక్కువగానే ఉంది. రెండేళ్లలో ఈ విభాగం స్థూల ప్రీమియమ్ ఆదాయం 19 శాతం చక్రగతి వృద్ధితో రూ.13,316 కోట్లకు, నికర లాభం 14 శాతం చక్రగతి వృద్ధితో రూ.1,188 కోట్లకు పెరగగలదని అంచనా. వినియోగ వస్తువుల కొనుగోళ్లకు రుణాలిచ్చే బజాజ్ ఫైనాన్స్ పనితీరు బాగా ఉంది. ఆర్థిక అనిశ్చితిలోనూ రుణ నాణ్యత నిలకడగానే ఉంది. 2011–17 ఆర్థిక సంవత్సరాల్లో నికర లాభం 40% చక్రగతిన వృద్ధి చెందింది. రెండేళ్లలో నికర లాభం 39 శాతం చక్రగతి వృద్ధితో రూ.6,653 కోట్లకు పెరగగలదని భావిస్తున్నాం. జీవిత బీమా వ్యాపారం ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. 2009–10 తర్వాత గత ఆర్థిక సంవత్సరంలోనే తొలిసారి లాభాన్ని ఆర్జించింది. రెండేళ్లలో ఈ విభాగం ప్రీమియమ్ ఆదాయం 13% చక్రగతి వృద్ధితో రూ.9,653 కోట్లకు పెరుగుతుందని అంచనా. తొలిసారిగా జీవిత బీమా, సాధారణ బీమా వ్యాపారాలు డివిడెండ్‌ను ప్రకటించాయి. మొత్తం మీద రెండేళ్లలో ఈ కంపెనీ ఆదాయం 23% వృద్ధితో రూ.48,836 కోట్లకు, నికర లాభం 26% వృద్ధితో రూ.4,159 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

3.4 శాతం ద్రవ్యలోటు కష్టమే!

- అధికంగా ప్రభుత్వ వ్యయాలు
- అల్పంగా రాబడి వృద్ధి
- ద్రవ్యలోటు లక్ష్యం కష్టమే
- మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ వెల్లడి



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును 3.4 శాతానికి పరిమితం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం సాకారం కావడం కష్టమేనని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ, మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తెలిపింది. ప్రభుత్వ వ్యయం అధికంగా ఉండటం, రాబడి వృద్ధి అల్పంగా ఉండనుండటం దీనికి ప్రధాన కారణాలని మూడీస్ తెలిపింది.

పెరుగుతున్న ప్రభుత్వ రుణ భారం....

ప్రభుత్వ రుణం భారీగా పెరుగుతోందని, ద్రవ్య క్రమశిక్షణ పాటిస్తేనే ఈ రుణ భారం తగ్గుతుందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ (సావరిన్ రిస్క్ గ్రూప్) ఎమ్‌డీ జీన్ ఫాంగ్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వృద్ధి అంచనాలు సమంజసంగానే ఉన్నాయని, అయితే ద్రవ్యలోటు లక్ష్యాలను సాధించడంలో సవాళ్లు కొనసాగుతాయని వివరించారు. ప్రభుత్వ వ్యయాలు పెరుగుతున్నాయని, రాబడి పెరగడం కష్టమవుతుందని వివరించారు. 2020 మార్చితో ముగిసే వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును 3.4 శాతానికి పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుందని, ఇది అంచనాల కంటే అధికమని పేర్కొన్నారు. చిన్న రైతులకు నేరుగా నగదు బదిలీ, ఆదాయపు పన్నులో రిబేట్లు ఇవ్వడం వల్ల ఇది పెరిగిందని తెలిపారు. ద్రవ్యలోటు పెరగడం వల్ల భారత్ రేటింగ్‌ను తగ్గించబోమని వివరించారు. ప్రస్తుతం భారత్‌కు బీఏఏ2 రేటింగ్‌ను ఇచ్చామని, ఇది స్టేబుల్ (నిలకడ)ను సూచిస్తోందని పేర్కొన్నారు. మెరుగుదల, తరుగుదల రిస్కులు సమతూకంగా ఉంటాయని ఈ రేటింగ్ సూచిస్తుందని వివరించారు.

36,220-36,778 శ్రేణిని ఎటు ఛేదిస్తే అటు

మార్కెట్ పంచాంగం


కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పేద, మధ్యతరగతి ప్రజలపై వరాల జల్లు కురిసింది. ఈ బడ్జెట్ ప్రతిపాదనల అనంతరం లబ్దిపొందుతాయని అంచనావేస్తున్న ఆటో, కన్జూమర్ షేర్లు ర్యాలీ జరపగా, ద్రవ్యలోటు పెరుగుతుందన్న ఆందోళనలతో బాండ్లతో పాటు బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు క్షీణించాయి. మరోవైపు రూపాయి క్షీణత ఫలితంగా ఐటీ షేర్లు కూడా మెరుగుపడ్డాయి. రానున్న కొద్ది రోజుల్లో బడ్జెట్ రోజునాటి ట్రెండే కొనసాగే అవకాశం లేదు. మరో మూడు నెలల్లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అంచనాలు, అమెరికా–చైనాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలపై అంచనాలు, ప్రపంచ ఆర్థికాభివృద్ధి గమనం తదితర అంశాలపై మార్కెట్ దృష్టి నిలపవచ్చు. తాజా బడ్జెట్ ప్రతిపాదనలపై విదేశీ ఇన్వెస్టర్లు వ్యవహరించే పెట్టుబడుల శైలికి అనుగుణంగా సమీప భవిష్యత్తులో మన మార్కెట్ కదలికలు ఉండొచ్చు. ఇక సూచీల సాంకేతిక అంశాల విషయానికొస్తే,

సెన్సెక్స్ సాంకేతికాలు...



ఫిబ్రవరి 1తో ముగిసిన వారం తొలిరోజున 35,565 పాయింట్ల కనిష్టస్థాయి వరకూ పతనమైన బీఎస్‌ఈ సెన్సెక్స్ శుక్రవారం బడ్జెట్ సమర్పణ తర్వాత 36,778 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగింది. చివరకు అంతక్రితంవారంకంటే 444 పాయింట్లు లాభపడి 36,469 పాయింట్ల వద్ద ముగిసింది. బడ్జెట్ రోజునాటి కనిష్ట, గరిష్ట స్థాయిలు సెన్సెక్స్ సమీప ట్రెండ్‌కు కీలకం. ఆ రోజునాటి కనిష్టస్థాయి అయిన 36,220 పాయింట్ల వద్ద సెన్సెక్స్‌కు తొలి మద్దతు లభిస్తుండగా, నిరోధం ఆ రోజునాటి గరిష్టస్థాయి అయిన 36,778 పాయింట్ల వద్ద ఎదురవుతున్నది, ఈ శ్రేణిని ఎటు ఛేదిస్తే అటు సెన్సెక్స్ వచ్చేవారం కదలవచ్చు. 36,220 పాయింట్ల స్థాయిని కోల్పోతే వేగంగా 35,740 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఈ రెండో మద్దతును కోల్పోయి, ముగిస్తే 35,565–35,380 పాయింట్ల శ్రేణి వరకూ క్షీణత కొనసాగవచ్చు. ఈ వారం 36,778 పాయింట్ల స్థాయిని అధిగమించి, ముగిస్తే అప్‌ట్రెండ్ బలోపేతమై 37,050–37,200 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. అటుపై 37,500 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగవచ్చు.


నిఫ్టీ కీలక శ్రేణి 10,813-10,983



గతవారం తొలిరోజున 10,630 పాయింట్ల కనిష్టస్థాయి వరకూ తగ్గిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ తదుపరి క్రమేపీ పెరుగుతూ వారాంతంలో 10,983 పాయింట్ల గరిష్టస్థాయిని అందుకుంది. చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 114 పాయింట్ల లాభంతో 10,894 పాయింట్ల వద్ద ముగిసింది. బడ్జెట్ రోజునాటి కనిష్ట, గరిష్టస్థాయిలైన 10,813–10,983 పాయింట్ల శ్రేణిని నిఫ్టీ ఎటు ఛేదిస్తే అటు వేగంగా కదలవచ్చు. 10,813 పాయింట్ల స్థాయిని కోల్పోయి, ముగిస్తే 10,680 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ రెండో మద్దతును సైతం వదులుకుంటే వేగంగా 10,630–10,535 పాయింట్ల శ్రేణి వరకూ తగ్గవచ్చు. ఈ వారం నిఫ్టీ 10,983 పాయింట్ల స్థాయిని దాటగలిగితే పటిష్టమైన అప్‌ట్రెండ్‌లోకి మార్కెట్ మళ్లవచ్చు. కొద్ది వారాల నుంచి పలు దఫాలు గట్టి అవరోధాన్ని కల్పిస్తున్న ఈ స్థాయిపైన నిఫ్టీ వేగంగా 11,100 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన 11,220 పాయింట్ల స్థాయి కూడా నిఫ్టీకి కష్టసాధ్యం కాదు.

– పి. సత్యప్రసాద్

రెంటల్ డిపాజిట్‌ను ఏ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా షాపింగ్ కాంప్లెక్స్‌ను అద్దెకివ్వడం వల్ల రెంటల్ డిపాజిట్‌గా(మూడేళ్లకు) రూ.5 లక్షలు వచ్చాయి. ఈ సొమ్ములను ఏ కేటగిరీ మ్యూచువల్ ఫండ్‌లో నేను ఇన్వెస్ట్ చేయాలి. మూడేళ్ల తర్వాత ఈ మొత్తాన్ని నేను తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది కాబట్టి అసలుకు ధోకా లేకుండా ఉండే ఫండ్‌ను సూచించండి.

–దేవేందర్, విశాఖ పట్టణం

ఈ మొత్తాన్ని అల్ట్రా షార్ట్ డ్యూరేషన్ బాండ్ ఫండ్ లేదా షార్ట్ డ్యూరేషన్ బాండ్ ఫండ్‌లో గానీ ఇన్వెస్ట్ చేయండి. మీరు సదరు ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసే ముందు ఈ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో ఎంత ఉందో చెక్ చేసుకోండి. ఈ మొత్తాన్ని ఒకేసారి మీరు ఆ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ కేటగిరీ ఫండ్స్‌లో అధిక క్రెడిట్ రేటింగ్ ఉన్న ఫండ్‌నే ఎంచుకోండి. క్రెడిట్ రేటింగ్ ఎంత అధికంగా ఉంటే, మీ ఇన్వెస్ట్‌మెంట్స్ అంత సురక్షితంగా ఉంటాయని చెప్పవచ్చు. అలా కాకుండా ఈ మొత్తాన్ని మీరు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారనుకోండి. ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వచ్చే వడ్డీకి మీరు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలా కాకుండా ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారనుకోండి. పన్నుల పరంగా మీకు ప్రయోజనాలు లభిస్తాయి. మూడేళ్లలోపు కాలంలో మీరు పొందే లాభాలపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన పని లేదు. మూడేళ్ల తర్వాత ఈ ఫండ్‌పై వచ్చే రాబడులను దీర్ఘకాలిక మూలధన లాభాలుగా పరిగణిస్తారు. దీంతో మీకు ఇండెక్సేషన్ ప్రయోజనాలు కూడా లభిస్తాయి.

ప్రస్తుతం మార్కెట్ తీవ్రమైన ఒడిదుడుకుల్లో ఉంది కదా! ఇలాంటి సందర్భాల్లో నష్ట భయాన్ని తగ్గించుకోవడానికి ఎన్‌ఎఫ్‌ఓ(న్యూ ఫండ్ ఆఫర్)లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఎన్‌ఎఫ్‌ఓలో ఇన్వెస్ట్ చేయాలనే నా నిర్ణయం సరైనదేనా?

–కుముదిని, విజయవాడ

మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి కీలకమైన ప్రాతిపదిక... సదరు ఫండ్ పనితీరు గతంలో ఎలా ఉందనే విషయం. ఒక ఫండ్ పనితీరును కనీసం ఏడాది నుంచి ఐదేళ్ల పాటు పరిగణనలోకి తీసుకొని, ఇదే కాలంలో ఇదే కేటగిరీ ఫండ్స్ పనితీరుతో పోల్చి, సంతృప్తికరమైన రాబడులు వస్తే, ఆ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. కానీ న్యూ ఫండ్ ఆఫర్(ఎన్‌ఎఫ్‌ఓ)కు అలాంటి ట్రాక్ రికార్డ్ ఏమీ ఉండదు. అందుకని ఎన్‌ఎఫ్‌ఓలో ఇన్వెస్ట్ చేయడం అర్థం లేని పని అని నా అభిప్రాయం. ఎన్‌ఎఫ్‌ఓలో ఇన్వెస్ట్ చేయడం వల్ల నష్ట భయం తగ్గుతుందనేది అపోహ మాత్రమే. నిజానికి చెప్పాలంటే ఎన్‌ఎఫ్‌ఓ విషయమై ఎక్కువ అనిశ్చితి ఉంటుందనే విషయం కాదనలేనిది. అందుకని మంచి ఈక్విటీ ఫండ్‌ను ఎంచుకొని సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్)విధానంలో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేస్తే ఒడిదుడుకుల ప్రభావం పెద్దగా ఉండదు.

నేను గత ఏడాది కొంత మొత్తం ఒక ట్యాక్స్–సేవింగ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశాను. కానీ ఈ ఫండ్ పనితీరు సరిగ్గా లేదు. ఈ ఏడాది కూడా ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగించమంటారా ? లేక వేరే కొత్త ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయమంటారా?

–అజీజ్, వరంగల్

జ: మీరు ఏ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసిందీ వివరాలు వెల్లడించలేదు. కానీ చాలా ట్యాక్స్ సేవింగ్ ఫండ్స్‌లో ఒక ఏడాది కాలంలో మంచి రాబడులను ఇవ్వలేవు. ఒక ఏడాది కాలంలో ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్ పనితీరు గురించి పెద్దగా పట్టించుకోవలసిన పనిలేదు. ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్స్‌లో కనీసం ఐదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి మీరు మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను ఐదేళ్ల పాటు కదలించలేరు. ఐదేళ్ల కాలవ్యవధిలో ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్స్ మంచి పనితీరే కనబరుస్తాయి. కాబట్టి మీరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు. సదరు ఫండ్‌లో మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించండి.

చాలా ఏళ్ల కోర్టులో ఉన్న న్యాయ వివాదం పరిష్కారమై నాకు రూ.15 లక్షలు వచ్చాయి. ఇప్పుడు నాకు ఈ డబ్బులతో ఏమీ అవసరం లేదు. ఈ డబ్బులను దీర్ఘకాలం పాటు.... కనీసం పదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఏ తరహా మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే మంచిదో సూచించండి. ?

–డేవిడ్, సికింద్రాబాద్

కనీసం పదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, ముందుగా ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్‌లో కొంత కాలం ఇన్వెస్ట్ చేయండి. ఆ తర్వాత ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను బ్యాలన్స్‌డ్ ఫండ్‌లోకి బదిలీ చేసి మీరు కోరుకున్న కాలానికి కొనసాగించండి. ఏడాది నుంచి ఏడాదిన్నర కాలం పాటు ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయండి. కార్పస్‌లో మూడో వంతు మొత్తాన్ని ఈ ఫండ్ ఈక్విటీలోనూ, మిగిలిన మొత్తాన్ని ఆర్బిట్రేజ్, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇలాంటి వ్యూహం కారణంగా మార్కెట్ ఒడిదుడుకుల్లో ఉన్నా కూడా మీ పెట్టుబడికి పెద్దగా ప్రమాదం ఉండదు. మూడేళ్ల పాటు ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించండి. ఆ తర్వాత మార్కెట్ ఒడిదుడుకులు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి విధానాలపై మీకు తగినంతగా అవగాహన వస్తుంది. అప్పుడు ఈ ఫండ్ నుంచి ఏదైనా బ్యాలన్స్‌డ్ ఫండ్‌కు మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మార్చుకోవచ్చు.

ఆన్‌లైన్ మొబైల్ గేమ్‌కు బానిసలవుతున్న యువత
గంటల తరబడి ఆటలోనే మునిగితేలుతున్న విద్యార్థులు
పోటీదారులను తుపాకులు, బాంబులతో చంపడమే గేమ్
పిల్లలను హింస, నేరప్రవృత్తి వైపు పురిగొల్పుతున్న వైనం
గేమ్‌ను బ్యాన్ చేసిన చైనా.. గుజరాత్ స్కూళ్లలో నిషేధం

మొన్న పోకెమాన్.. నిన్న బ్లూవేల్.. తాజాగా 'ప్లేయర్ అన్‌నోన్స్ బ్యాటిల్‌గ్రౌండ్' ఉరఫ్ పబ్‌జీ.. దేశంలో ప్రస్తుతం యువతను.. ప్రత్యేకించి స్కూలు విద్యార్థులను గంగవెర్రులెత్తిస్తున్న ప్రమాదకర ఆన్‌లైన్ మొబైల్ గేమ్ ఇది. ఆత్మహత్యలవైపు ప్రేరేపించిన బ్లూవేల్, పోకెమాన్‌ల స్థాయిలో కాకున్నా పబ్‌జీ విద్యార్థులను హింస, నేరప్రవృత్తి స్వభావంవైపు పురిగొల్పుతోంది. స్కూళ్లు ఎగ్గొట్టి మరీ గంటల తరబడి వారు ఈ ఆటలో మునిగితేలేలా బానిసలుగా మార్చుకుంటోంది. యువతలో వివిధ శారీరక, మానసిక అనారోగ్యాలకు కారణమవుతోంది.

– సాక్షి, హైదరాబాద్



పబ్‌జీ.. మహాడేంజర్‌జీ

పబ్‌జీ వల్ల బానిసలుగా మారిన యువతను చూసి చైనా ఈ గేమ్‌ను ఇప్పటికే పూర్తిగా నిషేధించింది. సర్వర్ లింకులను కూడా తొలగించి నెటిజన్లకు ఈ గేమ్ లింక్ దొరకకుండా చర్యలు చేపట్టింది. గుజరాత్ ప్రభుత్వం ఈ ఆటను స్కూళ్లలో నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే దేశవ్యాప్తంగా ఈ గేమ్‌ను నిషేధించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు సైతం చేసింది. వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) సైతం హాస్టళ్లలోని విద్యార్థులు పబ్‌జీకి బానిసలవుతున్నారని గుర్తించి తమ సంస్థ ఆవరణలో దీన్ని ఆడటంపై నిషేధం విధించింది.

గుజరాత్ స్కూళ్లలో నిషేధం

ఏమిటీ గేమ్...?

ఇది దక్షిణ కొరియాకు చెందిన ఓ వీడియో గేమింగ్ కంపెనీ తీసుకొచ్చిన ఆన్‌లైన్ మల్టీప్లేయర్ గేమింగ్ యాప్. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని గేమ్‌లో ప్రవేశించగానే ఒక ఐడీ లభిస్తుంది. ఇది ఎక్కువగా ఒక జట్టుగా ఆడే గేమ్. ఎంత మందితో ఈ గేమ్ ఆడాలి అనేది ముందే దీన్ని ఆడేవారు నిర్ణయించుకుంటారు. ఈ గేమ్ ఆడేవారు ప్రత్యేక సైనిక వేషధారుల్లా మారిపోతారు. అలాగే ఇది గ్రూప్ వాయిస్ గేమ్. అంటే ఈ గేమ్ ఆడేవారంతా ఎప్పటికప్పుడు మాట్లాడుకునే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది. ఈ గేమ్‌లో గరిష్టంగా వంద మంది ఉంటారు. దీన్ని ఆడేవారు ఏర్పాటు చేసుకున్న టీం తప్ప మిగతా వారంతా శత్రువుల కిందే లెక్క. దీంతో ఈ గేమ్ ఒక యుద్ధక్షేత్రాన్ని తలపిస్తుంది. పోటీదారులందరినీ చంపుకుంటూ పోవడమే ఈ ఆట. యుద్ధంలో ఉపయోగించే తుపాకులు, బాంబులతోపాటు శత్రువులకు చిక్కకుండా దాక్కునేందుకు బంకర్లు, గాయపడితే వైద్యం పొందేందుకు మెడికల్ కిట్ వంటివి ఇందులో ఉంటాయి. ఒక్కసారి ఆటగాడు చనిపోతే గేమ్ అయిపోనట్లే లెక్క. అందుకే యుద్ధంలో ఎలాగైనా గెలవాలనే కసితో ఈ ఆటలో చనిపోయిన ప్రతిసారీ తిరిగి గేమ్‌లో ప్రవేశించాలనుకుంటారు.

బానిసలుగా ఎందుకు మారుతున్నారు?



ఏదైనా ఆట ఆడేటప్పుడు గెలవాలనే కసి ఉండటం సహజం. కానీ పబ్‌జీ విషయంలో మాత్రం అది మరీ ఎక్కువ. ఈ గేమ్ ఆడుతున్నంతసేపూ యుద్ధం చేస్తున్న ఫీలింగ్ కలుగుతుంది కాబట్టి యువత ఓడిపోయిన ప్రతిసారీ తిరిగి గేమ్‌లోకి ప్రవేశిస్తూ విజయం కోసం తహతహలాడుతోంది. ఈ ఆట ఆడే సమయంలో ఎవరు వచ్చినా పట్టించుకోరు. గేమ్ నుంచి క్షణం దృష్టి మరల్చినా చనిపోతామనే భయంతో ఎవరు పిలిచినా పట్టించుకోరు. ఎవరు ఫోన్లు చేసినా కట్ చేస్తారు. మానసికంగా పూర్తిగా దానికే అంకితమవుతూ విచక్షణారహితంగా ప్రవర్తిస్తుంటారు.

పబ్‌జీ ఆడే వారిలో కనిపించే లక్షణాలు...

- చదువులో ఏకాగ్రత లోపించడం
- కోపం, చిరాకు ప్రదర్శించడం, దుందుడుకు స్వభావం
- ఎవరితోనూ కలవలేకపోవడం
- నిద్రలేమి, కంటి సమస్యలు

20 కోట్ల మంది యూజర్లు

ప్రపంచవ్యాప్తంగా పబ్‌జీ ఆడేవాళ్లు 20 కోట్ల మంది ఉన్నారు. ఏ సమయంలోనైనా ఈ గేమ్‌లో యాక్టివ్‌గా ఉండే వాళ్ల సంఖ్య 4 కోట్లుగా ఉంది. దీన్నిబట్టి ఈ ఆటకు ఎంత మంది బానిసలుగా మారారో అర్థంచేసుకోవచ్చు.

దేశంలో పబ్‌జీ ప్రభావం....

పబ్‌జీ కారణంగా జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పది, పన్నెండో తరగతి పరీక్షా ఫలితాలు చాలా దారుణంగా వచ్చాయని, వెంటనే ఈ గేమ్‌పై నిషేధం విధించాలని ఆ రాష్ట్ర విద్యార్థుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ రాష్ట్ర గవర్నర్ సత్య పాల్ మాలిక్‌ను కలసి ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. తెలుగు రాష్ట్రాల్లో సైతం పబ్‌జీ ప్రభావం అధికంగానే ఉంది.

వ్యవసాయ శాఖలో అవినీతి 'స్ప్రే'

- ఒకే రకమైన స్ప్రేయర్‌కు రెండు ధరలు
- కంపెనీలు, అధికారులు కుమ్మక్కు
- రైతులపై రూ.3 వేలు అదనపు భారం
- కమీషన్ల కోసం 25 వేల స్ప్రేయర్ల పంపిణీ

సాక్షి, అమరావతి : రాష్ట్ర వ్యవసాయ శాఖ పరికరాల కంపెనీలతో చేతులు కలిపి రైతుల్ని నిలువు దోపిడీ చేస్తోంది. ఒకే సామర్థ్యం కలిగిన పరికరాన్ని ఆ శాఖలోని వేర్వేరు విభాగాలకు వేర్వేరు రేట్లకు పంపిణీ చేస్తూ అక్రమాలకు పాల్పడుతోంది. అధికారులకు ఏ కంపెనీ ఎక్కువగా కమీషన్ ఇస్తోందో ఆ పరికరాన్నే రైతులు అధికంగా కొనేట్టుగా చేస్తున్నారు. వ్యవసాయ పరికరాల పంపిణీలోని అక్రమాలను నిలువరించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన డీబీటీ (డైరెక్టర్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) నేరుగా రాయితీ అందించే విధానాన్నీ భ్రష్టుపట్టిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తైవాన్ స్ప్రేయర్‌ను వ్యవసాయ శాఖ రైతులకు రూ.19,500కు పంపిణీ చేస్తుంటే, అదే స్ప్రేయర్‌ను పట్టు పరిశ్రమ విభాగం రూ.16,500కే ఇస్తోంది. అంటే ఒకే రకమైన స్ప్రేయర్‌పై వ్యవసాయ శాఖ అధికారులు రైతులపై రూ.3 వేల భారాన్ని అదనంగా మోపుతున్నారు. ఈ అదనపు భారాన్ని అటు ఆ పరికరం సరఫరా చేసిన కంపెనీ, ఇటు అధికారులు చెరిసగం పంచుకుంటున్నారు. వాస్తవానికి ఈ రెండు స్ప్రేయర్లు 25.6 సీసీ ఇంజన్ సామర్థ్యం కలిగి ఉన్నవే. ఆయిల్ నిల్వ సామర్థ్యం 900 మిల్లీ మీటర్లు, నీటి నిల్వ సామర్థ్యం 20 లీటర్లు కలిగి ఉండి, 5 నుంచి 6 మీటర్ల దూరం వరకు పురుగు మందును పంటలపై చల్లేలా ఉన్నాయి.

స్ప్రేయర్ల కోసమే అధిక బడ్జెట్

గతంలో ప్రతీ ఏడాది రాష్ట్రంలో 10 వేల స్ప్రేయర్లను రైతులకు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ ఈ ఏడాది కంపెనీలు ఇచ్చిన కమీషన్లకు ఆశపడి 25 వేల వరకు పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికంగా బడ్జెట్ కేటాయించడంతో ఇతర పరికరాలను రైతులు పొందలేకపోయారు. ఈ వ్యవహారంలో అధికారులు, కంపెనీలు కలిసి రైతుల్ని మోసం చేస్తున్నారని భావించిన కేంద్ర ప్రభుత్వం.. ఈ ఏడాది నేరుగా రాయితీ చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టింది. రైతులు తమకు అవసరమైన పరికరాలను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి, రశీదులను వ్యవసాయ శాఖకు అందజేస్తే.. ఆ పరికరం విలువలో 40 నుంచి 50 శాతం రాయితీని ప్రభుత్వం రైతుకు చెల్లిస్తుంది. అయితే ఈ విధానాన్నీ వ్యవసాయ శాఖ అధికారులు భ్రష్టు పట్టించారు. రైతులు కోరిన పరికరాలు అందుబాటులో లేవనే విధంగా ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసి తమకు అనుకూలంగా ఉండే కంపెనీల పరికరాలను కొనుగోలు చేసే విధంగా చేశారు. స్ప్రేయర్ల తరహాలోనే మరి కొన్ని కంపెనీల పరికరాల ధరలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

'సబ్‌ప్లాన్ నిధులు మళ్లించడం తగదు'

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించి వారికి తీవ్ర అన్యాయం చేస్తోందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ నిధులను ఎన్నికల తాయిలాల కోసం మళ్లించి వారి అభివృద్ధికి ప్రభుత్వం గండికొడుతోందన్నారు. ఎస్సీల నిధులు రూ.1,678 కోట్లు, ఎస్టీల నిధులు రూ.469 కోట్లు పసుపు కుంకుమ కార్యక్రమానికి మళ్లించటమేంటని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారం కోసం సుమారు రూ.32 కోట్ల నిధులు దారి మళ్లించారన్నారు. సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపును ఉపసంహరించుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'అగ్ని(వన్ని) కుల క్షత్రియులను విడదీయడం సరికాదు'



ఆటోనగర్‌లో ఆందోళన చేస్తున్న అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): ఒకే జాతిగా కలసి ఉన్న అగ్నికుల క్షత్రియులు, వన్నికుల క్షత్రియులను అనైతికంగా విడదీసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు పేర్కొన్నారు. విజయవాడ ఆటోనగర్‌లో అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు మాట్లాడుతూ 1929లో మద్రాసు ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 271కి వ్యతిరేకంగా అగ్ని, వన్ని కుల క్షత్రియులను విభజించి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విభజన వాదంతో ముందుకు వెళితే రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి రాష్ట్రంలోని అగ్నికుల క్షత్రియులందరం దూరమవుతామని హెచ్చరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖలు రాయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

'అవంతి'ని అప్రోచ్ అయ్యారు!

సాక్షి, హైదరాబాద్: కళాశాలల్లో హాజరు లెక్కింపునకు సంబంధించి జేఎన్టీయూ అమలులోకి తీసుకువచ్చిన బయోమెట్రిక్ వ్యవస్థనే ఏమారుస్తూ వేలిముద్రల్ని క్లోనింగ్ చేసిన గ్యాంగ్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వీరు సంప్రదించిన కాలేజీల్లో వివేకానంద గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌తో పాటు టీడీపీ అనకాపల్లి నియోజకవర్గ ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి శ్రీనివాస్)కు చెందిన అవంతి ఇంజనీరింగ్ కాలేజీ, ఆయన సోదరుడు ముత్తంశెట్టి కృష్ణారావు చెందిన నోవా ఇంజనీరింగ్ కాలేజీ ఉన్నాయి. వీటితో పాటు కోదాడలోని గేట్, కిట్స్ సంస్థలతోనూ వీరు సంప్రదింపులు జరిపారని గుర్తించారు. వేలిముద్రల క్లోనింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అవంతి కాలేజీకి నోటీసులు జారీ చేయాలని యోచిస్తున్నారు.

జేఎన్టీయూ నిబంధనలు కఠినతరంతో...

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన బొమ్మ రామకృష్ణ పీహెచ్‌డీ చేస్తూ అక్కడి స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేసేవాడు. కృష్ణా జిల్లా కోడూరుకు చెందిన పి.శ్రీరామ్ ప్రసాద్ 2014–17 మధ్య నోవా ఇంజనీరింగ్ కాలేజీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేశాడు. వీరిద్దరికీ పరిచయం ఏర్పడింది. నిబంధనల ప్రకారం ఇంజనీరింగ్ కాలేజీల్లో 15 మంది విద్యార్థులకో అధ్యాపకుడు ఉండాలి. అనేక కాలేజీల్లో దీన్ని పాటించలేకపోతున్నాయి. బోగస్ అధ్యాపకులు, విద్యార్థుల ఘటనల నేపథ్యంలో జేఎన్టీయూ బయోమెట్రిక్ హాజరు విధానం అవలంబిస్తోంది.

కాలేజీలతో ఒప్పందాలు చేసుకుని..

రామకృష్ణ వేలిముద్రలు క్లోనింగ్ చేసే విధానం తెలుసుకుని శ్రీరామ్ ప్రసాద్‌తో జట్టుకట్టాడు. హైదరాబాద్‌లోని కాలేజీలతో ఒప్పందాలు చేసుకునే శ్రీరామ్ అవసరమైన ఫింగర్‌ప్రింట్స్ ఆర్డర్‌ను రామకృష్ణకు పంపించేవాడు. ఎంటెక్ పూర్తి చేసిన వారిని యాజమాన్యాలు అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఎన్‌రోల్ చేసేవారు. వీరు కాలేజీకి వచ్చినప్పుడు శ్రీరామ్ వారి వేలిముద్రలు బయోమెట్రిక్ మిషన్‌లో లోడ్ చేసేవాడు.

క్లోనింగ్ చేశారిలా: రామకృష్ణ సూచన మేరకు శ్రీరామ్ ఓ ప్లాస్టిక్ కోటింగున్న కాగితంపై గ్లూ గన్‌తో సదరు ప్రొఫెసర్ల వేలిముద్ర సేకరిస్తాడు. దీని ఆధారంగా రామకృష్ణ ఒక్కో బోగస్ అధ్యాపకుడికి సంబంధించి నాలుగు సెట్ల క్లోన్డ్ వేలిముద్రల్ని తయారు చేసేవాడు. ఆయా కళాశాలల యాజమాన్యాలు ప్రతి రోజూ ఈ వేలిముద్రల అచ్చుల్ని బయోమెట్రిక్ మిషన్‌లో వేలు పెట్టాల్సిన చోట పెట్టేవి. ఇలా ఆ వ్యక్తి హాజరైనట్లు సర్వర్‌లో నమోదయ్యేలా చేసేవారు.



'క్షత్రియులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'



సంఘీభావం తెలుపుతున్న ప్రజా ప్రతినిధులు, జేఏసీ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): క్షత్రియుడంటే ధైర్యానికి, త్యాగానికి ప్రతీక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో 'క్షత్రియ శంఖారావం' కార్యక్రమం విజయవాడ సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ప్రతినిధి, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యేలు శివరామరాజు, విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ చైతన్యరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ధైర్యసాహసాలకు ప్రతీక అయిన క్షత్రియులు కాలక్రమేణా ఆర్థికంగా వెనుకబడిపోయారని, నిరుపేద క్షత్రియుల సంక్షేమాభివృద్ధికి పార్టీలకతీతంగా పాటుపడాలన్నారు. క్షత్రియులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనేది న్యాయమైన డిమాండ్ అన్నారు. ఎంపీ గోకరాజు మాట్లాడుతూ క్షత్రియ కార్పొరేషన్ సాధన కమిటీకి తన తరపున ఏటా రూ. కోటి చొప్పున ఐదేళ్లపాటు సహాయాన్ని అందిస్తానని తెలిపారు. క్షత్రియుల సంక్షేమానికి ప్రభుత్వం రూ. 50 కోట్ల నిధులను విడుదల చేసినట్లు ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ పేర్కొన్నారు. జేఏసీ కన్వీనర్ గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ అమరావతిలో అల్లూరి సీతారామరాజు స్మృతివనం ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని ఒక జిల్లాకు అల్లూరి పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్ నుంచి జరిగిన క్షత్రియ శంఖారావం ర్యాలీలో రాష్ట్ర నలుమూలల నుంచి జేఏసీ నాయకులు, సభ్యులు, క్షత్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'చట్టాన్ని అమలు చేస్తానంటే బదిలీ చేస్తారా?'

సాక్షి, అమరావతి: చట్టాన్ని అమలు చేస్తానని, టీడీపీ నేతలు చెప్పినట్లు చేయడం కుదరదని చెప్పిన నెల్లూరు జిల్లా గూడూరు మున్సిపల్ కమిషనర్‌పై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం చేయడాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్ చేతిలో ఉన్న ఫైల్స్ లాక్కుని చింపివేయడమే కాకుండా కులం పేరుతో దూషించడాన్ని తప్పుపట్టారు. చట్టాన్ని అమలు చేస్తోన్న కమిషనర్‌ను అన్యాయంగా బదిలీ చేయడం దుర్మార్గమైన చర్య అని, అక్కడ జరిగిన వాస్తవాలు పరిశీలన చెయ్యకుండా మంత్రి నారాయణ కమిషనర్ ఓబులేసును బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.